


ఈనాడు



విజయవాడ 3-3-2018 శనివారం సిటీ సంపుటి 44 . సంచిక 202

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 5-00 పేజీలు 16+20 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

తెగదెంపులే మేలు

- కేంద్ర ప్రభుత్వం నుంచి వైదొలగుదాం
- మంత్రులతో రాజీనామా చేయిద్దాం
- మెజార్టీ తెదేపా ఎంపీల అభిప్రాయం
- రాజీనామాకు సిద్ధమన్న అశోక్‌గజపతిరాజు, సుజనా చౌదరి
- సరైన సమయంలో నిర్ణయం తీసుకుందామన్న ముఖ్యమంత్రి
- పార్లమెంటులో పోరాడదామని స్పష్టీకరణ
- చివరి అస్త్రంగానే కేంద్ర మంత్రుల రాజీనామాలు
- తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ సమావేశంలో నిర్ణయం

ఈనాడు - అమరావతి

విభజన చట్టంలోని అంశాలు, ఇచ్చిన హామీలపై కేంద్రం నుంచి సానుకూల స్పందనేదీ రానందున ఇక భాజపాతో తెగదెంపులు చేసుకోవడమే మంచిదని ఎక్కువ మంది తెదేపా ఎంపీలు అభిప్రాయపడ్డారు. కేంద్ర ప్రభుత్వంలో భాగస్వామిగా ఉంటూ పోరాటం చేయడం కంటే, కేంద్రంలోని తెదేపా మంత్రులతో రాజీనామాలు చేయించడమే ఉత్తమమన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ నెల ఐదు నుంచి జరగనున్న రెండోవిడత పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన తెదేపా పార్లమెంటరీ పార్టీ సమావేశం శుక్రవారం ఉండవల్లిలో జరిగింది. తొలి విడత సమావేశాల్లో మన నిరసన గట్టిగా తెలియజేసినా... ఆ తర్వాత వివిధ మార్గాల్లో ఆందోళన తెలిపినా... కేంద్రం పట్టించుకోవడం లేదని ఎంపీలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇంకా భాజపాతో మైత్రిని కొనసాగించడం వల్ల ఉపయోగం లేదని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వంలో భాగస్వామిగా ఉండి తెదేపా ఎంపీలు ఆందోళన చేయడం, అదే సమయంలో తాము మంత్రులుగా ఉండటం ఇబ్బందికరంగా ఉందని అశోక్‌గజపతిరాజు పేర్కొన్నారు. అధినేత ఆదేశిస్తే ఎప్పుడైనా రాజీనామాకు సిద్ధమేనని మరో కేంద్ర మంత్రి సుజనా చౌదరి పేర్కొన్నారు. ఇద్దరు కేంద్ర మంత్రులతో పాటు, ఎంపీలందరి అభిప్రాయాల్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలుసుకున్నారు. ఇప్పటికిప్పుడు కేంద్ర మంత్రుల రాజీనామాలు చేయనవసరం లేదని, ఆ పరిస్థితే వస్తే సరైన సమయంలోనే నిర్ణయం తీసుకుందామని ముఖ్యమంత్రి చెప్పినట్టు తెలిసింది. ఏ నిర్ణయమైనా అది ప్రజాభిప్రాయం, ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగానే ఉండాలని, తొందరపాటు (మిగతా 2లో)



తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు



చంద్రబాబుకి అమిత్‌షా ఫోను

- పెండింగ్ అంశాలపై చర్చలకు బృందాన్ని పంపాలని సూచన
- రాష్ట్ర ప్రయోజనాలపై రాజీపడేదేలేదన్న ముఖ్యమంత్రి 2లో



మావోయిస్టులకు ఎదురుదెబ్బ

ఎన్‌కౌంటర్‌లో 10 మంది మృతి
ఒక పోలీస్ కమాండో కూడా

- తెలంగాణ- ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో ఘటన
- కొనసాగుతున్న కాల్పులు
- హరిభూషణ్ అలియాస్ లక్మదాదా క్షేమం



గ్రేహౌండ్ కానిస్టేబుల్ సుశీల్‌కుమార్ మృతదేహం

మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. తెలంగాణ- ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతంలో శుక్రవారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌లో 10 మంది మావోయిస్టులు, ఒక గ్రేహౌండ్స్ కమాండో మరణించారు. తెలంగాణ రాష్ట్రం జయశంకర్ భూపాలపల్లి జిల్లా సరిహద్దు వెంకటాపురం మండలం తడపల గుట్టలు, ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర పూజారి కాంకేడ్ మధ్య కొండపల్లి అటవీ ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి హరిభూషణ్, దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి ఆజాద్, పూర్వ కేకేడబ్ల్యూ కార్యదర్శి దామోదర్ నేతృత్వంలో స్పెషల్ జోనల్ కమిటీ సభ్యులు ఇక్కడి అటవీ ప్రాంతంలో సమావేశమైనట్లు నిఘా వర్గాలు పసిగట్టాయి. తెలంగాణకు చెందిన గ్రేహౌండ్స్ బలగాలు మాటువేసి ఎదురు కాల్పులకు దిగినట్లు సమాచారం. - పూర్తి వివరాలు 2, 11 పేజీల్లో

మళ్లీ నగదు కష్టాలు

- రాష్ట్రంలోని బ్యాంకుల్లో తీవ్రంగా కరెన్సీ కొరత
- నోట్లరద్దు నాటి పరిస్థితులు
- 80 శాతం ఏటీఎంలు ఖాళీ
- నగదు అందించలేక చేతులెత్తేస్తున్న బ్యాంకులు
- అన్ని వర్గాలపైనా ప్రభావం

ఈనాడు - అమరావతి

ఆంధ్రప్రదేశ్‌లో నగదు కష్టాలు మళ్లీ మొదలయ్యాయి. పెద్దనోట్ల రద్దు జరిగిన తొలినాళ్లలో నెలకొన్న పరిస్థితులు పునరావృతమవుతున్నాయి. రాష్ట్రంలోని బ్యాంకులు తీవ్ర నగదు కొరతను ఎదుర్కొంటున్నాయి. ఏటీఎంలు నో క్యాష్ బోర్డులతో దర్శనమిస్తున్నాయి. అవసరాలకు తగ్గ స్థాయిలో రిజర్వు బ్యాంకు నుంచి నగదు రాకపోవడం, బ్యాంకుల్లో రోజువారీ జమయ్యే నగదు కంటే ఉపసంహరించుకునే మొత్తమే అధికంగా ఉంటుండటంతో ఆ ప్రభావం వినియోగదారులపై పడుతోంది. చాలా బ్యాంకుల్లో గతేడాదితో పోలిస్తే డిపాజిట్లు తగ్గడం, ఉపసంహరణలు పెరగడం (మిగతా 2లో)



విజయవాడ ఎంజీ రోడ్డులో ఒకే చోట మూడు ఏటీఎంలు ఉన్నా.. ఒక్క దాంట్లో కూడా నగదు అందుబాటులో లేదు



ఆంధ్రప్రదేశ్‌కు 26.38 టీఎంసీలు.. తెలంగాణకు 19 టీఎంసీలు

- కృష్ణా బోర్డు త్రిసభ్య కమిటీలో నిర్ణయం
- ప్రస్తుతం బయటపెట్టకూడదని అంగీకారం 14లో




డిజిటల్ ప్రొవైడర్ల ఛార్జీలకు వ్యతిరేకంగా చేపట్టిన ఆందోళనలో భాగంగా మూసివేసిన విజయవాడ గాంధీనగర్‌లోని జయరాం థియేటర్

మూగబోయిన వెండితెర

- తెలుగు రాష్ట్రాల్లో 1600 థియేటర్లలో ప్రదర్శనలు నిలిపివేత
- శనివారం మరో దఫా చర్చలు 14లో

కోవూరులో ఉన్మాది కలకలం

ఓ మహిళపై అత్యాచారం, 11 మందిపై దాడి 5లో



సంఘటనా స్థలంలో రక్తపు మరకలు



తెగదెంపులే మేలు

(మొదటి పేజీ తరువాయి)

నిర్ణయాలు తీసుకున్నారన్న భావన ప్రజల్లో కలగరాదని సీఎం పేర్కొన్నారు.

ఒత్తిడి పెంచాలని నిర్ణయం

ఇప్పటికిప్పుడు కేంద్ర మంత్రులు రాజీనామా చేసేస్తే... తెదేపాని మరో ప్రతిపక్షంలానే భాజపా చూస్తుందని, ప్రభుత్వంలో ఉంటూనే రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని వివిధ మార్గాల్లో ఎలుగెత్తి చాటడంతో పాటు, కేంద్ర ప్రభుత్వంపై మరింతగా ఒత్తిడి పెంచాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. ఒకేసారి అస్త్రాలన్నీ వాడేయకుండా... దశలవారీగా పోరాటాన్ని ఉద్ధృతం చేస్తూ వెళ్లాలని నిర్ణయించారు. ఈ నెల 5 నుంచి పార్లమెంటులో ఎంపీలు ప్లకార్డులు పట్టుకుని, వెల్‌లోకి వెళ్లి నిరసన తెలియజేస్తారు. పార్లమెంటు వెలుపలా నిరసన కొనసాగుతుంది. ఆర్థిక బిల్లుకి సవరణలు ప్రతిపాదించినప్పుడైనా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి న్యాయం చేస్తుందేమో చూస్తారు. అప్పటికీ స్పందన లేకపోతే ఆ తర్వాత పోరాటం మరింత ఉద్ధృతం చేస్తారు. కార్యాచరణను ఎప్పటికప్పుడు నిర్ణయించుకుంటారు. అదే సమయంలో రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని వివరిస్తూ, తాము చేస్తున్న పోరాటానికి మద్దతు కోరుతూ వివిధ జాతీయ, ప్రాంతీయ పార్టీల అధ్యక్షులకు తెదేపా జాతీయ అధ్యక్షుడి హోదాలో ముఖ్యమంత్రి చంద్రబాబు లేఖలు రాస్తారు. ఆ లేఖల్ని పార్లమెంటులోని వివిధ పార్టీల ఎంపీలకూ అందజేస్తారు.

అమిత్‌షాతో భేటీతో ఒరిగిందేమీ లేదు..!

భాజపా అధ్యక్షుడు అమిత్‌షాతో గురువారం దిల్లీలో జరిగిన తమ సమావేశం వివరాలను ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు సి.కుటుంబరావు, ఎంపీ రామ్మోహన్‌నాయుడు తెదేపా సమావేశానికి ముందు ముఖ్యమంత్రికి వివరించారు. తాము అమిత్‌షాని కలవడం వల్ల ప్రయోజనమేమీ లేదని, తాము ఇచ్చిన పత్రాలు తీసుకున్నారే తప్ప సానుకూల స్పందన లేదని తెలియజేశారు. రాష్ట్ర ప్రజల మనోభావాల్ని వివరించామని, ప్రజల ఆకాంక్షల్ని కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం వల్ల రాజకీయంగా ఎదురయ్యే ఇబ్బందుల్నీ తెలియజేశామని వారు పేర్కొన్నారు. అమిత్‌షాతో సమావేశం గురించి తెదేపా సమావేశంలో ముఖ్యమంత్రి ప్రస్తావించారు. "రాష్ట్రానికి అన్యాయం చేసింది కాబట్టే కాంగ్రెస్ పోయింది. భాజపా కూడా అన్యాయం చేస్తుందా? అన్న ఆవేదన రాష్ట్ర ప్రజల్లో ఉంది. ప్రత్యేక హోదా వద్దని మనం ఎక్కడా ఎప్పుడూ అనలేదు. 14వ ఆర్థిక సంఘం సిఫారసుల ప్రకారం ప్రత్యేక హోదా ఇవ్వలేమని చెప్పినందుకే ప్రత్యేక సాయానికి అంగీకరించాం. అప్పుడు ఉండదని చెప్పి ఇప్పుడు వేరే రాష్ట్రాలకు హోదా ఎలా కొనసాగిస్తారు? వాళ్లకు ఇస్తున్నప్పుడు మనకీ కావాలన్నదే మన డిమాండ్..." అని సీఎం పేర్కొన్నారు. గొప్ప నమ్మకంతో భాజపాకి మద్దతిచ్చామని, దాన్ని నిబెట్టుకోవాల్సిన బాధ్యత వారిపై ఉందన్నారు.

వైకాపా ధోరణిని ఎండగట్టండి..!

ప్రత్యేక హోదా సాధనకు అవిశ్వాస తీర్మానం పెడతామని వైకాపా చేసిన ప్రకటన చర్చకు వచ్చింది. వాళ్లేదో ఒక నిర్ణయం తీసుకున్నారు కాబట్టి, మనమూ అదే దారిలో వెళ్లడం సరికాదన్న భావన ఈ సమావేశంలో వ్యక్తమైంది. అవిశ్వాస తీర్మానాన్ని పరిగణనలోకి తీసుకోవాలంటే కనీసం 50 మంది ఎంపీల మద్దతు కావాలని, వైకాపాకి ఏ పార్టీలు మద్దతిస్తాయన్న అంశంపై చర్చ జరిగింది. కాంగ్రెస్ తానే అవిశ్వాసం పెడతామని చెబుతోంది కాబట్టి మద్దతివ్వకపోవచ్చన్న అభిప్రాయం వ్యక్తమైంది. ఈ సందర్భంగా వైకాపా రాజకీయ ప్రయోజనాల కోసమే ప్రత్యేక హోదా అంటోందని, మిగతా 18 అంశాల్ని వదిలేస్తోందని, దీన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి సూచించారు. "హోదా ఒక్కటే సరిపోతే చట్టంలో అన్ని అంశాలు ఎందుకు పెట్టారో వైకాపా నేతలు స్పష్టం చేయాలి. రైల్వే జోను, కడప స్టీల్ ప్లాంట్, ఆర్థిక లోటు వంటివన్నీ వదిలేసి హోదా ఒక్కటే అడగడం సరికాదు. మనకు ఇచ్చిన అరకొర ప్రోత్సాహకాలు వాడుకోవడానికి పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపడం లేదు. ఈశాన్య రాష్ట్రాలకు ప్రత్యేక జీవో ద్వారా పన్ను ప్రోత్సాహకాలు ఇచ్చారు. కేవలం హోదా ఇచ్చి మిగతావి ఇవ్వకపోతే రాష్ట్రం నష్టపోతుంది..." అని సీఎం పేర్కొన్నారు. వైకాపాకి విశ్వసనీయత లేదని, నాటకాలాడుతోందన్న విషయం ప్రజల్లోకి వెళ్లిందని చెప్పారు. తెదేపా చిత్తశుద్ధితో పోరాడుతుందన్న సానుభూతి ప్రజల్లో ఉందని, రాష్ట్రం బాగుపడాలంటే మళ్లీ తెదేపానే అధికారంలోకి రావాలని ఆయన పేర్కొన్నారు.

రేపు ఉత్తరాంధ్ర ప్రజల్ని రెచ్చగొడతారా?

భాజపా నేతలు కొందరు రాయలసీమ డిక్లరేషన్ అంటూ ఉప ప్రాంతీయవాదాన్ని రెచ్చగొట్టడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రాన్ని నిధులు అడగకుండా, సమస్యల్ని పక్కదారి పట్టిస్తూ, రాష్ట్ర ప్రభుత్వానికి సమస్యలు సృష్టించడమేమిటంటూ మండిపడ్డారు. రేపు ఉత్తరాంధ్ర అంటూ అక్కడి ప్రజల్ని రెచ్చగొడతారా? అని పేర్కొన్నారు. రాయలసీమలో రెండో రాజధాని డిమాండ్‌కు మద్దతుగా ఎందుకు మాట్లాడారని ఎంపీ టీజీ వెంకటేష్‌ను ప్రశ్నించారు. తన మాటల్ని మీడియా వక్రీకరించిందని, ఉన్న రాజధానికి పూర్తిగా నిధులిచ్చాక ఆ డిమాండ్ పెట్టమని మాత్రమే తాను అన్నానని ఆయన వివరణ ఇచ్చారు. పత్రికల్లో వక్రీకరించి రాసినప్పుడు ఖండన ఇవ్వాలని, అవసరమైతే పరువు నష్టం దావా వేయాలని సీఎం సూచించారు. "వ్యక్తిగత, పార్టీ, ప్రజాభిప్రాయాల మధ్య వ్యత్యాసాన్ని ప్రతి రాజకీయ నాయకుడూ తెలుసుకోవాలి. ఈ సమయంలో పొరపాటు నిర్ణయాలు తీసుకుంటే అంతిమంగా నష్టపోయేది ప్రజలే..." అని ఆయన పేర్కొన్నారు.

ఏం ఫార్ములా ఇచ్చారు?

ఆర్థిక లోటు భర్తీకి ఒక ఫార్ములా ఇచ్చామని కేంద్ర ప్రభుత్వం చెప్పడంపై ముఖ్యమంత్రి మండిపడ్డారు. "వాళ్లేం ఫార్ములా ఇచ్చారు? వాళ్లేమీ ఇవ్వలేదు. వాళ్లే మనకు ఎంత ఇవ్వాలో అంత ఇవ్వాలి గానీ, మనల్నే చెప్పమనడం సరి కాదు..." అని పేర్కొన్నారు. విభజన తర్వాత రెండు తెలుగు రాష్ట్రాలు జాతీయ స్థాయిలో బలహీనపడ్డాయని తెలిపారు. '42 మంది ఎంపీలు ఉన్నప్పుడు కేంద్రంపై ఒత్తిడి తేగలిగే వాళ్లం. విభజన తర్వాత రాష్ట్రాల ప్రయోజనాలు నెరవేరడం లేదు. రాష్ట్రాలను జాతీయ పార్టీలు నిర్లక్ష్యం చేస్తే తగిన మూల్యం చెల్లించాల్సి ఉంటుంది. ఈశాన్య రాష్ట్రాల్లోని 60 ఎంపీ స్థానాల్లో ఒకటి కూడా జాతీయ పార్టీలు పొందే పరిస్థితి లేదు. సరిహద్దు రాష్ట్రాలు కాబట్టే వాటికి ఆ మాత్రమైనా సాయం అందుతోంది..." అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.

ఆ మంత్రి పదవులతో ఏమొచ్చింది?

ముఖ్యమంత్రి ఎంపీల అభిప్రాయం కోరినప్పుడు... తెదేపా పదవులు పట్టుకుని వేళ్లాడుతోందని విపక్షాలు ప్రచారం చేస్తున్నాయని ఎంపీ మురళీమోహన్ పేర్కొన్నారు. దీనికి ముఖ్యమంత్రి స్పందిస్తూ... "మనకెందుకీ రెండు మంత్రి పదవులు? ఏమొచ్చింది వాటి వల్ల? అవేమైనా ప్రధాన శాఖలా? వాటిని పట్టుకుని మనం వేళ్లాడటమేంటి?..." అని వ్యాఖ్యానించారు. గొప్ప నాయకుడిని కేంద్రం నిర్లక్ష్యం చేస్తోందన్న భావన ప్రజల్లో ఉందని, ఆయనకు సహనం ఉంది, ఆయనే ఆలోచిస్తారని ప్రజలు ఓర్పు పడుతున్నారని ఎంపీ శివప్రసాద్ పేర్కొన్నారు. మనపై ప్రజల్లో ఉన్న విశ్వాసం కాపాడుకోవాలని, కేంద్రం న్యాయం చేయదని ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి పేర్కొనగా... 'అలాగైతే ప్రకృతే న్యాయం జరిపిస్తుందని...' ముఖ్యమంత్రి తెలిపారు. 2014 ఎన్నికల ముందు రాష్ట్రం సంక్షోభంలో ఉన్నప్పుడు చంద్రబాబు సమర్థత, అనుభవంపై నమ్మకంతోనే ప్రజలు గెలిపించారని, ఇప్పుడూ ముఖ్యమంత్రి సామర్థ్యమే రాష్ట్రాన్ని గట్టెక్కించగలదన్న భావనలో ప్రజలున్నారని ఎంపీ కేశినేని నాని తెలిపారు. మన వద్ద ఉన్న ఆయుధాలు ఎంపీలు, మంత్రులేనని వాళ్లతో రాజీనామాలు చేయించడమంటే ఆయుధాలు లేకుండా యుద్ధం చేయడమేనని ఎంపీ కొనకళ్ల నారాయణ పేర్కొన్నారు.

ఆర్థిక నేరగాళ్లపై ఉదాసీనతేంటి?

అవినీతికి పాల్పడినవారి ఆస్తుల్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకోకపోవడం సరికాదని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలో వాన్‌పిక్‌కు కేటాయించిన 23 వేల ఎకరాలు, లేపాక్షికి ఇచ్చిన 8,800 ఎకరాలు కేసుల్లో స్తంభించిపోయాయని, ఆ భూములన్నీ ప్రజలకు చెందినవేనని గుర్తించాలని ఆయన తెలిపారు. ఆర్థిక నేరగాళ్లపై ప్రభుత్వ ఉదాసీనత వల్ల ప్రజల్లోకి చెడు సంకేతాలు వెళతాయని, స్వాధీనం చేసుకున్న అవినీతి ఆస్తుల్ని పేదల సంక్షేమానికి వినియోగించాలని సూచించారు.

చంద్రబాబుకి అమిత్‌షా ఫోను

ఈనాడు అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబుతో భాజపా అధ్యక్షుడు అమిత్‌షా శుక్రవారం సాయంత్రం ఫోన్లో మాట్లాడారు. విభజన చట్టంలోని అంశాలు, కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అంశాలపై చర్చించేందుకు ఈ నెల 5న ఒక ప్రతినిధి బృందాన్ని దిల్లీ పంపించాల్సిందిగా సూచించారు. కేంద్ర మంత్రి సుజనా చౌదరి, ఎంపీ రామ్మోహన్ నాయుడు, ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడు కుటుంబరావులను చర్చలకు పంపిస్తామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. పూర్తి సమాచారంతో బృందాన్ని పంపుతామని తెలిపారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో రాజీపడేది లేదని స్పష్టంచేశారు. తమ పోరాటం భాజపా మీద కాదని తెలిపారు. . కేంద్రం తీరు ఆశాజనకంగా లేకపోవడం వల్లే పోరాటం చేయాల్సి వస్తోందన్నారు. విభజన చట్టంలోని అంశాల్ని, కేంద్ర ప్రభుత్వం హామీల్ని పూర్తి స్థాయిలో అమలు చేయాల్సిందేనన్నారు. తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ సమావేశం ముగిసిన కొంత సేపటికే అమిత్‌షా నుంచి ముఖ్యమంత్రికి ఫోన్ వచ్చింది. కేంద్రం వ్యవహరిస్తున్న తీరు పట్ల చంద్రబాబు ఆగ్రహంగా ఉండటం, పోరాటాన్ని ఉద్ధృతం చేయాలని తెదేపా సమావేశంలో నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో అమిత్‌షా ఫోన్ చేసి మాట్లాడటం ప్రాధాన్యం సంతరించుకుంది.



బడ్జెట్ సవరణలతో న్యాయం చేయాలి

తెదేపా ఎంపీల స్పష్టీకరణ



తెదేపా సమావేశం అనంతరంమీడియాతో మాట్లాడుతున్న ఆ పార్టీ ఎంపీలు

అవసరమైతే కోర్టుకు వెళ్తాం: గల్లా జయదేవ్

'బడ్జెట్‌పై చర్చ వచ్చినపుడు సవరణల ద్వారా రాష్ట్రానికి న్యాయం చేస్తామని స్పష్టమైన హామీ వస్తే తప్ప మేం వేటినీ అంగీకరించం. ప్రత్యేకహోదాతో సమానంగా కేంద్రం సహాయం చేస్తామన్నందునే ప్యాకేజీకి అంగీకరించాం. ఇప్పటికీ ఆ హామీని నిలబెట్టుకోనందున మళ్లీ ప్రత్యేక హోదా అడుగుతున్నాం. దీనిపై అవసరమైతే కోర్టుకు వెళ్తాం. ఇప్పటివరకూ మిత్రపక్షంపై నమ్మకంతో ఎదురు చూసాం. న్యాయం జరగలేదనిపిస్తే బయటకు వస్తాం. ప్రస్తుతం అలాంటి పరిస్థితే ఉంది. ఇప్పటికైనా కేంద్రం నుంచి స్పష్టత లభించాలి. సీఎం సూచన మేరకు విడతల వారీగా కార్యాచరణను ప్రకటిస్తాం. దీని వల్ల కేంద్రానికి అవకాశం ఇచ్చినట్లు ఉంటుంది. జమ్మూ కశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్ ఇతర కొన్ని రాష్ట్రాలకు ప్రత్యేక హోదా పేరు లేకుండానే సాయం చేస్తున్నట్లుగా ఆంధ్రప్రదేశ్‌కు సహాయం చేయాలి.

మరింత ఒత్తిడి పెంచేలా వ్యవహరిస్తాం

–ఎంపీ రామ్మోహన్‌నాయుడు

'గురువారం అమిత్ షా నిర్వహించిన సమావేశంలో ఎలాంటి స్పష్టతా ఇవ్వలేదు. ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ నిధులు ఇచ్చేందుకు ఫార్ములా అన్నారు. అదేంటో కేంద్రమే చెప్పి రాష్ట్రానికి అంగీకారమో కాదో అడగాలి. ఫార్ములా ఇవ్వకుండా రాష్ట్రాన్నే ఇవ్వమంటే ఎలా?. తొలి విడత సమావేశాల్లో నిరసన తెలియజేయడం వల్ల ఒక నిర్ణయం తీసుకుంటారని ఆశ ఉండేది. తర్వాత జరిగిన చర్చల్లో చెప్పిన మాటే మళ్లీ చెబుతున్నారు. రాష్ట్ర ప్రజల మనోభావాలకు అనుగుణంగా పోరాడతాం.

నిలదీయాలని నిర్ణయించాం

–ఎంపీ తోట నరసింహం

'పార్లమెంటును స్తంభింపజేయాలని, కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాలని నిర్ణయించాం. మేం ప్రత్యేక హోదా వద్దని చెప్పలేదు. దానికి సమానంగా సాయం చేస్తామన్నందునే ప్రత్యేక ప్యాకేజీకి అంగీకరించాం. రెండో విడత బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యేలోపు కేంద్రం నుంచి ప్రకటన వచ్చేలా కనిపించడం లేదు. ఇన్నాళ్లూ కేంద్ర ప్రభుత్వం సాయం చేస్తుందన్న మాటలను నమ్మాం'.

మద్దతు కూడగట్టి పోరాటం చేస్తాం

–ఎంపీ కొనకళ్ల నారాయణ

'దేశంలో అన్ని రాజకీయ పార్టీల ముఖ్య నేతలు, ఎంపీలను కలిసి వారి మద్దతు కూడగట్టి పార్లమెంటులో పోరాటం కొనసాగించాలని సమావేశంలో నిర్ణయించాం. కేంద్రం దిగొచ్చేదాకా పోరాటం ఆగదు'.

సహనానికీ ఓ హద్దు ఉంటుంది

–ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి

'ఏదో భిక్షం ఇచ్చినట్లు నిధులు ఇస్తున్నారు. కేంద్రం నుంచి అంతకన్నా ఎక్కువ ఆశించలేం. రైల్వేజోన్ వల్ల కేంద్రం, రాష్ట్రానికి ఎలాంటి లాభ, నష్టాలు ఉండవు. ఉద్యోగాలు రావు. ఆదాయంలో వాటా అందదు. సహనానికీ ఓ హద్దు ఉంటుంది. సీఎం తీవ్ర నిర్ణయాన్నే తీసుకుంటారు'

ఎలాంటి ఫార్ములా రాలేదు

–కుటుంబరావు, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు

'కేంద్రం నుంచి ఎలాంటి ఫార్ములా రాలేదు. సమాఖ్య వ్యవస్థలో రాష్ట్రానికి సంబంధించిన విషయాల్లో రహస్యాలు ఏముంటాయి. రెవెన్యూలోటుకు సంబంధించి ఏది సరైందో కేంద్రమే నిర్ణయించాలి. ఆ ధైర్యం లేకుండా ఏదో ఓ ఫార్ములా ప్రకారం నిధుల్లో కోత పెడతామంటే కుదరదు. రాష్ట్ర డిమాండ్లపై అమిత్‌షాతో సమావేశంలో చర్చించాం. ప్రత్యేక సాయం ద్వారా ప్రత్యేకహోదాలో ఉన్న ప్రయోజనాలన్నీ కోరాం. పరిస్థితి మరింత తీవ్రమయ్యేలోపు పరిష్కరించాలని సూచించాం. చూస్తాం.. చేస్తాం అని సమాధానం వచ్చింది. తొలి విడత సమావేశాల్లో తీవ్ర నిరసన వ్యక్తం చేసినా జాతీయపార్టీ అధ్యక్షుడు నుంచి ఎలాంటి హామీ లభించకపోవడం దురదృష్టకరం'

రాణా మెట్లెక్కిన కర్ణాటక హోంమంత్రి

బెంగళూరు, న్యూస్‌టుడే: రానున్న విధానసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ టిక్కెట్లు ఇప్పిస్తానంటూ తమ పార్టీ నాయకుడొకరు మోసాలకు తెగిస్తున్నాడంటూ కర్ణాటక హోం మంత్రి రామలింగారెడ్డి ఏకంగా ఠాణా మెట్లెక్కి కేసు దాఖలు చేయించారు. కాంగ్రెస్ పార్టీ బెంగళూరు నగర పరిధి కోరమంగళ విభాగ అధ్యక్షుడు చరణ్‌రెడ్డి అలియాస్ సురేంద్రరెడ్డి ఎమ్మెల్యే టిక్కెట్లు ఇప్పిస్తానంటూ పలువురి వద్ద రూ.2 కోట్ల వరకూ డిమాండు చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని శుక్రవారం రాత్రి హోంమంత్రి అడుగోడి ఠాణాకు వెళ్లి ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ఇదివరకే ఠాణా అధికారులకు ఆయన విషయం చేరవేసినట్లు సమాచారం

మావోయిస్టులకు ఎదురుదెబ్బ

ఈనాడు డిజిటల్– జయశంకర్ భూపాలపల్లి, వెంకటాపురం, న్యూస్‌టుడే: తెలంగాణ- ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతంలో శుక్రవారం ఉదయం పోలీసులు, మావోయిస్టులకు మధ్య భారీగా ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో 10 మంది మావోయిస్టులు, ఒక గ్రేహౌండ్స్ కమాండో మరణించారు. మృతిచెందిన 10 మందిలో ఆరుగురు మహిళా మావోయిస్టులు, నలుగురు పురుషులు ఉన్నట్లు పోలీసులు పేర్కొంటున్నారు. తెలంగాణ రాష్ట్రం జయశంకర్ భూపాలపల్లి జిల్లా సరిహద్దు వెంకటాపురం మండలం తడపల గుట్టలు, ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర పూజారి కాంకేడ్ మధ్య కొండపల్లి అటవీ ప్రాంతంలో ఘటన చోటుచేసుకుంది. తెలంగాణకు చెందిన గ్రేహౌండ్స్ ప్రత్యేక బలగాలు అటవీ ప్రాంతాన్ని జల్లెడ పడుతున్న క్రమంలో ఎదురుకాల్పులు చోటుచేసుకున్నట్లు పోలీసు వర్గాల సమాచారం. మావోయిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి హరిభూషణ్, అతని భార్య ఎన్‌కౌంటర్‌లో మరణించినట్లు ప్రచారం జరిగింది. కానీ వారు తప్పించుకున్నట్లు సమాచారం. ఎన్‌కౌంటర్ అనంతరం ఘటనాస్థలిలో గాలించగా గ్రేహౌండ్స్ కమాండో సుశీల్‌కుమార్ మరణించినట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. సమీపంలో మరో రెండు మావోయిస్టు మృతదేహాలను గుర్తించారు. వీరిని ప్రత్యేక హెలికాప్టర్‌లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం తరలించారు. మృతిచెందిన కమాండోకు శవపరీక్ష నిర్వహించి అధికారిక లాంఛనాలతో స్వగ్రామానికి తరలించారు. ఘటనాస్థలంలో ఏకే 47 తుపాకులు, ఎస్ఎల్ఆర్, ఇన్సాస్, 303 రైఫిల్, సింగిల్ బోర్ గన్, ల్యాప్‌టాప్, స్కానర్లు, విప్లవ సాహిత్యం, కిట్ బ్యాగులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ఆ కీకారణ్యం మావోయిస్టుల కంచుకోట.. వెంకటాపురం, భద్రాచలం ప్రధాన రహదారికి సరిహద్దుల్లోని అటవీ ప్రాంతంలో ఎదురుకాల్పులు జరిగాయి. అది మావోయిస్టులకు కంచుకోట. ఎలాంటి రవాణా సౌకర్యం లేని అడవుల్లో మావోయిస్టులు నిత్యం సంచరిస్తుండటం షెల్టర్, సేఫ్ జోన్‌గా ఉపయోగించుకుంటారన్నది నిఘా వర్గాల సమాచారం. జయశంకర్ భూపాలపల్లి జిల్లా వెంకటాపురం మండల కేంద్రానికి సుమారు 35 కిలోమీటర్ల దూరంలో ఉన్న కొండపల్లి అరణ్యాన్ని మావోయిస్టులు నెలవుగా చేసుకున్నట్లు తెలుస్తోంది. వారి కంచుకోటగా ఉన్న కీకారణ్యంలోకి ప్రత్యేక పోలీసు బలగాలు చొచ్చుకెళ్లాయి. ప్లీనరీ సమావేశానికి సిద్ధమవుతున్న క్రమంలోనే 150 మంది పోలీసులు కాల్పులకు దిగినట్లు ఘటనాస్థలంలో ఆనవాళ్లు స్పష్టం చేస్తున్నాయి. ఛత్తీస్‌గఢ్ అటవీప్రాంతంలో ఆది నుంచి మావోయిస్టులు సమాంతరంగా కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. వ్యూహాత్మకంగా గ్రేహౌండ్స్ బలగాలు చుట్టుముట్టిన క్రమంలో మావోయిస్టులపై పోలీసులు పట్టు సాధించినట్లు తెలుస్తోంది. హరిభూషణ్‌తో పాటు దండకారణ్య స్పెషల్ జోనల్ కార్యదర్శి ఆజాద్ సైతం చిక్కినట్లే చిక్కి అడవుల్లోకి వెళ్లిపోయినట్లు ప్రచారం జరుగుతోంది.

కొనసాగుతున్న ఎదురుకాల్పులు: ఎస్పీ అంబర్‌కిశోర్ ఝా

ఈనాడు, ఖమ్మం– న్యూస్‌టుడే, భద్రాచలం: తెలంగాణ -ఛత్తీస్‌గఢ్ పోలీసుల ఆధ్వర్యంలో భూపాలపల్లి జయశంకర్ జిల్లా వెంకటాపురం మండలం పూజారి కాంకేర్ సమీప దండకారణ్యంలో కూబింగ్ నిర్వహిస్తుండగా మావోయిస్టులు తటస్థించి కాల్పులు జరిపారని, ఆత్మరక్షణార్థం పోలీసులు నిర్వహించిన కాల్పులతో భారీ ఎన్‌కౌంటర్ సంభవించిందని భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ అంబర్ కిశోర్ ఝా ప్రకటించారు. శుక్రవారం సాయంత్రం 6 గంటలకు భద్రాచలం ఏఎస్పీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. ఇంకా అక్కడ ఎదురుకాల్పులు జరుగుతున్నాయని ప్రకటించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించగా 10 మంది మావోయిస్టులు, గ్రేహౌండ్ కానిస్టేబుల్ ఒకరు మృతి చెందినట్లు గుర్తించామన్నారు. మృతులను గుర్తించాల్సి ఉందన్నారు. శుక్రవారం అర్ధరాత్రి వరకు కానీ, శనివారం ఉదయం వరకు కానీ భద్రాచలం ప్రాంతీయ ఆసుపత్రికి ఆ మృతదేహాలను తరలిస్తామన్నారు. మృతుల్లో ఆరుగురు మహిళలు, నలుగురు పురుషులు ఉన్నట్లు వెల్లడించారు. వీరి వద్ద ఏకే 47, ఎస్ఎల్ఆర్, 303 రైఫిల్, పిస్తోలు ఒక్కోటి చొప్పున, రాకెట్ బాంబులు, డిటోనేటర్లు, 05 ఇన్‌టాక్ పరికరాలు, రూ.43 వేల నగదు, విప్లవ సాహిత్యం స్వాధీనం చేసుకున్నట్లు ప్రకటించారు.

మళ్లీ నగదు కష్టాలు

(మొదటి పేజీ తరువాయి)

కూడా ఈ పరిస్థితికి కారణమవుతోంది. కొన్ని ప్రాంతాల్లో సేవింగ్స్ ఖాతాల్లో జమచేయడం కూడా తగ్గింది. బ్యాంకుల్లో రోజు వారీ జరిగే లావాదేవీల సామర్థ్యాన్ని బట్టి ఆయా శాఖల్లో రూ.15 లక్షల నుంచి రూ.50 లక్షల వరకూ నగదు అందుబాటులో ఉంటుంది. ప్రస్తుతం ఏ బ్యాంకు శాఖల్లో చూసినా రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు మించి నగదు లభ్యత ఉండటం లేదు. దీంతో బ్యాంకులకు రోజు వారీ వచ్చి చేరే నగదును అదే రోజుల్లో ఏటీఎంల్లో పెట్టడానికి, ఖాతాదారులకు ఇవ్వడానికే సరిపోని పరిస్థితి ఉందని ఓ బ్యాంకు ఉద్యోగి వాపోయారు. గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి మరీ దారుణంగా ఉంటోంది. రూ.లక్షకు సంబంధించి చెక్కును బ్యాంకులో జమచేస్తే ఆ సొమ్ము చెల్లించడానికి కనీసం వారం నుంచి పది రోజులు పడుతోంది.

> విజయవాడకు చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగి సొంత పనులపైన ఇటీవల కాకినాడ వెళ్లారు. అత్యవసరమై నగదు కోసం దాదాపు రెండున్నర గంటల పాటు 15 ఏటీఎంలు తిరిగినా పనవలేదు. చివరికి తెలిసిన స్నేహితుడికి ఫోన్ చేసి అతని దగ్గరున్న సొమ్ము తీసుకుని తాత్కాలికంగా తన అవసరం నుంచి గట్టెక్కారు.

ఏ జిల్లాలో చూసినా ఇదే దుస్థితి!

- ప్రకాశం జిల్లాలో దాదాపు 650 ఏటీఎంలు ఉండగా..దాదాపు 70 శాతం ఏటీఎంల్లో నగదు లభ్యత లేదు..
- కృష్ణా జిల్లాలో విజయవాడ సహా 950 ఏటీఎంలు ఉన్నాయి. వీటిలో 60 శాతం వాటిల్లో డబ్బుల్లేవ్. పది రోజుల కిందట రూ.4 వేల కోట్లు కావాలని లెక్కకట్టగా... ఇప్పటివరకూ రూ.257 కోట్లు మాత్రమే వచ్చింది.
- గుంటూరు జిల్లాలోని బ్యాంకుల్లో లావాదేవీల కోసం రూ.2 వేల కోట్లు అవసరమని పది రోజుల కిందట అంచనా వేయగా..ఇప్పటివరకూ వచ్చింది రూ.200 కోట్లలోపే ఉంది. ఈ జిల్లాలో 70 శాతం ఏటీఎంల్లో నో క్యాష్‌బోర్డులే కనిపిస్తున్నాయి.
- చిత్తూరు జిల్లాలో 39 ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులకు సంబంధించి 610 బ్యాంకు శాఖలున్నాయి. వీటిలో రోజుకు సగటున రూ.1200 కోట్ల మేర లావాదేవీలు జరుగుతాయి. నగదు కొరత కారణంగా అందులో 45 శాతం మేరే లావాదేవీలు జరుగుతున్నాయి. 680 ఏటీఎం కేంద్రాల్లో గతంలో రోజుకు రూ.70 కోట్లు వరకూ నగదును పెట్టేవారు. ఇప్పుడు అందులో సగం కూడా పెట్టడంలేదు.
- పశ్చిమగోదావరి జిల్లాలో 581 బ్యాంకు శాఖలు ఉండగా వీటి పరిధిలో 2 వేల వరకూ ఏటీఎం కేంద్రాలున్నాయి. వీటిల్లో 90 శాతం కేంద్రాల్లో నగదు అందుబాటులో లేదు. ఈ జిల్లాలోని బ్యాంకులు, ఏటీఎంల్లో రోజుకు రూ.4 వేల కోట్ల వరకూ నగదు లావాదేవీలు జరుగుతుంటాయి. అయితే ఆ స్థాయిలో నగదు బ్యాంకుల్లో అందుబాటులో లేదు.

> శ్రీకాకుళం జిల్లాలోని టెక్కలి, నరసన్నపేట తదితర ప్రాంతాల్లో కొన్ని ఏటీఎంలు నెలలు తరబడి మూతపడగా... మరికొన్ని చోట్ల నగదు పెట్టిన గంటల వ్యవధిలోనే ఏటీఎం ఖాళీ అయిపోతోంది. దీంతో అత్యవసరంగా నగదు కావాల్సిన వారు 40 కి.మీ. దూరాన ఒడిశాలోని పర్లాఖెమొండికి వెళ్లి అక్కడ ఏటీఎంలను ఆశ్రయిస్తున్నారు.

- శ్రీకాకుళం జిల్లాకు రూ.350 కోట్లు కావాలని స్టేట్‌బ్యాంక్, ఆంధ్రా బ్యాంకులు రిజర్వు బ్యాంకును కోరగా కొద్ది రోజుల కింద రూ.50 కోట్లు మాత్రమే వచ్చాయి. మరోవైపు నగదు కొరతతో గతనెలలో ఇవ్వాల్సిన సామాజిక పింఛన్లు ఇప్పటికీ 20శాతంపైగా బకాయి పడి ఉన్నాయి. దీనితో రూ.వెయ్యి పింఛను కోసం వృద్ధులు, వితంతువులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

రూ.లక్ష అంటే డిజిటల్ లావాదేవీనే!

బ్యాంకు నుంచి రూ.లక్ష వెనక్కి తీసుకోవాలంటే ఎంతో కొంత నగదు చేతికిచ్చి మిగతా మొత్తం మీరు చెప్పిన ఖాతాకు ఆన్‌లైన్‌లో బదిలీ చేస్తామన్న సమాధానం ఎదురవుతోంది. తూర్పుగోదావరి జిల్లాలోని కొన్ని బ్యాంకుల్లో రూ.లక్ష వెనక్కి తీసుకోడానికి కనీసం నెల రోజుల సమయం పడుతోంది. గుంటూరు జిల్లాలోని కొన్ని బ్యాంకులైతే రూ.లక్ష అడుగుతుంటే రూ.20 వేలు చేతిలో పెట్టి ప్రస్తుతానికి సరిపెట్టుకోమంటున్నాయి.

- ధాన్యం విక్రయాలకు సంబంధించి ఇవ్వాల్సిన సొమ్ములను మిల్లర్లు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నారు. ఆ సొమ్ము తీసుకోవడం వారికి ప్రహసనంగా మారుతోంది. రైతులు తాము తీర్చాల్సిన అప్పులను తీర్చుదామంటే చేతిలో నగదు ఉండటం లేదు. అలాగని సంబంధిత వ్యక్తుల ఖాతాలకు ఆన్‌లైన్‌లో నగదు బదిలీ చేద్దామంటే అవతలి వ్యక్తులు అందుకు అంగీకరించడం లేదు. నగదు కొరత నేపథ్యంలో విజయవాడలోని ఎన్టీఆర్ కాంప్లెక్స్, కాళేశ్వరరావు మార్కెట్ తదితర ప్రాంతాల్లో లావాదేవీలు 70 శాతానికి పైగా పడిపోయాయి.

నగదు లేదు.. నెల గడిచేదెలా?

ప్రస్తుతం కొత్త నెల ప్రారంభమైంది. ఉద్యోగుల వేతనాలు ఇతర అవసరాలకు మరింత నగదు అవసరం ఉంటుంది. ఇంటి అద్దె, ఇతర ఖర్చులకు మొదటి వారంలో ఎక్కువగా నగదును వారు తమ ఖాతాల నుంచి తీస్తారు. ఆ స్థాయిలో బ్యాంకుల దగ్గర నగదు అందుబాటులో లేకపోవడంతో నెల గడిచేదెలా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

> ప్రకాశం జిల్లాలోని కొన్ని ప్రైవేటు డెయిరీలు పాడిరైతులకు చెల్లించాల్సిన సొమ్మును పదిహేను రోజులకోసారి చెక్కుల రూపంలోనో లేదా వారి బ్యాంకు ఖాతాలకు జమచేయడమో చేస్తున్నాయి. రెండు నెలలుగా రైతులు బ్యాంకుల నుంచి ఆ సొమ్ము తీసుకోడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

రూ.5 వేల కోట్లు కావాలని సీఎం కోరినా...

రాష్ట్రంలో తీవ్ర నగదు కొరత ఏర్పడిన నేపథ్యంలో ఇక్కడి లావాదేవీల కోసం రూ.5 వేల కోట్లు నగదు ఇవ్వాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రిజర్వు బ్యాంకుకు పది రోజుల కిందట లేఖ రాశారు. ఇప్పటికీ రిజర్వు బ్యాంకు నుంచి మాత్రం నగదు రాలేదు.

గ్రహం అనుగ్రహం

3–3–2018 శనివారం

శ్రీ హేవళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
శిశిర రుతువు; ఫాల్గుణ మాసం; బహుళ పక్షం
విదియ: తె. 3-58 తదుపరి తదియ
ఉత్తర నక్షత్రం: రా. 10-30 తదుపరి హస్త
అమృత ఘడియలు: మ. 3-27 నుంచి 5-01 వరకు
వర్జ్యం: ఉ.శే. 7-39 వరకు
దుర్ముహూర్తం: ఉ. 6-20 నుంచి 7-54 వరకు
రాహుకాలం: ఉ. 9-00 నుంచి 10-30 వరకు
సూర్యోదయం: ఉ.6-22; సూర్యాస్తమయం: సా.6-03

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
కర్నూలు	38.4	21.2
రాజమహేంద్రవరం	38.0	20.0
గుంటూరు	38.0	20.0
శ్రీకాకుళం	37.5	17.5
ఖమ్మం	37.0	22.0
విశాఖపట్నం	36.4	19.6
హైదరాబాద్	36.3	18.3
విజయవాడ	36.2	20.4
అనంతపురం	36.2	19.1
నిజామాబాద్	36.0	21.0
కడప	36.0	21.0
తిరుపతి	36.0	18.2
కరీంనగర్	36.0	18.0
ఒంగోలు	35.9	22.7
సూర్యాపేట	35.0	24.0
నెల్లూరు	34.0	22.0
నరసాపురం	33.8	22.7
తాడేపల్లిగూడెం	33.0	21.5

ఇదీ సంగతి!



500 మంది మహిళలకు హజ్ యాత్రకు అవకాశం

దరఖాస్తుకు గడువు ఈ నెల 20

ఈనాడు అమరావతి: రాష్ట్రం నుంచి 500 మంది మహిళలు హజ్‌యాత్రకు వెళ్లేందుకు కేంద్ర కమిటీ అవకాశమిచ్చిందని రాష్ట్ర హజ్ కమిటీ ప్రకటించింది. 2018 సంవత్సరానికి యాత్రకు వెళ్లేందుకు దరఖాస్తు చేసుకోలేకపోయిన మహిళలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చని తెలిపింది. మెహరం విభాగం కింద మహిళలు ఈ నెల 20 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొంది.. అయితే వీరు 2018 హజ్ యాత్రకు కోసం ఇప్పటికే దరఖాస్తు చేసుకుని డ్రాలో ఎంపికైన వారికి బంధువులు అయి ఉండాలని వెల్లడించింది. దరఖాస్తుతోపాటు అవసరమైన పత్రాలను ఏపీ రాష్ట్ర హజ్ కమిటీ, డోర్ నెం.39-3-2, ఆర్కే ప్లాజా, మసీదు వీధి, లబ్బీపేట, విజయవాడ చిరునామాకు పంపాలని తెలిపింది.

బాధితులందరికీ న్యాయం జరిగే వరకు పోరాటం

అగ్రిగోల్డ్ బాధితులు, ఏజెంట్ల సంక్షేమ సంఘం

విజయవాడ, న్యూస్‌టుడే: అగ్రిగోల్డ్ బాధితులందరికీ న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదని అగ్రిగోల్డ్ బాధితులు, ఏజెంట్ల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. హనుమాన్‌పేట సీపీఐ భవన్‌లో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ప్రైవేటు సంస్థ చేసిన మోసానికి బలైపోయిన బాధితులకు గతంలో ఎక్కడా జరగని రీతిలో అసోసియేషన్ పోరాటాల కారణంగా ప్రభుత్వం పరిహారం చెల్లించడం చరిత్ర పుటల్లో నిలిచిపోతుందన్నారు. 100 కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున మొత్తం రూ.5 కోట్లు విలువైన చెక్కులను అందజేసినందుకు సీఎం చంద్రబాబుకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. మూడేళ్ల కాలంలో అసోసియేషన్ ఆధ్వర్యంలో కొనసాగిన కార్యక్రమాలను వివరించారు. రాష్ట్రంలో 19.52లక్షల మంది, 8 రాష్ట్రాల్లోని 32లక్షల మందిబాధితుల్లో ఆత్మవిశ్వాసాన్ని కల్పించి ఆత్మహత్యల సంఖ్య పెరగకుండా నివారించినట్లు తెలిపారు. సంక్రాంతి, రంజాన్, క్రిస్మస్ పండుగలను ఆనందంగా జరుపుకోవడం కోసం ప్రభుత్వం చంద్రన్న కానుకలు అందజేస్తున్న క్రమంలోనే ఈసారి బడ్జెట్‌లో రూ.4వేల కోట్లను కేటాయించి అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని కోరారు.

బెజవాడలో 'భూ'చోళ్లు



రాజధానంటే ప్రశాంతమైన వాతావరణానికి నెలవు కావాలి. ఇక్కడ ఉన్న... కొన్న ఆస్తులకు రక్షణ ఉంటుందన్న భరోసా ఉండాలి. అప్పుడే పెట్టుబడులు వెల్లువెత్తుతాయి. నగరం అందరి దృష్టిని ఆకర్షించి అభివృద్ధి చెందుతుంది. కానీ బెజవాడలో ప్రస్తుతం అందుకు పూర్తి భిన్నంగా జరుగుతోంది. స్థలం కనిపిస్తే చాలు కబ్జా అన్నట్లుగా పరిస్థితి ఉంది. నకిలీ పత్రాలను సృష్టించేసి ఆ భూమి తమదేనంటూ దురాక్రమణకు పాల్పడుతున్నారు. కొందరు రాజకీయ నాయకులే.. తెరవెనుక ఉంటూ తమ అనుచరుల ద్వారా ఈ దందాలను నడిపిస్తుండటంతో సామాన్యులు తీవ్ర అన్యాయమవుతున్నారు. ఇలాంటి ఘటనల పట్ల కఠినంగా వ్యవహరించి బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం మౌనంగా ఉంటోంది. తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తోంది.

- రాజకీయ నాయకుల అండతో చెలరేగిపోతున్న కబ్జా ముఠాలు
- నకిలీ పత్రాలు, లేని వివాదాలు సృష్టించి ఖాళీ భూముల్లో పాగా
- రెవెన్యూ, రిజిస్ట్రేషన్, పోలీసు శాఖల్లో కొంతమంది సహకారం

ఈనాడు–అమరావతి

ప్రభుత్వ నిర్లక్ష్యం ఫలితంగా నిన్న విశాఖపట్నంలో భూ మాఫియా ఎలా చెలరేగిపోయిందో ఇప్పుడు విజయవాడలో అచ్చం అలాగే జరుగుతోంది. ఒకరకంగా చెప్పాలంటే విజయవాడలో అంతకంటే తీవ్రమైన పరిస్థితులు ఉన్నాయి. రాజధాని ప్రాంతంగా మారిన తర్వాత అజిత్‌సింగ్‌నగర్, భవానీపురం, ఇబ్రహీంపట్నం, పాయకాపురం తదితర శివారు ప్రాంతాల్లోని భూముల విలువ ఒక్కసారిగా అనేక రెట్లు పెరిగిపోయింది. దీంతో ఖాళీగా ఉన్న విలువైన స్థలాలపై కన్నేసి, వాటికి సంబంధించిన నకిలీ ఆస్తి పత్రాలు సృష్టించి ఆ భూమిలో పాగా వేస్తున్నారు. రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖల్లోని కొందరు అధికారులు నకిలీ ఆస్తి పత్రాల తయారీలో ఈ ముఠాలకు సహకరిస్తున్నారు. స్థలం కబ్జాకు గురైందని పోలీసులకు ఫిర్యాదు చేస్తే సివిల్ వివాదాలంటూ వారు అందులో జోక్యం చేసుకోవడం లేదు. దీంతో కబ్జా మాఫియాకు అడ్డూ అదుపూ లేకుండా పోతోంది.

బెజవాడలో భూ కబ్జాలకు పన్నాగాలు ఇలా...

ఎత్తుగడ–1

నగరంలో ఎక్కడెక్కడ ఖాళీ స్థలాలు ఉన్నాయో తొలుత గుర్తిస్తారు. ఆ స్థలాలు తమవని ఎవరైనా గత కొన్నేళ్లలో ఎప్పుడైనా వచ్చారా? లేదా? అనేది పరిశీలిస్తారు. అలా ఎవరూ రాకపోయినా, ఆ స్థలాల యజమానులు విదేశాల్లోనో లేదా ఇతర ప్రాంతాల్లోనో ఉంటున్నారని తెలిసినా వెంటనే దానిపైన కన్నేస్తారు. రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖల్లోని కొందరి వ్యక్తుల ద్వారా ఆ భూమి ఎవరి పేరిట ఉందో తెలుసుకుంటారు. ఎప్పుడో రెండు దశాబ్దాల కిందటే ఆ యజమాని ఆ భూమిని వేరే వ్యక్తులకు విక్రయించేసినట్లు... అతను దాన్ని మరికొందరికి అమ్మేసినట్లు వారి నుంచి తాము కొనుగోలు చేసినట్లు లింక్ డాక్యుమెంట్లు సృష్టిస్తారు. నిజమైన యజమాని వస్తే తమ దగ్గరున్న పత్రాలు చూపించి తమదే ఈ భూమని దబాయిస్తారు. కొంచెం గట్టిగా పోరాడేవారైతే విషయాన్ని న్యాయస్థానంలో తేల్చుకోమని చెప్పి దౌర్జన్యానికి పాల్పడతారు.

ఎత్తుగడ–2

ముందుగా కబ్జా చేయాల్సిన స్థలాన్ని ముఠా సభ్యులు ఎంపిక చేసుకుని దాని సర్వే నెంబరు, యజమాని వివరాలు సేకరిస్తారు. అతను వేర్వేరు సంవత్సరాల్లో ఒకే ఆస్తిని ఇద్దరు వేర్వేరు వ్యక్తులకు విక్రయించినట్లు నకిలీ పత్రాలు సృష్టిస్తారు. ఆ ఇద్దరు వ్యక్తులు అదే స్థలాన్ని చెరో ఇద్దరు వ్యక్తులకు విక్రయించినట్లు నకిలీ లింక్ డాక్యుమెంట్లు తయారు చేస్తారు. వాస్తవంగా వీరంతా కబ్జా ముఠాల సభ్యుల బినామీలో లేదా వారు కేవలం కాగితాలపై సృష్టించిన వ్యక్తులో అయి ఉంటారు. తమ మధ్య ఆస్తికి సంబంధించిన వివాదం ఏర్పడిందని, వాటి పత్రాలు తమవద్ద ఉన్నాయని చెబుతూ వారు వేర్వేరుగా న్యాయస్థానాల్ని ఆశ్రయిస్తారు. వాటన్నింటినీ పరిశీలించి, వాదనలు విన్న అనంతరం వారిలో ఎవరికో ఒకరికి అనుకూలంగా న్యాయస్థానం తీర్పిస్తే... ఆ ప్రతులను పట్టుకుని తాము ఎంపిక చేసుకున్న జాగాలో పాగా వేస్తారు. వాస్తవంగా చూస్తే ఇక్కడ తప్పుడు పత్రాలు తయారు చేయడం, వాటిని ఆధారంగా చేసుకుని తమలో తమకు వివాదం ఏర్పడినట్లు సృష్టించడం. . దాని పరిష్కారం కోసం న్యాయస్థానాన్ని ఆశ్రయించడం..ఇలా ప్రతిదీ పక్కా ప్రణాళిక ప్రకారం జరుగుతుంది. ఈ మొత్తం వ్యవహారంలో అసలైన యజమానికి ఎలాంటి సంబంధమూ ఉండదు. యజమాని వచ్చి ప్రశ్నిస్తే స్థలం మాదేనని న్యాయస్థానం తీర్పు ఇచ్చిందంటూ కబ్జా ముఠాల సభ్యులు తీర్పు ప్రతులను చూపిస్తూ బెదిరిస్తారు.

ఎత్తుగడ–3

తాము ఏ స్థలాన్ని అయితే కబ్జా చేయాలనుకుంటారో ఆ స్థల యజమాని తనకున్న భూమిలో కొంత భాగాన్ని అతని సమీప బంధువులకు గిఫ్ట్‌డీడ్ రాసిచినట్లు నకిలీ పత్రాలు చేస్తారు. ఆ సమీప బంధువు ఆ ఆస్తిని వేరేవారికి విక్రయించినట్లు... వారి నుంచి దాన్ని తాము కొనుగోలు చేసినట్లు నకిలీ లింక్ డాక్యుమెంట్లు సృష్టిస్తారు. అసలైన యజమానుల వారుసులు ఎవరైనా ఆ స్థలంలోకి వచ్చి తమదేనని గట్టిగా నిలదీస్తే....ఆ ఆస్తిలో కొంత భాగమే మీదని మిగతాదంతా తమదేనని చెప్పి దబాయిస్తారు. అందుకు ఆధారంగా తాము తయారు చేసిన లింక్ డాక్యుమెంట్లు చూపిస్తారు. కొన్ని సందర్భాల్లో ఆ ఆస్తిని కూడా తమకే అమ్మేయాలని బెదిరించి తక్కువ ధరకు దక్కించుకుంటారు.

ఎత్తుగడ–4

తాము కన్నేసిన స్థలాన్ని దాని అసలు యజమాని నుంచి ఎప్పుడో ముప్పై ఏళ్ల కిందటే కొన్నట్లు నకిలీ పత్రాలు సృష్టిస్తారు. ఆ ఆస్తి ఇద్దరు, ముగ్గురు చేతులు మారినట్లు పత్రాలు తయారు చేస్తారు. వారి నుంచి భూమి అభివృద్ధి కోసం తాము తీసుకుంటున్నట్లు జీపీఏ ఒప్పందం కుదుర్చుకుంటారు. ఆ పత్రాలను ఆధారంగా చేసుకుని ఆ స్థలంలో కార్యకలాపాలు మొదలుపెట్టేస్తారు. యజమాని గుర్తించేలోపే అక్కడ భవనాలు నిర్మించేయడమో లేదా ప్లాట్లుగా విభజించి విక్రయించడమో చేస్తారు. ఈ తరహా దందాలో యజమాని మోసపోవడంతో పాటు, కబ్జా ముఠాల సభ్యుల దగ్గర తెలియకుండా ప్లాట్లు కొనుగోలు చేసిన వారు కూడా తీవ్రంగా నష్టపోతున్నారు.

ఎత్తుగడ–5

1988లో విజయవాడలో చెలరేగిన అల్లర్లలో తమ ఆస్తి పత్రాలు దహనమైపోయాయని, మళ్లీ సిద్ధం చేసిన డాక్యుమెంట్లు మంజూరు చేయాలని కోరుతూ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంటారు. కొందరు అధికారులు, సిబ్బంది సహకారంతో కొత్త తేదీలతో రిజిస్ట్రేషన్ అయిన డాక్యుమెంటను పొందుతారు. దాని ఆధారంగా నగరపాలక సంస్థలో కొన్నాళ్లపాటు ఖాళీ ఆస్తి పన్ను, ఇతరత్రా పన్నులు చెల్లిస్తుంటారు. కొన్ని రోజుల తర్వాత ఆ స్థలాన్ని ఆక్రమించేస్తారు. యజమాని దాన్ని గుర్తించి ఆ స్థలం వద్దకు చేరితే తమ పేరిట ఉన్న డాక్యుమెంట్లు చూపించి బెదిరిస్తారు. కొన్నిసందర్భాల్లో లేని వ్యక్తులను కేవలం కాగితాలపైనే సృష్టించి వారిదే ఆ భూమని పేర్కొన్నిలా పత్రాలు సృష్టిస్తారు.

ఎత్తుగడ–6

నిబంధనల ప్రకారం స్టాంపు పేపర్ల విక్రయదారులు తాము ఏ రోజు ఎవరికి పత్రాలను విక్రయించామనేది రిజిస్టర్ నిర్వహించాలి. ఆ సమాచారాన్ని నిర్ణీత కాలవ్యవధిలో రిజిస్ట్రేషన్ల శాఖకు అందజేయాలి. కబ్జా ముఠాల సభ్యులు ఇలాంటి స్టాంపు విక్రయదారులను కొందర్ని తమ గుప్పిట్లో పెట్టుకుంటున్నారు. వారు నిర్వహించే రోజువారీ విక్రయాల రిజిస్టర్‌లోని క్రమసంఖ్యలో అక్కడక్కడ ఖాళీలు వదిలేలా చూస్తారు. కొంతకాలం తర్వాత పాత తేదీలతో కూడిన ఆ స్టాంపు పేపర్లను కబ్జా ముఠాల సభ్యులు కొంటారు. వాటిని అడ్డం పెట్టుకుని నకిలీ పత్రాలు సృష్టిస్తూ భూముల కబ్జాలకు పాల్పడుతున్నారు.



అంతర్జాతీయ వరి పరిశోధన సంస్థ డైరెక్టర్ జనరల్ మాథ్యూ మోరెల్‌ను సత్కరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు. చిత్రంలో మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

రాష్ట్రంలో అంతర్జాతీయ వరి ఆవిష్కరణల కేంద్రం

సీఎం చంద్రబాబుతో ఇరి డైరెక్టర్ జనరల్ మాథ్యూమోరెల్

ఈనాడు–అమరావతి: అంతర్జాతీయ వరి పరిశోధన సంస్థ(ఇరి) రాష్ట్రంలో ఆవిష్కరణ కేంద్రం (ఇన్నోవేషన్ సెంటర్) ఏర్పాటుకు ముందుకు వచ్చింది. ఇప్పటికే వారణాసిలో ఒక కేంద్రం అందుబాటులో ఉండగా దక్షిణ భారతదేశంలో ఆంధ్రప్రదేశ్‌ను ఎంచుకుంది. సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడితో సమావేశమైన ఇరి డైరెక్టర్ జనరల్ డాక్టరు మాథ్యూ మోరెల్ ఈ విషయాన్ని వెల్లడించారు. వ్యవసాయ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉపకులపతి దామోదర్‌నాయుడు ఆధ్వర్యంలోని బృందం ఈ సందర్భంగా కేంద్రం ఏర్పాటుకు అవసరమైన వివరాలను సీఎంకు తెలిపారు. పోషకలోపాల నివారణ, తెగుళ్లను తట్టుకునే వరి రకాల అభివృద్ధి, వర్షాభావ పరిస్థితులను తట్టుకుని అధిక దిగుబడినిచ్చే రకాలు, జాస్మిన్ రైస్, వివిధ కార్యక్రమాలపై అధ్యయనం, సామర్థ్య పెంపు, యాంత్రీకరణ తదితర అంశాలపై సహకరించాలని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా డైరెక్టర్‌ను కోరారు.

భూమి కోసం పరిశీలన: కేంద్రం ఏర్పాటుకు 50 ఎకరాలు అవసరమని డైరెక్టర్ జనరల్ డాక్టరు మాథ్యూ మోరెల్ సీఎంకు తెలిపారు. అనుకూలమైన ప్రాంతాన్ని ఎంపిక చేయాలని సీఎం ఆదేశించడంతో వ్యవసాయ విశ్వవిద్యాలయ అధికారులు డైరెక్టర్‌తో కలిసి శుక్రవారం బాపట్ల వరి పరిశోధన సంస్థకు వెళ్లారు. అక్కడ జరుగుతున్న పరిశోధనలను వివరించారు. శనివారం నెల్లూరులో పర్యటించనున్నట్లు ఉపకులపతి దామోదర్‌నాయుడు తెలిపారు.

84మంది ఎర్రకూలీల పట్టివేత

సినీఫక్కీలో పట్టుకున్న టాస్క్‌ఫోర్సు

ఈనాడు, న్యూస్‌టుడే–తిరుపతి: అడవిలోకి వెళ్లడానికి సిద్ధంగా ఉన్న 84మందిని ఎర్రచందనం పరిరక్షణ ప్రత్యేక దళం సిబ్బంది శుక్రవారం తెల్లవారుజామున పట్టుకున్నారు. వీరు తమిళనాడులోని వెల్లూరు, తిరువన్నామలై జిల్లాలవాసులుగా గుర్తించారు. ఒకేసారి భారీ సంఖ్యలో అడవిలోకి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నవారిని నిలువరించడం ఇదే తొలిసారి. ఎర్రచందనం చెట్లు కొట్టేందుకు ఒకే లారీలో 84 మందిని పశువుల మాదిరి కుక్కేసి పైన టార్పలిన్ కప్పి తిరుపతి సమీపంలోని శేషాచలంలోకి తీసుకువెళ్తుండగా టాస్క్‌ఫోర్స్ బృందం వెంబడించింది. తమిళనాడు సరిహద్దు నుంచే వీరు వస్తున్న లారీని పోలీసులు సినీఫక్కీలో అనుసరించారు. తిరుపతి సమీపంలోని ఆంజనేయపురం అటవీ చెక్‌పోస్టు వద్ద వాహనాన్ని దిగ్బంధించి ఆపారు. తాము నిరుపేదలమని, బాగా డబ్బులు వస్తాయంటూ కొందరు తీసుకొచ్చారని టాస్క్‌ఫోర్స్ పోలీసుల ఎదుట వారు వాంగ్మూలమిచ్చారు. పట్టుబడిన వారిలో ఒకరు ఎమ్మెస్సీ గణితం, మరొక యువకుడు ఎంకాం చదువుతున్నాడు. వారినుంచి గొడ్డళ్లు, రంపాలు, తినుబండారాలు, ఇతర ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. వీరిలో కొందరు గతంలోనూ ఎర్రచందనం చెట్లను కొట్టేందుకు వచ్చినవారిగా ఫిన్స్ సాఫ్ట్‌వేర్ సాయంతో గుర్తించారు.



టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్న తమిళ కూలీలు

అలుపెరగని నాయకుడు..!

- చిన్నప్పుడే నాయకత్వ లక్షణాలు
- చంద్రబాబు జీవిత విశేషాల సమాహారం 'ఇండియాస్ గ్లోకల్ లీడర్'

ఈనాడు – అమరావతి

★ ముఖ్యమంత్రి చంద్రబాబు తన చిన్నతనంలో చేసిన మొదటి వ్యాపారం ఏంటి?


★ ఆయన ఉమ్మడిఆంధ్రప్రదేశ్‌కి సీఎంగా ఉన్నప్పుడు చేపట్టిన జన్మభూమి కార్యక్రమానికి బీజం ఎక్కడ పడింది?

★ 'సైబరాబాద్'కి ఆ పేరు ఎలా వచ్చింది?

...ఇలాంటి ఆసక్తికరమైన ప్రశ్నలకు సమాధానాలు ఆ పుస్తకంలో దొరుకుతాయి. 'చంద్రబాబు-ఇండియాస్ గ్లోకల్ లీడర్' పేరుతో ఆయన జీవిత చరిత్రను పాత్రికేయురాలు, కమ్యూనికేషన్ కన్సల్టెంట్ తేజశ్విని పగడాల ఆంగ్లంలో రచించారు. అలుపెరుగని నాయకుడని పేర్కొన్నారు. చంద్రబాబు నలభై ఏళ్ల రాజకీయ జీవితాన్ని పూర్తి చేసుకున్న నేపథ్యంలో ఆ పుస్తకాన్ని ఇటీవలే పాఠకులకు అందుబాటులోకి తెచ్చారు.

సోదరి చదువు మానేస్తే అన్నం పెట్టొద్దు..

చంద్రబాబు తండ్రి ఖర్జూర నాయుడుకి తన పిల్లలు పొలం పనులు చేయడం ఇష్టం ఉండేదికాదు. వారు బడికెళ్లి బాగా చదువుకోవాలన్న భావనలో ఆయనుండేవారు. చంద్రబాబు మాత్రం తల్లిదండ్రుల వెంట వెళ్లి పొలం



పనుల్లో సాయం చేసేవారు. అంతే ఉత్సాహంతో పాఠశాలకూ వెళ్లేవారు. 'చదువు' విలువను చంద్రబాబు చిన్నప్పుడే గుర్తించారు. ఆయన సోదరి హైమావతి ఇక తాను చదువు మానేస్తానని అమ్మతో చెప్పడం చంద్రబాబు విన్నారు. ఆయనకు చాలా కోపం వచ్చింది. ఆమె చదువు మానేస్తే అన్నం పెట్టవద్దని తల్లితో గట్టిగా చెప్పారు. తన సోదరితో చదువు కొనసాగింపజేసేందుకు ఆయన చాలా ప్రయత్నం చేశారు. కానీ ఆమె ఏడో తరగతితో చదువు ఆపేశారు.

చిన్నప్పుడే నాయకత్వం..!

తన గ్రామాన్ని అభివృద్ధి చేయాలని ఆయన చిన్నప్పటి నుంచే తపన పడేవారు. తోటి పిల్లలు 40 మందిని కూడగట్టి వినాయక సంఘం ఏర్పాటు చేశారు. గ్రామంలో మొక్కలు నాటడం, కాలువ మరమ్మతులు వంటి పనుల్ని చంద్రబాబు నాయకత్వంలో పిల్లలు చేశారు. గ్రామ పెద్దల్ని ఒప్పించి రంగంపేట నుంచి నారావారి పల్లె వరకు స్థానికుల శ్రమదానంతో రోడ్డు వేయడం అప్పట్లో ఆయన సాధించిన పెద్ద విజయం. చంద్రబాబు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు మొదటిసారి ముఖ్యమంత్రి అయినప్పుడు ప్రవేశపెట్టిన 'జన్మభూమి' కార్యక్రమానికి వినాయక సంఘం చేసిన సేవా కార్యక్రమాలతోనే పునాది పడింది. చంద్రబాబులో చిన్నతనంలోనే వ్యాపార లక్షణాలు ఉండేవి. అప్పట్లో నారావారి పల్లెలోను, చుట్టుపక్కలా రైతులు ఎక్కువగా చెరకు పండించేవారు. దీంతో చంద్రబాబు తన మిత్రులతో కలిసి బెల్లం తయారు చేసి విక్రయించారు.

'బ్రాండ్ హైదరాబాద్'కి అంకురార్పణ..!

హైదరాబాద్‌ను ఐటీ రంగంలో అగ్రగామిగా తీర్చిదిద్దాలని చంద్రబాబు నిర్ణయించారు. హైదరాబాద్‌కి ఐటీ సంస్థల్ని తీసుకొచ్చే బాధ్యతను బెంగళూరులోని ఎస్‌టీపీఐ డైరెక్టర్‌గా ఉన్న అనంతపురం జిల్లావాసి జేఏ చౌదరికి అప్పగించారు. ఆ తర్వాత హైదరాబాద్ ఐటీ రంగంలో ఒక ఐకాన్‌గా తయారైంది.

'సైబరాబాద్' పేరు పెట్టిందిలా...!

అప్పట్లో మైక్రోసాఫ్ట్ కేంద్రం హైదరాబాద్‌లో ఏర్పాటు చేయడంపై చర్చలు జరుగుతున్నాయి. ఒక రోజు మైక్రోసాఫ్ట్‌కి చెందిన సంజయ్ పార్థసారథి, సీఎం సంయుక్త కార్యదర్శి రణదీప్ సుడాన్ మాట్లాడుకుంటున్నారు. మాదాపూర్‌లో హైటెక్‌సిటీ నిర్మించనున్నట్టు సుడాన్ తెలిపారు. దానికి సంజయ్ స్పందిస్తూ... ''హైదరాబాద్ ఏదో ఒక రోజు సైబరాబాద్ అవుతుంది. కానీ మా కార్యకలాపాలు ప్రారంభించేందుకు వెంటనే ఒక భవనం కావాలి'' అని పేర్కొన్నారు. ఆయన మాటల నుంచి స్ఫూర్తి పొందిన సుడాన్.. మాదాపూర్‌లో అభివృద్ధి చేసే ఐటీ కారిడార్‌కి సైబరాబాద్ అని పేరు పెడదామని ముఖ్యమంత్రికి సూచించారు. దానికాయన వెంటనే అంగీకరించారు.

ప్రశ్నపత్రాల ముద్రణ బాధ్యత ఎవరికీ..!

- ఏప్రిల్ 9 నుంచి సమ్మెటివ్-2 ప్రారంభం

ఈనాడు, అమరావతి: పాఠశాల విద్యాశాఖలో సమ్మెటివ్-2 ప్రశ్నపత్రాల ముద్రణ బాధ్యతలు ఎవరికి అప్పగించాలన్న అంశం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. గతంలో రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి (ఎస్‌సీఈఆర్టీ) వీటిని సిద్ధం చేయగా.. జిల్లా ఉమ్మడి పరీక్షల మండలి(డీసీఈబీ)లు ముద్రణ, సరఫరా బాధ్యతలు నిర్వహించేవి. గతంలో సమ్మెటివ్-1 ప్రశ్నపత్రాల లీకేజీ కారణంగా దాని వరకు మాత్రమే ముద్రణ బాధ్యతలను ప్రభుత్వ పరీక్షల విభాగానికి అప్పగించారు. ఈ ఏడాది ఏప్రిల్ 9వ తేదీ నుంచి సమ్మెటివ్-2 పరీక్షలు ప్రారంభం కాబోతున్నాయి. వీటికి సంబంధించిన ప్రశ్నపత్రాల రూపకల్పన తుదిదశకు చేరుకుంది. ఈ నేపథ్యంలో ఈ సారి ముద్రణ బాధ్యతలు ఎవ్వరికి అప్పగించాలనే దానిపై ఇప్పటివరకూ స్పష్టత లేకపోవడంతో ఈ ప్రక్రియ ముందుకు కదలడం లేదు. ఈసారికీ తమకే ఇవ్వాలని ప్రభుత్వ పరీక్షల విభాగం కోరుతుండగా.. తాము తక్కువ ఖర్చులోనే ముద్రణ, సరఫరా పూర్తి చేస్తామని డీసీఈబీలు పేర్కొంటున్నాయి. ఇటీవల 8,9 తరగతుల ప్రశ్నపత్రాల ముద్రణకు పరీక్షల విభాగం వ్యయం ఎక్కువ చేసిన నేపథ్యంలో తమకు అప్పగిస్తే తక్కువ ఖర్చులోనే పూర్తి చేస్తామని పేర్కొంటూ అంచనాలను సమర్పించేందుకు కొన్ని డీసీఈబీలు సన్నద్ధమవుతున్నాయి. మరో పక్క గతంలో నిర్వహించిన పరీక్షలకు సంబంధించి వీటికి దాదాపు రూ.25 కోట్లు వరకు బకాయిలు చెల్లించాల్సి ఉంది. దీనిపై... ప్రైవేటు పాఠశాలల నుంచి వసూలు చేసిన మొత్తం ఎంత? ప్రశ్నపత్రాల ముద్రణ, సరఫరాకు సంబంధించి ఎంత వ్యయం చేశారు? తదితర వివరాలను ఇవ్వాలని కోరినా డీసీఈబీలు ఇవ్వడం లేదని... అందుకే బిల్లుల చెల్లింపుల్లో జాప్యమవుతోందని విద్యాశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

కేంద్ర వైఖరికి నిరసనగా 13న ర్యాలీలు, సభలు: యూటీఎఫ్

ఈనాడు, అమరావతి: రాష్ట్రం పట్ల కేంద్రం నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ఈ నెల 13న జరిగే ర్యాలీలు, సభల్లో పాల్గొనాలని ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య (యూటీఎఫ్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్‌సాబ్జీ, పి.బాబురెడ్డి కోరారు. విజయవాడలో శుక్రవారం యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గసభ్యుల సమావేశంలో మాట్లాడారు.

ఈనాడు

లోక్‌పాల్‌పై వ్యర్థ రాద్ధాంతం

'అవినీతి అంతానికి కట్టుబడి ఉన్నట్లు అంతా చెబుతున్నారు... వాస్తవంలో ఎవరూ ఏమీ చెయ్యలేకపోతున్నారు'- గతంలో సర్వోన్నత న్యాయపాలిక చేసిన వ్యాఖ్య అది. నడుస్తున్న చరిత్రను గమనిస్తే అదెంత నిష్ఠుర సత్యమో బోధపడుతుంది. భారత తొలి ప్రధాని పండిత నెహ్రూ నోట అవినీతికి అంకుశంలా లోక్‌పాల్ ప్రస్తావన వచ్చిన అయిదు దశాబ్దాలకు 2014 తొలి వేకువలో సంబంధిత బిల్లుపై రాష్ట్రపతి ఆమోదముద్ర పడింది. కేంద్రస్థాయిలో అవినీతి నిర్మూలనకు పటుతర వ్యవస్థగా లోక్‌పాల్ ఆవిర్భవించడమే తరువాయి అనుకొన్న జాతి జనుల ఎదురుచూపుల్లోనే యాభై నెలలు కరిగిపోయాయి! తొలినాళ్లలో లోక్‌పాల్ ఎంపిక బృందం (సెర్చ్ కమిటీ) నుంచి న్యాయ నిపుణుడు ఫాలీ నారిమన్ వైదొలగగా, మరికొన్నాళ్లకే బృంద నేతృత్వ బాధ్యత తనకు వద్దంటూ 'సుప్రీం' మాజీ న్యాయమూర్తి జస్టిస్ కేటీ థామస్ తిరస్కరించారు. ఆ వెంటనే తోసుకొచ్చిన సార్వత్రిక ఎన్నికల్లో అవినీతి కాంగ్రెస్‌కు దేశ ప్రజ రిక్తహస్తం చూపడంతో- ఆ పార్టీ ప్రధాన ప్రతిపక్ష హోదా సైతం పొందలేక పరువుమాసింది. లోక్‌పాల్ ఎంపిక కమిటీలో ప్రధానమంత్రి, లోక్‌సభ స్పీకర్, భారత ప్రధాన న్యాయమూర్తితోపాటు ప్రధాన ప్రతిపక్ష నేతా సభ్యులుగా ఉండాలని చట్టం చెబుతోంది. పదహారో లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష హోదాయే ఏ పార్టీకీ లేనందువల్ల లోక్‌పాల్ నియామక కసరత్తు సాధ్యపడటం లేదని మోదీ ప్రభుత్వం సుప్రీంకోర్టుకే నివేదించింది. 'ఎందుకురా ఏడుస్తున్నావు అంటే... ఎగ్గొట్టడానికి' అన్నట్లున్న కేంద్రసర్కారు ధోరణిని సూటిగా తప్పుపట్టిన న్యాయపాలిక- విపక్షంలో అతిపెద్ద పార్టీ నేతతోనైనా లోక్‌పాల్ నియామక క్రతువును జరిపించగల వీలుందని నిరుడే స్పష్టీకరించింది. దానిపైనా మీనమేషాలు లెక్కించి న్యాయపాలికతో మొట్టికాయలు వేయించుకోవాల్సి రావడం కేవలం భాజపా నేతాగణం స్వయంకృతం. ఎట్టకేలకు లోక్‌పాల్ నియామక ప్రక్రియకు శ్రీకారం చుడుతూ, కాంగ్రెస్ లోక్‌సభా పక్ష నేత మల్లికార్జున్ ఖర్గేను 'ప్రత్యేక ఆహ్వానితుడి'గా పరిగణించి వ్యర్థ రాద్ధాంతానికి తెరతీయడం- హ్రస్వదృష్టి రాజకీయానికి నిదర్శనం!

'లోక్‌పాల్ వ్యవస్థ తప్పనిసరిగా అమలులోకి రావాలి... పార్లమెంటు ఔనన్నా కాదన్నా లోక్‌పాల్ అమలులోకి వచ్చేలా న్యాయపాలిక చూస్తుంది'- 2016 నవంబరులో సుప్రీంకోర్టు చేసిన కీలక వ్యాఖ్య అది. లోక్‌పాల్, ఆ వ్యవస్థలోని ఎనిమిది మంది సభ్యుల ఎంపిక తీరు ఎలా సాగాలో చట్టం విస్పష్టంగా నిర్దేశించింది. లోక్‌పాల్ ఎంపిక కమిటీలో అయిదుగురు సభ్యులుండాలని- ప్రధాని, లోక్‌సభాపతి, విపక్ష నేత, భారత ప్రధాన న్యాయమూర్తి కలిసి సూచించే ఓ న్యాయకోవిదుడిని అయిదో సభ్యుడిగా రాష్ట్రపతి నియమించాలని చట్టం చెబుతోంది. కేదస (సీబీఐ) సంచాలకుడు, ప్రధాన సమాచార కమిషనర్, కేంద్ర నిఘా సంఘం అధిపతి వంటి కీలక పదవుల నియామక క్రతువులోనూ ప్రధాన విపక్ష నేత పాత్ర, ప్రమేయం తప్పనిసరి. ఆయా పదవుల ఎంపికలో కాంగ్రెస్ లోక్‌సభా పక్షనేత పాల్పంచుకొనేలా సంబంధిత చట్టాలను సవరించిన పార్లమెంటు- లోక్‌పాల్ విషయంలో మాత్రం ఆచితూచి వ్యవహరిస్తోంది. విపక్షంలో మెజారిటీ సీట్లున్న పార్టీనేతకు లోక్‌పాల్ నియామక బృందంలో చోటుపెట్టాలని పార్లమెంటరీ స్థాయీసంఘమూ ఎంతోకాలం క్రితమే సిఫార్సు చేసింది. లోక్‌పాల్‌ను సాంతం అటకెక్కించేలా కేంద్రప్రభుత్వం నాన్చుడు ధోరణి కనబరుస్తోందంటూ 'కామన్‌కాజ్' అనే స్వచ్ఛంద సంస్థ దాఖలుచేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యం సందర్భంగా 'సుప్రీం' వ్యాఖ్యలు- రాజ్యాంగ స్ఫూర్తికి పట్టంకట్టాయి. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే, అత్యవసరాదేశం (ఆర్డినెన్స్) ద్వారానైనా లోక్‌పాల్ నియామక ప్రక్రియను పరుగులు పెట్టించగల వీలుందన్నట్లుగా వ్యాఖ్యానించిన సుప్రీం ధర్మాసనం- నిరుడు మే నెలలోనే విస్పష్ట తీర్పు ఇచ్చింది. అది వెలువడిన తరవాతా తొమ్మిది నెలల కాలయాపన, విపక్ష నేతకు ఆహ్వానంపై సంకుచిత రాజకీయ రగడ- ప్రభుత్వ ప్రతిష్ఠనే పలుచన చేస్తున్నాయి!

లోక్‌పాల్ అన్నది ఏ ప్రభుత్వాల దయాధర్మమూ కాదు. అయిదున్నర దశాబ్దాల క్రితమే వెలుగుచూసిన లోక్‌పాల్ ప్రతిపాదన ఏకంగా ఎనిమిదిసార్లు పార్లమెంటులో బిల్లుగానే మురిగిపోవడానికి సర్వభ్రష్ట రాజకీయమే పుణ్యం కట్టుకొందనడంలో మరో మాట లేదు. అవినీతి పంకిల పాలనకు పెట్టిందిపేరుగా కాంగ్రెస్ ఏలుబడి ఛీ కొట్టించుకొంటున్న రోజుల్లో- పటిష్ఠ లోక్‌పాల్ కోసం అన్నా హజారే 2011లో చేపట్టిన ఆందోళనకు యావద్భారతం మద్దతు పలికింది. జనాగ్రహ జ్వాలాముఖి బద్దలయ్యే ప్రమాదాన్ని శంకించి- అన్నా హజారే దీక్షను విరమింపజేయడానికి లోక్‌పాల్ ఏర్పాటుపై పార్లమెంటు హడావుడిగా విశేష తీర్మానమే చేసింది! నాటకీయ పరిణామాల నేపథ్యంలో తన పరిశీలనకు వచ్చిన లోక్‌పాల్ బిల్లుకు పార్లమెంటరీ సెలక్ట్ కమిటీ 2012 డిసెంబరులో 16 సవరణలు ప్రతిపాదించింది. వాటిలో 14 సూచనలకు మన్మోహన్ సర్కారు తలొగ్గడంతో, మొదట తక్కినవాటిపై బెట్టుచేసిన భాజపా చివరకు సమ్మతించడంతో స్థూలంగా ఏకాభిప్రాయం సాధ్యపడింది. సార్వత్రిక ఎన్నికలు తోసుకొస్తున్న వేళ కాంగ్రెస్, భాజపాలకు లోక్‌పాల్ చట్టరూపం దాల్చడం రాజకీయావసరంగా మారి- బిల్లు నెగ్గడంలో అపూర్వ ఏకాభిప్రాయం ప్రస్ఫుటమైంది. అప్పుడంతగా లోక్‌పాల్‌ను నెత్తికెత్తుకొన్న భాజపా, నాలుగేళ్లుగా ఆ వ్యవస్థకు ప్రాణప్రతిష్ఠ చెయ్యకుండా కుంటిసాకులతో రోజులు నెట్టుకు రావడం ఏమిటి? లోక్‌పాల్, లోకాయుక్త యంత్రాంగాల్ని కట్టుదిట్టంగా కొలువుతీర్చి, నిఘా విభాగాలకు సానపట్టి, దర్యాప్తు సంస్థలకు కోరలు తొడిగి, ప్రత్యేక కోర్టుల కొరడా ఝుళిపిస్తేనే కదా- అవినీతిపై పోరులో విజయం సాధించగలిగేది?

మోసాల ఉచ్చులో బ్యాంకులు

సమగ్ర క్షాళన తక్షణావసరం




డాక్టర్ పీఎస్ఎం రావు

పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ) కుంభకోణానికి బాధ్యత మీదంటే మీదేనని పాలక ప్రతిపక్షాలు ఒకరిదానిపై మరొకటి విరుచుకుపడుతున్నాయి. ప్రభుత్వం, రిజర్వు బ్యాంకు, పీఎన్‌బీ యాజమాన్యం, ఉద్యోగులు, ఆడిటర్లు... ఒకరినొకరు నిందించుకొంటున్నారు. అన్ని పక్షాలూ పరస్పర ఆరోపణల పర్వాన్ని కట్టిపెట్టి ఇకపై ఇలాంటి అకృత్యాలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. అసలు పీఎన్‌బీ కుంభకోణం లాంటివి మరెన్నో తెరచాటున దాగి ఉండవచ్చు. వాటి ఆరా తీయాలంటే పీఎన్‌బీ కుంభకోణం పూర్వాపరాలను ఒకసారి పునశ్చరణ చేసుకోవాలి. మొత్తం నిధుల స్వాహా ముంబాయిలో ఒకే ఒక్క పీఎన్‌బీ శాఖ (బ్రాడీహౌస్ శాఖ) సాయంతో జరిగింది. ఈ శాఖ 2011-2017 మధ్య కాలంలో అలహాబాద్ బ్యాంకు, యాక్సిస్ బ్యాంకు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంకుల విదేశీ శాఖలకు అవగాహన పత్రాలు (లెటర్స్ ఆఫ్ అండర్‌స్టాండింగ్) జారీచేసి రూ.12,717 కోట్ల రుణాలు మంజూరయ్యేలా చూసింది. ఈ డబ్బంతా విదేశ మారక ద్రవ్య రూపంలో చేతులు మారింది. నీరవ్ మోదీ, ఆయన బంధువు మెహుల్ చోక్సీలకు చెందిన కంపెనీలకు సరకులు విక్రయించిన వ్యక్తులు, సంస్థలకు ఈ డబ్బు ముట్టింది.

లెక్కాపత్రం లేని అప్పులు

ఎల్ఓయూ కింద ఒక బ్యాంకు (పీఎన్‌బీ) మరొక బ్యాంకు విదేశీ శాఖ (ఉదాహరణకు అలహాబాద్ బ్యాంకు శాఖ)కు లేఖ రాసి మూడో పక్షానికి (నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీల విదేశీ సరఫరాదారులకు) విదేశ ద్రవ్య రూపంలో నిధులు సమకూర్చవలసిందిగా కోరుతుంది. తరవాత ఈ మొత్తాన్ని ఖర్చులు, వడ్డీతో సహా చెల్లించే పూచీ తనదని హామీ ఇస్తుంది. సాధారణంగా రెండో బ్యాంకు (అలహాబాద్ బ్యాంకు) డిమాండ్ చేసిన 90 రోజుల్లో ఈ డబ్బును తిరిగి చెల్లించాలి. కానీ, పీఎన్‌బీ కేసులో ఇది ఏడాదికి దేకింది. ఇక్కడ గమనించాల్సిన ముఖ్యాంశం ఏమంటే- అలహాబాద్ బ్యాంకు డబ్బును అప్పుగా ఇచ్చింది పీఎన్‌బీకే తప్ప నీరవ్ మోదీ, చోక్సీలకు కాదు. కాబట్టి మోదీ, చోక్సీ, వారి సరఫరాదారులను బాకీ చెల్లించాలంటూ డిమాండ్ చేసే హక్కు అలహాబాద్ బ్యాంకుకు లేదు. దీన్ని దృష్టిలో ఉంచుకుని పీఎన్‌బీ తాను హామీ ఇచ్చిన రుణానికి సరిపడా నగదు, ఇతర ఆస్తుల రూపంలో నూరుశాతం పూచీకత్తును ఖాతాదారుల నుంచి తీసుకోవాలి. కానీ, తాజా ఉదంతంలో పీఎన్‌బీ ఆ పనే చేయలేదు. మోదీ, చోక్సీ కంపెనీల నుంచి స్థిరచరాస్తుల రూపేణా ఎలాంటి హామీలను తీసుకోకుండానే వారి సరఫరాదారుల చేతికి సొమ్ము చిక్కనిచ్చింది. పైగా నేరం తనది కాదని, ముంబయి బ్రాడీహౌస్ శాఖ ఉద్యోగులదని బుకాయించింది. ఈ పీఎన్‌బీ శాఖ ఉద్యోగులు స్విఫ్ట్(సొసైటీ ఫర్ వరల్డ్‌వైడ్ ఇంటర్ బ్యాంక్ ఫైనాన్షియల్ టెలికమ్యూనికేషన్) ద్వారా ఎల్ఓయూలు పంపారు. 1973 నుంచి అమలులోకి వచ్చిన స్విఫ్ట్ తన సభ్యులకు వేగంగా భద్రంగా లావాదేవీలు జరిపే సౌకర్యాన్ని అందిస్తోంది. సభ్య బ్యాంకుల మధ్య చెల్లింపు ఆదేశాలు శీఘ్రంగా బదలీ అయ్యేలా చూస్తోంది. అందువల్ల స్విఫ్ట్ ద్వారా అందే ఆదేశాలను ఏ బ్యాంకూ అనుమానించదు. తక్షణం చెల్లింపులు జరిపేస్తుంది. లెక్క ప్రకారం స్విఫ్ట్ ద్వారా జరిగే లావాదేవీలను కానీ, పంపే ఎల్ఓయూలను సక్రమంగా కోర్ బ్యాంకింగ్ సొల్యూషన్స్ (సీబీఎస్)లో నమోదు చేయాలి. దీనివల్ల ఖాతా పుస్తకాలు పకడ్బందీగా ఉండటంతోపాటు మోసాలు జరగకుండా అరికట్టవచ్చు. పీఎన్‌బీ ఉద్యోగులు ఈ జాగ్రత్తలు తీసుకోకపోవడం విచిత్రం. పీఎన్‌బీ భారతదేశంలో రెండో అతిపెద్ద బ్యాంకు. తాజా మోసం బయటపడేవరకు అక్కడ స్విఫ్ట్, సీబీఎస్‌లను అనుసంధానించలేదు. దేశంలో మరికొన్ని బ్యాంకులదీ ఇదే వరస. ఈ కుంభకోణాన్ని పురస్కరించుకుని అన్ని బ్యాంకులూ ఈ ఏడాది ఏప్రిల్ 30 కల్లా స్విఫ్ట్ లావాదేవీలను సీబీఎస్‌తో అనుసంధానించాలని రిజర్వుబ్యాంకు ఆదేశించింది. దానాదీనా పీఎన్‌బీ నీరవ్ మోదీకి కాని, చోక్సీకి కాని నేరుగా రుణాలివ్వలేదు. కానీ వారి సరఫరాదారులకు ఇతర బ్యాంకుల విదేశీ శాఖల ద్వారా నిధులు అందేట్లు చూసింది. ఆ డబ్బు తిరిగి చెల్లించే పూచీ తనదంటూ ఎల్ఓయూలను ఇచ్చింది. ఈ తరహా ఏర్పాట్లు బ్యాంకుల బ్యాలన్స్‌షీట్లకు ఎక్కవు. వీటిని సంభావ్య రుణాల పేరిట విడిగా నమోదు చేస్తారు. వీటి మాటున మోసాలు జరిగిపోతున్నాయి. మరికొన్ని మోసాలు నిరర్థక ఆస్తుల (ఎన్‌పీఏ) రూపంలో దాగి ఉండవచ్చు. నిర్ణీత కాలావధిలో చెల్లించని రుణాలను ఎన్‌పీఏలుగా వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. మోసపూరిత మార్గాల్లో రుణాలు తీసుకునేవాళ్లు సహజంగానే వాటిని తిరిగి చెల్లించరు. అలాంటి బాకీలన్నీ ఎన్‌పీఏలుగా మారిపోతున్నాయి.



కాబట్టి బ్యాంకు ఖాతా పుస్తకాల్లో నమోదైన ఎన్‌పీఏలు, సంభావ్య రుణాలను పరిశీలిస్తే బండారమంతా బయటపడిపోతుంది.

భారతీయ బ్యాంకుల ఎన్‌పీఏలు మొత్తం ఎంతమేరకు పేరుకుపోయాయో ఎవ్వరికీ కచ్చితంగా తెలియదు. 2017 సెప్టెంబరు 30నాటి అధికార గణాంకాల ప్రకారం ప్రభుత్వ బ్యాంకుల మొత్తం ఎన్‌పీఏలు రూ.7,33,974 కోట్లు. ప్రైవేటు బ్యాంకుల నిరర్థక ఆస్తులు రూ.1,02,808 కోట్లు. కాబట్టి మొత్తం ఎన్‌పీఏలు రూ.8.37 లక్షల కోట్లుగా లెక్కతేలతాయి. పీఎన్‌బీ కుంభకోణం బట్టబయలు కావడానికి ముందు మొత్తం ఎన్‌పీఏలు ఈ ఏడాది మార్చి కల్లా రూ.9.5 లక్షల కోట్లకు చేరుకుంటాయని అంచనా వేసేవారు. కానీ, అసలు మొత్తం ఇంతకు చాలాఎక్కువగా ఉంటుందని విమర్శకులు అంటున్నారు. ఇటీవలి సంవత్సరాల్లో బ్యాంకులు ఆరు లక్షల కోట్ల రూపాయల మేర ఎన్‌పీఏలను మాఫీ చేసినా ప్రభుత్వం, బ్యాంకులు వాటిని మాఫీ అనవు. సమతూకపరచే ఉద్దేశంతోనే ఎన్‌పీఏలను బ్యాలన్స్‌షీట్లలో చూపడంలేదు. అంతమాత్రాన వాటిని పూర్తిగా మాఫీ చేసేశామనడం సరికాదని వివరిస్తున్నాయి. కానీ, వీటిని కూడా బ్యాలన్స్‌షీట్లలో చూపిస్తేనే బ్యాంకుల నిజస్థితి తేటతెల్లమవుతుంది. ఆస్తుల వర్గీకరణకు రిజర్వుబ్యాంకు నిర్దేశించిన ప్రమాణాలను బ్యాంకులు పాటించకపోవడం నిరర్థక ఆస్తులు కొండల్లా పెరిగిపోవడానికి కారణమైంది. ఏమైతేనేం, బ్యాంకులు బయటపెడుతున్నదానికన్నా పారుబాకీలు ఎంతో ఎంతో ఎక్కువగా ఉండవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇవి రూ.20 లక్షల కోట్ల వరకు ఉండొచ్చని రిజర్వు బ్యాంకు మాజీ డిప్యూటీ గవర్నర్ కేసీ చక్రవర్తి అంటున్నారు. సంభావ్య రుణాలు ఇంతకన్నా ఎన్నో రెట్లు ఎక్కువనే భయాలు వ్యక్తమవుతున్నాయి. ఒక బ్యాంకు పూచీ మీద మరో బ్యాంకు ఖాతాదారుకు ఇచ్చే అప్పును సంభావ్య రుణంగా పరిగణిస్తారు. ఒకవేళ సదరు ఖాతాదారు రుణం ఎగవేస్తే, పూచీ ఇచ్చిన బ్యాంకు అందుకు బాధ్యత వహించాల్సి వస్తుంది. ఇలాంటి రుణాలు 2017 మార్చినాటికి ఒక్క పీఎన్‌బీలోనే రూ.3.32 లక్షల కోట్లకు చేరాయి. అన్ని బ్యాంకులవి కలిపి రూ.151.61 లక్షల కోట్ల వరకు ఉంటాయని అంచనా. కానీ, బ్యాంకుల మొత్తం ఆస్తులు రూ.141.58 లక్షల కోట్లు. 2016-17లో భారతదేశ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) రూ.149.94 లక్షల కోట్లకన్నా కూడా బ్యాంకుల సంభావ్య రుణాలే హెచ్చు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇతర ప్రభుత్వ రంగ బ్యాంకుల ఆస్తులు, సంభావ్య రుణాల నిష్పత్తి వరసగా 36, 41 శాతం; ప్రైవేటు బ్యాంకుల నిష్పత్తి 106 శాతం. విదేశీ బ్యాంకుల నిష్పత్తి అయితే ఏకంగా 927 శాతానికి చేరుకుంది. భారతీయ బ్యాంకింగ్ వ్యాపారంలో విదేశీ బ్యాంకుల వాటా నాలుగు లేదా అయిదు శాతాన్ని మించదు. అయినా వాటి మొత్తం సంభావ్య రుణ విలువ రూ.75 లక్షల కోట్లకు చేరుకున్నాయి. దీని ప్రకారం భారతీయ బ్యాంకుల మొత్తం సంభావ్య రుణాల్లో 50 శాతం విదేశీ బ్యాంకుల వద్దనే పేరుకున్నాయి.

'ప్రైవేటూ' అంతంతమాత్రం

బ్యాంకింగ్ రంగంలో తాజా గందరగోళాన్ని చూసి ప్రైవేటు పరిశ్రమల అధిపతుల సమాఖ్యలైన ఫిక్కీ, అసోచామ్‌లు ప్రభుత్వ బ్యాంకులను ప్రైవేటీకరించాలని సూచించాయి. ప్రైవేటు బ్యాంకులు కూడా నిండా ఈ తరహా రుణాల్లో కూరుకుపోయాయనే వాస్తవాన్ని అవి పట్టించుకోవడం లేదు. 2008 ఆర్థిక సంక్షోభానికి కారణం ప్రైవేటు బ్యాంకుల నిర్వాకమేనని మరవకూడదు. అసలు ప్రైవేటు బ్యాంకులు దివాలా తీసినందునే వాటిని జాతీయీకరించాల్సి వచ్చింది. జాతీయీకరణ తరవాత కూడా అనేక ప్రైవేటు బ్యాంకులను ప్రభుత్వ బ్యాంకుల్లో విలీనం చేశారు. ఇదంతా చెప్పేది- ప్రభుత్వ బ్యాంకుల నిర్వాహకుల అక్రమాలు, అవినీతి, అసమర్థతలను క్షమించేయాలని కాదు. అవకతవకల విషయంలో ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులు పోటీపడుతున్నాయి. విదేశీ బ్యాంకులు వీటిని తలదన్నాయి. ఇప్పుడు నిర్వహణ బాధ్యతలను ప్రైవేటువారికి అప్పగిస్తే వారు సాధించేదేమీ ఉండదు. అసలు ప్రస్తుత పరిస్థితుల్లో బ్యాంకులను ప్రైవేటీకరించాలని సూచించడం సమస్యను తప్పుదోవ పట్టించడమే అవుతుంది. ఇలాంటి సూచనలు బయటివారి నుంచి వస్తుంటే- ప్రభుత్వ బ్యాంకుల అధికారులు, ఉద్యోగులు జరిగినదానికి ఒకరినొకరు నిందించుకొంటున్నారు. ప్రభుత్వం, రిజర్వు బ్యాంకు ఇందులో తమ తప్పేమీ లేదని చేతులు దులిపేసుకుంటున్నాయి. బ్యాంకులు గాడి తప్పకుండా అదుపు చేయాల్సిన బాధ్యత తమదేనని అంగీకరించడం లేదు. ఇకనైనా దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించడం తక్షణావసరం. దీనికి సంబంధించి ఓ బిల్లుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తాజాగా తెలపడం ఈ దిశగా పడిన ముందడుగు.

బ్యాంకులపై ప్రజల్లో నమ్మకాన్ని పాదుగొల్పాలంటే నిరర్థక ఆస్తులు, సంభావ్య రుణాల గురించి పూర్తిగా ఆరా తీయాలి. రోగానికి మూలం, రోగ విస్తృతి ఏమిటో తెలిస్తే సరైన వైద్యం చేయవచ్చు. బ్యాంకుల్లో రకరకాల ఆడిట్లు జరగవలసి ఉండగా అవి సక్రమంగా జరుగుతున్నాయో లేదో ఎవరికీ తెలియదు. దీనికి కారణమేమిటో కనిపెట్టి దిద్దుబాటు చర్యలు తీసుకోవాలి. ఇకముందు ఇలాంటి మోసాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. బ్యాంకింగ్ వ్యవస్థ కుప్పకూలితే మొత్తం ఆర్థిక వ్యవస్థే కూలిపోతుందని గ్రహించాలి!

ఇంకెన్ని ఉన్నాయో?



ఎల్ఓయూ తరహా రుణాల మాటున మరింత భారీ కుంభకోణాలు దాగి ఉన్నాయని అనుమానించడానికి ఆస్కారం ఉంది. అవన్నీ ఒక్కసారి బట్టబయలైతే దేశ ఆర్థిక స్థితి ఏమవుతుందో ఊహించడానికే భయమేస్తుంది. నీరవ్ మోదీ కుంభకోణం వల్ల పీఎన్‌బీ షేర్ల విలువ రూ.15,400 కోట్ల మేరకు కోసుకుపోయింది. ఇది కుంభకోణ మొత్తం రూ.12,703 కోట్లకన్నా రూ.2,697 కోట్లు ఎక్కువ. పీఎన్‌బీ మార్కెట్ మూలధనీకరణ (పీఎన్‌బీ షేర్ల మార్కెట్ విలువ) కేవలం 15 రోజుల్లోనే రూ.39,255 కోట్ల నుంచి రూ.23,855 కోట్లకు పడిపోయింది.

ఇది విధానాల వైఫల్యం

వైకల్యం అనే పదప్రయోగమే సరికాదు. శారీరక, మానసిక వికలాంగులు అనడంలోనూ అర్థం లేదు. తరచి చూస్తే, వారిలో ఏదో ఒక దివ్యశక్తి ఉంటుంది. అందుకే వారిని 'దివ్యాంగులు'గా పరిగణిద్దాం. వారందరి సంక్షేమం, అభివృద్ధికి సంబంధించిన పథకాలు, కార్యక్రమాలకు వైకల్యం సోకకుండా చేద్దాం' అని ప్రధాని నరేంద్ర మోదీ అభిలషించి రెండేళ్లు దాటిపోయాయి. రోజువారీ పనుల్లో, ప్రయాణాల్లో దివ్యాంగులు నానాపాట్లు పడకుండా మేలుబాట పరచే 'సుగమ్య భారత్'ను అప్పట్లో ఆయన లక్షించారు. ఆ సూచనల్ని అమలుపరచడంలో భాగంగా, రైల్వే ప్రయాణ రాయితీ దరఖాస్తు పత్రాల్లో 'వికలాంగ్' స్థానే 'దివ్యాంగ్' పేరు ఇటీవల చోటుచేసుకుంది. అంటే, ముద్రిత పత్రాల్లో పేరు మార్పు చేసేందుకు దేశంలోనే అతిపెద్దదైన రైల్వేశాఖకు రెండు సంవత్సరాలు పట్టిందన్న మాట! దివ్యాంగుల ప్రయోజనాల పరిరక్షణ ఆచరణరీత్యా ఏ స్థాయిలో ఉందో ఇది వెల్లడిస్తోంది. ఎన్నో అవకాశాలు, సదుపాయాలు కలిగిన వ్యక్తులకే ముందడుగు పడని ప్రస్తుత సామాజిక పరిస్థితుల్లో- దివ్యాంగులు పలు రకాల సందేహాలు, సమస్యల నడుమ దినదినగండంగా బతుకులు వెళ్లదీయాల్సి వస్తోంది. దేశానికి స్వాతంత్ర్యం లభించిన తరవాత, దాదాపు అర్ధశతాబ్దిదాకా వారికి ప్రత్యేక చట్టమన్నదే రూపొందలేదు. సాధారణ ప్రస్తావనలే తప్ప, ఆ బాధితుల బాగోగుల్ని ప్రభుత్వాలే చూడాలన్న కచ్చితమైన విధివిధానాలేవీ భారత రాజ్యాంగంలో చోటుచేసుకోలేదు. ఏడేళ్లనాడు కేంద్రం నిర్వహించిన భారత జన గణన ప్రకారం, దివ్యాంగులు దాదాపు 2.7 కోట్లమంది ఉన్నారు. అప్పటి జనసంఖ్యలో వారిది ఇంచుమించు మూడుశాతంగా గుర్తించారు. కానీ, ఐక్య రాజ్యసమితి అంచనాల్ని బట్టి, భారత్‌లో దివ్యాంగులు పదిశాతం పైమాటే! ఆ జనసంఖ్యను గణించడంలో; వారికి చదువు, వైద్యం, వృత్తి, ఉద్యోగాలు, ఇతరత్రా అండదండలు అందించడంలో మాటలకు, చేతలకు ఎంత అంతరముందో ఇది స్పష్టీకరిస్తోంది. ఇటువంటి స్థితిగతుల్లో వారికి సౌకర్యాల కల్పన, హక్కుల పరిరక్షణకు ఉద్దేశించిన చట్టం అమలుకు సన్నాహాలే 20 నెలలుగా 'కొనసాగుతున్నాయి'. కార్యాచరణ కనీసం ఇప్పటికైనా వేగవంతం కావాల్సిన అవసరాన్ని ఇది ప్రస్ఫుటం చేస్తోంది.

అమలు తీరే వేరు

వికలాంగ శ్రేణిని ఏడు నుంచి 21 రకాలకు విస్తరించారు. వాటిలో అంధత్వం, దృష్టి లోపం, వినికిడి సమస్య, చలన వైకల్యంతో పాటు ఆమ్ల దాడుల బాధలు, మరుగుజ్జుతనం వంటివీ ఉన్నాయి. వాటిని సాకుగా చూపి ఎవరైనా కించపరిస్తే, విస్మరిస్తే, వివక్షణ కనబరిస్తే గరిష్ఠంగా రెండేళ్ల జైలుశిక్ష, అయిదు లక్షల రూపాయల జరిమానా వడ్డన తప్పదు. నియమ నిబంధనల్ని అతిక్రమించిన ప్రభుత్వ, ప్రైవేటు శాఖలు/సంస్థలపై క్రిమినల్ చర్యలు తప్పవు. దివ్యాంగుల బహుళ ప్రయోజనాల్ని కాపాడేందుకు ఎటువంటి జాగ్రత్తలు/చర్యలు తీసుకున్నారో ఆయా విభాగాల నివేదికల్లో, వెబ్‌సైట్లలో వివరాలతో సహా ఉండాలి. ఏ విధమైన ఫిర్యాదులనైనా సంబంధిత అధికారులు రెండు నెలల్లోగా పరిష్కరించాలి. ప్రభుత్వ రంగ ప్రయాణ సంస్థల్లో పదిశాతం వాహనాలనైనా మార్చి నెలాఖరులోగా



పట్టాలకెక్కని కొత్త చట్టం

దివ్యాంగులకు అనువైన రీతిలో మార్చాలన్నది నాటి సంకల్పం. అన్నింటి కంటే మించి ఆయా విద్యార్థుల కోసం ప్రత్యేక విశ్వవిద్యాలయాన్ని స్థాపించాలనీ ప్రతిపాదించారు. సాంకేతిక, సమాచార రంగాల్లోనూ వారి కోసం స్నేహపూరిత వాతావరణాన్ని కల్పించదలచారు. సామాజిక భద్రత కలిగేలా కట్టుదిట్టమైన చర్యలు చేపడతామన్నారు. అమలు తీరు నామమాత్రంగానే ఉంటోంది. ఒక రాష్ట్రంలో ఉన్న గుర్తింపు పత్రం మరోచోట చెల్లడం లేదు. 'సార్వత్రిక గుర్తింపు కార్డులు' ప్రకటనల్లో తప్ప ఎక్కడా లేవు. ఆ పత్రాల్ని ఆధార్‌తో అనుసంధానించి ప్రభుత్వ సంబంధ ప్రయోజనాలు కల్పించడం అనేది ఎప్పటి మాట? ఆరోగ్య కార్డులు అందజేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఎన్ని విన్నపాలు చేసుకున్నా నిష్ఫలమే అవుతోంది. దివ్యాంగులకు విద్య, ఉద్యోగ రిజర్వేషన్లను మూడు నుంచి నాలుగు శాతానికి పెంచాలని సర్వోన్నత న్యాయస్థానం మూడున్నర ఏళ్లక్రితమే ఆదేశించింది. అమలు కావాల్సిన ఆ ఉత్తర్వులు ఇంకా ప్రభుత్వాల పరిశీలన దశలోనే ఉంటున్నాయి. పదోన్నతుల్లో రిజర్వేషన్ల పెంపుదలను ఇక ఊహించడమూ కష్టతరమే. 'విభిన్న ప్రతిభావంతులు' అని వర్ణనలే తప్ప, వారికి ఒరుగుతున్నదేమీ లేదు. 'శుష్కప్రియాలు, శూన్య హస్తాలు ఇంకా ఎంతకాలం' అంటూ రామ్మూర్తి కమిటీ వంటివి ఏళ్లకిందటే ప్రభుత్వాల్ని నిలదీశాయి. పరిస్థితుల్లో నాటికీ నేటికీ పెద్ద తేడా ఏదీ లేకపోవడమే అత్యంత గర్హనీయం.

మార్పుచేర్పులతో లబ్ధి

దివ్యాంగులకు లభించాల్సిన ఉద్యోగాలు దారి మళ్లుతున్నాయి. ప్రత్యేక కమిషన్ల ఏర్పాటుకు ఉద్దేశించిన ప్రతిపాదనల దస్త్రాలు బీరువాలకే పరిమితమవుతున్నాయి. వారి మేలు కోరే లక్ష్యంతో ఏర్పాటైన ప్రత్యేక మంత్రిత్వశాఖలున్న రాష్ట్రాల్ని వేళ్లమీద లెక్కపెట్టవచ్చు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనూ పింఛన్ల మంజూరు నామమాత్రమే! తెలంగాణలో దాదాపు 45 శాతం దివ్యాంగులు- అర్హులైనా పింఛన్లకు నోచుకోవడం లేదు. వారికి అర్హత ధ్రువపత్రాలు ఇవ్వాల్సిన శిబిరాల నిర్వహణ అంతంతమాత్రంగానే ఉంటోంది. వైద్యనిపుణుల కొరత ఆంధ్రప్రదేశ్‌నూ బాధిస్తోంది. స్థానిక పరిస్థితుల కారణంగా ఎదురయ్యే వైకల్యాల బాధితుల ఘోషను ఆలకించేవారే లేరు. ప్రగతి సాధనకు 'అందరికీ సమాన అవకాశాలు' పేరిట ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ దివ్యాంగుల సంవత్సరం (1981) ప్రకటించి- 37 ఏళ్లు దాటింది. వారి ప్రయోజనాల సంరక్షణకు దశాబ్దిని 1983-'93 మధ్య నిర్వహించారు. అనంతరం ఆ పౌరుల సంక్షేమ దినోత్సవాన్ని 2008 నుంచి పాటిస్తున్నారు. ఏదో ఒక వైకల్యం గల వ్యక్తులు ప్రపంచ జనాభాలో అధిక శాతం ఉన్నారు. వారందరి శ్రేయస్సే ధ్యేయంగా వివిధ సంఘాలు ఏర్పాటయ్యాయి. దేశీయంగానూ కేంద్రం, రాష్ట్రస్థాయుల్లో ప్రత్యేకమైన సలహా సంస్థలు ఏర్పాటు కావాలి. జిల్లాలవారీగా సంక్షేమ కమిటీల నియామకం విస్తృత ప్రాతిపదికన సాగాలి. వివిధ దశల్లో నిధుల కేటాయింపు పెరగాల్సి ఉంది. దేశంలో 22 ఏళ్లనాటి చట్టానికి నవీన జవసత్వాలు కలిగిస్తూ కేంద్రం తెచ్చిన నిబంధనలు అనేకం. వీటిని దివ్యాంగుల హక్కులకు సంబంధించిన ఐక్యరాజ్య ఒప్పంద (యూఎన్‌సీఆర్‌పీడీ) సూత్రాలకు అనుగుణంగా రూపొందించారు. ఇదే స్ఫూర్తి కేంద్రంలో, రాష్ట్రాల్లోనూ పరిఢవిల్లినప్పుడు, క్షేత్రస్థాయిలో కదలిక మొదలైనప్పుడు దివ్యాంగుల సంక్షేమం సుసాధ్యమవుతుంది!

– దీపక్ శర్మ

ప్రశ్న

తెలుసుకోవాలనే జిజ్ఞాసకు, జ్ఞానార్జన దృష్టికి సంకేతం- ప్రశ్న. అది లేనిదే వికాసం లేదు. భారత, భాగవతాది మహాగ్రంథాలన్నీ అధిక భాగం ప్రశ్నోత్తర రూపాల్లో కనిపిస్తాయి.

వక్త చెబుతూ ఉంటే, శ్రోతకు అనేక ప్రశ్నలు తలెత్తుతాయి. ఏ ప్రశ్నా వేయలేదంటే, దానికి కారణం అతడు వినటంలో ఏకాగ్రత లోపించడం కావచ్చు. అడగటానికి మొహమాటమో, తన తెలియనితనాన్ని చాటడం ఇష్టం లేకపోవడమో కావచ్చు. వింటున్న విషయంలో ఆసక్తి లేకపోయినా, శ్రోత నుంచి ప్రశ్నలు రావు.

ఎందుకు, ఎప్పుడు వంటి ప్రశ్నలతోనే విజ్ఞానం విస్తరించింది. నూతన ఆవిష్కరణలు చోటుచేసుకున్నాయి. ఎవరూ ప్రశ్నించుకోకుండా ఉంటే- చైతన్యం ముందు, పదార్థం తరవాత అనే సిద్ధాంతం స్థానంలో పదార్థమే ముందు, చైతన్యం తరవాత అనేది పుట్టేదే కాదు. వ్యాకరణం పుట్టాక భాష పుట్టింది అనే సూత్రం స్థానంలో భాష ముందు, వ్యాకరణమే తరవాత అనేది వెలుగు చూసేదీ కాదు. ప్రశ్నలే తలెత్తకుంటే- తెలుగు భాష ఎప్పటి నుంచి వాడుకలో ఉంది, అందులో తొలి పదాలు ఏమిటి అనేవాటిపై కొత్త ఆవిష్కరణలేవీ వెలువడేవే కావు.

ప్రశ్న అంటూ లేనప్పుడు మానవ మనుగడ, పురోగతి ఉండవు.

ప్రతి వ్యక్తికీ బాల్యం ఒక అందమైన దశ. ఏ భయాలు, కల్మషాలు అంటవు. బాల్యంలోనే ఏకాగ్రత, ఆసక్తి అనేవి నిండుగా, మెండుగా ఉంటాయి. ఏదైనా వింటున్నప్పుడు, చదువుతున్నప్పుడు పిల్లల్లో ఎన్నో ప్రశ్నలు తలెత్తుతాయి. వాటిని వికసింపజేయాల్సిన బాధ్యత పెద్దలదే! ఒక్కొక్కసారి బాలలు వేసే ప్రశ్నకు సమాధానం చెప్పలేక, ఎలా చెప్పాలో తెలియక పెద్దవారు సతమతమవుతుంటారు. విద్యాలయాల్లో పిల్లలూ పలు ప్రశ్నలు గుప్పిస్తుంటారు. వాటికి ఉపాధ్యాయులు ఓపికగా సమాధానాలు చెప్పి సందేహ నివృత్తి చేయాలి.

'ఎందుకు' అనేది హేతుబద్ధంగా, తార్కికంగా ఆలోచించడాన్ని నేర్పుతుంది. మనిషి నిరంతర విద్యార్థి. విషయాలు తెలుసుకోవాలన్న అనురక్తి అతడిలో ఉండాలి. తనకు తెలిసినవాటిని ఎదుటివారికి విశ్లేషించి చెప్పగలగడం అతడి జ్ఞాన వికాసానికి దోహదపడుతుంది. పురాణాలు, ఇతర ఆధ్యాత్మిక గ్రంథాలు చదువుతున్నప్పుడు, ప్రవచనాలు వింటున్నప్పుడు ఎన్నెన్నో ప్రశ్నలు అంకురిస్తాయి. సమాధానాలు తెలిసేదాకా, అవి మెదడును తొలిచేస్తుంటాయి. జ్ఞానానికి ఎల్లలు లేవు. అది పొందడానికి చిన్న, పెద్ద తారతమ్యం ఉండదు. అవసరమైనప్పుడు పిన్నల నుంచి అడిగి తెలుసుకోవడాన్ని ఎవరూ ఆత్మన్యూనతగా భావించనక్కర్లేదు.

ఉపనిషత్తుల్లో ప్రశ్నోపనిషత్తుకు ప్రత్యేక



అంతర్యామి

స్థానం ఉంది. మహాభారతంలోని 'యక్ష ప్రశ్నలు' మనోజ్ఞ ఘట్టం! యక్షుడి రూపంలో వచ్చిన యమధర్మరాజు తన అంశతో జన్మించిన ధర్మరాజు ధర్మనిరతిని లోకానికి చాటిచెబుతాడు. యక్షుడి ప్రశ్నలు, ధర్మజుడి సమాధానాలు సామాన్య మానవాళికీ అత్యంత ఉపయోగకరాలు. శమం అంటే ఏమిటి, దయ అనేది ఎలా ఉంటుంది, లోకంలో మనిషి జయించేందుకు అలవి కాని శత్రువు ఎవరు వంటి ప్రశ్నలకు సమాధానాలు వ్యక్తిత్వ వికాసానికి దోహదపడతాయి.

అర్జునుడు, కృష్ణుడు నరనారాయణ స్వరూపాలు. భగవద్గీతలో అర్జునుడు అడిగినవన్నీ అందరి సమస్యలే! వాటికి గీతాచార్యుడు బదులిచ్చిన తీరు ఎప్పటికీ దివ్యసందేశమై నిలిచి ఉంటుంది.

సమూహంలో ప్రశ్నించడం వల్ల తెలిసే విషయాలు ఆ వ్యక్తికే కాక మిగతావారికీ ఉపయోగపడతాయి. ఒక ప్రశ్న నుంచి మరొక ప్రశ్న పుట్టడానికి ఆవకాశముంది. భారతం, భాగవతం, ఉపనిషత్తులు వంటి ఆధ్యాత్మిక గ్రంథాలు చదవటం, వినడం వల్ల ప్రశ్నోత్తర రూపమైన రచనా పద్ధతి నేటి తరానికి బాగా తెలుస్తుంది. ప్రశ్నలు తలెత్తడం ప్రాథమిక జ్ఞానానికి సూచన. సమాధానాల్ని అన్వేషించి తెలుసుకోవడం జ్ఞాన వికాసానికి గుర్తు. రమణ మహర్షి జీవిత విశేషాలు, ఉపదేశాలు ప్రశ్నోత్తర రచన రూపంలో లభిస్తాయి. ఇటువంటివి చదువుతున్నప్పుడు మరెన్నో ప్రశ్నలు ఉదయిస్తుంటాయి. నిరంతర జ్ఞానార్జన ప్రక్రియ- ప్రశ్న. దానితోనే మానసిక పరిపక్వత, విశేష విషయ సంపద, సమాజ ప్రగతి సాధ్యపడతాయి.

– వెంగల్వ బొడ్డపాటి రామలక్ష్మి

గౌరీ లంకేశ్ కేసులో కీలక ముందడుగు

- సిట్ కస్టడీలో నిందితుడు
- తొలుత అక్రమాయుధాల కేసులో అరెస్టు
- గౌరి హత్యలో ప్రమేయముందని విచారణలో వెల్లడి

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : ప్రఖ్యాత పాత్రికేయురాలు గౌరి లంకేశ్ హత్య కేసు దర్యాప్తులో కీలక ముందడుగు పడింది. అక్రమాయుధాలు కలిగి ఉన్నాడన్న ఆరోపణలతో గత నెల



నిందితుడు కె.టి.నవీన్‌కుమార్

18న బెంగళూరు పోలీసులు అరెస్టు చేసిన కె.టి.నవీన్ కుమార్ (37) అలియాస్ హొట్టె నవీన్ కుమార్‌కు గౌరీలంకేశ్ హత్య కేసులో ప్రమేయముందని ఆధారాలు లభించడంతో ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) అధికారులు శుక్రవారం తమ అదుపులోకి తీసుకున్నారు. గత నెల 18న అరెస్టయిన తర్వాత సిట్ అధికారులు అతన్ని విచారించారు. గౌరీ లంకేశ్ హత్య కేసులో అతని ప్రమేయముందని ఆ విచారణలో ఆధారాలు లభించాయని తెలిసింది. అక్రమాయుధాల కేసులో జ్యుడిషియల్ రిమాండ్‌లో ఉండడంతో సిట్ అధికారులు తమ అదుపులోకి తీసుకోవడానికి మెజిస్ట్రేట్ కోర్టు అనుమతి కోరారు. హత్య కేసులో ప్రమేయంపై నిందితుడు చేసిన నేరాంగీకార ప్రకటనకు సంబంధించిన సీల్డ్ కాపీని సిట్.. అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్‌కు అందజేసింది. నేరం వెనక ఉన్న భారీ కుట్రను వెలికి తీసేందుకు నిందితుడిని మరో ఎనిమిది రోజుల పాటు సిట్ కస్టడీకి అప్పగించాలని సహాయక పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోర్టుకు విజ్ఞప్తి చేశారు. కోర్టు అందుకు అంగీకరించింది. నవీన్‌కుమార్‌కు హిందూ అతివాద సంస్థ అయిన హిందూ యువసేనతో సంబంధముందని సిట్ విచారణలో వెల్లడయింది. సనాతన్ సంస్థ, దాని అనుబంధ సంస్థ అయిన హిందూ జనజాగృతి సమితితోనూ సంబంధాలున్నట్లు వెల్లడయిందని సమాచారం. నవీన్‌కుమార్ మాండ్యాలోని మద్దూర్‌కు చెందిన వాడిగా పోలీసులు గుర్తించారు. గౌరీ లంకేశ్ నివాసం వద్ద సీసీటీవీ దృశ్యాల ఆధారంగా రూపొందించిన అనుమానితుడి ఫొటోగ్రాఫ్‌తో నవీన్‌కుమార్ చూపులు సరిపోలుతున్నాయని పోలీసు వర్గాలు వెల్లడించాయి.

నీరవ్ మోదీ అమెరికాలో ఉన్నారా? మాకు తెలియదు!

నిర్ధారించలేమన్న అగ్రరాజ్య విదేశీ వ్యవహారాల శాఖ



వాషింగ్టన్: వజ్రాభరణాల వ్యాపారి, రూ.12వేల కోట్ల పంజాబ్ నేషనల్ బ్యాంకు(పీఎన్‌బీ) కుంభకోణంలో కీలక నిందితుడు నీరవ్ మోదీ తమ దేశంలో ఉన్నారో లేదో నిర్ధారించలేమని అమెరికా విదేశీ వ్యవహారాల అధికార ప్రతినిధి ఒకరు తెలిపారు. అయితే, నీరవ్ అమెరికాలో ఉన్నట్లు ఇటీవల మీడియాలో వస్తున్న వార్తల గురించి మాత్రం తెలుసని చెప్పారు. నీరవ్ ఎక్కడున్నారో గుర్తించేందుకు భారత ప్రభుత్వానికి సహకారం అందిస్తున్నారా అని 'పీటీఐ' ప్రతినిధి ప్రశ్నించినప్పుడు... భారత్‌కు న్యాయపరమైన చేయూత అందించే విషయాన్ని న్యాయ శాఖ దృష్టికి తీసుకెళ్తామని మాత్రమే జవాబిచ్చారు. మరోవైపు అమెరికా న్యాయశాఖ...నీరవ్ మోదీ గురించి మాట్లాడేందుకు నిరాకరించింది. నీరవ్ మోదీ, ఆయన కుటుంబ సభ్యులు, గీతాంజలి జెమ్స్ అధినేత చోక్సీ తదితరులు జనవరిలోనే భారత్‌ను వీడి విదేశాలకు వెళ్లిన విషయం తెలిసిందే.

అమెరికా కోర్టులో నీరవ్‌కు ఉపశమనం

నీరవ్ మోదీకి చెందిన ఫైర్‌స్టార్ డైమండ్స్ సంస్థకు అమెరికా కోర్టులో ఉశమనం లభించింది. తమకు రావాల్సిన బకాయిలను చెల్లించాలని ఆ సంస్థపై ఒత్తిడి తీసుకురావద్దని రుణదాతలను ఆదేశిస్తూ న్యాయస్థానం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. దీనిని అనుసరించి రుణగ్రహీత నుంచి బకాయిల వసూళ్లకు, లేదా ఆ సంస్థ ఆస్తుల జప్తునకు రుణదాతలు ప్రయత్నించటానికి వీల్లేదు. ఈ నెల 30వ తేదీన రుణదాతలందరినీ కోర్టు సమావేశపర్చనుంది. ఫైర్ స్టార్ డైమండ్స్ సంస్థ గత సోమవారం న్యూయార్క్‌లోని దివాలా కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే.

చాపకింద నీరులా మూత్రపిండాల వ్యాధులు!

- కృష్ణా జిల్లా ఎ.కొండూరు మండలంలో వెలుగులోకి
- 160 మంది రక్త పరీక్షలు విశ్లేషించగా.. 76 మందిలో ప్రమాద సంకేతాలు

ఎ.కొండూరు, న్యూస్‌టుడే: కృష్ణా జిల్లా ఎ.కొండూరు మండలంలో మూత్రపిండాల వ్యాధులు చాపకింద నీరులా విస్తరిస్తున్నాయి. ఈ మండలంలోని దీప్లానగర్‌తండా, మాన్‌సింగ్‌తండా, రేపూడి తండా, కుమ్మరికుంట్ల, పోలిశెట్టిపాడు, రామచంద్రాపురం శివారు లక్ష్మీపురం, గోపాలపురం, గొల్లమందల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం వరకు 269 మంది నుంచి రక్త నమూనాలు సేకరించగా సుమారు 160 ఫలితాలు వచ్చాయి. 76 మంది(47.5%)లో క్రియాటిన్ 2 ఎంజీకిపైగా నమోదైనట్లు తెలడంపట్ల వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. వీరిలో 12 మంది వరకు చక్కెర వ్యాధితో బాధపడుతున్నట్లు వైద్యులు తెలిపారు. వీరితోపాటు మిగిలిన వారు కూడా రక్తపోటుతో సతమతమవుతున్నారు. అధికారిక లెక్కల ప్రకారం 2016 సెప్టెంబరు నుంచి 2017 డిసెంబరు మధ్యకాలంలో డయాలసిస్ చేయించుకుంటూ 14 మంది ప్రాణాలు విడిచారు. గత కొన్నేళ్ల నుంచి నిరాటంకంగా ఈ మండలంలో ఫ్లోరైడ్, ఇతర అనారోగ్య సమస్యల నుంచి ఉపశమనం పొందేందుకు నొప్పి నివారణ మందులను విస్తృతంగా ఉపయోగిస్తుండడం, మద్యం అలవాట్లు, పోషకాహారాన్ని తీసుకోకపోవడం వంటి కారణాలతో మూత్రపిండాల వ్యాధులు ఇప్పుడు బయటపడుతున్నాయి.

8 ఆవాసాల్లో పరిమితికి మించి ఫ్లోరైడ్..!: మూత్రపిండాల సమస్యలు తీవ్రతరమైన నేపథ్యంలో తాజాగా గ్రామీణ నీటిపారుదల శాఖ అధికారులు మండలంలోని 16 గ్రామాలు, 4శివారుగ్రామాలు, 12 గిరిజన తండాల్లోని 71 తాగునీటి ఆవాసాల్లో నమూనాలు సేకరించారు. 8 ఆవాసాల్లో పరిమితికి మించి (సాధారణంగా లీటరు నీటిలో 1-1.5 మిల్లీగ్రాములు ఉండాల్సి ఉండగా 1.8 మిల్లీగ్రాములుగా) నమోదైంది. వల్లంపట్ల, జీళ్లకుంట, ఎ.కొండూరుతండాలో నాలుగు తాగునీటి ఆవాసాల్లో, చైతన్యనగర్ తండా, కుమ్మరికుంట్లలో ఫ్లోరైడ్ పరిమితికి మించి ఉన్నట్లుగా నమోదైంది. దీప్లానగర్‌తండా, మాన్‌సింగ్‌తండా, గోపాలపురం తదితర గ్రామాల్లోని నీటి ఆవాసాల్లో పరీక్షలు నిర్వహించి వాటిని వాడకుండా ఎరువురంగు గుర్తులను వాటిపై ముద్రించారు. ఆర్వో ప్లాంట్లు, ట్యాంకర్ల ద్వారా మంచినీటిని అందిస్తున్నట్లు మండల రెవెన్యూ అధికారి సురేష్‌కుమార్ తెలిపారు. దశాబ్దాల కాలం నుంచి ఫ్లోరైడ్ ప్రభావం, అర్హతలు లేకుండా వైద్యాన్ని అందించే పరిస్థితులవల్ల ఇక్కడి పరిస్థితులు చెయ్యి దాటిపోతున్నాయని నిమ్స్ విశ్రాంతి సంచాలకులు డాక్టర్ రాజారెడ్డి పేర్కొన్నారు.

అప్రమత్తంగా వ్యవహరించాలి: రక్తపరీక్షలను నిర్వహించిన వారిలో క్రియాటిన్ 2 ఎంజీ ఉన్న వారు ఎక్కువగా ఉండడంపై ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం విశ్రాంతి ఉపకులపతి డాక్టర్ రవిరాజ్, గుంటూరు జనరల్ ఆస్పత్రి అసిస్టెంట్ ప్రొఫెసర్ శివరామకృష్ణ మాట్లాడుతూ జీఎఫ్ఆర్ పరీక్షలను కూడా నిర్వహిస్తే బాగుంటుంది. క్రియాటిన్ రెండు ఎంజీ ఉండడం ఆందోళన కలిగించే అంశమేనని పేర్కొన్నారు. వీరికి వైద్య సేవలను బాగా అందిస్తే డయాలసిస్ చేయించుకోవల్సిన అవసరం ఉండకపోవచ్చన్నారు.

ప్రత్యేక హోదాపై గట్టి పట్టుకే మొగ్గు!

- తుది దశకు జనసేన జేఎఫ్‌సీ చర్చలు
- కేంద్ర, రాష్ట్రాల తప్పులను ఎత్తి చూపనున్న కమిటీ

ఈనాడు-అమరావతి: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా వచ్చేలా గట్టి పట్టు పట్టడమే మంచిదని జనసేన ఏర్పాటు చేసిన సంయుక్త నిజనిర్ధారణ కమిటీ(జేఎఫ్‌సీ) తుది నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌తో పాటు ఈ కమిటీలో సభ్యులుగా ఉన్న జయప్రకాష్ నారాయణ, ఐవైఆర్ కృష్ణారావు, తోట చంద్రశేఖర్, పద్మనాభయ్య, ఉండవల్లి అరుణ్‌కుమార్ తదితరులు శుక్రవారమూ ఈ అంశాలపై చర్చలు జరిపారు. శనివారం కూడా సమావేశమవుతారు. సాయంత్రానికి నివేదికను వెల్లడించనున్నారు. ఇంతవరకు కొలిక్కి వచ్చిన అంశాల మేరకు రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధన వైపు మొగ్గు చూపి అందుకు పట్టుపట్టడమే ప్రధానమనే అభిప్రాయానికొచ్చారు. ఇవ్వబోయే నివేదికలో అటు కేంద్రం వైఖరితో పాటు రాష్ట్ర ప్రభుత్వ లోటుపాట్లను కూడా వెల్లడించనున్నట్లు తెలిసింది. కేంద్ర ప్రభుత్వం నుంచి ఈ కమిటీకి ఎలాంటి సమాచారమూ అందలేదు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం జేఎఫ్‌సీకి నివేదిక అందించినా అది కూడా సమగ్రంగా లేదని కమిటీ అభిప్రాయపడింది. విభజన హామీలకు సంబంధించిన అన్ని అంశాల సమాచారమూ అందులో లేదు. ప్రధానంగా కొత్త రాజధాని అమరావతికి సంబంధించిన సమాచారం రాష్ట్ర ప్రభుత్వం సమర్పించకపోవడంతో ఆ విషయంపై ఎలాంటి తుది నిర్ణయానికి రాలేదని తెలిసింది.

★ పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని కేంద్రమే చేపట్టి త్వరగా పూర్తి చేయడమే మేలని కూడా కమిటీ సూచించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

★ రెవిన్యూ లోటు విషయంలో కేంద్రం మాట తప్పిన వైనంపై స్పష్టమైన సమాచారం ఉండగా ఆ విషయంపై ఇప్పటికే రాష్ట్రం ఒక కచ్చితమైన వైఖరి తీసుకుని కేంద్రానికి గట్టిగా చెప్పి పోరాటం చేసి ఉండాల్సిందనే అభిప్రాయమూ వ్యక్తీకరించే అవకాశం కనిపిస్తోంది.

పొగ ప్రమాదం

దేశంలో తగ్గుతోంది.. ఏపీలో ఎక్కువ!

ఇదీ 'పొగాకు' భారతం

ప్రపంచంలో మనం...

వినియోగంలో 2వ స్థానం

ఉత్పత్తిలో 3వ స్థానం

ఒకప్పటితో పోలిస్తే ఇటీవలి కాలంలో మన దేశంలో పొగాకు వినియోగం తగ్గుముఖం పడుతోంది. ఈ విషయం తాజాగా యువతపై నిర్వహించిన ప్రపంచవ్యాప్త సర్వేలో వెల్లడైంది. మన దేశంలో వివిధ రాష్ట్రాల్లో 15 ఏళ్ల పైబడిన 74,037 మందిపై నిర్వహించిన ఈ సర్వే (జీఏటీఎస్-2) వివరాలు ఇటీవలే విడుదల చేశారు.

మేల్కొన్న యువత

యువతలో పొగాకు వినియోగం తగ్గుతోంది.

- వయోజనుల్లో పొగాకు వినియోగం...

2009-10లో 34.6%
2016-17లో 28.6%

- 15-24 ఏళ్ల మధ్య వయస్కుల్లో తగ్గుదల...

18.4% నుంచి 12.4%

నమిలేదే ఎక్కువ

దేశంలో పొగాకు వినియోగం బీడీ, సిగరెట్ల రూపంలో కంటే ఖైనీ, జర్దా వంటి రూపాల్లోనే ఎక్కువగా ఉంటోంది.

- జర్దా, ఖైనీ వంటి నమిలే రూపాల్లో..... 19.9 కోట్ల మంది
- బీడీ, సిగరెట్ల వంటి పొగ రూపంలో..... 10 కోట్ల మంది
- రెండు రూపాల్లో వినియోగిస్తున్నది...... 3.2 కోట్ల మంది

పల్లెల్లోనే ఎక్కువ

పొగాకు వినియోగించేవారు పల్లెల్లోనే ఎక్కువగా ఉంటున్నారు.

- గ్రామాల్లో పొగాకు వాడకం..... 19.9 కోట్ల మంది
- పట్టణాల్లో..... 6.8 కోట్ల మంది

ఫలిస్తున్న బొమ్మల ప్రయోగం

హెచ్చరిక బొమ్మల వల్ల పొగ అలవాటు తగ్గుతున్నట్లు తేలింది.

- బొమ్మల తర్వాత సిగరెట్లు వదులుకున్న యువత 61.9%
- బీడీలు వదులుకున్న యువత 53.8%
- నమిలే అలవాటు వదులుకున్నది 46.2%

'పక్కపొగ' సమస్యే

పక్కవాళ్లు వదులుతున్న పొగ పీల్చి ఇబ్బందుల్లో చిక్కుకుంటున్న వారి సంఖ్య ఆందోళనకరంగా ఉంది.

- ఇళ్లలో, కార్యాలయాల్లో 30%
- బహిరంగ ప్రదేశాల్లో 23%

ఆంధ్రప్రదేశ్‌లో అత్యధికం

దక్షిణ భారతదేశంలో పొగతాగే వారి సంఖ్య ఆంధ్రప్రదేశ్‌లోనే అత్యధికం!
రాష్ట్రంలో పొగతాగే వారు 14.2%
పొగాకు ఉత్పత్తులు నమిలేవారు 7.1%

- దేశంలో అత్యధికం మిజోరం - 34.4%
- తమిళనాడు 10.5%
- కర్ణాటక 8.8%
- తెలంగాణ 8.3%
- ఒడిశా 7%

- ఈనాడు ప్రత్యేక విభాగం

ప్రజాసేవకు పునరంకితమవుదాం

- అభిమానులకు జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ పిలుపు

ఈనాడు డిజిటల్, అమరావతి: జనసేనని అభిమానించే అందరూ ఒక చోట చేరి తెలుగు రాష్ట్రాల ప్రజల సేవకు పునరంకితమవుదామని ఆ పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ శుక్రవారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. గుంటూరు జిల్లాలోని నాగార్జున విశ్వవిద్యాలయం ఎదురుగా ఉన్న మైదానంలో ఈ నెల 14న పార్టీ ఆవిర్భావ మహాసభ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా పార్టీ ప్రకటన నాటి నుంచి నేటి వరకు సాగిన ప్రయాణాన్ని, జనసేన సిద్ధాంతాలను అభిమానులు, నాయకులతో పంచుకోనున్నట్లు వివరించారు. మహాసభ ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నట్లు తెలిపారు. తెలుగు రాష్ట్రాల కోసం త్యాగం చేసిన నాయకులను స్మరించుకునే విధంగా సభా ప్రాంగణం ఉంటుందని పేర్కొన్నారు. సమన్వయం కోసం విజయవాడలోని వినాయక థియేటర్ ఎదురుగా భారతీనగర్‌లో కార్యాలయాన్ని ప్రారంభించినట్లు చెప్పారు.

పేరుకే వంద పనిరోజులు!

- గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు అసలు రూపం...

ఈనాడు, దిల్లీ: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద గ్రామీణ పేదలకు ఏటా వంద రోజుల పనిదినాలను కల్పించాలన్నది లక్ష్యం. కానీ ప్రభుత్వ లెక్కలు గమనిస్తే అందులో సగం పనిదినాల కల్పన కూడా గగనంగా ఉన్నట్లు స్పష్టమౌతోంది. 2012-13లో సగటున 50 పనిదినాల కల్పన జరగ్గా 2018 ఫిబ్రవరి నాటికి ఆ సంఖ్య 39కి పడిపోయింది. ఉపాధి పొందుతున్న సగటు కుటుంబాల సంఖ్య ఆరేళ్లలో దాదాపు 10% తగ్గిపోయింది. ఈ పథకానికి గత దశాబ్దకాలంలో ఏటా 7% బడ్జెట్ కేటాయింపులు పెరుగుతూ పోతున్నాయి. 2011-12, 2012-13 సంవత్సరాలు మినహాయించి మిగిలిన అన్ని సంవత్సరాల్లో బడ్జెట్ పెరిగిందే తప్ప తగ్గలేదు. 2016-17లో అత్యధికంగా 23% కేటాయింపులు పెరిగాయి. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బడ్జెట్ వ్యయం కూడా భాగా పెరిగింది. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం ఆ ఫలితం కనిపించడం లేదు. దీని కింద ఉపాధి పొందుతున్న కుటుంబాలసంఖ్య, పనిదినాలు ఏటికేడాది తగ్గిపోతున్నాయి. 2012-13 సంవత్సరంలో ఈ పథకం కింద నమోదు చేసుకున్న వారిలో 97% కుటుంబాలకు పని కల్పించగా 2017-18 నాటికి అది 87శాతానికి పడిపోయింది. 2009-10లో సగటున 54 పనిదినాలు కల్పించగా 2017-18లో (ఫిబ్రవరినాటికి)అవి 39కి పడిపోయాయి.

చట్టంలో పొందుపరిచిన 100 రోజుల ఉపాధితో పోలిస్తే ఇది చాలా తక్కువ. వేతనాల చెల్లింపు మాత్రం ఈ ఆర్థిక సంవత్సరంలో బాగా మెరుగుపడింది. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి మూడేళ్లలో వేతనాల చెల్లింపులో తీవ్ర జాప్యం చోటుచేసుకుంది. గత ఏడాది సుప్రీం కోర్టు వేతనాల చెల్లింపుల్లో జరుగుతున్న జాప్యంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేయడంతో ప్రభుత్వం స్పందించి పెండింగ్ బకాయిలు చెల్లించింది. దీంతో 2017-18లో పరిస్థితి కొంత మెరుగుపడింది. 2014-15లో 73% వేతనాలను ఆలస్యంగా చెల్లించగా ప్రస్తుతం అది 14%కి తగ్గిపోయింది.

ఉపాధి పొందుతున్న కుటుంబాలు....

సంవత్సరం	కుటుంబాల శాతం
2012-13	97%
2013-14	93%
2014-15	89%
2015-16	90%
2016-17	90%
2017-18	87%

గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద కల్పించిన పనిదినాల సంఖ్య వివరాలు...

సంవత్సరం	సగటు పనిదినాలు
2012-13	50
2013-14	49
2014-15	40
2015-16	48
2016-17	46
2017-18 (ఫిబ్రవరినాటికి)	39

జ్యుడీషియల్ భవనాల తుది ఆకృతులు ఖరారు

- 12 ఆకృతుల్లో మొదటిదాన్ని ఎంపిక చేసిన ముఖ్యమంత్రి
- టెండర్లు పిలిచిన సీఆర్‌డీఏ

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతిలో నిర్మించతలపెట్టిన జ్యుడిషియల్ భవన సముదాయాల తుది ఆకృతులను రాష్ట్ర ప్రభుత్వం ఖరారు చేసింది. దీని కోసం మొత్తం 12 ఆకృతులను రూపొందించగా మొదటి ఆకృతిని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎంపిక చేశారు. శుక్రవారం సీఆర్‌డీఏ అధికారులతో జరిగిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయించారు. రూపొందించిన ఆకృతులన్నింటినీ సీఆర్‌డీఏ వెబ్‌సైట్‌లో పెట్టి వాటిపైన ప్రజల నుంచి సలహాలు, అభిప్రాయాలు స్వీకరించారు. ఓటింగూ చేపట్టారు. వాటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని తుది ఆకృతిని ఖరారు చేశారు. అనంతరం జీ ప్లస్2 నమూనాలో ఈ భవనం నిర్మించేందుకు సీఆర్‌డీఏ టెండర్లు పిలిచింది.



నేలపాడులో నిర్మించబోయే జ్యుడీషియల్ భవన సముదాయాల కోసం ఎంపిక చేసిన తుది ఆకృతి (ఈ భవనంలోనే హైకోర్టును ఏర్పాటు చేస్తారు)

మొత్తం 2.25 లక్షల చ.అడుగుల నిర్మిత ప్రాంతం ఉంటుంది. భవిష్యత్తులో భవనంలో జీ ప్లస్ 5 వరకూ అంతస్తులు వేసేందుకు వీలుగా నిర్మిస్తారు. రాజధాని పరిధిలోని నేలపాడులో రూ.94.50 కోట్ల వ్యయంతో దీన్ని నిర్మించనున్నారు. ఒక్కో చ.అడుగుకు రూ.4200 ఖర్చు కానుంది. ఏప్రిల్ 4వ తేదీ సాయంత్రం నాల్గింటికి సాంకేతిక బిడ్లు తెరుస్తారు. భవన సముదాయాల నిర్మాణం పూర్తయ్యాక ఆంధ్రప్రదేశ్ హైకోర్టును తాత్కాలికంగా ఈ భవనాల్లో ఏర్పాటుచేస్తారు. పరిపాలన నగరంలో శాశ్వత హైకోర్టు భవన నిర్మాణం పూర్తయ్యాక జ్యుడిషియల్ భవన సముదాయాలను సిటీ సివిల్, జిల్లా కోర్టులకు కేటాయిస్తారు.

స్ట్రక్చరల్ ఆకృతులు సిద్ధమైన నెల రోజుల్లో శాశ్వత భవనాలకు టెండర్లు: మరోవైపు పరిపాలన నగరంలో నిర్మించనున్న శాశ్వత సచివాలయం, అసెంబ్లీ, హైకోర్టు భవనాలకు సంబంధించిన అంతర్గత, స్ట్రక్చరల్ ఆకృతులు ప్రస్తుతం సిద్ధమవుతున్నాయి. మార్చి 15వ తేదీకి సచివాలయం, ఏప్రిల్ 15వ తేదీకి హైకోర్టు, మే 15కు అసెంబ్లీ భవనాలకు సంబంధించిన అంతర్గత, స్ట్రక్చరల్ ఆకృతులు సిద్ధంకానున్నాయి. అవి ఖరారైన నెల వ్యవధిలో వాటి నిర్మాణానికి టెండర్లు పిలవనున్నారు.

అమరావతి మెరీనా అభివృద్ధికి టెండర్లు

ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య విధానంలో అమరావతి మెరీనాను అభివృద్ధి చేసేందుకు సీఆర్‌డీఏ శుక్రవారం టెండర్లు పిలిచింది. ఏప్రిల్ 17వ తేదీ సాయంత్రం మూడింటి వరకూ దరఖాస్తు చేసుకోవచ్చు.

హోదాపై తాడోపేడో తేల్చుకుంటాం

- 5 నుంచి దిల్లీలో నిరసన
- ఏపీసీసీ అధ్యక్షుడు రఘువీరా వెల్లడి

విజయవాడ, న్యూస్‌టుడే: ప్రత్యేకహోదా, విభజన హామీల అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయని వచ్చే పార్లమెంటు సమావేశంలో దీనిపై తాడోపేడో తేల్చుకుంటామని ఏపీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి స్పష్టం చేశారు. సోమవారం నుంచి పార్లమెంటు లోపల, బయట నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. శుక్రవారం విజయవాడలో విలేకరుల సమావేశంలో రఘువీరారెడ్డి మాట్లాడుతూ అరెస్టులకు కాంగ్రెస్ నాయకులు భయపడేది లేదని రాబోయే రోజుల్లో జైల్‌భరో నిర్వహిస్తామన్నారు. లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష నేత మల్లిఖార్జున్ ఖర్గే ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, విభజన హామీలపై చర్చకు నోటీసు ఇచ్చారని దీనిపై మిత్రపక్షాలను సమీకరిస్తామన్నారు. తెదేపా, వైకాపాలకు చెందిన ఎంపీలు ఈ అంశంపై నిలబడాలని కోరారు. ప్రత్యేక హోదాపై కాంగ్రెస్ పోరాడుతుంటే తెదేపా, వైకాపాలు నాటకాలు ఆడుతున్నాయని విమర్శించారు. ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టిన తెదేపా చనిపోయిందని ప్రస్తుతం అది చంద్రన్న పార్టీగా మారిందన్నారు. ఏప్రిల్ 5లోగా ప్రత్యేక హోదా సాధించుకోలేకపోతే ఎప్పటికీ రాదన్నారు. అసెంబ్లీ సమావేశాలను వాయిదా వేసుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు దిల్లీకి వెళ్లి ప్రధానిమోదీని కలిసి ప్రత్యేక హోదా కోసం ఒప్పించాలన్నారు.



రఘువీరారెడ్డిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు. చిత్రంలో మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సుంకర పద్మశ్రీ తదితరులు

రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు డిమాండ్‌తో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ విజయవాడలోని స్క్యూబ్రిడ్జి సమీపంలో రాస్తారోకో చేయాలని నిర్ణయించింది. పాల్గొనడానికి వస్తున్న రఘువీరారెడ్డి, తదితర కాంగ్రెస్ నాయకులను పోలీసులు ముందుగానే అదుపులోకి తీసుకుని రాస్తారోకోను భగ్నం చేశారు. అనంతరం రఘువీరారెడ్డిని కంకిపాడు స్టేషన్‌కు, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సుంకర పద్మశ్రీ, కొలనుకొండ శివాజీ తదితరులను పెనమలూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

కోవూరులో ఉన్మాది కలకలం

- ఓ మహిళపై అత్యాచారం, 11 మందిపై దాడి

కోవూరు, న్యూస్‌టుడే: శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కోవూరు పట్టణంలో ఓ ఉన్మాది వీరంగం సృష్టించాడు. మహిళలే లక్ష్యంగా చేసుకొని వరస దాడులకు తెగబడి, భయభ్రాంతులకు గురిచేశారు. గురువారం రాత్రి సుమారు పది గంటల నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు సుమారు 11 ప్రాంతాల్లో మహిళలపై దాడులకు దిగాడు. పట్టణంలోని నాయీబ్రాహ్మణ వీధిలో 55 సంవత్సరాల మహిళ ఇంట్లోకి ప్రవేశించి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆమెను తీవ్రంగా గాయపరిచి పరారయ్యాడు. ఆబోతు వారి వీధిలో ఒంటేరు అంకమ్మ అనే వృద్ధురాలి ఇంట్లోకి ప్రవేశించి ఆమెను గాయపరిచాడు. ఇలా పట్టణంలో కనిపించిన మహిళలపై దాడులకు తెగబడ్డాడు. బాధితుల ఫిర్యాదులతో ఉన్మాదిని పట్టుకోవడానికి పోలీసులు గాలింపు ప్రారంభించారు. క్లూస్‌టీం సంఘటనా స్థలంలో వేలిముద్రలు సేకరించింది. పోలీసు జాగిలంతో దర్యాప్తు మొదలుపెట్టారు. విషయం తెలియగానే జిల్లా ఎస్పీ రామకృష్ణ సంఘటనా స్థలాలను పరిశీలించి బాధితుల నుంచి వివరాలు సేకరించారు. గాలింపు తీవ్రం చేశామని, దాడులకు పాల్పడుతున్న వ్యక్తిని పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ రామకృష్ణ

నైజీరియా సైనిక స్థావరంపై బొకోహరం దాడి

- ముగ్గురు ఐరాస సిబ్బంది సహా 11 మంది మృతి

మైదుగురి: కరడుగట్టిన ఉగ్రవాద సంస్థ బొకోహరం నైజీరియాలో మారోసారి రక్తపాతం సృష్టించింది. సోమవారం భారీ ఆయుధాలతో కామెరూన్ సరిహద్దుల్లో ఉన్న ఒక సైనిక స్థావరంపై విరుచుకపడటంతో 11 మంది మృతి చెందారు. వీరిలో ముగ్గురు ఐక్యరాజ్య సమితికి చెందిన సేవా సంస్థ సిబ్బంది. మిగిలిన వారు నైజీరియా ప్రభుత్వ సైనికులు, పోలీసులు.

కాంగోలో 49 మంది హత్య

బునియా: ప్రజాస్వామ్య గణతంత్ర కాంగోలో జాతులమధ్య చెలరేగిన హింసలో 49 మంది పౌరులు హత్యకు గురయ్యారు. ఈశాన్యప్రావిన్స్‌లో హెమా, లెండు అనే రెండు తెగల మధ్య ఘర్షణ తలెత్తిందని, మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది.

ఇన్‌సర్వీసు సీట్ల భర్తీలో మార్కులకు ప్రాధాన్యం

- రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించిన ఎంసీఐ

ఈనాడు, అమరావతి: వైద్య కళాశాలల్లో పీజీ వైద్య విద్య సీట్లను ప్రతిభ ప్రతిపాదికనే భర్తీచేయాలని భారతీయ వైద్య మండలి(ఎంసీఐ) రాష్ట్రాలకు సూచించింది. 2018-19 విద్యాసంవత్సరం నుంచి వైద్య కళాశాలల్లో ఉన్న పీజీ వైద్య సీట్లలో 50% జాతీయ స్థాయిలో నింపబోతున్నారు. మిగిలిన వాటిని ఇన్‌సర్వీసు కోటా కింద కేటాయించాలని ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న జూనియర్ వైద్యులు కోరుతున్నారు. సీట్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వాలకు స్వేచ్ఛ ఉందంటూ.. ఈ ప్రకారమే ఒడిశా ప్రభుత్వం ఉత్తర్వులిచ్చిందని గుర్తుచేస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం.. వెనుకబడిన, గ్రామీణ, పట్టణ, నగర ప్రాంతాల్లోని సర్కారీ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న వైద్యులను పరిగణనలోనికి తీసుకుని మార్కుల పరంగా ప్రాధాన్యం ఇవ్వాలని, ఇది పది నుంచి 20% దాటకూడదని రాష్ట్ర ప్రభుత్వాలకు ఎంసీఐ సూచించినట్లు తెలిసింది.



ఎంసీఐ నుంచి సూచన వచ్చిన మాట వాస్తవమేనని, అధికారిక ఉత్తర్వుల కోసం ఎదురుచూస్తున్నామని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి.

పీజీ సీట్ల పెరుగుదల ఉన్నట్లా? లేనట్లా?: ప్రత్యేకంగా ప్రభుత్వ వైద్య కళాశాలల్లో పీజీ వైద్య సీట్లు పెంచుతామని కేంద్రం కిందటేడాది ప్రకటించింది. దీనివల్ల కనీసం 150 సీట్ల వరకు పెరుగుతాయని, ఫిబ్రవరిలోగా సమాచారం వస్తుందని అధికారులు ఎదురుచూస్తుండగా.. ఇప్పటివరకు ఉత్తర్వులు వెలువడలేదు. గుంటూరు వైద్య కళాశాలలో పీజీ వైద్యవిద్యలో కనీసం 40సీట్లు అదనంగా వస్తాయని భావిస్తున్నారు. ఈ పెంపుపై సంబంధిత ప్రభుత్వ కళాశాలల వారు ఎంసీఐతో చర్చలు జరిపి వచ్చినా సానుకూలత లేదు. మరోవైపు.. ఎప్పటిలానే 2018-19 విద్యా సంవత్సరానికి సంబంధించి అదనపు సీట్లు, కోర్సుల నిర్వహణకు ఆమోదం తెలిపిన, తెలపని జాబితాలను ఎంసీఐ ప్రకటిస్తూ వస్తోంది. ఫిబ్రవరి 28 నాటికి అది సీట్ల పెంపు నిరాకరించిన జాబితాలో 140కళాశాలల పేర్లు ఉన్నాయి. ఇందులో రాష్ట్రానికి చెందిన ప్రైవేట్ కాలేజీలతో పాటు అనంతపురం ప్రభుత్వ వైద్య కళాశాల కూడా ఉంది.



రహదారుల నిర్మాణ వివరాలు నమోదు చేసుకొంటున్న మంత్రి నారాయణ

శరవేగంగా రాజధానిలో రహదారుల నిర్మాణం: మంత్రి నారాయణ

తుళ్ళూరు, న్యూస్‌టుడే: రాజధాని అమరావతిలో నిర్మిస్తున్న రహదారులు 2019 మార్చికి పూర్తవుతాయని రాష్ట్ర పురపాలకశాఖమంత్రి డా.పి.నారాయణ తెలిపారు. తొలిదశలో 277 కిలోమీటర్ల రోడ్లు 2018 డిసెంబరు నాటికి సిద్ధమవుతాయన్నారు. అమరావతిలో రహదారుల పనులను మంత్రి శుక్రవారం పరిశీలించారు. దొండపాడు, రాయపూడి, లింగాయపాలెం, ఉద్దండ్రాయుని పాలెం గ్రామాలను అనుసంధానిస్తూ నిర్మిస్తున్న రహదారులను మంత్రి పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. శరవేగంగా పనులు సాగుతున్నాయన్నారు. 325 కిలోమీటర్లలో నాలుగు రకాల రహదారులు నిర్మిస్తున్నామన్నారు. రైతులకు కేటాయించిన ప్లాట్ల అభివృద్ధి పనులను వచ్చే మూడేళ్లలో పూర్తి చేస్తామన్నారు. అందులో రహదారుల పనులు ఏప్రిల్ నుంచి ప్రారంభిస్తామని.. అన్నీ సిమెంటు రోడ్లనే వేస్తామన్నారు.

7,500 మంది పేదలకు గృహాలు: రాజధాని ప్రతిపాదిత గ్రామాల్లో పది ప్రదేశాల్లో 5వేల కుటుంబాలు నివసించేందుకు గృహాలు సిద్ధమవుతున్నాయన్నారు. మరో 2,500 మంది నిరుపేదలు ఉన్నారనే విషయం తమ దృష్టికి వచ్చిందని వారికి కూడా త్వరలో గృహాలు మంజూరు చేస్తామన్నారు. ఐఏఎస్, ఐపీఎస్, ఎన్‌జీవోలకు 3,820 ఫ్లాట్లు నిర్మిస్తున్నామన్నారు. మార్చినెలాఖరుకు మొదటి అంతస్థు పైకప్పు పూర్తి చేస్తామని మంత్రి పేర్కొన్నారు.

బ్యాంకాక్ సదస్సుకు సీతారామరాజు

ఈనాడు, అమరావతి: థాయ్‌లాండ్‌లోని బ్యాంకాక్‌లో ఈ నెల 4 నుంచి 17 వరకు నిర్వహించే అంతర్జాతీయ స్థాయి కార్యశాలకు మత్స్యశాఖ సంయుక్త డైరెక్టర్ కె.సీతారామరాజు హాజరవుతున్నారు. ఈ మేరకు అక్కడి ప్రభుత్వం నుంచి ఆహ్వానం వచ్చింది. వివిధ దేశాలకు చెందిన మత్స్య నిపుణులు హాజరయ్యే ఈ కార్యశాలలో భారతదేశం తరపున ప్రజంటేషన్ ఇస్తారు. చేపలు, రొయ్యల సాగులో థాయ్‌లాండ్ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకుంటూ విత్తన రకాలను అభివృద్ధి చేస్తోంది. ప్రపంచస్థాయి ప్రమాణాలను రాష్ట్రంలోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచిస్తున్న నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలపై ప్రభుత్వానికి నివేదిక ఇస్తారు.

కోతుల దాడి నుంచి తప్పించుకోబోయి..

భవనం నుంచి పడి వైద్యురాలి మృతి

నందికొట్కూరు, న్యూస్‌టుడే: కర్నూలు జిల్లా నందికొట్కూరు పట్టణంలోని ఓ ప్రైవేటు నర్సింగ్ హోమ్ వైద్యురాలు ప్రభావతమ్మ(70) ప్రమాదవశాత్తు మేడపై నుంచి కిందపడి మృతి చెందారు. బంధువులు తెలిపిన వివరాల మేరకు దినచర్యలో భాగంగా శుక్రవారం మేడపై నడకకు ఆమె వెళ్లారు. మూడో అంతస్తు మెట్లు ఎక్కే సమయంలో అక్కడ ఉన్న కోతులు మీదికి రావడంతో భయపడి పక్కకు జరగటంతో కాలు జారి కిందపడి ఉండవచ్చన్నారు. భవంతి పక్కనే ఉన్న పురపాలక ప్రహరీలోని డక్‌టైల్ పైపులపై పడటంతో ప్రభావతమ్మ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు.



ప్రభావతమ్మ (పాతచిత్రం)

బ్యాంకులు ప్రభుత్వ రంగంలోనే ఉండాలి

- ఏఐబీఈఏ జాతీయ కార్యదర్శి రాంబాబు

ఈనాడు, హైదరాబాద్: దేశంలో రుణాల ఎగవేతలు, నిరర్థక ఆస్తులు ఆందోళన కలిగిస్తున్నాయని అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం(ఏఐబీఈఏ) జాతీయ కార్యదర్శి రాంబాబు ఆందోళన వ్యక్తం చేశారు. బ్యాంకులిచ్చిన రుణాలు, వసూళ్లు, నిరర్థక ఆస్తులను గుర్తించడంలో ఆరు ఆడిటింగ్ వ్యవస్థలు విఫలమయ్యాయని విమర్శించారు. శుక్రవారమిక్కడ ఏఐటీయూసీ, తెలంగాణ, ఏపీ బ్యాంకు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి వివిధ బ్యాంకులు, ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులు, కార్మిక సంఘాల నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ.. బ్యాంకు కుంభకోణాల వెనుక రాజకీయ నాయకులు, బ్యాంకుల యాజమాన్యాలు, కార్పొరేటు సంస్థలున్నాయని ఆరోపించారు. గతేడాది బ్యాంకులు రూ.86వేల కోట్ల రుణాలను మాఫీ చేసిందని, ఇందులో చిన్న పరిశ్రమలు, రైతులు, సాధారణ పౌరులెవరూ లేరని రాంబాబు తెలిపారు. బ్యాంకుల్లో 80 శాతం ఎన్‌పీఏలకు కార్పొరేట్ కంపెనీలు కారణమని యూనియన్ నాయకులు వెంకటరామయ్య తెలిపారు. పీఎన్‌బీ బ్యాంకులో జరిగిన కుంభకోణంపై సమగ్ర విచారణ జరిపించాలని ఏఐటీయూసీ ప్రతినిధి నర్సింహులు కోరారు. బ్యాంకులు ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని సమావేశం తీర్మానం చేసింది. ఎఫ్‌ఆర్‌డీఐ చట్టం కింద డిపాజిట్లపై రూ.15లక్షల వరకు బీమా ఉండాలని, అన్ని డిపాజిట్లకు బీమా చేయాలని కోరింది. రూ.5కోట్లకు పైబడిన ఎన్‌పీఏలపై సమగ్ర విచారణ చేయాలని డిమాండ్ చేసింది. ఈ సమావేశంలో వివిధ ప్రభుత్వరంగ బ్యాంకు సంఘాల ప్రతినిధులు కుమార్, ఉదయ్ భాస్కర్, రమణ, సమద్ తదితరులు పాల్గొన్నారు.



హైకోర్టు ప్రవేశ ద్వారం వద్ద బైఠాయించి నిరసన వ్యక్తంచేస్తున్న న్యాయవాదులు

రెండో రోజు విధులను బహిష్కరించిన న్యాయవాదులు

ఈనాడు, హైదరాబాద్: డిమాండ్ల సాధన కోసం ఉమ్మడి హైకోర్టు న్యాయవాదులు రెండో రోజు శుక్రవారం విధులను బహిష్కరించారు. దీంతో హైకోర్టులోని అత్యవసర వ్యాజ్యాల్లో తప్ప సాధారణ వ్యాజ్యాల్లో విచారణ సాగలేదు. ఉదయం తెలంగాణ, ఏపీ హైకోర్టు న్యాయవాది సంఘాల అధ్యక్షులు జల్లి కనకయ్య, చల్లా ధనంజయ, కార్యదర్శుల ఆధ్వర్యంలో పలువురు న్యాయవాదులు కోర్టు హాళ్ల వద్దకు వెళ్లి విధుల బహిష్కరణకు సహకరించాలని సహచర న్యాయవాదులను కోరారు. అనంతరం అందరూ హైకోర్టు వెలుపల ఆరో గేటు నుంచి ప్రవేశ మార్గం వద్ద ఉన్న నాలుగో గేటు వరకు ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. హైకోర్టులో ఖాళీగా ఉన్న న్యాయమూర్తుల పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని, పూర్తిస్థాయి ప్రధాన న్యాయమూర్తి(సీజే)ని నియమించాలని నినాదాలు చేశారు. కోర్టు ప్రవేశ ద్వారం వద్ద బైఠాయించి నిరసన వ్యక్తంచేశారు.

ఉపాధి నిధుల భోక్తలపై చర్యలేవి?

- రెవెన్యూ రికవరీ చట్టం అమలులోనూ నిర్లిప్తత
- రూ.17.31 కోట్లకు గాను రూ.63.23 లక్షల వసూలు
- రాజకీయ జోక్యంతో అత్యధిక జిల్లాల్లో అధికారుల మీనమేషాలు

నెల్లూరు జిల్లాలో రూ.85.84 లక్షలకుపైగా ఉపాధి నిధుల్లో అక్రమాలు జరిగాయి. రాబట్టేందుకు రెవెన్యూ రికవరీ చట్టం కింద 75 కేసులు నమోదయ్యాయి. ఇప్పటికీ రూపాయి వెనక్కి రాలేదు. కారణం రాజకీయ జోక్యం.

గుంటూరు జిల్లాలో ఈ బాపతు మొత్తం రూ.2.53 కోట్ల పైమాటే. రాబట్టేందుకు ఇక్కడ నమోదు చేసిన కేసులు 139. ఇప్పటిదాకా రూ.6.07 లక్షలు వసూలు చేసి అధికారులు చేతులెత్తేశారు. జిల్లాలో పనుల నిర్వహణలో ప్రజాప్రతినిధుల జోక్యంతో నిబంధనలకు నీళ్లొదిలారు.

ఈనాడు, అమరావతి: దుర్వినియోగమైన ఉపాధి నిధులను బాధ్యుల నుంచి తిరిగి రాబట్టడంలో అలక్ష్యం కనిపిస్తోంది. రెవెన్యూ రికవరీ చట్టాన్ని ప్రయోగించినా ఇప్పటివరకు 3.65 శాతం మాత్రమే తిరిగి రాబట్టగలిగారు. ఉపాధి పనులపై ఏటా విధిగా సామాజిక తనిఖీలు నిర్వహిస్తుంటారు. నిబంధనలకు విరుద్ధంగా చేసిన, నాణ్యత లోపించిన, తక్కువ పని చేసి ఎక్కువ చూపించిన పనులను, కూలీలకు వేతనాల చెల్లింపులను ప్రత్యేక బృందాలు పరిశీలించి నివేదికలు రూపొందిస్తుంటాయి. వీటిపై మళ్లీ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ నాలుగు దశల్లో పునః పరిశీలన చేసి నిధుల దుర్వినియోగాన్ని ఖరారు చేస్తుంది. బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవడంతోపాటు స్వాహా చేసిన నిధులను జిల్లాల వారీగా వసూలు చేయాలి.

కేసులు సరే... కాసులేవి?

నిధులు స్వాహా చేసిన వ్యక్తుల ఆస్తుల స్వాధీనం కోసం రెవెన్యూ రికవరీ చట్టాన్ని ప్రయోగిస్తున్నా ఉపయోగం లేకుండాపోతోంది. చట్టాన్ని అమలు చేయాల్సిన తహశీల్దార్లు శ్రద్ధ చూపకపోవడంతో ఆస్తుల రికవరీ అంతంత మాత్రంగా ఉంటోంది. సంయుక్త కలెక్టర్లు సమీక్షించి చర్యలు తీసుకునేలా ఆదేశాలివ్వాలని భూ పరిపాలన ముఖ్య కమిషనర్‌కు ఇటీవల పంచాయతీ, గ్రామీణాభివృద్ధిశాఖ విజ్ఞప్తి చేసింది.



అలక్ష్యంపై గణాంకాలు ఇలా..

- జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని (నరేగా) ప్రారంభించాక గత 13 ఏళ్లలో ఏపీకి సంబంధించి రూ.165 కోట్లకుపైగా దుర్వినియోగమైనట్లు సామాజిక తనిఖీల్లో బయటపడింది.
- పునః పరిశీలన తరువాత ఆ మొత్తాన్ని రూ.82.96 కోట్లుగా తేల్చారు.
- ఇందులో రూ.25.46 కోట్లు వసూలు కాగా మరో రూ.57.51 కోట్లు రాబట్టాలి.
- వీటిలో రూ.17.31 కోట్ల వసూలు కోసం 4,243 కేసుల్లో రెవెన్యూ రికవరీ చట్టాన్ని ప్రయోగించారు. రాజకీయ జోక్యంతో సరిగా అమలు కావడం లేదు.
- 304 కేసుల్లో ఇప్పటివరకు కేవలం రూ.63.23లక్షలు వసూలు చేశారు.

రెవెన్యూ రికవరీ చట్టం కింద వివిధ జిల్లాల్లో ఇప్పటివరకు నమోదు చేసిన కేసుల వివరాలు...

జిల్లా	కేసులు	నిధులు (రూపాయలలో)	కేసులు	వసూళ్లు
అనంతపురం	399	1,73,22,295	2	2,776
చిత్తూరు	514	1,50,94,444	82	7,19,336
తూర్పు గోదావరి	338	2,12,53,593	43	11,03,446
గుంటూరు	139	2,53,98,195	12	6,07,902
కృష్ణా	218	1,88,41,869	26	1,86,778
కర్నూలు	22	2,12,07,867	4	12,22,434
నెల్లూరు	75	85,84,843	0	0
ప్రకాశం	69	27,26,683	17	1,19,256
శ్రీకాకుళం	332	11,04,542	37	1,99,609
విశాఖపట్నం	1466	1,25,75,634	44	17,85,358
విజయనగరం	117	71,46,463	6	1,14,505
పశ్చిమ గోదావరి	230	64,64,310	30	2,57,677
కడప	324	1,53,88,553	1	4,904
మొత్తం	4,243	17,31,09,291	304	63,23,981

పరస్పర సహకారంతోనే రాష్ట్రాభివృద్ధి

- భాజపా సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ హరిబాబు



విజయవాడలో నిర్వహించిన కృష్ణా జిల్లా భాజపా కార్యకర్తల సమావేశంలో 'కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఏపీ అభివృద్ధి' అనే అంశంపై మాట్లాడుతున్న ఎంపీ హరిబాబు

ఈనాడు, అమరావతి: కేంద్రం, రాష్ట్రం పరస్పరం సహకరించుకోవడంతోనే అభివృద్ధి సాధ్యమని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు, విశాఖ ఎంపీ కె.హరిబాబు పేర్కొన్నారు. విజయవాడలో శుక్రవారం కృష్ణా జిల్లా అధ్యక్షుడు కుమారస్వామి అధ్యక్షతన నిర్వహించిన భాజపా కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మిగతా రాష్ట్రాలతో పోల్చితే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేక చొరవ తీసుకొని భూములు కేటాయించడంతోనే కేంద్రం అనేక విద్యా సంస్థలు మంజూరు చేసిందన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రగతికి పదేళ్లలో చేయాల్సిన అభివృద్ధిని మూడేళ్లలో భాజపా చేసి చూపిస్తుందని వివరించారు. రెవెన్యూలోటు ఎక్కువగా ఉన్నందున కేంద్ర సాయం పెంచాలన్న రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తిని పరిశీలిస్తోందని, 14వ ఆర్థిక సంఘ సూచనలను పక్కనపెట్టి పార్లమెంట్‌లో ఇచ్చిన హామీ మేరకు కేంద్ర ప్రాయోజిత కార్యక్రమాలకు 90 శాతం సాయం అందిస్తుందని వివరించారు. దుగరాజపట్నంలో ఓడరేవు విషయమై రాష్ట్రం ప్రత్యామ్నాయం చూపిస్తే దాని ఏర్పాటుకు కేంద్రం కట్టుబడి ఉందని, కడపలో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుపై ఏం చేస్తే బాగుంటుందో కేంద్ర ఉక్కు మంత్రిత్వశాఖ పరిశీలిస్తోందని, విశాఖలో రైల్వే జోన్ ఏర్పాటు ఖాయమని వివరించారు. అనంతపురం, విజయనగరంలో కేంద్రీయ, గిరిజన విశ్వవిద్యాలయాల ఏర్పాటుకు పార్లమెంట్‌లో చట్టం తీసుకొస్తున్నామని చెప్పారు. విభజనకు కారణమై, చట్టంలో ప్రత్యేక హోదా అంశాన్నే ప్రస్తావించని కాంగ్రెస్ పార్టీ నేతలు ఇప్పుడు అధికారంలోకి వస్తే హోదాపై మొదటి సంతకం చేస్తామని అనడం విడ్డూరంగా ఉందన్నారు. మూడు రాష్ట్రాలకు హోదా పొడిగించారన్నది వాస్తవమైతే కేంద్రాన్ని అడిగించేందుకు సిద్ధంగా ఉన్నానని, ఎక్కడ పొడిగించారో ప్రతిపక్ష పార్టీలు చెప్పాలని సూచించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెదేపాతో కలిసే పనిచేస్తున్నామని, ఇందులో ఎలాంటి సందేహం లేదని స్పష్టం చేశారు.

గుంటూరులో వైరస్ పరిశోధన, నిర్ధరణ కేంద్రం

- రూ.6.5 కోట్ల వ్యయం అంచనా
- కేంద్రం 75 శాతం, రాష్ట్రం 25 శాతం నిధులను భరిస్తాయి
- ఒప్పందం కుదుర్చుకున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

ఈనాడు - అమరావతి

గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాలలో రాష్ట్ర స్థాయి 'వైరస్ పరిశోధన నిర్ధరణ కేంద్రం (వైరస్ రీసెర్చి అండ్ డయాగ్నస్టిక్ లాబరేటరీస్-వీఆర్‌డీఎల్) రాబోతుంది. పెరుగుతున్న యాంటిబయోటిక్స్ వాడకంవల్ల బాక్టీరియా ప్రభావం తగ్గుతున్నా...వైరస్ తీవ్రస్థాయిలో వ్యాప్తి చెందుతోంది. ఒక ప్రాంతం నుంచి మరోక ప్రాంతానికి కొత్త సూక్ష్మజీవులు వ్యాప్తి చెందుతూ వ్యాధులను తీవ్రతరం చేస్తున్నాయి. ప్రకృతి వైపరీత్యాల్లో కూడా ఈ వైరస్ వ్యాధులు త్వరగా వ్యాప్తి చెందుతున్నాయి. దీని వల్ల ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారు. సరైన సమయంలో సరైన వైద్యం అందక అడపాదడపా రోగులు చనిపోతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఈ వైరస్ వ్యాధులను పూర్తిస్థాయిలో గుర్తించి సరైన వైద్యం అందించేందుకు ప్రత్యేక పరిశోధన కేంద్రాలను అన్ని రాష్ట్రాల ప్రధాన నగరాల్లో ఏర్పాటు చేసేందుకు కేంద్రం సిద్ధమైంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర స్థాయి వైరస్ పరిశోధన నిర్ధారణ కేంద్రాన్ని గుంటూరులో నెలకొల్పేందుకు కేంద్రం ఆమోదం తెలిపింది. ఇందుకోసం 6.5 కోట్ల రూపాయల వరకు వ్యయమవుతుందని అంచనా వేశారు. ఇందులో కేంద్రం 75%, రాష్ట్ర ప్రభుత్వం 25% నిధులను భరిస్తాయని గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్బారావు వెల్లడించారు.

ఐదేళ్ల తరువాత రాష్ట్ర పర్యవేక్షణలోనే...

ఐదు సంవత్సరాల అనంతరం రాష్ట్ర ప్రభుత్వ పర్యవేక్షణలోనే ఈ కేంద్రం కార్యకలాపాలు కొనసాగుతాయి. ఈ మేరకు కేంద్రంతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈ కేంద్రంలో వైరాలజీ ప్రయోగశాలల్లో నిర్ధరణ జరగని కొత్త రకాల వైరస్‌లు, వ్యాధులు, జన్యుపరమైన మార్పుల ద్వారా గుర్తించలేని వైరస్‌ల గురించి ఈ కేంద్రంలో గుర్తించేందుకు అవకాశం ఏర్పడుతుంది. ఈ కేంద్రంలో అత్యాధునిక పరికరాలు అందుబాటులోకి వస్తాయని సమన్వయకర్త ప్రశాంతి తెలిపారు. మరోవైపు. ..రాష్ట్రంలో ప్రస్తుతం ఆరు వైరాజీ ల్యాబ్స్ ఉన్నాయి. రెండు, మూడు జిల్లాలకు ఒకటి వంతున ఇవి పని చేస్తున్నాయి. స్థానికంగా వైరస్ వ్యాధులు ప్రబలితే సంబంధిత రోగుల నుంచి రక్త నమూనాలను సేకరించి తేలిన సమాచారం మేరకు వ్యాధులు ఇతరులకు సంక్రమించకుండా సరైన సమయంలో నియంత్రణ చర్యలు తీసుకునేందుకు వీలవుతుంది. ఈ కేంద్రాల్లో నిర్ధరణ కాని వైరస్‌లు, మరింత లోతుగా పరిశీలించాల్సిన విషయాలపై గుంటూరులో రానున్న కేంద్రం పరిశోధన చేయనుంది.

ముగిసిన టెట్

పరీక్ష రాసిన 4,10,828 మంది అభ్యర్థులు

ఈనాడు, అమరావతి: ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) శుక్రవారంతో ముగిసింది. గత నెల 21న ప్రారంభమైన ఈ పరీక్షలకు మొత్తం 91.94శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. మొదట ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం శనివారం వరకు పరీక్ష నిర్వహించాల్సి ఉండగా కేంద్రాల సంఖ్య ఎక్కువగా ఉండడంతో శుక్రవారంతోనే పూర్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 190 పరీక్ష కేంద్రాల్లో రెండు విడతలుగా ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహించారు. మొత్తం 4,46,833మంది దరఖాస్తు చేయగా 4,10,828మంది హాజరయ్యారు. మొదట ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ప్రాథమిక 'కీ'ని ఆదివారం విడుదల చేయనున్నారు. దీనిపై అభ్యంతరాలుంటే ఆన్‌లైన్‌లో ఈనెల 9వరకు ఫిర్యాదు చేయవచ్చు.

పేపర్	అభ్యర్థులు	హాజరు	శాతం
పేపర్- 1	1,80,742	1,71,052	94.64
పేపర్- 2	2,04,028	1,81,304	88.86
పేపర్- 3	62,063	58,472	94.21

ఇప్పటికీ తేలని పోస్టుల లెక్క..

ఒక పక్క టెట్ ముగిసినా ఉపాధ్యాయ పోస్టుల సంఖ్య ఇప్పటికీ ఓ కొలిక్కి రాలేదు. మంత్రి గంటా శ్రీనివాసరావు డీఎస్సీ షెడ్యూల్ విడుదల సమయంలో 12,370 పోస్టులు భర్తీ చేయనున్నట్లు ప్రకటించారు. అనంతరం అధికారులు లెక్కలు తీయగా వీటి సంఖ్య 14వేలకుపైగా ఉన్నట్లు తేలింది. పోస్టులకు సంబంధించిన అనుమతి కోసం ఆర్థిక శాఖకు పంపిన దస్త్రానికి ఇంతవరకు ఆమోదం లభించలేదు. ఉపాధ్యాయ నియామక పరీక్ష నిర్వహణ బాధ్యతలను ఈసారి ఏపీపీఎస్సీకి అప్పగించారు.

10న గ్రంథాలయ సంస్థల ఉద్యోగుల రాష్ట్ర సదస్సు

ఈనాడు, అమరావతి: 'ఆంధ్రప్రదేశ్ పౌర గ్రంథాలయాల అభివృద్ధిలో ఉద్యోగులు పాత్ర-సమీక్ష' ప్రథమ రాష్ట్ర సదస్సు ఈనెల 10న తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహిస్తున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కళ్లేపల్లి మధుసూదనరాజు, రేపాక రాము తెలిపారు. విజయవాడలో శుక్రవారం మీడియాతో మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలోని కేంద్రీయ గ్రంథాలయంలో ఉన్న పుస్తక సంపద నుంచి రాష్ట్రం వాటాను తీసుకువచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రంథాలయాల ఉద్యోగులకు, పింఛన్‌దారులకు 010పద్దు కింద వేతనాలు చెల్లించాలన్నారు. ఉద్యోగులకు ఆరోగ్య కార్డులు మంజూరు చేయాలని, పొరుగు సేవల కింద పని చేస్తున్న సిబ్బందికి పెంచిన జీతాల బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

జులైలో శ్రీవారి ఆలయ మహా సంప్రోక్షణ

- తితిదే ఈవో అనిల్‌కుమార్ వెల్లడి

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారి ఆలయ మహా సంప్రోక్షణ కార్యక్రమాన్ని వచ్చే జులైలో నిర్వహించనున్నట్లు తితిదే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ వెల్లడించారు. ప్రతి పన్నెండేళ్లకోసారి ఈ క్రతువు నిర్వహించాల్సి ఉందని, చివరిసారిగా 2006లో జరిగిందని గుర్తు చేశారు. త్వరలోనే ఆగమ సలహాదారులతో భేటీ అయ్యి.. ఇందుకు ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. తిరుమల నుంచి శుక్రవారం డయల్ తితిదే ఈవో కార్యక్రమంలో సింఘాల్ భక్తులతో మాట్లాడారు. అనంతరం విలేకరుల సమావేశంలోనూ మాట్లాడారు. "రూ.34.60 కోట్లతో కురుక్షేత్రలో, రూ.22.50 కోట్లతో కన్యాకుమారిలో నిర్మించిన శ్రీవారి ఆలయాల్లో రానున్న ఏప్రిల్‌లో స్వామివారి విగ్రహాలను ప్రతిష్ఠించనున్నాం. చెన్నైలో పద్మావతి అమ్మవారి ఆలయాన్ని రూ.7 కోట్లతో నిర్మించబోతున్నాం. గిరిజన ప్రాంతాల్లో రూ.4.50 కోట్లతో ఆలయాల నిర్మాణానికి టెండర్లు పిలుస్తున్నాం. శ్రీవారి ఆలయ కట్టడాల్లోని పొగచూరిన రాళ్లను రసాయన రహిత మూలికా ద్రవ్యాలతో శుద్ధి చేసే కార్యక్రమాన్ని తలపెట్టాం. ఈ ప్రయోగం తిరుపతిలోని శ్రీగోవిందరాజస్వామివారి ఆలయంలో తొలుత చేపట్టబోతున్నామ"ని ఈవోవివరించారు.



56 వేల ఆర్జిత సేవా టిక్కెట్లు విడుదల: శ్రీవారి ఆర్జిత సేవా టిక్కెట్లను జూన్ మాసానికి సంబంధించి 56,424 విడుదల చేసినట్లు ఈవో సింఘాల్ తెలిపారు. వీటిలో సుప్రభాతం 7,854, తోమాల 120, అర్చన 120, అష్టదళ పాదపద్మారాధన 180, నిజపాద దర్శనం 2,875 టిక్కెట్లను లాటరీ విధానంలో జారీ చేశారు. ఈ నెల 6న ఉదయం 10 గంటల వరకు నమోదు చేసుకోవచ్చు. అదే రోజు మధ్యాహ్నం 12 గంటలకు ఎలక్ట్రానిక్ లాటరీ విధానంలో భక్తులను ఎంపిక చేస్తారు. ఆ తర్వాత మూడు రోజుల్లోగా నగదు చెల్లించాల్సి ఉంటుంది. జనరల్ కేటగిరి కింద 45,275 టిక్కెట్లను విడుదల చేశారు. శాశ్వత ప్రాతిపదికన సమయ నిర్దేశిత సర్వదర్శనం కేంద్రాలు తిరుపతిలో 55, తిరుమలలో 35 చొప్పున త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు ఈవో తెలిపారు. వృద్ధులు, దివ్యాంగులకు ఈ నెల 6, 20న; ఐదేళ్లలోపు చంటిబిడ్డలతో పాటు తల్లిదండ్రులకు ఈ నెల 7, 21న సుపథం మార్గంలో ఉచితంగా స్వామివారి ఆలయ ప్రవేశ దర్శన అవకాశం కల్పించనున్నట్లు చెప్పారు. ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఈ నెల 24 నుంచి ఏప్రిల్ 3 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.



జస్టిస్ అరుణ్‌మిశ్రా దంపతులు తదితరులు

శ్రీవారి సేవలో జస్టిస్ అరుణ్‌మిశ్రా

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారిని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అరుణ్ మిశ్రా దంపతులు శుక్రవారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ ప్రారంభ దర్శన సమయంలో స్వామివారి సేవలో కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. న్యాయమూర్తికి తితిదే అధికారులు స్వాగతం పలికి స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి తీర్థ ప్రసాదాలు అందచేసి సత్కరించారు.

హోలీ వేడుకల్లో పాల్గొన్న జగన్

- ప్రకాశం జిల్లాలో కొనసాగిన పాదయాత్ర

చీమకుర్తి, న్యూస్‌టుడే: వైకాపా అధినేత వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి పాదయాత్ర శుక్రవారం ప్రకాశం జిల్లా సంతనూతలపాడు నియోజకవర్గం పరిధిలోని చీమకుర్తి మండలంలో కొనసాగింది. పాదయాత్ర ఆద్యంతం ఆయావర్గాల పరామర్శ, పలకరింపులతోనే సాగింది. ఉదయం స్థానిక బీవీఎస్‌ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులతో కలిసి హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం ప్రారంభమైన పాదయాత్ర.. స్థానిక ఎన్టీఆర్ కాలనీ, మంచికలపాడు, బండ్లమూడి, టి.గుడిపాడు ఎస్సీ కాలనీ, పల్లామల్లి, గాడిపర్తివారిపాలెం వరకూ జరిగింది. శుక్రవారం మొత్తం 13 కిలోమీటర్ల మేర పాదయాత్ర చేశారు. మంచికలపాడు, బండ్లమూడి గ్రామాల్లో వైకాపా జెండాలను జగన్ ఆవిష్కరించారు. మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే ఆదిమూలపు సురేష్, మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, సినీనటుడు విజయ్‌చంద్ర, పార్టీ అధికార ప్రతినిధి బత్తుల బ్రహ్మానందరెడ్డి, ఏఎంసీ మాజీ ఛైర్మన్ మారం వెంకారెడ్డి యాత్రలో జగన్ వెంట ఉన్నారు. ఎస్సీ వర్గీకరణకు మద్దతు తెలపాలని ఎమ్మార్పీఎస్ నాయకులు, గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆ సంఘం నేతలు, ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వైఎస్‌ఆర్ ఆర్టీసీ మజ్దూర్ యూనియన్ నాయకులు ఈ సందర్భంగా జగన్‌ను కలిసి విన్నవించారు.



చీమకుర్తిలో జగన్‌కు రంగులుపూస్తున్న విద్యార్థినిలు

అధికారులు ససేమిరా అన్నా రాయితీలు!

- పోలవరంలో డీజిల్ ఖర్చులూ భరించేందుకు అంగీకారం
- నెలకు రూ.20 కోట్ల మేర గుత్తేదారుకు భారం తగ్గింపు

ఈనాడు, అమరావతి: పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులకు ప్రతి నెలా అయ్యే డీజిల్ ఖర్చుల్ని ముందుగా ప్రభుత్వమే భరించనుంది. ఇంతవరకు సిమెంట్, స్టీల్ వంటి వాటికి మాత్రమే గుత్తేదారుకు ఈ రాయితీని వర్తింపజేసింది. ఇప్పుడు తాజాగా డీజిల్ ఖర్చులు కూడా ముందుగా ప్రభుత్వమే భరించేలా అనుమతిచ్చారు. పోలవరం ప్రధాన డ్యాం పనులను ట్రాన్స్‌ట్రాయ్ ప్రధాన గుత్తేదారుగా చేపట్టింది. ఆ గుత్తేదారు ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సిమెంట్, స్టీల్‌కు అయ్యే ఖర్చులను ముందుగా ప్రభుత్వమే భరించి ఆ తర్వాత బిల్లుల్లో మినహాయించుకునేలా వెసులుబాటు కల్పించారు. ఇప్పుడు పోలవరంలో స్పిల్‌వే కాంక్రీటు, స్పిల్ ఛానల్ పనులు, మట్టి తవ్వకం పనులను 60 సి కింద తొలగించి కొంత భాగం నవయుగ కన్‌స్ట్రక్షన్ కంపెనీకి అప్పగించారు. మట్టి తవ్వకం పనులు గతంలో ఉపగుత్తేదారు అయిన త్రివేణి సంస్థకు ట్రాన్స్‌ట్రాయ్ అప్పగించింది. ప్రస్తుతం కొత్త గుత్తేదారు రంగప్రవేశం చేసినా అదే సంస్థ మట్టి తవ్వకం పనులు కొనసాగించబోతోంది. ఆ సంస్థ డీజిల్‌కు కూడా తమకు రాయితీ ఇవ్వాలన్న ప్రతిపాదన తెరపైకి తీసుకొచ్చింది. పోలవరంలో రోజుకు దాదాపు రూ.60 లక్షల విలువ చేసే డీజిల్ వినియోగిస్తారని ఒక అంచనా. ఈ లెక్కన దాదాపు నెలకు రూ.20 కోట్లవుతుంది. ప్రభుత్వమే ముందస్తుగా డీజిల్ సరఫరాకు ఏర్పాట్లు చేసి ఆనక నెలవారీ బిల్లుల్లో మినహాయించుకోవాలనే ప్రతిపాదన వచ్చింది.

అధికారులు ససేమిరా?: ఇది ఒప్పందానికి విరుద్ధమని జలవనరులశాఖ అధికారులు కొందరు అభ్యంతరం వ్యక్తం చేశారు. రెండు మూడు పర్యాయాలు అధికారులు తమ అసమ్మతి తెలియజేసినా చివరకు ఆ పైస్థాయిలో నిర్ణయం తీసుకుని ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు ఇవ్వాలన్న మౌఖిక ఆదేశాలు వెలువడ్డాయి.



ఆ రుణం తీర్చుకోవాలని..



ఐదేళ్ల వయసు.. అప్పటికి పెద్దగా ఊహ కూడా తెలియదు. నాన్న తీసుకెళ్లి కరాటే క్లాసులో చేర్చాడు. సత్తా చాటుకుంది. తర్వాత నాన్న కరాటె కాదు.. జిమ్నాస్టిక్స్ అన్నాడు. నాన్న మాటే వేదం. చెప్పినట్లే ఆట మార్చుకుంది. అందులోనూ ప్రతిభ చాటుకుంది. సాధన కోసం స్టేడియానికి తీసుకెళ్లేది నాన్నే. అక్కడి నుంచి ఇంటికి తీసుకొచ్చేది నాన్నే. పాఠశాలకు వెళ్లాలన్నా... తిరిగి ఇంటికి రావాలన్నా నాన్నే.

వయసు పెరిగింది. ఆట మెరుగైంది. అప్పుడు కూడా ఎక్కడ పోటీ జరిగినా వెంట నాన్నే ఉండాలి. ఆయనే నడిపించాలి. ఇలా అన్నీ తానై వ్యవహరించిన ఆయన హఠాత్తుగా కన్ను మూశాడు.

ఎప్పుడూ తన వెంటే ఉండి నడిపించే తోడు లేదు. ధైర్యం సడలింది. భవిష్యత్తు భయంకరంగా కనిపించింది. అలాంటపుడు 14 ఏళ్ల అమ్మాయి మానసిక స్థితి ఎలా ఉంటుందో చెప్పేదేముంది..?

కానీ అంత కష్టంలోనూ ఆ అమ్మాయి పట్టు వదల్లేదు. ఆటను విడవలేదు. నాన్న కలను నెరవేర్చడమే ధ్యేయంగా సాగింది. ఏళ్ల తరబడి కష్టపడింది. ఇప్పుడు భారత జిమ్నాస్టిక్స్ చరిత్రలోనే ఎవ్వరూ సాధించని ఘనతను అందుకుంది. ప్రపంచకప్‌లో పతకం గెలిచిన తొలి భారత జిమ్నాస్ట్‌గా నిలిచింది. తన విజయాన్ని తండ్రికి అంకితం చేసింది. ఇదీ బుడ్డా అరుణారెడ్డి విజయగాథ!



అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన అరుణ కుటుంబం దాదాపు మూడు దశాబ్దాల కిందటే హైదరాబాద్‌లో స్థిరపడింది. తండ్రి నారాయణరెడ్డి వృత్తి రీత్యా అకౌంటెంట్. ఆయనకు క్రీడలంటే చాలా ఇష్టం. ఆ ఇష్టంతోనే తన చిన్న కూతురు అరుణను ఐదేళ్ల వయసులోనే కరాటేలో చేర్చాడు. అందులో ప్రతిభ చాటుకున్న ఆమె రెండేళ్ల లోపే బ్లాక్‌బెల్ట్ సాధించింది. అయితే అరుణ శరీరం జిమ్నాస్టిక్స్‌కు సరిపోతుందన్న సలహా మేరకు తర్వాత అందులో చేర్చాడు తండ్రి. నిజానికి మొదట్లో జిమ్నాస్టిక్స్ అంటే అంత ఆసక్తి లేకున్నా తండ్రి మాట ప్రకారం అందులోనే సాధన చేసిందామె. కొంత కాలానికే అందులోనూ సత్తా చాటుకుంది. కొంచెం వయసు పెరిగే కొద్దీ ఈ ఆటపై ఆసక్తి పెరిగింది. పదేళ్ల వయసులోనే జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటుకుంది. 12 ఏళ్ల వయసులో 2007 జాతీయ క్రీడల్లో వాల్ట్ విభాగంలో పతకం కూడా గెలిచింది. తన కూతురు ప్రపంచ స్థాయి క్రీడాకారిణి కాగలదని నారాయణరెడ్డికి నమ్మకం కుదిరింది అప్పుడే. ఆ తర్వాత పలు జాతీయ టోర్నీల్లో సత్తా చాటుకుందామె.

కారు నుంచి బస్సుకు..

2010.. అరుణ జీవితం పెద్ద కుదుపునకు లోనైన సంవత్సరం. ఆమె తండ్రి గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన ఉన్నపుడు కారుండేది. దానికి డ్రైవర్ ఉండేవాడు. తెల్లవారుజామునే అరుణను నిద్ర లేపి ఇంటి నుంచి ఎల్బీ స్టేడియంకు తీసుకెళ్లడం, సాధన అయ్యాక ఇంటికి తీసుకురావడం.. ఆపై పాఠశాలలో దింపి తన పనులు చూసుకోవడం.. మళ్లీ సాయంత్రం ఇంటికి తీసుకురావడం.. ఇదీ నారాయణరెడ్డి దినచర్య. అరుణ ఎక్కడ టోర్నీకి వెళ్లినా వెంట ఆయనుండేవాడు. ఏ ఇబ్బంది లేకుండా చూసుకునేవాడు. కానీ నారాయణరెడ్డి మరణానంతరం పరిస్థితి తల్లకిందులైంది. ఆయన చికిత్సకు చాలా ఖర్చయింది. తల్లి గృహిణి. బయటి ప్రపంచం తెలియదు. సోదరికి అప్పటికే పెళ్లయింది. నారాయణరెడ్డి మరణంతో ఆదాయం ఆగిపోయింది. బీమా ద్వారా వచ్చిన డబ్బులతో ఇంటి అవసరాలైతే తీరాయి కానీ.. అరుణ ఆటలో కొనసాగడానికి అవసరమైన ఖర్చులు భరించడమే కష్టమైంది. ఆర్థిక ఇబ్బందులకు తోడు తనకు అన్నీ తానై వ్యవహరించే తండ్రి లేని బాధ ఆమెను కుంగదీసింది. దీంతో జిమ్నాస్టిక్స్ వదిలేద్దామన్న ఆలోచన వచ్చింది. కానీ ఆ సమయంలో తల్లి, అక్కా, బావ, కోచ్ బ్రిజ్ కిషోర్ ఆమెకు అండగా నిలిచారు. ధైర్యం నింపారు. తాను ప్రపంచ స్థాయి జిమ్నాస్ట్ కావాలని తండ్రి కన్న కలను నెరవేర్చి ఆయన రుణం తీర్చుకోవాలనుకుంది. దీంతో ఎన్ని ఇబ్బందులొచ్చినా ఆటలో కొనసాగాలనే నిర్ణయానికి వచ్చింది. తండ్రి చనిపోయాక కారు అమ్మేశారు. అప్పట్నుంచి సిటీ బస్సుల్లోనే ప్రయాణం. అంతకుముందు కార్లో ఏ కష్టం లేకుండా 20 నిమిషాల్లో స్టేడియానికి వెళ్లేది. కానీ తర్వాత బస్సు కోసం ఎదురు చూడటం.. కిక్కిరిసిన జనాల మధ్య ప్రయాణించడం.. ప్రయాణానికే చాలా సమయం అయిపోవడం.. లాంటి ఇబ్బందులు తప్పలేదు. ఓవైపు సాధన, మరోవైపు చదువు.. ఇంకా టోర్నీలు, గాయాలు, చికిత్సలు.. అప్పుడప్పుడూ కొన్ని వైఫల్యాలు.. ఇన్ని అడ్డంకుల మధ్య తన ప్రయాణాన్ని కొనసాగించింది అరుణ. టోర్నీల్లో ప్రదర్శన ద్వారా వచ్చే ప్రైజ్‌మనీలు, ప్రభుత్వం నుంచి అందే ప్రోత్సాహకాలతోనే గత ఎనిమిదేళ్లుగా నెట్టుకొస్తున్న ఆమె.. తల్లికి ఏనాడూ భారం కాలేదు.

> “నన్ను అంతర్జాతీయ స్థాయి క్రీడాకారిణిగా చూడాలన్నది నాన్న కల. ఆయన చనిపోయాక ఆట వదిలేద్దామనిపించింది. కానీ ఆయన కోసమే ఆటలో కొనసాగాను. ఎప్పటికైనా ఓ అంతర్జాతీయ టోర్నీలో నేను పోడియం మీద ఉండగా భారత పతాకం ఎగరాలని లక్ష్యంగా పెట్టుకున్నా. రియో ఒలింపిక్స్‌తో దేశం దృష్టిని ఆకర్షించిన దీప జాతీయ శిబిరాల్లో నా రూమ్ మేట్. ఐదేళ్లుగా కలిసి సాధన చేస్తున్నాం. 2014 కామన్వెల్త్ క్రీడల్లో దీప పతకం గెలిచినపుడు సంతోషించా. కానీ నా వైఫల్యం బాధ పెట్టింది. అయితే దీపకు స్థానికంగా అయినా, జాతీయ శిబిరంలో అయినా ఒకరే కోచ్. సౌకర్యాలు కూడా ఒకేలా ఉంటాయి. నా పరిస్థితి భిన్నం. జాతీయ శిబిరంలో పాల్గొన్నపుడు ప్రదర్శన మెరుగయ్యేది. హైదరాబాద్ వచ్చాక లయ తప్పేది. సౌకర్యాల లేమితో ఇబ్బంది ఎదురయ్యేది. విదేశీ శిక్షణ నాలో చాలా మార్పు తెచ్చింది. ప్రపంచకప్ పతకం నాన్నకే అంకితం”
>
> **–అరుణ**

అసలు టోర్నీకే వెళ్లాల్సింది కాదు..

ప్రపంచకప్‌లో పతకం గెలిచిన తొలి భారత జిమ్నాస్ట్‌గా నిలిచిన అరుణ.. ఒక దశలో ఈ టోర్నీకి వెళ్లడమే అనుమానంగా మారింది. రెండేళ్ల కిందట ఆమె భుజానికి గాయమైంది. అది కెరీర్‌నే ప్రమాదంలో పడేసేలా కనిపించింది. దిల్లీలో ఆమెను పరీక్షించిన వైద్యులు శస్త్రచికిత్స అవసరమన్నారు. అది చేయించుకుంటే వెంటనే కోలుకోవడం, ఒకప్పట్లా విన్యాసాలు చేయడం కష్టమయ్యేది. ఈ ఏడాది ప్రపంచకప్‌కూ దూరం కావాల్సి వచ్చేది. అయితే హైదరాబాద్‌లో తెలిసిన వైద్యుల దగ్గర చూపించి.. మందులు, ఫిజియోథెరపీతోనే కోలుకుంది అరుణ. ఇక గత నెలలో దిల్లీలో కామన్వెల్త్ క్రీడల ట్రయల్స్‌లో పాల్గొన్నాక ప్రపంచకప్‌కు వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకుంది కానీ.. ఆస్ట్రేలియా వీసా కోసం 20 రోజుల ముందు దరఖాస్తు చేయాల్సి ఉండగా.. అధికారులు ప్రయాణానికి ఐదు రోజుల ముందే దరఖాస్తు పంపారు. దీంతో వీసా కష్టమే అని భావించి దిల్లీ నుంచి హైదరాబాద్ వచ్చేయడానికి సిద్ధమైందామె. ఐతే అధికారులు తర్వాత అప్రమత్తమై దౌత్య అధికారులకు మాట్లాడి, ప్రత్యేక పరిస్థితుల కింద వీసా ఇప్పించారు. గత నెల 20న సాయంత్రం ప్రయాణమైతే.. ఉదయానికి కానీ వీసా రాలేదు. ఆ రోజు గడిస్తే అరుణ ఆస్ట్రేలియాకు వెళ్లేది కాదు. ప్రపంచకప్ పతకం గెలిచేదీ కాదు.

ఆశల్లేని స్థితి నుంచి..

ఎంత కృషి, పట్టుదల ఉన్నప్పటికీ పరిస్థితుల ప్రభావంతో ఏదో ఒక దశలో నైరాశ్యం అలుముకోవడం సహజం. గత ఏడాది అరుణ కూడా అదే స్థితికి చేరింది. ఆటలో కొనసాగడంపై సందిగ్ధంలో పడింది. ప్రాక్టీస్‌లో ఇబ్బందులు, ఇతర కారణాల వల్ల తన ప్రదర్శన ఒక స్థాయికి మించి మెరుగవకపోవడంతో ఆమె ఆత్మవిశ్వాసం దెబ్బ తింది. ఏడాదిలో ఓ మూణ్నాలుగు నెలలు జాతీయ శిబిరంలో పాల్గొనేది. అక్కడ కోచింగ్ పద్ధతులు కొంచెం భిన్నం. సౌకర్యాలు మెరుగ్గా ఉండేవి. హైదరాబాద్ వస్తే ఇక్కడ ఆ స్థాయి మౌలిక వసతులు ఉండేవి కావు. ఇక్కడ తన దీర్ఘకాలిక కోచ్ బ్రిజ్ కిషోర్ శ్రద్ధతో ఆమెకు శిక్షణ ఇచ్చినా.. సౌకర్యాల లేమి వల్ల అరుణ లయ దెబ్బ తినేది. దీంతో అంతర్జాతీయ పోటీల్లో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయింది. తన ప్రదర్శన తర్వాతి దశకు వెళ్లలేకపోతుండటం, దీనికి తోడు గాయాల బాధతో ఇక ఆట నుంచి తప్పుకుందామా అన్న ఆలోచన వచ్చిందామెకు. ఆట వదిలేసి సీఏ చేద్దామా అని ఆలోచించింది. అయితే ఆ సమయంలోనే కుటుంబ సభ్యులు, కోచ్ మరోసారి ఆమెలో ధైర్యం నింపారు. ఇంకో రెండేళ్లు ప్రయత్నించి చూడమని.. లేదంటే చదువుకోవచ్చని చెప్పారు. ఆ సమయంలోనే అరుణ ‘టాప్’ పథకానికి ఎంపికైంది. కొన్ని నెలల కిందటే ఉజ్బెకిస్థాన్‌లో శిక్షణకు వెళ్లే అవకాశం దక్కించుకుంది. ప్రభుత్వం నుంచి సకాలంలో నిధులు అందకపోయినప్పటికీ చాముండీశ్వరీనాథ్ సకాలంలో స్పాన్సర్‌ను సమకూర్చి ఆర్థిక సాయం అందేలా చూడటంతో ఆమె అక్కడికి వెళ్లగలిగింది. అక్కడి శిక్షణే అరుణ కెరీర్‌ను మలుపు తిప్పింది. అంతర్జాతీయ ప్రమాణాలతో సాగిన శిక్షణ ప్రదర్శనను మెరుగుపరిచింది. ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. ఆ శిక్షణ పూర్తయ్యాక పాల్గొన్న తొలి టోర్నీ జిమ్నాస్టిక్స్ ప్రపంచకప్. అందులో వాల్ట్ విభాగంలో కాంస్యం గెలిచి చరిత్ర సృష్టించింది అరుణ.

– తిమ్మాపురం చంద్రశేఖర్ రెడ్డి

పాపం.. కోచ్




అరుణకు దశాబ్దం కిందట్నుంచి శిక్షణ ఇస్తున్నాడు కోచ్ బ్రిజ్ కిషోర్. ఆయన తనను కూతురిలా చూస్తాడని, తనకెంతో అండగా ఉంటూ శిక్షణ ఇస్తాడని అంటుందామె. ఆమెతో పాటు ఉజ్బెకిస్థాన్‌లో శిక్షణకు కూడా వెళ్లాడు కిషోర్. నెల తర్వాత అక్కడ తన అవసరం లేదని భావించి హైదరాబాద్ వచ్చేశాడు. అయితే ఉజ్బెకిస్థాన్‌లో ఉండగానే ఆయన అనారోగ్యం పాలయ్యాడు. ఉదర సంబంధిత జబ్బు వచ్చింది. ఐతే హైదరాబాద్‌లో చికిత్సలో లోపం వల్ల ఆయన ఆరోగ్యం మరింత దెబ్బతింది. నెల రోజులుగా తిండి తినలేక బాగా నీరసించిపోయాడాయన. తన శిష్యురాలు ప్రపంచకప్‌లో గెలిచి చరిత్ర సృష్టించిన సందర్భాన్ని ఆయన ఆస్వాదించలేని పరిస్థితి.

పట్టు పట్టాడు... పసిడి తెచ్చాడు!



1962 ఆసియా క్రీడల్లో స్వర్ణం గెలిచిన భారత జట్టు



రహీం

అంతర్జాతీయ టోర్నీలో భారత ఫుట్‌బాల్ జట్టుకు స్వర్ణం! ఈ మాట వింటే ఈ తరం వాళ్లు నమ్మలేరు.. ఆ ఆటలో మనమూ ఒక వెలుగు వెలిగిన కాలంలో భారత్ ఈ ఘనత సాధించింది. దీనికి కారణం కోచ్ రహీం... ఈ హైదరాబాదీ మాజీ ఆటగాడు తన వ్యూహాలతో అద్భుతమే చేశాడు.

1962 జకర్తాలో జరిగిన ఆసియా క్రీడల్లో భారత్ ఫుట్‌బాల్‌లో పసిడి గెలిచి అబ్బురపరిచింది. అప్పటి మన జట్టు తెగువ, పోరాటం ఒక ఎత్తయితే.. తెర వెనుక శక్తిగా పని చేసిన కోచ్ సయ్యద్ అబ్దుల్ రహీం వ్యూహాలు మరో ఎత్తు. మైదానంలో ఆడింది 11 మందే అయినా బయట నుంచి రహీం వారిని శాసించాడు. అసలు ఈ పోటీల్లో భారత్ స్వర్ణం గెలుస్తుందని ఎవరూ ఊహించలేదు. తొలి మ్యాచ్‌లో ఆతిథ్య కొరియా చేతిలో 0-2తో ఓడి నిరాశపడిన భారత్.. ఆ తర్వాత 4-1తో థాయ్‌లాండ్‌పై, 2-0తో జపాన్‌పై గెలిచి ముందంజ వేసింది. ఐతే థాయ్‌తో మ్యాచ్‌లో భారత డిఫెండర్ జర్నైల్ సింగ్ నుదుటికి గాయమైంది. అప్పటికి సబ్‌స్టిట్యూట్ నిబంధన లేకపోవడంతో భారత్ పదిమందితోనే ఆడి ఘన విజయం సాధించింది. దక్షిణ వియత్నాంతో సెమీఫైనల్లో కోచ్ రహీం.. సాహసోపేత నిర్ణయాలు తీసుకున్నాడు. గాయం నుంచి ఇంకా కోలుకోని జర్నైల్‌ను సెంటర్ ఫార్వర్డ్‌గా ఆడించాడు. అప్పటికి అతను తలకు కట్టు కట్టుకునే ఉన్నాడు. అయితే భారీకాయుడు అయి ఉండి... ప్రత్యర్థిని భయపెట్టేలా ఉండే జర్నైల్ ఆడితే మానసికంగా ప్రత్యర్థి వెనుకంజ వేస్తుందని ఊహించిన రహీమ్.. అతణ్ని తుది జట్టులో ఆడించాడు. కీలక సమయంలో చున్ని గోస్వామి నుంచి పాస్ అందుకున్న జర్నైల్ గోల్ చేసి భారత్‌ను ఆధిక్యంలో నిలిపాడు. అంతేకాదు ప్రత్యర్థిని మైదానంలో అటు నుంచి ఇటు రావడానికి నానా తిప్పలు పడేలా చేశాడు. ఆట చివర్లో చున్ని గోస్వామి మరో గోల్ కొట్టడంతో భారత్ 3-2తో సంచలన విజయం సాధించి ఫైనల్ చేరింది.

ఆ రోజు రాత్రి...


దక్షిణకొరియాతో ఫైనల్... ఆ రోజు రాత్రి ఆటగాళ్లెవరికి నిద్ర పట్టట్లేదు. దీంతో జర్నైల్‌సింగ్, ఫ్రాంకో, తంగరాజు, పి.కె.బెనర్జీ, బలరామ్, త్రిలోక్‌సింగ్ కాసేపు అలా నడకకు వెళ్దామని బయల్దేరారు. వాళ్లు అలా ముందుకెళ్లారో లేదో కాస్త దూరంగా ఒక చిన్న వెలుగు కనిపించింది. పొగ కూడా వస్తోంది..! దెయ్యం అని అందరూ రూఢీ చేసుకున్నారు. భయంగానే దగ్గరకి వెళ్లారు. తీరా చూస్తే.. చీకట్లో కూర్చొని చార్మినార్ సిగిరెట్‌ని నోట్లో పెట్టుకుని గుప్పుగుప్పున పొగ వదులుతున్న కోచ్ రహీం!! “రేపు మీ దగ్గర నుంచి నాకో బహుమతి కావాలి” అని అన్నాడు శిష్యులతో ఆ సిగిరెట్‌ను నోటి పక్కకు పెట్టి నవ్వుతూ.. అలాగే సార్ అంతా ముక్తకంఠంతో అన్నారు. అందరూ శిబిరానికి చేరుకునే సమయంలోనూ రహీం మరోసారి ఆటగాళ్లను చూసి ఏదో అభ్యర్థిస్తున్నట్లు “రేపు మీరు స్వర్ణం గెలవాలి” అన్నాడు. కఠినంగా, నిబ్బరంగా ఉండే కోచ్ ఇంత ఉద్వేగానికి గురి కావడం వాళ్లెప్పుడూ చూడలేదు. భారత్-ఇండోనేషియా మధ్య రాజకీయంగా పొసగడం లేదు. ప్రాక్టీస్‌కు వెళ్తున్నప్పుడు కూడా భారత్ జట్టును అభిమానులు హేళన చేసేవాళ్లు. జర్నైల్‌సింగ్‌కు తలపాగా ఉండడంతో అతను బస్‌లో కింద కూర్చొని ఎవరికీ కనిపించకుండా ప్రయాణించేవాడట.

అప్పుడు జరిగింది అద్భుతం...

ఈ పరిస్థితులకు తోడు భారత జట్టులో సగం మంది ఆటగాళ్లు ఫిట్‌గానే లేరు. గోల్‌కీపర్ తంగరాజ్ ఫ్లూ జ్వరంతో బాధపడుతుంటే...త్రిలోక్‌సింగ్ బొటను వేలికి గాయమై ఇబ్బందిపడుతున్నాడు. అయినా ఆటగాళ్లెవరూ తగ్గలేదు. జర్నైల్ తల కట్టు నుంచి రక్తం కారినా అతను ఆ విషయాన్నే పట్టించుకోకుండా ఆడాడు. ఎత్తుగా ఉండే తంగరాజు గోల్‌పోస్టు ముందుంటే భారత్‌కు అవకాశాలు బాగుంటాయని భావించిన రహీం.. అతను ఎట్టి పరిస్థితుల్లోనూ ఆడాలని ఆదేశించాడు. ఫైనల్ రోజు తనకు ఆరోగ్యం సరిగా లేకపోయినా రహీం మాత్రం జట్టును వీడలేదు. సరికొత్త వ్యూహాలతో ప్రత్యర్థులను ఆశ్చర్యంలో ముంచెత్తాడు. లక్షమంది అభిమానులతో నిండిన స్టేడియంలో దాదాపు 90 శాతానికిపైగా మద్దతు దక్షిణకొరియాకే!. ఐతే జర్నైల్ మధ్యలో గోడలా ఉండడం వల్ల కొరియా అటాకింగ్ దెబ్బతింది. 17వ నిమిషంలో పి.కె.బెనర్జీ, 20వ నిమిషంలో జర్నైల్‌సింగ్ గోల్స్ కొట్టడంతో అప్పటివరకూ ఊగిపోయిన స్టేడియం మూగబోయింది. విశేషం ఏమిటంటే అంతకుముందు రోజు భారత్‌పై గెలిచిన పాకిస్థాన్ హాకీ జట్టు.. స్టేడియానికి వచ్చి భారత్‌కు మద్దతుగా నిలవడం. ఈ మ్యాచ్‌ను 2-1 గోల్స్‌తో గెలుచుకున్న భారత్ చరిత్రలో నిలిచింది. కోచ్ రహీం కోరుకున్నట్లే తాము అద్భుతమే చేసినా ఆయనకి అదే ఆఖరి ఆసియా క్రీడలు అవుతాయని ఆటగాళ్లు ఊహించలేదు. ఈ టోర్నీ తర్వాత రహీం ఊపిరితిత్తుల క్యాన్సర్‌తో బాధపడుతూ హైదరాబాద్‌లో చికిత్సకు వచ్చేశాడు. 1951 ఆసియా క్రీడల తర్వాత భారత ఫుట్‌బాల్‌లో స్వర్ణ కాంతులు నింపిన ఘనుడిగా రహీం పేరు చరిత్రలో సువర్ణాక్షరాలతో నిలిచిపోయింది.


చిత్రం చెప్పిన కథ

అనగనగా ఒక చైనామన్..



చైనామన్ బౌలర్.. ఎడమ చేత్తో మణికట్టును ఉపయోగించి వేసే లెగ్‌స్పిన్ బౌలర్. ఇప్పుడు కుల్‌దీప్ యాదవ్.. ఒకప్పుడు బ్రాడ్ హాగ్‌ల గురించి మాట్లాడుకుంటున్నాం కానీ.. అసలు బ్యాట్స్‌మెన్ కదలికల్ని చూడకుండానే సరిగ్గా బంతులేసి.. వికెట్లు తీసిన ఒక బౌలర్ గురించి మీకు తెలుసా? ప్రపంచంలో ఏ చైనామన్ బౌలర్‌కు లేని బౌలింగ్ శైలితో.. చిత్ర విచిత్ర విన్యాసంతో అతను బంతులేస్తుంటే అందరూ ఆశ్చర్యంగా చూసేవాళ్లు. ఆ భిన్నమైన బౌలరే పాల్ ఆడమ్స్. దక్షిణాఫ్రికా బౌలర్. 90ల్లో క్రికెట్‌ను వీక్షించిన వారికి ఈ స్పిన్నర్ సుపరిచితం. మామూలు రనప్‌తో క్రీజులోకి వచ్చేసరికే తలను పూర్తిగా వంచుతూ బంతిని సరిగ్గా బ్యాట్స్‌మెన్ దగ్గర పడేలా వేయడంలో ఇతను దిట్ట. అతని బౌలింగ్ యాక్షన్ అర్థం కాక వికెట్లు సమర్పించుకున్న బ్యాట్స్‌మెన్ ఎందరో! ఆడమ్స్ బంతులేస్తుంటే నాన్‌స్ట్రైకర్‌తో పాటు అంతా విచిత్రంగా చూసేవాళ్లు. అతనో ముడుచుకుపోయిన కప్ప మాదిరిగా ఉన్నాడు ఆడమ్స్‌ను మైక్ గ్యాటింగ్ లాంటి వాళ్లు విమర్శించినా.. అతను మాత్రం తన శైలి మార్చుకోలేదు.

ఈనాడు సినిమా



కరికాలుడు

'పూర్తి రౌడీయిజాన్ని ఎప్పుడూ చూడలేదు కదా, ఇప్పుడు చూపిస్తా...' అంటున్నాడు రజనీకాంత్. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'కాలా'. హ్యూమా ఖురేషి కథానాయిక. పా.రంజిత్ దర్శకత్వం వహిస్తున్నారు. రజనీ అల్లుడు ధనుష్ వండర్‌బార్ ఫిల్మ్స్ పతాకంపై నిర్మిస్తున్నారు. శుక్రవారం ఉదయం టీజర్‌ని విడుదల చేశారు. ఇందులో ప్రతినాయకుడిగా నటిస్తున్న నానా పటేకర్ 'కాలా... ఇదేం పేర్రా?' అని సంభాషణ చెప్పడంతో టీజర్ మొదలవుతుంది. 'కాలా అంటే ఎవరు? కాలుడు, కరికాలుడు, గొడవపడైనా కాపాడేవాడు', 'నలుపు శ్రమ జీవుల వర్ణం... మావాడకొచ్చి చూడు, మురికంతా ఇంద్ర ధనుస్సులా కనిపిస్తుంది', 'క్యారే? సెట్టింగా? వీరయ్య బిడ్డని రా, ఒక్కడినే ఉన్నా. దిల్లుంటే గుంపుగా రండ్రా...' అనే సంభాషణలతో, రజనీ శైలి మాస్ హంగామాతో టీజర్ సాగుతుంది. 'కబాలి' తర్వాత రజనీకాంత్, పా.రంజిత్ కలయికలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని ఏప్రిల్ 27న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు.

కొత్త చిత్రానికి అనిరుధ్ సంగీతం


రజనీకాంత్ కథానాయకుడిగా కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కబోతోంది. సన్ పిక్చర్స్ నిర్మిస్తోంది. ఆ చిత్రానికి యువ సంగీత దర్శకుడు అనిరుధ్ స్వరాలు సమకూర్చబోతున్నారు. రజనీ చిత్రానికి అనిరుధ్ సంగీతం అందిస్తుండడం ఇదే తొలిసారి.



కుటుంబ సభ్యులతో హోళీ సంబరాల్లో రజనీకాంత్

బాలీవుడ్ నుంచి...

మహేష్‌బాబు కథానాయకుడిగా వంశీ పైడిపల్లి దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కబోతోంది. పూజా హెగ్డే కథానాయిక. శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్, వైజయంతీ మూవీస్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. త్వరలోనే సెట్స్‌పైకి వెళ్లబోతున్న ఈ చిత్రానికి ఛాయాగ్రాహకుడిగా కె.యు.మోహనన్‌ని ఎంపిక చేశారు. షారుఖ్‌ఖాన్, ఆమిర్‌ఖాన్ కథానాయకులుగా నటించిన 'డాన్', 'రాయిస్', 'తలాష్' తదితర చిత్రాలకి ఛాయాగ్రహణ బాధ్యతల్ని నిర్వర్తించిన సాంకేతిక నిపుణుడు మోహనన్. ఆయన కెమెరా బాధ్యతలు నిర్వర్తించనున్నట్టు శుక్రవారం నిర్మాణ సంస్థలు ప్రకటించాయి. మహేష్ నటిస్తున్న 25వ చిత్రమిది. విజయవంతమైన 'ఊపిరి' తర్వాత వంశీ పైడిపల్లి తెరకెక్కిస్తున్న చిత్రమిది. ఉన్నతమైన నిర్మాణ హంగులతో రూపొందిస్తున్నారు. అమెరికా నేపథ్యంలో సాగే ఈ చిత్రాన్ని అక్కడే ఎక్కువ భాగం తెరకెక్కించబోతున్నట్టు తెలిసింది. మహేష్ ప్రస్తుతం నటిస్తున్న 'భరత్ అనే నేను' పూర్తయిన వెంటనే కొత్త చిత్రం మొదలవబోతోంది.



కె.యు.మోహనన్



మహేష్‌బాబు



కాజల్

అవి లెక్కలోకి రావు!

చుట్టూ విలువైన విషయాలు ఎన్ని కనిపించినా సరే... చేసే పనిలోనే ఎక్కువ సంతృప్తిని వెదుక్కుంటుంటా అని చెబుతోంది కాజల్. పుష్కరకాలంగా చిత్ర పరిశ్రమలో కొనసాగుతున్న ఈమె త్వరలోనే కల్యాణ్‌రామ్‌తో కలిసి 'ఎమ్.ఎల్.ఎ'తో సందడి చేయబోతోంది. 'ఎన్నో ప్రదేశాలు తిరుగుతుంటారు, ఎంతో మందిని కలుస్తుంటారు... ఈ ప్రయాణంలో మిమ్మల్ని ఎక్కువగా సంతృప్తినిచ్చే విషయాలేమిటి' అని అడిగితే... "చేసే పాత్రలు, ఎంచుకొనే కథలే" అని సమాధానమిచ్చింది కాజల్. "నేనే అలా ఉంటానో, లేదంటే అందరికీ ఇలాగే అనిపిస్తుందో నాకు తెలియదు. వృత్తిపరంగా నేను నటిని కాబట్టి ఒక మంచి కథ విన్నా, ఒక మంచి పాత్రలో నటించినా... ఎనలేని సంతృప్తి లభిస్తుంటుంది. దాని ముందు ఇంకెన్ని విలువైన విషయాలైనా సరే, అసలు లెక్కలోకే రావు. ఇప్పటికీ నన్ను మరింత ఉత్సాహంగా నడిపించేది ఆ సంతృప్తే అని గట్టి నమ్మకం. నేను ఎప్పటికప్పుడు సంతృప్తిని రెట్టింపు చేసుకోవాలంటే నాతో నేనే పోటీపడాలి. ఒక సినిమాని మించి మరొక సినిమా ఉండేలా చూసుకోవాలి. ప్రస్తుతం అదే చేస్తున్నా. ఇన్నేళ్ల అనుభవం తర్వాత నాకు అర్థమవుతోందేంటంటే ఏ రంగంలో ఉన్నవాళ్లైనా సరే, వాళ్ల వృత్తిపరంగా ఒక అడుగు ముందుకేసినప్పుడే ఎక్కువ తృప్తి పొందుతుంటారేమో" అని చెప్పుకొచ్చింది కాజల్.

బంధం... భావోద్వేగం



నాగశౌర్య, సాయిపల్లవి

నాగశౌర్య, సాయిపల్లవి జంటగా లైకా ప్రొడక్షన్స్ పతాకంపై తెరకెక్కిన చిత్రం 'కణం'. విజయ్ దర్శకత్వం వహించారు. ఎన్.వి.ఆర్.సినిమా సమర్పిస్తోంది. చిత్రీకరణ పూర్తయింది. ఈ నెల 5న హైదరాబాద్‌లో విడుదల ముందస్తు వేడుక జరగబోతోంది. సాయిపల్లవి మాట్లాడుతూ "తల్లికి, బిడ్డకీ మధ్యనుండే బంధం, భావోద్వేగాల నేపథ్యంలో సాగే చిత్రమిది. తల్లి పాత్ర చేయాలని దర్శకుడు చెప్పినప్పుడు భావోద్వేగాలు పండించగలనా అనుకొన్నా. ఎందుకంటే అలాంటి పాత్రని నేను ఇంతకు ముందు చేయలేదు. దర్శకుడితో పాత్ర గురించి చాలా విషయాల్ని చర్చించాను. అలాగే నాకు కూతురిగా నటించిన వెరోనికాతో చాలా సమయం గడిపాను. మేం ఇద్దరం నిజంగానే తల్లీకూతుళ్లుగా కలిసిపోయాం. అందుకు తగ్గట్టుగానే సన్నివేశాలు చాలా సహజంగా వచ్చాయి. నటిగా నాకు ప్రత్యేకమైన చిత్రమిది" అన్నారు. విడుదల ముందస్తు వేడుకలో చిత్రాన్ని ఎప్పుడు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామో చెబుతామని నిర్మాణ వర్గాలు స్పష్టం చేశాయి.

ప్రేమకథలో...



వర్షిక, ఆయూష్

ఆయూష్, వర్షిక జంటగా రవికుమార్ పొన్నగంటి దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. షేక్ గౌస్ నిర్మాత. గుంటూరులో ప్రారంభమైందీ చిత్రం. ముహూర్తపు సన్నివేశానికి ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ క్లాప్‌నిచ్చారు. గుంటూరు అర్బన్ అడిషనల్ ఎస్.పి. వై.టి.నాయుడు గౌరవ దర్శకత్వం వహించారు. నిర్మాత మాట్లాడుతూ "ఒక యువ జంట నేపథ్యంలో సాగే ప్రేమకథా చిత్రమిది. ఆ కథలో మలుపులు ఆకట్టుకుంటాయి. ఈ నెల 24 వరకు జరిగే చిత్రీకరణతో సినిమాని పూర్తి చేస్తాం. పాటల్ని విశాఖపట్నం, కోల్‌కతా, బ్యాంకాక్‌ల్లో తెరకెక్కిస్తాం. ఏప్రిల్ చివరి వారంలో కానీ, మేలో కానీ విడుదల చేస్తాం" అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: అమ్మపండు, ఛాయాగ్రహణం: దుర్గప్రసాద్

క్యాంపస్ హంగామా



నిఖిల్, సిమ్రాన్

నిఖిల్ కథానాయకుడిగా నటించిన చిత్రం 'కిర్రాక్‌పార్టీ'. సంయుక్త హెగ్డే కథానాయిక. సిమ్రాన్ పరీన్జ కీలక పాత్రధారి. శరణ్ కొప్పిశెట్టి దర్శకత్వం వహిస్తున్నారు. రామబ్రహ్మం సుంకర నిర్మాత. చిత్రీకరణ పూర్తయింది. నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈనెల 16న చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తారు. "కాలేజీ క్యాంపస్ నేపథ్యంలో సాగే చిత్రమిది. డ్రామా చాలా బాగుంటుంది. నిఖిల్‌కి 'హ్యాపీడేస్' తరహాలో మంచి విజయాన్ని అందిస్తుంది. ఆయన లుక్ కూడా ఇందులో చాలా బాగుంటుంది. నిఖిల్‌తో 'స్వామి రారా', 'కార్తికేయ' తెరకెక్కించిన దర్శకులు సుధీర్‌వర్మ, చందు మొండేటి ఈ చిత్రానికి స్క్రీన్‌ప్లే, మాటలు రాశారు. టీజర్‌కి, పాటలకి మంచి స్పందన లభిస్తోంది" అన్నారు. సంగీతం: అజనీష్ లోకనాథ్

ఆస్కార్‌ను ముద్దాడే ముద్దుగుమ్మ ఎవరో..!

ఆస్కార్ బరి

ఈ నెల 4న జరగనున్న 90వ ఆస్కార్ వేడుక కోసం యావత్ సినీ ప్రపంచం ఆసక్తిగా ఎదురు చూస్తోంది. ఆస్కార్ విజేతలుగా చరిత్రలో నిలిచిపోయేవారెవరన్నదానిపై సర్వత్రా ఊహాగానాలు చెలరేగుతున్నాయి. అందులోనూ ఉత్తమ నటి పురస్కారాన్ని కైవసం చేసుకునే అభినేత్రులెవరన్నది మరింత కుతూహలంగా మారింది. ఆస్కార్ నామినేషన్ల విషయంలో రికార్డు సాధించినవారు, ఇప్పటికే ఆస్కార్ విజయాన్ని రుచి చూసినవారితో పాటు తొలిసారిగా ఆస్కార్ బరిలో నిలిచి కోటి ఆశలు పెట్టుకున్నవారుండటమే అందుకు కారణం. మరి ఆస్కార్ ప్రతిమను ముద్దాడబోయే ముద్దుగుమ్మ ఎవరో తెలిసే ముందు వారి విశేషాలు చదివేయండి.



మార్గట్ రాబ్బీ

ఆమె వయసు 27 సంవత్సరాలే. నటించింది 12 చిత్రాలే. కానీ ప్రఖ్యాత టైమ్ మ్యాగజైన్ ఆమెను ప్రపంచంలోని అత్యంత ప్రభావశీలురైన వంద మంది వ్యక్తుల్లో ఒకరిగా ఎంపిక చేసింది. ఫోర్బ్స్ మ్యాగజైన్ '30 ఏళ్ల కన్నా తక్కువ వయసున్న 30 మంది ప్రముఖులు' జాబితాలో ఆమెకు స్థానమిచ్చింది. ఆమే ఆస్ట్రేలియన్ నటి మార్గట్ రాబ్బీ. 'ఐ, టోన్యా' చిత్రంతో ఈ ఏడాది ఉత్తమ నటిగా ఆస్కార్ బరిలో నిలిచింది. ఆమెకిదే తొలి ఆస్కార్ నామినేషన్. ప్రముఖ ఫిగర్ స్కేటింగ్ క్రీడాకారిణి టోన్యా హార్డింగ్ జీవిత కథతో ఈ చిత్రం తెరకెక్కింది. ఇందులో ఆమె నటనతో ఉత్తమ నటిగా గోల్డెన్ గ్లోబ్, బాఫ్టా, సాగ్ నామినేషన్లు కూడా అందుకుంది. అబౌట్ టైమ్, ది ఉల్ఫ్ ఆఫ్ వాల్‌స్ట్రీట్, లెజెండ్ ఆఫ్ టార్జాన్, సూసైడ్ స్క్వాడ్ చిత్రాలు రాబ్బీకి గుర్తింపు తీసుకొచ్చాయి. ఈ భామ తొలి ఆస్కార్ నామినేషన్‌తోనే పురస్కారం కూడా సాధిస్తుందేమో చూడాలి.

సావోర్సె రొనన్

23 ఏళ్ల అమెరికన్ నటి సావోర్సె రొనన్ ఘటికురాలే అని చెప్పాలి. ఫోర్బ్స్ మ్యాగజైన్ '30 ఏళ్ల కన్నా తక్కువ వయసున్న 30 మంది ప్రముఖులు' జాబితాలో స్థానం సంపాదించుకోవడంతో పాటు టైమ్ మ్యాగజైన్ 'రాబోయే తరం మార్గదర్శకుల్లో' ఒకరిగా నిలిచింది. ఈ వయసుకే మూడు ఆస్కార్ నామినేషన్లు, నాలుగు బాఫ్టా నామినేషన్లు, ఒక గోల్డెన్ గ్లోబ్ నామినేషన్ అందుకుని ఆశ్చర్యపరిచింది. ఈ ఏడాది 'లేడీబర్డ్' చిత్రంతో ఉత్తమ నటిగా ఆస్కార్ బరిలో నిలిచింది. ఈసారి ఉత్తమ నటి పురస్కారం కోసం పోటీపడుతున్న అతి పిన్న వయస్కురాలు ఈమెనే. స్వేచ్ఛగా బతకాలనుకునే తనను అదుపు చేస్తున్న తల్లితో సంఘర్షించే టీనేజ్ అమ్మాయిగా 'లేడీబర్డ్'లో ఆమె నటన మెప్పించింది. 'అటోన్‌మెంట్'తో ఉత్తమ సహాయ నటిగా, 'బ్రూక్లిన్'తో ఉత్తమ నటిగా ఆస్కార్ నామినేషన్లు అందుకున్నా పురస్కారం దక్కలేదు. మరి ఆమె తొలి ఆస్కార్ అందుకుంటుందా అన్నది త్వరలో తేలుతుంది.



స్యాలీ హాకిన్స్

ఓ వింత జీవితో ప్రేమలో పడి, దాన్ని ప్రమాదం నుంచి కాపాడటానికి పరితపించే మూగ అమ్మాయిగా 'ది షేప్ ఆఫ్ వాటర్'లో నటించింది స్యాలీ హాకిన్స్. తన అభినయంతో అదరగొట్టేసి ఉత్తమ నటిగా ఆస్కార్, బాఫ్టా నామినేషన్లు సాధించింది 41 ఏళ్ల హాకిన్స్. ఉత్తమ నటిగా ఆమెకు ఇదే తొలి ఆస్కార్ నామినేషన్. ఇంతకు ముందు 'కాస్సాండ్రాస్ డ్రీమ్', 'బ్లూ జాస్మిన్' చిత్రాలకుగానూ ఉత్తమ సహాయ నటిగా ఆస్కార్ నామినేషన్లు అందుకుంది. కానీ పురస్కారం దక్కలేదు. 'హ్యాపీ గో లక్కీ' చిత్రం హాకిన్స్‌కు మంచి పేరు తీసుకొచ్చింది. అందులో తన పాత్రకుగానూ ఉత్తమ నటిగా గోల్డెన్ గ్లోబ్‌తో పాటు ప్రతిష్ఠాత్మక బెర్లిన్ చిత్రోత్సవంలోనూ పురస్కారం అందుకుంది. ఈసారి హాకిన్స్ ఆస్కార్ బరిలో విజేతగా నిలిస్తే ఆమె ఖాతాలో తొలి ఆస్కార్ పురస్కారం పడినట్లే.





ఫ్రాన్సిస్ మెక్ డొర్మండ్

కూతురు అత్యాచారం, హత్యకు గురైతే ఆ బాధ దిగమింగుకుని న్యాయం కోసం పోరాడే తల్లిగా 'త్రీ బిల్‌బోర్డ్స్ ఔట్‌సైడ్ ఎబ్బింగ్, మిస్సోరీ'లో అద్భుత నటనతో ఆకట్టుకుంది ఫ్రాన్సిస్ మెక్ డొర్మండ్. తన పాత్రకుగానూ ఇప్పటికే ఇప్పటికే ఉత్తమ నటిగా గోల్డెన్ గ్లోబ్, బాఫ్టా పురస్కారాలు గెలుచుకుంది 60 ఏళ్ల డొర్మండ్. ఇప్పుడు ఆస్కార్ పురస్కారం కోసం పోటీపడుతోంది. అది కూడా డొర్మండ్‌కు దక్కడం ఖాయమని విశ్లేషకులు చెబుతున్నారు. డొర్మండ్‌కు 'ఫార్గో' చిత్రానికిగానూ ఉత్తమ నటిగా తొలి ఆస్కార్ లభించింది. మరో మూడు చిత్రాలకు ఉత్తమ సహాయ నటిగా ఆస్కార్ నామినేషన్లు అందుకుంది. ట్రిపుల్ క్రౌన్ ఆఫ్ యాక్టింగ్‌గా పిలుచుకునే ఆస్కార్, టోనీ, ఎమ్మీ అవార్డులు మూడింటినీ గెలుచుకున్న అతికొద్ది మంది నటీమణుల్లో డొర్మండ్ కూడా ఉండటం గమనార్హం.

మెరిల్ స్ట్రీప్

ఆస్కార్ పురస్కారం కాదు కనీసం నామినేషన్ సాధించినా చాలనుకునే నటీనటులు కోకొల్లలు. అలాంటిది వేరెవరికీ సాధ్యంకాని రీతిలో 21 నామినేషన్లతో రికార్డు సృష్టించింది మెరిల్ స్ట్రీప్. ఇప్పుడు 68 ఏళ్ల వయసులోనూ 'ది పోస్ట్' చిత్రంతో ఉత్తమ నటి పురస్కారం కోసం బరిలో నిలవడం విశేషం. ఆమె ఈ ఏడాది ఉత్తమ నటి విభాగంలో పోటీపడుతున్న అత్యధిక వయస్కురాలిగా నిలిచింది. ఇప్పటి వరకూ మూడుసార్లు ఆస్కార్ సాధించింది. 'క్రామెర్ వర్సెస్ క్రామెర్'తో ఉత్తమ సహాయ నటిగా, 'సోఫీస్ ఛాయిస్', 'ది ఐరన్ లేడీ' చిత్రాలతో ఉత్తమ నటిగా ఆస్కార్ అందుకుంది. గోల్డెన్ గ్లోబ్ పురస్కారాల్లోనూ మెరిల్ స్ట్రీప్‌కు అరుదైన రికార్డు ఉంది. అందరి కన్నా ఎక్కువగా 31 నామినేషన్లు, ఎనిమిది పురస్కారాలు సాధించి సత్తా చాటింది. స్టీవెన్ స్పీల్‌బర్గ్ తెరకెక్కించిన 'ది పోస్ట్'లో మెరిల్ స్ట్రీప్ 'వాషింగ్టన్ పోస్ట్' పత్రికాధిపతి కేథరిన్ గ్రాహమ్ పాత్రలో నటించి మెప్పించింది. ఈ చిత్రానికిగానూ ఉత్తమ నటిగా ఆస్కార్‌తో పాటు గోల్డెన్ గ్లోబ్ నామినేషన్ కూడా అందుకుంది.



వసుంధర వంటల పోటీ!



మీరు చక్కగా వంట చేయగలుగుతారా? నోరూరించే పదార్థాలను చకచకా చేయడంలో సమర్థులా... అయితే రానున్న మహిళా దినోత్సవం సందర్భంగా **'ఈనాడు - వసుంధర'** మీకు ఆహ్వానం పలుకుతోంది. తక్కువ నూనె, ఉప్పు వాడుతూ నోరూరించే పదార్థాలు మాకు చేసి పంపండి. చిరుతిళ్లు, అల్పాహారాలు, కూరలూ, జంక్‌ఫుడ్.. ఇలా ఏవయినా సరే మాకు పంపొచ్చు. మీరు చేయాల్సిందల్లా.. వంటను చేసి వీడియో తీసి, మాకు వాట్సాప్ చేయడం, ఆ పదార్థాల వివరాలను తెలియజేయడం.

మీ వంటల వీడియోలను పంపించాల్సిన చివరితేదీ.. 04.3.2018. ఇక, వీడియోలు పంపించాల్సిన వాట్సాప్ నంబరు 9121167517.

ఎలా పంపాలంటే..

- మీ పేరు, ఫొటో, ఊరు వివరాలు.
- వంటకం పేరు..
- పదార్థం వీడియో!


మొదటి ఐదుగురు విజేతలకు బహుమతులు ఉంటాయి. ఇంకెందుకాలస్యం! ప్రయత్నించండి మరి.



బంగారం వెండి

2న ముగింపు-క్రితం

	హైదరాబాద్		విజయవాడ	
బంగారం(24క్యా)	-------	31,300	31,350	31,400
ఆర్నమెంట్	-------	29,210	29,100	29,150
వెండి (కిలో)	-------	39,172	39,700	39,700
	ప్రొద్దుటూరు		**రాజమండ్రి**	
బంగారం(24క్యా)	31,380	31,380	31,040	30,930
ఆర్నమెంట్	29,090	29,060	29,040	28,930
వెండి (కిలో)	39,700	39,400	38,900	38,500
	విశాఖపట్నం		**తమిళనాడు**	
బంగారం(24క్యా)	31,160	31,160	-------	-------
ఆర్నమెంట్	28,980	28,980	2,904	2,893 గ్రా
వెండి (కిలో)	39,900	39,900	41.40	41.10 గ్రా



పొద్దున్నే నిద్రలేచి... కాసేపు ట్రెడ్‌మిల్‌పై నడిచి... ఇంకాసేపు ఎక్సర్‌సైజ్ సైకిల్ తొక్కేస్తే.. సన్నబడటం ఎంతసేపు కదా! కానీ జిమ్‌కు వెళ్లి, బోలెడు డబ్బు ఖర్చుపెడితేకానీ.. అవన్నీ సాధ్యం కాదు..! ఆగండి! అవేవీ లేకుండానే మన ఇంటినే మినీ జిమ్‌గా మార్చేయొచ్చు! నచ్చినట్టుగా సన్నగా మారిపోవచ్చు. అదీ మనకున్న బడ్జెట్‌లో కొన్ని వస్తువులు కొనుక్కుంటే చాలు!



ఇంట్లోనే జిమ్ మారో జిమ్

శరీరం ఫిట్‌గా, ఆరోగ్యంగా ఉండాలంటే జిమ్‌కే వెళ్లాలా? అంటే దానికి కాదు అనే సమాధానం కూడా ఉంది. ఇంట్లోనే... అది కూడా తక్కువ ఖర్చులోనే చిన్నపాటి జిమ్ లాంటి జిమ్‌ను ఏర్పాటు చేసుకోవచ్చు. ఎన్ని కెలొరీలు కరిగించుకోవాలనుకుంటున్నారో... ఆ లెక్క ఆధారంగా కొన్ని వస్తువులు కొనిపెట్టుకుంటే చాలు. ఉదాహరణకు నెలకు జిమ్‌కి పన్నెండు నుంచి పదిహేను వందల రూపాయలు ఖర్చుపెడుతున్నారనుకుంటే... ఆ పరికరాలన్నీ దాదాపు రెండు నుంచి రెండున్నర వేల రూపాయల్లో వచ్చేస్తాయి. లేదా మన బడ్జెట్‌కి సరిపోయేవాటినే కొనుక్కోవచ్చు. వాటివల్ల ఇంట్లోనే ఆ ఫలితాలు పొందొచ్చు. ఈ ఏర్పాట్లన్నీ చేసుకునే ముందు మీ ఇంట్లో వెలుతురు కాస్త బాగుండే గదిని ఎంపిక చేసుకోవాలి. జిమ్‌లాంటి అనుభూతే కావాలనుకుంటే ఒకట్రెండు పొడవాటి అద్దాలు ఆ గదిలో ఏర్పాటు చేసుకోండి. లేదంటే పడకగదిలో ఉండే డ్రెసింగ్‌టేబుల్‌ను ఈ రూమ్‌లో పెట్టుకున్నా ఫరవాలేదు. దాంతోపాటూ కొలిచే టేపూ, వేయింగ్ మెషీన్ తప్పనిసరిగా ఉండాల్సిన వస్తువులు. ఇవి ఎప్పటికప్పుడు కసరత్తుల ప్రభావం మీపై ఎలా ఉందో తెలియజేస్తాయి. ఆ తరువాత...

సమస్యను బట్టీ...

ఏ భాగాల్లో కొవ్వు తగ్గించుకోవాలనుకుంటున్నారో ఆలోచించుకోండి. బరువు చూసుకోండి. వీలైతే ఒకసారి ఫిట్‌నెస్ నిపుణులను కలిసి ఈ వివరాలు తెలుసుకుంటే మంచిది. ఆ తరువాత ప్రణాళిక సిద్ధం చేసుకుని దాన్ని పక్కాగా అనుసరించడమే తరువాయి. మొదట రెండు వేల రూపాయల బడ్జెట్ కేటాయించుకుంటే ఐదువందల రూపాయల్లో ఫ్రీ వెయిట్లూ, రెండువందల రూపాయలకు రెసిస్టెన్స్ బ్యాండ్లూ, మూడు వందల్లో కెటిల్ బెల్, నాలుగొందల రూపాయలతో స్టెబిలిటీ బాల్, రెండు వందల్లో ఒక స్కిప్పింగ్ రోప్ కొనుక్కోవచ్చు. వీటితోనే విభిన్న వ్యాయామాలు ఎలా చేయాలో తెలుసుకుంటే శరీరం మొత్తానికీ కావాల్సిన కసరత్తులు చేయొచ్చు.

ఇంటి పరికరాలూ...

పైవన్నీ సరే... మీ ఇంట్లో కొన్నిరకాల వస్తువులు మీకు వ్యాయామసాధనాలుగా ఉపయోగపడతాయి తెలుసా...!

- **బంతి:** ఫుట్‌బాల్ లేదా వాలీబాల్ ఉందా... దాన్ని రెండుచేతుల్లో పట్టుకుని పైకెత్తి కుడి, ఎడమలవైపు కనీసం అరవైసార్లు తిప్పి చూడండి. ఛాతి భాగం నుంచీ నడుము వరకూ పేరుకొన్న కొవ్వు కరిగి, శరీరం తీరైన ఆకృతిలోకి మారుతుంది.
- **కర్ర:** ఇదొకటి అందుబాటులో ఉంటే చాలు. దీంతోనూ రకరకాల వ్యాయామాలు చేయొచ్చు. దాన్ని భుజాలపై పెట్టుకుని రెండువైపులా వంగేందుకు ప్రయత్నించాలి. అలాగే కుడి, ఎడమమలవైపు తిరగాలి.
- అవనే కాదు, నీళ్లసీసాలూ, చున్నీ, కుర్చీ, చిన్న బల్లా.. ఇలా ఏదయినా వ్యాయామసాధనమే. ప్రత్యేకంగా చేసే కసరత్తులే కాకుండా... రోజూవారి ఇంటి పనులతో కూడా శరీరానికి కావాల్సిన వ్యాయామం అందుతుంది. చపాతీలు చేయడం, బట్టలుతకడం, గిన్నెలు తోమడం... ఇలా ప్రతి పనీ ఒక్కో అవయవానికి వ్యాయామం అందిస్తుంది.

ఎన్ని కెలరీలంటే...



రెసిస్టెన్స్ బ్యాండ్

తక్కువ ఖర్చులో దొరికే వ్యాయామ సాధనం ఇది! కసరత్తు చేసే రకాన్ని బట్టి దీంతో అరగంటకు వంద నుంచి రెండు వందల కెలొరీలు కరిగించుకోవచ్చు. దీనివల్ల శరీరం బాగా సాగుతుంది. ముఖ్యంగా మోకాలూ, భుజాలూ, మోచేయి దగ్గర కీళ్లు బలపడతాయి.

ఎక్సర్‌సైజ్ బాల్

దీంతో ప్రత్యేకంగా కసరత్తులు చేయడమే కాక, ఏదైనా పనిచేస్తున్నప్పుడు దీని మీద కూర్చున్నా గంటకు వందకు పైగా కెలొరీలు తగ్గించుకోవచ్చు. పైగా దీనిపై బోర్లా పడుకుని చేతులూ, కాళ్లను సాగదీసినా సరిపోతుంది. కూర్చుని వెనక్కివాలి పైకి లేవడం, కాళ్లను పైకి లేపే ప్రయత్నం.. ఇవన్నీ వ్యాయామాలే. అవసరంలేదనుకున్నపుడు దీనిలోని గాలి తీసేస్తే సరిపోతుంది. దాన్ని పట్టుకుని చేతుల్ని కుడి, ఎడమవైపు అరవైసార్లు తిప్పినా ఎంతో ఫలితం ఉంటుంది.



యోగామ్యాట్



ఆసనాలు నేరుగా నేలమీద వేయకూడదు. రెండువందల రూపాయల్లో మంచి యోగామ్యాట్ దొరుకుతుంది. దాన్ని వాడటం వల్ల సౌకర్యంగా కూడా అనిపిస్తుంది.

ప్లేట్లు



ఇవి కేజీల వారీగా దొరుకుతాయి. రెండు నుంచి ఐదు కేజీల వరకూ కొనుక్కుంటే... రకరకాల వ్యాయామాలు చేయొచ్చు. కేవలం రెండు చేతులతో పట్టుకుని కుడి, ఎడమలవైపు వంగే ప్రయత్నం చేసినా చాలు. పొట్టకు ఇరువైపులా ఉండే కొవ్వు క్రమంగా కరిగిపోతుంది.

డంబెల్స్



తేలికపాటి బరువులు ఎత్తుతుండటం వల్ల నలభై నిమిషాలకు దాదాపు వందకు పైగా కెలరీలు ఖర్చవుతాయి. దీనివల్ల చేతి కండరాలు బలంగా తయారవుతాయి. చేతులూ, ఛాతీభాగం తీరైన ఆకృతిలోకి వస్తాయి. ఇవి ఒకటి లేదా రెండు కేజీల్లో ఉండేలా చూసుకుంటే చాలు.

స్కిప్పింగ్ రోప్

దీని వల్ల కాళ్లూ, భుజాల కండరాలు బలపడటమే కాదు. గుండెకు కూడా మంచి వ్యాయామం అందుతుంది. తక్కువ సమయంలోనే ఎక్కువ కెలొరీలు కరిగించుకోవచ్చు. ఇరవై నిమిషాలు తాడాట ఆడటం వల్ల దాదాపు రెండొందల కెలొరీలు ఖర్చయిపోతాయి. పైగా కుదిరినప్పుడల్లా తాడాట ఆడినా చాలు... ఎంతో మార్పు కనిపిస్తుంది.



అదే ఫలితం!



అరుణ
యోగా నిపుణులు

జిమ్‌కు వెళ్లడం కుదరని వాళ్లు ఇంట్లో ఉన్న వస్తువులతోనే కసరత్తులు చేయొచ్చు. జిమ్ ఫలితాలనే వాటి ద్వారా పొందొచ్చు. దానికి మన ఇంట్లో ఉండే పాతవస్తువులే వ్యాయామ సాధనాలు. కానీ బీఎమ్ఐ (బాడీ మాస్ ఇండెక్స్) ఆధారంగా ఎలాంటి కసరత్తులు చేయాలనే విషయంపై స్పష్టత ఉండాలి. ఎత్తూ, శరీరతత్వం, బరువూ, వయస్సు... వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకోవడం తప్పనిసరి. వ్యాయామం చేసే ముందు కూడా వాటికి సంబంధించిన నియమాలూ, చేసే పద్ధతి ఒకసారి తెలుసుకుంటే మేలు.

– కౌటిక్ ప్రణయశ్రీ, ఈనాడు డిజిటల్

వెనీలా అనగానే ఐస్‌క్రీములూ, కుకీలూ, కేకులు గుర్తుకు వచ్చి చిన్నారులతోపాటు పెద్దలకు నోరూరుతుంది. అయితే ఈ సువాసనకూ, రుచికి ఆధారం ఒక మొక్క అనే విషయం మనలో చాలామందికి తెలియదు. వీటన్నింటిలో వాడే వెనీలా ఎసెన్స్‌ను ఆ మొక్క గింజల నుంచి తయారు చేస్తారు.

వెనీలా ఆర్కిడ్ జాతికి చెందిన మొక్క. దీని శాస్త్రీయ నామం వెనీలా ఫ్లావిఫోరియా. సుగంధ ద్రవ్యంగా వాడకంలోనూ, సాగులోనూ వెనీలాదే ప్రపంచంలో అగ్రస్థానం. ఇది దాదాపు 500 సంవత్సరాలకు పూర్వం నుంచే సాగులో ఉంది. దీని జన్మస్థలం మెక్సికో. వెనీలా అంటే 'లిటిల్ పాండ్' అని అర్థం. ఈ పేరు దీని కాయల ప్రాధాన్యాన్ని తెలుపుతుంది.



తియ్యటి మొక్క.. వెనీలా!



వెనీలాకు గాలిలో తేమ ఎక్కువగా ఉండాలి. సూటిగా ఎండ పడకుండా వెలుతురు సోకుతూనే నీడగా ఉండాలి. మొక్కల మధ్య పెంచుకుంటే అనువుగా ఉంటుంది. నేల సారవంతంగా, నీరు నిలవకుండా, తేమగా ఉండాలి. వెనీలా మొక్క కాండానికి గానీ, ఏదైనా ఆధారానికి గానీ అంటుకుని పెరుగుతుంది. కోకోపీట్, వర్మి కంపోస్టులతోపాటు కొద్దిగా ఇసుక కలిపిన మిశ్రమం దీనికి అనువుగా ఉంటుంది. వీలైతే కొద్దిగా స్పెగ్నమ్ మాస్ కూడా కలిపితే ఇంకా మంచిది.

వెనీలా సన్నని కాండంతో రెండువైపులా ఆకులతో దాదాపు 30 మీటర్ల పొడవు వరకు పెరిగే మొక్క. దీని ఆకులు మందంగా, ముదురాకుపచ్చ రంగులో, దాదాపు అంగుళం వెడల్పు, మూడంగుళాల పొడవుతో ఉంటాయి. ఇందులో మరింత ఆకర్షణీయమైన వరిగేటెడ్ రకం కూడా ఉంది. ఆకు గ్రీవాల నుంచి పూలు వస్తాయి. ఇవి మీగడ రంగులో కొంచెం పెద్దగా ఉంటాయి. ఈ పూలు ఒక్కరోజులోనే వాడిపోతాయి. కాయలు తయారు కావాలంటే ఈ పూలను చేతితో పరాగ సంపర్కం చేయాలి. సాధారణంగా ఇసుక ప్రాంతాల్లో పెరుగుతుందీ మొక్క. పూలు పూయడం, కాయలు రావడం అరుదు. అయితే అది ఈ మొక్కను పెంచాలన్న మన ఉత్సాహాన్నేమీ తగ్గించదు. మీరు ఎక్కువ శ్రద్ధ చూపించగలిగితే కాయలు కాయించడం కూడా అసాధ్యమేమీ కాదు.

కుండీలోనూ...

వెనీలాను కుండీలో కూడా పెంచుకోవచ్చు. కుండీలో మాస్‌స్టిక్‌ను గానీ, ఏదైనా కర్రను గానీ ఆధారంగా పెట్టినప్పుడు దానికి అంటుకుని ఆరోగ్యంగా పెరుగుతుంది. నీళ్లు పోసేటప్పుడు మట్టి మిశ్రమంతోపాటు ఆధారాన్ని కూడా తడపాలి. అప్పుడే వేళ్లు బలంగా ఉండి మొక్క బాగా పెరుగుతుంది. జీవామృతం లేదా నీటిలో కరిగే పాలీ ఫీడ్ లాంటి రసాయన ఎరువును రెండు వారాలకోసారి వేస్తే సరిపోతుంది. రసం పీల్చే పురుగులు ఆశించకుండా ఆకు కషాయాలు చల్లుతూ నీళ్లు ఎక్కువ కాకుండా జాగ్రత్త పడితే వెనీలా చక్కగా పెరుగుతుంది. ఈ మొక్కకు ఔషధ గుణాలు కూడా ఉన్నాయి. దీన్ని హిస్టీరియా, జ్వరం, కీళ్లనొప్పులు తగ్గించడానికి వాడతారు. వెనిల్లా సువాసనకు మనసును సాంత్వన పరిచి ప్రభావితం కలిగించే సుగుణం ఉంది. దీనికి ఉన్న మరో ప్రత్యేకత ఏమిటంటే వివిధ ప్రాంతాల్లో సాగు చేసినప్పుడు ఒకేరకమైనా దాని సువాసనలో తేడా ఉంటుందట. దీన్ని కొమ్మకత్తిరింపుల ద్వారా సులువుగా ప్రవర్ధనం చేయవచ్చు

– బోడెంపూడి శ్రీదేవి, లాండ్‌స్కేప్ కన్సల్టెంట్


నజరానా

వంటింటి చాకులు తుప్పపట్టాయా...? నిమ్మచెక్కతో రుద్ది చూడండి. తుప్పు వదిలి, వాడుకోవడానికి అనువుగా మారతాయి.



నెలసరి సమయంలో ఎందుకలా?

డియర్ వసుంధర



డా॥ అనగాని మంజుల
గైనకాలజిస్టు

నా వయసు యాభై. ఏడాదిగా నెలసరి సమయంలో జననేంద్రియాల్లో కురుపులా వస్తోంది. నెలసరి తరువాత ఆ కురుపు తగ్గిపోతోంది. ప్రతినెలా ఇదే సమస్య. ఇలా ఎందుకు జరుగుతోందో అర్థంకావడం లేదు. ఇదేమైనా పెద్ద సమస్యేమోనని భయంగా ఉంది. అసలు ఎందుకిలా అవుతోంది? **- ఓ సోదరి**

నెలసరి సమయంలోనే కురుపు వస్తోందంటే... నిర్లక్ష్యం చేయకుండా వైద్యుల్ని సంప్రదించడం మంచిది. కొన్నిసార్లు బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్ ఉన్నా ఇలా కావచ్చు. జననేంద్రియాల్లోని పీహెచ్‌శాతం ఆమ్లగుణంతో ఉంటుంది. అది నెలసరి రక్తస్రావంతో కలిసినప్పుడు ఆల్కలైన్‌గా మారుతుంది. అలాంటప్పుడు కూడా ఇన్‌ఫెక్షన్లు రావచ్చు. అందులో భాగంగానే కురుపు కనిపించడం. కొన్నిసార్లు ఆ కురుపు కాండిడియాసిస్‌కి సంకేతం అయ్యుండొచ్చు. అలాగే మనం వాడే శానిటరీ న్యాప్‌కిన్ల వల్ల కూడా ఎలర్జీలా వచ్చి, కురుపు ఏర్పడుతుంది. రోగనిరోధకశక్తి తగ్గినప్పుడు హెర్పిస్ ఇన్‌ఫెక్షన్ వచ్చినా ఇలా కావచ్చు. కొన్నిసార్లు రేజర్ వల్లా ఈ సమస్య ఎదురయ్యే ఆస్కారం కూడా ఉంటుంది. కారణం తెలియాలంటే ముందు మీరు నిర్లక్ష్యం చేయకుండా నెలసరి వచ్చిన సమయంలో వైద్యుల్ని సంప్రదించాల్సి ఉంటుంది. వాళ్లు పరీక్షించి, దానికి తగినట్లుగా చికిత్స చేస్తారు. ఒకవేళ పీహెచ్ వల్ల అలా జరుగుతోంటే దానికి తగినట్లుగా వాష్‌లు సూచిస్తారు. ఇతర కారణాలైతే మందులు సిఫారసు చేస్తారు. వ్యాధినిరోధకశక్తి తగ్గడం వల్ల ఇలా అవుతోందంటే దానికి చికిత్స చేస్తారు. వయసు యాభై అంటున్నారు కాబట్టి మధుమేహం కూడా కొన్నిసార్లు ఇలాంటి ఇన్‌ఫెక్షన్‌కి కారణం కావచ్చు. కాబట్టి ఆలస్యం చేయకండి.

– మీ సందేహాలను, సమస్యల్ని vasuhealth@eenadu.net కు పంపించగలరు.

ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో మా వత్తులే...





ఓ చిన్న ఆలోచన... ఆ ఊరికో కొత్త ఉపాధి మార్గాన్ని చూపించింది. అప్పటివరకూ చాలీచాలని సంపాదనతో నెట్టుకొచ్చిన ఆ మహిళలు ఇప్పుడు తమ కుటుంబాలనే కాదు, మరెన్నో గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇంతకీ అదే ఊరు? అక్కడి మహిళలు ఏం చేశారో చూద్దాం రండి.

ఆ ఊరిపేరు ఇల్లంద. వరంగల్ రూరల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని పల్లెటూరు. ఏ కాస్త ఖాళీ సమయం దొరికినా ఆ ఊరి మహిళలంతా ఓ చోటకి చేరిపోతారు. అయితే కాలక్షేపానికి మాత్రం కాదు. భగవంతుడి సన్నిధిలో వెలుగులిచ్చే వత్తులు తయారు చేయడానికే సమావేశమవుతారు. ఆ ఊళ్లో ఏ ఇంట్లో చూసినా ఇదే దృశ్యం కనిపిస్తుంది. దీనిద్వారా నెలకు కొంత సంపాదిస్తూ తమ కుటుంబానికి ఆసరాగా నిలుస్తున్నారు. వీళ్లు తయారు చేసిన వత్తులన్నీ తెలుగు రాష్ట్రాల్లోని ప్రముఖ పుణ్యక్షేత్రాలైన బాసర, యాదగిరిగుట్ట, విజయవాడ వంటి ప్రాంతాలకు ఎగుమతి అవుతాయి. అంతేనా... హైదరాబాద్, కరీంనగర్, నిజామాబాద్ వంటి చోట్లా అమ్ముతారు.

ఇల్లందలో ఇంటింటా మొదలైన ఈ పని క్రమంగా ఇతర గ్రామాలకూ పాకింది. ఇప్పుడు కనీసం 20 గ్రామాల్లోని మహిళలూ ఇదే పని చేస్తున్నారు. అసలు వీరికా పని ఎలా అలవాటయ్యిందంటే... ఈ ప్రాంతంలో పత్తి అధికంగా పండుతుంది. వ్యవసాయం సాటిరాక ఇబ్బందులు పడుతోన్న సమయంలో ఈ గ్రామానికి చెందిన కొందరు మహిళలు కార్తీక, శ్రావణ మాసాలూ, పండగల రోజుల్లో వరంగల్‌లోని దేవాలయాల దగ్గరా, షాపుల్లో వత్తులు అమ్మేవారు. మిగతావాళ్లూ ఖాళీగా ఉండడం ఎందుకని ఇదే పని చేయడం మొదలుపెట్టారు. ఇలా వత్తులు చేస్తూనే ఒక్కో మహిళ రోజుకు కనీసం రూ.60 వరకూ సంపాదిస్తోంది.

- పాండురంగశర్మ, వరంగల్.



ముందు డిగ్రీ.. తర్వాత ఇంటర్.. ఇప్పుడు గ్రూప్-2

కష్టాలు ఏం చేస్తాయి?
మనిషిని రాటుదేలుస్తాయి
నష్టాలు ఏం నేర్పుతాయి?
నిలదొక్కుకోవాలనే తపన పెంచుతాయి
అవకాశాలు ఏం ఇస్తాయి?
ఒక్కోమెట్టు ఎక్కుతూ లక్ష్యాన్ని చేరుకోమంటాయి

అలా రాటుదేలిన, నిలదొక్కుకున్న, లక్ష్యాన్ని చేరుకొన్న వారే వీరిద్దరూ. గ్రూప్-2లో ప్రథమ స్థానం సాధించిన విజయ్‌కుమార్‌రెడ్డి, ఇదే పరీక్షలో ఉపతహసీల్దారు ఉద్యోగం పొందిన వెంకటసుబ్బారావులు ఎన్నో కష్టాలను ఎదుర్కొని నిలిచారు. విజయం వైపు సాగిన వీరి పయనం స్ఫూర్తిదాయకం.

- రోజూ 10 నుంచి 12 గంటలు చదివేవాణ్ని. ఏ సబ్జెక్టు ఎప్పుడు చదవాలో ప్రణాళిక వేసుకున్నాను.
- సమాచారం కోసం ఇంటర్నెట్ శోధన, కరెంట్ అఫైర్స్ ఫాలోకావడం బాగా కలిసొచ్చింది.
- ఈనాడు పత్రికను క్షుణ్ణంగా చదివాను. ఇది ఎంతో ఉపకరించింది. స్నేహితుల సలహాలు పనికొచ్చాయి. స్థిర లక్ష్యం, సాధించాలనే తపన నన్ను నడిపించాయి.

- సమాచార సేకరణకు ఎక్కువగా నెట్‌పై ఆధారపడ్డాను. ఎకనమిక్‌సర్వేను అధ్యయనం చేయడం ఎంతో ఉపకరించింది.
- కరెంట్‌అఫైర్స్ బుక్స్, యోజన ఉపయోగపడ్డాయి.
- నిరంతరం చదవడం... చదివిన వాటిని రాయడం ద్వారా గుర్తుంచుకోవడం సులువైంది. చదివిన వాటి గురించి చర్చించడం మంచి ఫలితాన్నిచ్చింది.



విజయ్ ప్రస్థానం

బతుకు చెప్పే పాఠాలు నేర్చుకొంటే... భవిత ఉజ్వలంగా ఉంటుంది. వెంకటసుబ్బారావు అందుకు నిదర్శనం. బత్తి చిన్నపాలంకయ్య, అంకమ్మల కుమారుడు వెంకటసుబ్బారావు. వీరిది ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం మండలం పొద్దకొలుకుల గ్రామం. మధ్యతరగతి కుటుంబం. సమీపంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలోనే 2000 సంవత్సరంలో పదోతరగతి పూర్తిచేశాడు సుబ్బారావు. ఎలాగైనా తన కుమారుడిని ఉన్నత చదువులు చదివించాలనే ఆశయం నాన్నది. గుంటూరు జిల్లా నరసారావుపేటలోని జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్‌లో చేర్పించారు. మారుమూల గ్రామం నుంచి వెళ్లడంతో అక్కడి వాతావరణానికి భయపడి నెలరోజులకే ఇంటికి పారిపోయి వచ్చేశాడు. తల్లిదండ్రులు ఎంత బతిమాలినా, కళాశాలకు వెళ్లలేదు. చదువు మానేస్తానని, ఊళ్లోనే కూలీ పనులు చేసుకుంటానని ఉండిపోయాడు. అలా తొమ్మిదేళ్లు కూలీగానే ఉండిపోయాడు. పదేళ్లు బడిలో చదివిన పాఠాల కంటే... తొమ్మిదేళ్లలో జీవితం నేర్పిన గుణపాఠాలు ఎక్కువ మార్పును తీసుకొచ్చాయి.

బాధ్యతలే బాటలేశాయి

సొంత పొలం అయిదెకరాలు ఉండేది. పత్తి, మిరప, కంది వేసేవారు. కరవు కావడంతో వ్యవసాయంలో నష్టాలే. పొలాన్ని బీడుగా విడిచి కూలీ పనులకు వెళ్లారు. 2004లో అక్క సుబ్బలక్ష్మి భర్త మరణించారు. అప్పటికే ఆమెకు ఇద్దరు సంతానం. ఇద్దరూ పసివాళ్లే. అక్క, పిల్లలకు తోడుగా ఉండాల్సి వచ్చింది. మాచర్ల మండలం రచ్చమల్లపాడులో ఉంటూ వారి పొలం సాగుచేస్తూ కుటుంబ బాధ్యతలు చూసుకున్నాడు సుబ్బారావు. 2008లో పెళ్లి చేసుకున్నాడు. వివాహమైన తర్వాత అక్క ఇంట్లో ఉండడం సబబు కాదని, ఏడాది తర్వాత సొంతూరు పెద్దకొలుకుల వచ్చేశాడు. వ్యవసాయంతో కుటుంబాన్ని పోషించలేమని అర్థమవడానికి కరవు గురువైంది. ఆర్థికంగా కష్టాలు వెంటాడాయి. మార్పు మొదలైంది. చదువే ఈ కష్టాల నుంచి తనని బయటపడేస్తుందని భావించాడు. ఈ ఊరి నుంచి పాతికమంది ప్రభుత్వ ఉపాధ్యాయులుగా స్థిరపడ్డారు. వారి నుంచి అందిన స్ఫూర్తి, భవిష్యత్తుపై భయం ఉండడంతో తనూ ఉపాధ్యాయుడు కావాలని నిర్ణయించుకున్నారు. అందుకు తగిన కార్యాచరణ, ప్రణాళికలు సిద్ధంచేసుకున్నారు. బీఈడీ చదవాలంటే డిగ్రీ అర్హత కావడంతో అదే ఏడాది దూరవిద్యలో డిగ్రీలో చేరారు. కూలీ పనులకు వెళ్తూ చదువుకొని పరీక్షలు రాశారు. డిగ్రీ రెండో ఏడాదిలో ఉండగా ఒక పాప(సంజన) పుట్టింది. కుటుంబ బాధ్యతలు చూస్తూనే 2012లో 60శాతం మార్కులతో డిగ్రీ పూర్తిచేశారు. వెంటనే బీఈడీ ప్రవేశపరీక్ష రాస్తే 105వ ర్యాంకు వచ్చింది. అప్పుడే ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టులన్నీ టీటీసీ చదివిన వారికి కేటాయిస్తూ నిర్ణయం వచ్చింది. దీంతో బీఈడీ చదవాలనే ప్రయత్నం విరమించుకుని గ్రూప్స్ సాధించాలని నిర్ణయించుకున్నారు. దీనికి ఇంటర్మీడియట్ తప్పనిసరిగా ఉండాలని 2013లో వన్ సిట్టింగ్‌లో ఇంటర్మీడియట్ పరీక్షలు రాసి 70 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాడు.

ఒకేసారి రెండు కొలువులు

ఇంటర్మీడియట్ అవ్వగానే ప్రభుత్వం వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి ఉద్యోగాలు భర్తీచేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎలాగైనా ఉద్యోగం సాధించాలనే కసితో కుటుంబాన్ని వదిలి హైదరాబాద్ వెళ్లి మూడు నెలలపాటు శిక్షణ తీసుకున్నారు. ఓ వైపు వీఆర్‌వో, మరోవైను పంచాయతీ కార్యదర్శి రెండు పరీక్షలు రాశారు. రెండింటిలోనూ విజేతగా నిలిచారు. ఒకేసారి రెండు కొలువులు వరించాయి. సన్నిహితుల సూచనతో వీఆర్వో ఉద్యోగాన్ని ఎంచుకున్నారు. ఉద్యోగం వచ్చిన కొన్నిరోజులకు బాబు(భానుమనీష్) పుట్టాడు. 2016లో గ్రూప్-2 నోటిఫికేషన్ విడుదలైంది. ఇక లక్ష్యం ఇదే. ఉద్యోగానికి సెలవుపెట్టి, కుటుంబాన్ని కొన్నాళ్లు దూరంగా పెట్టి తను హైదరాబాద్ వెళ్లిపోయారు. స్నేహితులతో కలిసి ఏడాదిపాటు సొంతంగా సాధన చేశారు. పత్రికలు, సమకాలీన అంశాలు, అంతర్జాలంలో అంశాలను మేళవించుకుని మిత్రులతో చర్చించడం ద్వారా పరీక్షలో విజయం సాధించారు. 332 మార్కులతో ఉపతహసీల్దారుగా ఎంపికయ్యారు.

కుటుంబమే అండ

హైదరాబాద్‌లో ఏడాది శిక్షణలో ఉంటే మరి కుటుంబానికి దిక్కెవరు? ఇంటిని పోషించడానికి, తన చదువుకి డబ్బు అవసరం తప్పనిసరి. అప్పుడే అమ్మానాన్నలు, స్నేహితులు అండగా నిలిచారు. పొలం పనులు, కూలీపనులు చేస్తూ డబ్బులు పంపించేవారు. పిల్లల బాధ్యతంతా నా భార్య వీరనారాయణమ్మ చూసుకునేది. నా విజయంలో కీలక పాత్ర నా జీవిత భాగస్వామిదే. కరెంటు అఫైర్స్ కోసం పూర్తిగా 'ఈనాడు'పైనే ఆధారపడ్డాను. 'ఈనాడు'లో వచ్చిన కరెంటు అఫైర్స్‌లో 80శాతం ప్రశ్నలు పరీక్షల్లో వచ్చాయి. రైతులకు నాణ్యమైన సేవలు అందించడమే నాలక్ష్యం.

- వెంకట సుబ్బారావు

అంది వచ్చిన ప్రతి అవకాశాన్ని వినియోగించుకుంటూనే దశలవారీగా లక్ష్యాలు సాధించడం విజేతల లక్షణం. చింతలపూడి విజయ్‌కుమార్‌రెడ్డి అలాంటి విజేతే. 2016 గ్రూప్-2 పరీక్షల్లో మొదటి ర్యాంకు సాధించి ఉపతహసీల్దారు పోస్టుకు అర్హత సాధించారు. ఇదే పరీక్షలో ఈయన భార్య గీతాకుమారీ మంచి మార్కులతో ఉప తహసీల్దారుగా అర్హత సాధించారు. భార్యభర్తలిద్దరూ రెండుసార్లు గ్రూప్-2 పరీక్షలు రాసి విజేతలుగా నిలవడం వారి ప్రతిభకు నిదర్శనం. వీరితో పాటు విజయ్‌కుమార్‌రెడ్డి తమ్ముడూ ఇదే పరీక్షలో ఉద్యోగం పొందడం మరో విశేషం. దీంతో ఈ కుటుంబం స్థానికంగా గ్రూప్-2 కుటుంబమైపోయింది. ఇంతటి విజయాలు సులువుగా దక్కలేదు. కళ్లెదుటే భూములున్నా సాగు సాధ్యం కాక... తరచూ వ్యాపారంలో నష్టాలతో నాన్న నిరుత్సాహంగా ఉండేవారు. అయినా విజయ్‌కుమార్ వెనుకడుగు వేయలేదు. ఎప్పటికప్పుడు తనని తాను మలుచుకుంటూ విజేతగా నిలిచారు. భార్య, తమ్ముడినీ అదే బాట పట్టించారు.

ఆది నుంచి కష్టాలే

ప్రకాశం జిల్లాలోని అత్యంత వెనకబడిన ప్రాంతం, కరవు నేలలున్న పెద్దారవీడు మండలంలోని కంభంపాడు విజయ్‌కుమార్ స్వగ్రామం. అక్కడే అయిదో తరగతి వరకు ప్రాథమిక బడిలో చదివారు. ఈ ప్రాంతంలో భూములున్నా విలువ ఉండదు. సేద్యం సాధ్యం కాదు. విజయ్ తండ్రి సుబ్బారెడ్డి పంటలు పండక, తరచూ పొలం అమ్ముకుంటూ కుటుంబాన్ని నెట్టుకొచ్చారు. సేద్యాన్ని, సొంతూరుని విడిచిపెట్టి 1994లో వారి కుటుంబమంతా మార్కాపురం పట్టణానికి వలస వచ్చేశారు. అప్పుడే బొగ్గుబట్టీల వ్యాపారం మొదలుపెట్టారు. ఏ వ్యాపారమూ స్థిరంగా సాగలేదు. ఇలా వివిధ వ్యాపారాలు చేసినా తరచూ నష్టాలు వచ్చేవి. వారు పస్తులుండైనా పిల్లలను చదివించారు. అలా విజయ్ పదోతరగతి పూర్తిచేశారు. 61 శాతం సగటు మార్కులతో.

నష్టాలు మలిచిన శిల్పం

విజయ్ చిన్ననాటికి ఈ కుటుంబానికి నలభై ఎకరాల పొలం ఉండేది. పదోతరగతి పూర్తయ్యే సరికి మూడెకరాలే మిగిలింది. ఓ వైపు పొలం పోతుంది. వ్యాపారంలో లాభాలు లేవు. ఏం చేసినా నష్టాలే. తండ్రి సుబ్బారెడ్డిది సూటిగా వెళ్లే వ్యక్తిత్వం. సిద్ధాంతాలను నమ్మిన వ్యక్తి. నెల్లూరులోని వీఆర్ కళాశాలలో బీఏ చదివారు. ఆ సమయంలో భారత విద్యార్థి ఫెడరేషన్ నాయకుడు. అత్యయికస్థితిలో అరెస్టయ్యారు. దీంతో చదువు ఆపేసి సొంతూరుకి వచ్చేసి వ్యవసాయం, వ్యాపారంపై దృష్టిపెట్టారు. తను నష్టపోయినా ఎదుటి వాళ్లకు అన్యాయం జరగకూడదు అనుకునే తత్వం. వ్యాపారాలు ఏవీ సక్రమంగా సాగలేదు. 'వ్యాపారం చేసుకోండి, చదువులతో లాభం లేదు. మనకు ఉద్యోగాలు రావు' అంటూ బిడ్డలకు చెప్పేవారు. కానీ నాన్న కష్టనష్టాలు కళ్లారా చూసిన విజయ్ ఉద్యోగాన్ని సాధించి కుటుంబాన్ని నిలబెట్టాలనుకున్నారు. ఇంటర్మీడియట్ సమయంలో పెదనాన్న ప్రోత్సాహంతో ఆర్థిక అవసరాలు తీర్చుకుని కళాశాల విద్యలోకి అడుగుపెట్టారు. పెదనాన్న అల్లూరిరెడ్డి కానిస్టేబుల్. విజయ్‌కు ఈ విషయంలో అండగా నిలిచారు. వెన్నుతట్టారు.

విజయానికి తొలి అడుగు

మార్కాపురంలోని సాధన కళాశాలలో విజయ్ డిగ్రీ పూర్తిచేశారు. ఆ తర్వాత బీఈడీ. 2006 డీఎస్సీలో 94.5 మార్కులతో ఉపాధ్యాయ ఉద్యోగం పొందారు. పట్టణానికి దగ్గరలోని రాయవరంలో 2007 వరకు పనిచేశారు. 2008లో గ్రూప్-2 రాశారు. రాష్ట్రస్థాయిలో 12వ ర్యాంకు సాధించి, విశాఖపట్నంలో కార్మికశాఖ అసిస్టెంట్ అధికారిగా ఉద్యోగంలో చేరారు. ఇలా తొలిరెండు ప్రయత్నాల్లోనే రెండు ఉద్యోగాలు సాధించారు. 2011లో గ్రూప్-1 రాశారు. తొలిపరీక్షలో అర్హత సాధించినా, కోర్టు వివాదాలతో రెండో పరీక్షకు దూరమయ్యారు. దీంతో 2016 గ్రూప్-2పై దృష్టిపెట్టారు. ఈ పరీక్షకు భార్య గీతాకుమారితో కలిసి సాధన చేశారు. ఇద్దరూ కలిసి చదువుకుని, ఆలోచనలు పంచుకుని, పుస్తకాలు సొంతంగా సిద్ధంచేసుకుని ఆరునెలలు శ్రమించారు. విజయ్‌కుమార్ 357.35 మార్కులతో రాష్ట్రస్థాయిలో ప్రథమర్యాంకు సాధించారు. సొంతజిల్లాలో ఉపతహసీల్దారుగా ఉద్యోగం సాధించాలనే తపన తీరింది. భార్య గీత కూడా 310 మార్కులు సాధించి ఉపతహసీల్దారుగానే ఉద్యోగ అర్హత పొందారు. విజయ్ తమ్ముడు అశోక్‌కుమార్‌రెడ్డి 2016 గ్రూప్-2 పరీక్షలో 332 మార్కులు సాధించి ఉప తహసీల్దారుగా అర్హత పొందారు. ఇలా ఒకే కుటుంబంలోని ముగ్గురు విజేతలయ్యారు.

చిన్న చిన్న లక్ష్యాలు

ఒకేసారి ఉన్నత లక్ష్యాలు పెట్టుకుంటే సాధించే అవకాశం ఉండకపోవచ్చు. దశల వారీగా లక్ష్యాలను మార్చుకోవాలి. నాన్న పడిన కష్టం, నాన్న నమ్మిన సిద్ధాంతాలు నన్ను బాగా ఆలోచింపజేశాయి. ఆయన నుంచి నేర్చుకున్న పాఠం, పెదనాన్న అందించిన ప్రోత్సాహంతో రాణించగలిగాను. గ్రూప్-2లో విజేతలుగా నిలవాలంటే పట్టుదల, సాధన ఉండాలి. ప్రభుత్వ గుర్తింపు పొందిన యోజన, కురుక్షేత్ర వంటి పుస్తకాలతో పాటు, అంతర్జాలం, పత్రికల్లోని వార్తాంశాలు, సమకాలీన అంశాలు బాగా అవగాహన చేసుకోవాలి. సబ్జెక్టుపై తరచూ భార్య, తమ్ముడు, స్నేహితులతోనే చర్చించడం ద్వారా పరీక్షకు సన్నద్ధమయ్యాం.

- మంచిది విజయ్‌కుమార్

- మానెం శ్రీనివాసరావు, ఈనాడు డిజిటల్, ఒంగోలు,
- మందుల వెంకటనాయుడు, న్యూస్‌టుడే, యర్రగొండపాలెం

దోతి దోస్తీ



దోతీలతో మనసు దోచేస్తే



ఎక్కడ చూసినా పెళ్లి బాజాలే. ఆ సందడిని రెట్టింపు చేస్తూ ఓ కొత్త ట్రెండ్ జోరందుకుంది. అదేంటో తెలుసా? దోతి. లింగ భేదం లేకుండా ఇప్పుడు జంటలతో జతకట్టేస్తోంది. మగమహారాజులకే ప్రత్యేకం కాదంటూ మహిళామణులూ దోతి ఫ్యాంట్‌లతో మనసు దోచేస్తున్నారు. మార్కెట్‌లోనూ పలు రకాల డిజైన్లు తెగ సందడి చేస్తున్నాయి. అందుకు సాక్ష్యంగా వేడుకల్లో సెలబ్రిటీలు జంటగానే కాకుండా సోలోగానూ ధరించి అందరి దృష్టిని ఆకర్షించేస్తున్నారు. ముఖ్యంగా శుభకార్యాల్లో జంటగా ఈ నయా 'దోతి-కుర్తా సెట్'లను క్రేజీగా ధరించేస్తున్నారు.

సంగీత సంద్రం

ఇక మ్యూజిక్ మస్తీ




'ప్రైమ్'తో ఇప్పటికే ఎంటర్‌టైన్మెంట్ అడ్డాగా మారిన అమెజాన్ ఇక మీదట మ్యూజిక్ మస్తీ చేసేందుకు సిద్ధం అయింది. నేటి వరకూ 'ఎకో స్మార్ట్ స్పీకర్'లో మాత్రమే ఉన్న మ్యూజిక్ విభాగాన్ని 'అమెజాన్ మ్యూజిక్' పేరుతో దేశంలో పాటల స్థావరంగా పరిచయం చేసింది. ప్రైమ్ యూజర్లు రిజిస్టర్ అయిన ఎకౌంట్‌తోనే లాగిన్ అయ్యి సంగీత సాగరంలో మునిగితేలొచ్చు. సభ్యులైన వెంటనే భాషల్ని సెలెక్ట్ చేసుకుని ప్లేలిస్ట్‌ల జాబితాని పొందొచ్చు. వెబ్ సర్వీసులానే కాకుండా ఆప్ రూపంలో ఫోన్‌లో నిక్షిప్తం చేసుకుని వినొచ్చు. ఆండ్రాయిడ్, ఐఓఎస్ ఆప్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఏడాది మొత్తానికి రూ.999 చందా చెల్లించి ఎన్ని పాటలైనా వినొచ్చు. వెబ్‌సైట్‌ని సందర్శించాలనుకుంటే https://music.amazon.in/home లింక్‌ని చూడండి.

మనసులో మాట

మేం ప్రేమికులం మాది ప్రేమ కులం

మాది రాజమండ్రి. తన పేరు చిన్నా. మేం ఎనిమిదిలో ఒకే తరగతి. ఇద్దరం ఎప్పుడూ గొడవపడేవాళ్లం. తరగతులతో పాటు... మా మధ్య స్నేహం పెరుగుతూ వచ్చింది. తొమ్మిదేళ్ల మంచి ఫ్రెండ్స్ మేం. ఆ తర్వాత ఒకరంటే ఒకరికి ఇష్టమని తెలిసింది. ప్రేమించుకున్నాం. ఒకరిని విడిచి ఒకరు ఉండలేనంతగా. ఎనిమిదో తరగతిలో మమ్మల్ని చూసిన స్నేహితులు.. ఇప్పుడు చూస్తే షాక్ అవుతారు. అంత క్లోజ్‌గా ఉంటాం. తను నాకు చిన్న కష్టం వచ్చినా తట్టుకోలేడు. నేను తనే లోకంగా బతుకుతుంటాను. సంవత్సరాలు రోజుల్లా, రోజులు... గంటల్లా, గంటలు... నిమిషాల్లా కరిగిపోతున్నట్లు అన్పించింది.



జీవితం మొత్తం తన ప్రేమ నాకుంటే... ఈ ప్రపంచంలో ఇంకేం నాకు వద్దనిపించింది. ఎవరికీ తెలియకుండా గోదావరి గట్టు మీద మేం నడుస్తున్నప్పుడు ప్రపంచాన్ని జయించినంత ఆనందంగా ఉండేది. కళాశాలకు సెలవు రోజుల్లో నన్ను చూడటానికి అతను మా ఇంటి ముందు తిరగడం, అతని ఆరోగ్యం బాగాలేనప్పుడు నేను వాళ్లింటికి వెళ్లి చూసిరావడం అన్నీ మధురానుభూతులే. దూరమున్న సమయంలో క్షణానికో వాట్సప్, నిమిషానికో ఫొటో అప్‌డేట్ ఇలా నడిచింది. ఎంతో హాయిగా సాగిపోతున్న మా ప్రేమ ఇంట్లో వాళ్లకు తెలిసిపోయింది. నాదీ, చిన్నాది వేరేవేరే కులాలు. పెద్దలు అస్సలు ఒప్పుకోలేదు. తను మాత్రం ఇంట్లో వాళ్లను ఎదిరించి పెళ్లిచేసుకుందామన్నాడు. నేను ఇంట్లో వాళ్ల అంగీకారం కోసం ఎదురుచూస్తున్నాను. వాళ్లు ఎప్పుడు కరుణిస్తారో తెలియదు. మమ్మల్ని కలుసుకోనివ్వడం లేదు. మాట్లాడుకోనివ్వడం లేదు. తను మాత్రం నాకోసం పిచ్చివాడిలా మారుతున్నాడు. నన్ను వదిలేసి వేరే వాళ్లను పెళ్లిచేసుకోమని చెబుతున్నా వినిపించుకోవడం లేదు. నువ్వు లేకపోతే ఈ జీవితం వద్దని, నీ కోసం ఎంత కాలమైనా నిరీక్షిస్తానని చెబుతున్నాడు. నేను మా ఇంట్లో వాళ్లను ఒప్పించలేకపోతున్నాను. నువ్వు ఎవరినైనా పెళ్లి చేసుకో కాదనం... కులం మాత్రం చెడొద్దని అంటున్నారు. అలా జరిగితే కుటుంబం పరువు గోదారిలో కలుస్తుందంటున్నారు. పరువు పోయాక ప్రాణాలెందుకని నన్ను మాటలతో కట్టేస్తున్నారు. వేర్వేరు కులాల్లో పుట్టడం మా తప్పా? నానో యుగంలో కూడా ఇంకా కులాల పట్టింపులేంటి? పెద్దలు దయచేసి అర్థం చేసుకోండి. మాది ప్రేమ'కులం'. మా లాంటి ప్రేమికుల్ని కలపండి.

– బుజ్జి

రైతుల ఆత్మహత్యలపై రూపొందిన షార్ట్‌ఫిల్మ్ 'మిస్సింగ్'. సోషల్ మీడియాలో వైరల్. ఫేస్‌బుక్‌లోనే ఇప్పటివరకూ అరవై లక్షలకి పైగా వీక్షించారు. కొన్ని వేలమంది కామెంట్స్ రాశారు. హృదయాన్ని మెలిపెట్టే ఈ కథ 'న్యూజెర్సీ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్'లో ఈ రోజే ప్రదర్శితమవుతోంది. ఈ సందర్భంగా 'మిస్సింగ్ దర్శకుడు' ఎ.గంగారెడ్డిని ఈతరం పలకరించింది.

'లఘు'దర్శనం

అన్నదాతపై ఉన్నమాట

4 నిమిషాలు... 60 లక్షలు

మిస్సింగ్..

నిడివి నాలుగు నిమిషాలు.. ఉండేది రెండే పాత్రలు..

ఫేస్‌బుక్‌లో చూసింది అరవై లక్షలు...

న్యూజెర్సీ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శన..

ఇంతలా ఈ పొట్టి చిత్రంలో ఏముందీ అంటే.. అన్నదాత దీన పరిస్థితి ఉంది. 'మా అబ్బాయి గత ఇరవై రోజులుగా కనిపించడం లేదు' అనే పోస్టర్‌తో మొదలవుతుంది. సమాజం, ప్రభుత్వం రైతుల ఆతహత్యలను పట్టించుకోని పరిస్థితిలో ఓ మహిళారైతు తన కొడుకు కోసం అన్వేషణ చేసిన వ్యధాపూరిత కథే ఇది. ఈ సస్పెన్స్ థ్రిల్లర్.. వీక్షకులను వెంటాడుతుంది. దేశానికి అన్నంపెట్టే రైతన్న ఊపిరికి ఎలా ఉరిబిగుసుకుంటోందో కళ్లకు కడుతుంటే... చెమర్చని కళ్లుండవు. ఆలోచించని మనసుండదు.

అనుభవాలే తెరపై..

గంగారెడ్డిది నిజామాబాద్ జిల్లా మోతె గ్రామం. ఇతని నాన్నకి డెబ్భై మూడేళ్లు. ఇప్పటికీ సైకిల్ మీద పొలానికి వెళ్లి వ్యవసాయం చేస్తాడు. చదువుకునే రోజుల్లో గంగారెడ్డీ వ్యవసాయం చేశాడు. లండన్‌లో ఎంబీఏ చేసిన ఇతనికి విజువల్ మీడియా అంటే ఆసక్తి. రచనపై ఆసక్తి ఉంది. ఫొటోగ్రఫీతో పరిచయముంది. అందుకే అమెజాన్‌లో ఉద్యోగాన్ని వదులుకుని హైదరాబాద్‌కి వచ్చాడు. ఫేస్‌బుక్‌లో ఫొటోలను చూసి బెంగళూరుకు చెందిన కిసాన్‌రాజ్ సంస్థ సంప్రదించింది. ఆ యాడ్‌లో రైతు జీవితాన్ని చూపించాడు. ఆ తర్వాత తనికెళ్లభరణితో చేసిన 'కేర్ మోటో' యాడ్‌కి మంచి పేరొచ్చింది. పేరుకి ఇవి రెండూ యాడ్స్ అయినా అందులో హ్యూమన్ ఎమోషన్స్ ఉన్నాయి. కాబట్టే అవి లక్షల హృదయాల్ని తాకాయి.


అలా 'మిస్సింగ్' చేసే అవకాశం..

రెండు యాడ్‌ఫిల్మ్స్ ఫేస్‌బుక్‌లో వైరల్ అయ్యాయి. దీంతో అమెరికాలోని సురేష్ అనే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ గంగారెడ్డిని మెసెంజర్‌లో సంప్రదించాడు. సురేష్ రైతు ప్రేమికుడు. తెలుగురాష్ట్రాలతో పాటు, మహారాష్ట్రలో ఆత్మహత్యలు చేసుకున్న కొందరు రైతుకుటుంబాల్లోని పిల్లలకు చదువు చెప్పిస్తుంటాడు. 'ఐఫర్ ఫార్మర్స్' అనే సంస్థను నెలకొల్పాడు. సురేష్ అనుకున్న ఓ కథను గంగారెడ్డికి చెప్పాడు. అలా 'మిస్సింగ్' షార్ట్ ఫిల్మ్‌ను తెరకెక్కించే అవకాశం గంగారెడ్డికి వచ్చింది. ఇటీవలే రైతులు ఆత్మహత్యలు చేసుకోకుండా ఉండాలంటే తోటివారు భరోసాను ఇవ్వాలనే ఉద్దేశ్యంతో 'ఎంకరేజ్‌మెంట్' అనే షార్ట్‌ఫిల్మ్ తీశాడు. దీన్ని నలభై లక్షల మంది వీక్షించారు.

అదే నా ఆశ

కేంద్రప్రభుత్వ లెక్కల ప్రకారం 1995 నుంచి 2015 వరకూ దేశంలో ఇరవై మూడులక్షల ఇరవై వేల మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. అనధికారికంగా మరో నాలుగు లక్షలమంది చనిపోయారని ఎన్జీవో సంస్థలు అంటున్నాయి. ఈ లెక్కలు చూసి బాధపడే 'మిస్సింగ్' ఫిల్మ్ చేశాం. కంటెంట్, టెక్నికల్ స్టాండర్డ్‌తో లఘుచిత్రంలో రైతుల ఆత్మహత్యలనే పెద్ద విషయాన్ని చర్చించాం. ఇది సవాల్‌తో కూడుకున్న విషయం. ఇందులో వాస్తవం ఉంది. కాబట్టే ప్రతి ఒక్కరూ కనెక్టయ్యారు. అందుకే న్యూజెర్సీ ఫిల్మ్‌ఫెస్టివల్ దాకా ఈ చిత్రం వెళ్లింది. దర్శకత్వం చేయాలనేదే నా లక్ష్యం.

- గంగారెడ్డి



ఎన్‌కౌంటర్‌తో రెండు రాష్ట్రాల్లో ఉలికిపాటు

- హెలిక్యాప్టర్‌లో భద్రాచలానికి చేరిన మూడు మృతదేహాలు
- సుశీల్ కుమార్ భౌతికకాయానికి పోలీసుల నివాళి

ఈనాడు, ఖమ్మం
న్యూస్‌టుడే, భద్రాచలం

తెలంగాణ సరిహద్దుల్లో ప్రశాంతంగా ఉండే అటవీ ప్రాంతమంతా బందూకుల ఘర్జనలతో హోరెత్తిపోయింది. మావోయిస్టులు-పోలీసులకు మధ్య జరిగిన భారీ ఎదురు కాల్పులకు తెలంగాణ- ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర సరిహద్దులు ఉలిక్కిపడ్డాయి. రెండు రాష్ట్రాల ప్రత్యేక పోలీసు దళాల సంయుక్త ఆపరేషన్ జయశంకర్ భూపాలపల్లి జిల్లా వెంకటాపురం మండలం పూజారి కాంకేడ్ గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో శుక్రవారం ఉదయం జరిగింది. ఇందులో 10 మంది మావోయిస్టులు మృతిచెందగా.. ఒక గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ మరణించారు. శుక్రవారం ఉదయం ఎన్‌కౌంటర్ జరగ్గా ఘటనాస్థలి నుంచి మధ్యాహ్నం 12 గంటల సమయంలో ప్రత్యేక హెలిక్యాప్టర్‌లో మూడు మృతదేహాలను భద్రాచలం తరలించారు. అక్కడి నుంచి గ్రేహౌండ్ కానిస్టేబుల్ సుశీల్ కుమార్ మృతదేహాన్ని ప్రత్యేక వాహనంలో ఏఎస్పీ కార్యాలయానికి తీసుకెళ్లారు. ఇక్కడ ఆయనకు పోలీసు అధికారులు నివాళులర్పించారు. అనంతరం సుశీల్ మృతదేహాన్ని ప్రభుత్వ ప్రాంతీయాసుపత్రిలోని శవ పంచనామా గదికి తరలించారు. మరో రెండు మావోయిస్టుల మృతదేహాలను పోస్టుమార్టం గదికి చేర్చారు. గ్రేహౌండ్స్ కానిస్టేబుల్‌కు పోస్టుమార్టం నిర్వహించారు. ఆయనకు నడుం వైపు నుంచి పొట్ట భాగం మీదుగా ఒక బులెట్ బయటకు వచ్చినట్లు గుర్తించారు. శవపంచనామా అనంతరం మృతదేహాన్ని కింద ఉంచి సుశీల్‌కుమార్ అమర్ రహే అంటూ నినాదాలు చేశారు. తర్వాత ప్రత్యేక వాహనంలో ఉంచి ఖమ్మం తరలించారు. మృతుని భార్య దంత వైద్యురాలని సమాచారం. సుశీల్‌కుమార్ 2004 బ్యాచ్‌కు చెందిన సివిల్ కానిస్టేబుల్. 2010లో గ్రేహౌండ్స్‌కు వెళ్లారు. సాయంత్రం ప్రత్యేక అంబులెన్స్ వాహనంలో సుశీల్‌కుమార్ స్వస్థలమైన కర్ణాటక రాష్ట్రం బీదర్‌కు తరలించారు.



వివరాలు వెల్లడిస్తున్న భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ అంబర్‌కిశోర్‌ఝా, పక్కనే భూపాలపల్లి ఎస్పీ భాస్కరన్ తదితరులు

మృతదేహాల కోసం వెదకులాట

ఎన్‌కౌంటర్‌లో మిగిలిన 8 మృతదేహాలు సంఘటన స్థలంలో చెల్లాచెదురుగా పడి ఉంటాయని భావిస్తున్నారు. వాటికోసం శుక్రవారం మధ్యాహ్నం 2.30 గంటల ప్రాంతంలో భద్రాచలం నుంచి హెలిక్యాప్టర్ బయలుదేరి వెళ్లింది. ఘటన స్థలంలో ఎత్తైన చెట్లు, పొదలు ఉండటంతో హెలిక్యాప్టర్ దిగేందుకు అనువుగాలేదని పైలెట్ స్పష్టం చేసినట్లు తెలిసింది. ఈక్రమంలో రాత్రి కావడంతో మృతదేహాల తరలింపును అనివార్యంగా వాయిదా వేసినట్లు తెలిసింది. అనుకోని పరిణామాలు చోటు చేసుకుంటే శుక్రవారం అర్ధరాత్రి వరకు మృతదేహాలు వచ్చే వీలుంది. తొలుత ఎన్‌కౌంటర్‌లో 12 మంది మరణించారని ప్రచారం జరిగినా పోలీసులు అందించిన సమాచారం మేరకు 11 మంది ఎన్‌కౌంటర్ మృతులుగా తేల్చారు.

భద్రాచలంలో హరిభూషణ్ తోబుట్టువులు

ఎన్‌కౌంటర్ చోటుచేసుకున్న అనంతరం కొన్ని సంఘాలు కోర్టును ఆశ్రయించాయి. దీంతో రెండు మావోయిస్టు మృతదేహాలను అలాగే ఉంచారు. మిగిలిన మృతదేహాలు వచ్చాక ప్రత్యేక వైద్యనిపుణుల ఆధ్వర్యంలో శవపంచనామా చేయనున్నారు. మృతుల్లో ఆరుగురు మహిళా మావోయిస్టులు ఉన్నందున మహిళా వైద్యులు కూడా శవ పంచనామాలో పాల్గొంటారని స్థానిక అధికారులు వెల్లడించారు. మావోయిస్టు అగ్రనేత హరిభూషణ్ ఎన్‌కౌంటర్‌లో మరణించినట్లు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం సాగింది. ఈ సమాచారం తెలుసుకున్న హరిభూషణ్ తోబుట్టువులు భద్రాచలం చేరుకున్నారు. శవపంచనామా గదిలో ఉన్న రెండు మృతదేహాల్లో ఒక మహిళ, ఒక వ్యక్తి ఉన్నారు. మృతదేహాల ఫొటోలను హరిభూషణ్ బంధువులు చూశారు. ఇందులో ఆయన లేరని తోబుట్టువులు గుర్తించారు.



సుశీల్‌కుమార్ మృతదేహం వద్ద పోలీసుల నివాళి

కానిస్టేబుల్ మృతిపై భిన్నవాదనలు

ఎన్‌కౌంటర్‌లో గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ సుశీల్ కుమార్ మృతిపై భిన్నవాదనలు వినిపిస్తున్నాయి ఆయన నడుం వైపు నుంచి పొట్ట భాగం మీదుగా ఒక బుల్లెట్ బయటకు వచ్చినట్లు గుర్తించారు. ఎదురు కాల్పుల సమయంలో ఈవిధంగా బుల్లెట్ తగులుతుందా? అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అయితే కూంబింగ్, ఆపరేషన్ సమయంలో సిబ్బంది తప్పనిసరిగా డ్రెస్‌కోడ్ పాటిస్తారని, జాగ్రత్తలు తీసుకుంటారని కొందరు స్పష్టం చేస్తున్న వారూ ఉన్నారు.

తప్పించుకున్న అగ్రనేత!

చర్ల, న్యూస్‌టుడే: మావోయిస్టు అగ్రనేత, పార్టీ రాష్ట్ర కార్యదర్శి యాపా నారాయణ అలియాస్ హరిభూషణ్ ఎన్‌కౌంటర్లో మరణించినట్లు విస్తృత ప్రచారం జరిగింది. భద్రాచలం చేరుకున్న రెండు మావోయిస్టు మృతదేహాల్లో హరిభూషణ్‌తో పాటు ఆయన భార్య జజ్జర్ల సమ్మక్క అలియాస్ శారద ఉన్నట్లు ప్రచారం జరిగింది. తాజా ఎన్‌కౌంటర్‌లో వీరిద్దరూ తప్పించుకొన్నారు. సమ్మక్క చర్లతోపాటు శబరి ఏరియా కమిటీ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. పార్టీ క్యాడర్‌లో జవసత్వాలు నింపేందుకు సరిహద్దులో ఎప్పటికప్పుడు ఎత్తులు వేస్తూ హరిభూషణ్ ముందుకు సాగుతున్న క్రమంలో పోలీసులు ఆయన్ను మట్టుబెట్టేందుకు పక్కా వ్యూహంతో దాడులు జరిపినా తప్పించుకున్నట్లు సమాచారం. మిలటరీ ప్లాటూన్ కమాండర్ బాధ్యతలు నిర్వర్తిస్తున్న హరిభూషణ్‌కు తెలంగాణ విభజన అనంతరం రాష్ట్ర కార్యదర్శి పదవిని పార్టీ కట్టబెట్టింది. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో పలు కార్యకలాపాలను కొనసాగించాడు. పార్టీపై మరింత నిర్బంధం పెరగడంతో కీలక నిర్ణయాలు తీసుకొనేందుకు హరిభూషణ్ ఏర్పాటు చేసిన సమావేశంపై పోలీసులు పక్కా వ్యూహంతో దాడి జరిపారు.

జగన్‌గా అధికార ప్రతినిధి బాధ్యతలు!: తెలంగాణ ఏర్పడ్డాక హరిభూషణ్‌కు పార్టీ పగ్గాలు అప్పగించిన కేంద్ర కమిటీ ఆయననే అధికార ప్రతినిధి హోదాలో ఉంచింది. హరిభూషణ్‌కు లక్మదాదాగా ఛత్తీస్‌గఢ్‌లో పేరుంది. 'జగన్' పేరిట అధికార ప్రతినిధి బాధ్యతలను ఆయన నిర్వర్తిస్తున్నారు.

మృతుల నిర్ధారణలో జాప్యం

రోజంతా తప్పని ఎదురుచూపులు

హన్మకొండ అర్బన్, న్యూస్‌టుడే: తెలంగాణ- ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో శుక్రవారం ఉదయం ఎన్‌కౌంటర్ జరిగినప్పటి నుంచి మృతుల జాడ రాత్రి వరకూ తెలియరాలేదు. సాధారణంగా ఎన్‌కౌంటర్ జరిగిన గంటల్లోనే ఆ ప్రాంత పార్టీ సానుభూతిపరులు మాజీల సహకారంతో మృతులెవరనే విషయాన్ని పోలీసువర్గాలు ధ్రువీకరించుకుంటాయి. ఈ ఘటనలో మాత్రం 15 గంటలు గడిచినా పోలీసులు నిర్ధారణలో స్పష్టతకు రాలేకపోయారు. మృతిచెందిన పది మంది మావోయిస్టులెవరనేది నిర్ధారణ కాలేదు. ఇందులో మావోయిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి హరిభూషణ్ ఉన్నారని ప్రచారం జరిగింది. మృతుల్లో ఆరుగురు మహిళలు కూడా ఉండటంతో మహబూబాబాద్ ప్రాంతం మడగూడేనికి చెందిన హరిభూషణ్ ఆయన భార్య గంగారం మండల కేంద్రానికి చెందిన సమ్మక్క ఉన్నట్లు వార్తలు వెలువడ్డాయి. మరో మావోయిస్ట్ నేత జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, పెద్దపల్లి, వరంగల్ జిల్లాల కార్యదర్శి బడే చొక్కారావు అలియాస్ దామోదర్, మొద్దులగూడేనికి చెందిన ఖమ్మం జిల్లా కార్యదర్శిగా పనిచేస్తున్న కొయ్యడసాంబయ్య ఉన్నట్లు ప్రచారం జరిగింది. మృతదేహాలు ప్రత్యేక హెలికాప్టర్‌లో భద్రాచలం తరలించినప్పటికీ మృతులెవరనే విషయంపై స్పష్టత రాలేదు. సంఘటనాస్థలిలో సమీప గ్రామస్థులను, మాజీలను పిలిపించినా ప్రయోజనం లేకపోయింది. శుక్రవారం సాయంత్రం వరకు మృతుల్లో పెద్దపల్లి ప్రాంతానికి చెందిన కంకణాల రాజిరెడ్డి ఉన్నట్లు మరో వార్త ప్రచారమైంది. ఇద్దరు ఛత్తీస్‌గఢ్ లోకల్ గెరిల్లా దళానికి చెందిన సంజీవ్, సముద్రగా గుర్తించినట్లు ప్రచారం సాగింది. పోలీసులు మాత్రం ఘటన అటవీప్రాంతంలో జరగడం వల్ల సమాచార సేకరణకు ఇంకా సమయం పడుతుందని చెప్పుకొచ్చారు.

ఎన్‌కౌంటర్‌పై కేసు నమోదు

చర్ల, న్యూస్‌టుడే: తడపల వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌పై చర్ల పోలీసు స్టేషన్లో కేసు నమోదైంది. తెలంగాణ -ఛత్తీస్‌గఢ్ సరిహద్దు బీజాపూర్ జిల్లా పూజారికాకేడు అటవీప్రాంతంతో రెండు రాష్ట్రాల పోలీసుల ఆధ్వర్యంలో సంయుక్తంగా కూంబింగ్‌కు వెళ్లిన పోలీసులపై పెద్దఎత్తున సమావేశమై ఉన్న మావోయిస్టులు కాల్పులు జరపడంతో ప్రాణరక్షణార్థం ఎదురుకాల్పులు జరపాల్సి వచ్చిందని పోలీసులు తెలిపారు. సంయుక్త ఆపరేషన్లో భాగంగా శుక్రవారం ఉదయం 6 గంటల సమయంలో మావోయిస్టుల క్యాంపు నుంచి ఆకస్మికంగా కాల్పులు ప్రారంభమైనట్లుగా ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ క్రమంలో పోలీసులు, మావోయిస్టుల మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో 10 మంది మావోయిస్టులు మరణించగా, గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ బి.సుశీల్‌కుమార్ కూడా మృతి చెందినట్లు కేసులో పేర్కొన్నారు. వెంకటాపురం ఎస్సై ఫిర్యాదు మేరకు ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు.

సిటింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

నల్లకుంట, న్యూస్‌టుడే: తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో ఎన్‌కౌంటరు పేరుతో 12 మంది మావోయిస్టులను హతమార్చడాన్ని సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ ఖండిస్తున్నట్లు ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి డీవీ కృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బూటకపు ఎన్‌కౌంటర్‌పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

శవపరీక్షను వీడియో తీయండి

- తెలంగాణ ప్రభుత్వానికి ఉమ్మడి హైకోర్టు ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర పరిధిలోకి తీసుకొచ్చిన ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్ మృతులకు ఫోరెన్సిక్ వైద్యుడి నేతృత్వంలో శవపరీక్ష (పోస్టుమార్టం) నిర్వహించాలని తెలంగాణ ప్రభుత్వానికి ఉమ్మడి హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. మొత్తం శవపరీక్ష ప్రక్రియను వీడియో తీయించాలని స్పష్టం చేసింది. ఆ తరువాత బంధువులకు మృతదేహాలను అప్పగించాలని తెలిపింది. తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో శుక్రవారం ఉదయం పోలీసులు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పులపై సీబీఐతో దర్యాప్తు చేయించాలని, పోలీసులపై హత్యా నేరం కేసు నమోదు చేసి, మృతదేహాలకు వరంగల్ ఎంజీఎం లేదా ఉస్మానియా ఆసుపత్రిలో శవపరీక్ష నిర్వహించేలా ఆదేశాలివ్వాలంటూ పౌరహక్కుల కమిటీకి చెందిన ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. శుక్రవారం భోజన విరామ సమయం (లంచ్ మోషన్)లో అత్యవసరంగా విచారణ చేపట్టాలంటూ తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ కె.విజయలక్ష్మిలతో కూడిన ధర్మాసనాన్ని పిటిషనర్ తరపు న్యాయవాది అభ్యర్థించారు. దీనికి ధర్మాసనం అనుమతించడంతో.. మధ్యాహ్నం విచారణ కొనసాగింది. ప్రభుత్వం తరపున అదనపు అడ్వొకేట్ జనరల్ జె.రామచంద్రరావు వాదనలు వినిపిస్తూ.. ఎన్‌కౌంటర్ తెలంగాణలో జరగలేదని, ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా హుసూరు పోలీసుస్టేషన్ ప్రాంతంలో జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో దీనిపై విచారించే పరిధి ఈ కోర్టుకు లేదంటూ అభ్యంతరం వ్యక్తంచేశారు. ఘటన అక్కడ జరిగినప్పటికీ ఆ రాష్ట్ర పోలీసుల విజ్ఞప్తి మేరకు శవపరీక్షకు భద్రచలంలో సౌకర్యం కల్పించామన్నారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకే శవపరీక్ష నిర్వహిస్తామని ధర్మాసనం దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై పిటిషనర్ తరపు న్యాయవాది వి.రఘునాథ్ స్పందిస్తూ ఘటన అక్కడ జరిగినప్పటికీ ఇద్దరి మృతదేహాలను భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారని చెప్పారు. ఈ రెండు మృతదేహాల్లో ఒకటి హరిభూషణ్‌దని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. ధర్మాసనం జోక్యం చేసుకుంటూ మృతదేహాలను భద్రాచలం తీసుకొచ్చినందున వాటికి సంబంధించిన అంశం ఈ కోర్టు పరిధిలోకి వస్తుందని, దీనిపై విచారించే పరిధి తమకుందని పేర్కొంది. మృతుల్లో ఎవరైనా తెలంగాణకు చెందినవారున్నారా అన్న ప్రశ్నకు హరిభూషణ్ అనే వ్యక్తి తెలంగాణకు చెందినవారేనని పిటిషనర్ తరపు న్యాయవాది సమాధానమిచ్చారు. దీనిపై అదనపు అడ్వొకేట్ జనరల్ స్పందిస్తూ కావచ్చేమోకానీ, శవపరీక్ష తరువాత మృతదేహాల గుర్తింపు జరిపి బంధువులకు అప్పగిస్తామన్నారు. అనంతరం రఘునాథ్ వాదనలు వినిపిస్తూ శవపరీక్ష నిర్వహించడానికి భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో సరైన వసతుల్లేవన్నారు. వరంగల్ ఎంజీఎం లేదా ఉస్మానియా ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించేలా ఆదేశాలివ్వాలని కోరారు. ఫోరెన్సిక్ నిపుణుల సమక్షంలో ఈ ప్రక్రియ జరిగేలా చూడాలని కోరారు. దీనికి అదనపు అడ్వొకేట్ జనరల్ అభ్యంతరం వ్యక్తంచేస్తూ భద్రాచలం ఆసుపత్రిలో శవపరీక్షకు అన్ని సౌకర్యాలున్నాయన్నారు. వాదనలను విన్న ధర్మాసనం ఫోరెన్సిక్ వైద్యుడి ఆధ్వర్యంలో శవపరీక్ష నిర్వహించి, వీడియో తీయాలని ఆదేశిస్తూ విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

భారీ ఎదురు కాల్పుల ఘటనలివే..



- **2016 అక్టోబర్ 24**
  ఒడిశా మల్కనగిరి జిల్లా జంత్రి సమీపంలో జరిగిన ఎదురు కాల్పుల్లో 24 మంది మావోయిస్టులు మరణించారు. ఏపీ, ఒడిశా పోలీసుల సంయుక్త బృందం ఈ ఎదురు కాల్పుల ఘటనలో పాల్గొంది.
- **2012 మార్చి 18**
  ఛత్తీస్‌గఢ్ నారాయణపూర్ జిల్లాలోని అబూజ్‌మడ్ అటవీ ప్రాంతంలో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఘటనలో 15 మంది మావోయిస్టులు మరణించారు.
- **2013 సెప్టెంబర్ 14**
  ఒడిశా మల్కనగిరి జిల్లా పొడియా బ్లాకులో పోలీసులతో జరిగిన ఎదురు కాల్పుల్లో 14 మంది మావోయిస్టులు మృతి చెందారు.
- **2010 జూన్ 17**
  పశ్చిమబెంగాల్ పశ్చిమ మిద్నపూర్ జిల్లా రంజా అటవీ ప్రాంతంలోని దులీ గ్రామంలో జరిగిన ఎదురు కాల్పుల్లో 12 మంది మావోయిస్టులు మృతిచెందారు. ఇందులో ముగ్గురు మహిళలున్నారు.
- **2006 ఏప్రిల్ 28**
  కడప జిల్లా సుండుపల్లి మండలం శేషాచలం అటవీ ప్రాంతంలో ఎదురు కాల్పుల్లో 9 మంది మావోయిస్టులు మరణించారు.
- **2006 జూన్ 27**
  మహబూబ్‌నగర్ జిల్లా లింగాల పోలీసుస్టేషన్ పరిధిలో మేడిమల్కల, ఈర్లపెంట గ్రామాల సమీపంలో జరిగిన ఎదురు కాల్పుల్లో 8 మంది మరణించారు.
- **2016 మార్చి 2**
  తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో 8 మంది మావోయిస్టులు మృతిచెందారు. మృతుల్లో ఐదుగురు మహిళలున్నారు.
- **2006 జులై 24**
  ప్రకాశం జిల్లా నల్లమల అటవీ ప్రాంతంలో జరిగిన ఎదురు కాల్పుల్లో అగ్రనేత మాధవ్, ఏడుగురు మావోయిస్టులు మృతిచెందారు.
- **2006 నవంబర్ 10**
  ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ జిల్లాలో రెండుగంటలపాటు జరిగిన ఎదురు కాల్పుల్లో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందారు.
- **2014 ఫిబ్రవరి 19**
  మహారాష్ట్ర గోండియా జిల్లాలో జరిగిన ఎదురు కాల్పుల్లో ఏడుగురు మావోయిస్టులు మృతిచెందారు. ఇందులో ఇద్దరు మహిళలున్నారు.
- **2011 మార్చి 13**
  ప్రకాశం, వరంగల్ జిల్లాల్లో వేర్వేరుగా జరిగిన ఎదురు కాల్పుల్లో మావోయిస్టు అగ్రనేతలు శాఖమూరి అప్పారావు, పోలిపేట కొండల్‌రెడ్డి అలియాస్ టెక్ రమణ మరణించారు.
- **2006 ఏప్రిల్ 30**
  234 మంది పర్యాటకులతో కూడిన రెండు లాంచీలను మావోయిస్టులు హైజాక్ చేసి, పర్యాటకులను నాగార్జున కొండలో వదిలేసి, 12 కి.మీ. దూరంలో లాంచీలను పేల్చివేశారు. కొద్ది గంటల తర్వాత మహబూబ్‌నగర్ జిల్లా మద్దిమడుగు వద్ద జరిగిన ఎదురుకాల్పుల్లో నలుగురు మావోయిస్టులు మరణించారు.
- **2010 జులై 3**
  ఆదిలాబాద్ జిల్లాలో జరిగిన ఎదురుకాల్పుల ఘటనలో మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు చెరుకూరి రాజ్‌కుమార్ అలియాస్ ఆజాద్ సహా ఇద్దరు మావోయిస్టులు మృతిచెందారు.

–ఈనాడు ప్రత్యేక విభాగం

మొన్ననే వచ్చివెళ్లాడు.. ఇక తిరిగిరాడు!

విషాదంలో కానిస్టేబుల్ సుశీల్‌కుమార్ కుటుంబం

మోమిన్‌పేట, జహీరాబాద్ అర్బన్ – న్యూస్‌టుడే: తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో జరిగిన ఎదురుకాల్పుల్లో గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ సుశీల్‌కుమార్(33) మృతి చెందడంతో వికారాబాద్ జిల్లా మేకవనంపల్లి, కర్ణాటకలోని బీదర్‌లో బాధిత కుటుంబాల్లో విషాదం అలముకుంది. వారం క్రితమే వచ్చి వెళ్లాడని, అటునుంచి అటే తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయాడంటూ కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. బీదర్‌కు చెందిన శారద, విజయ్‌కుమార్ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు సుశీల్‌కుమార్. మోమిన్‌పేటలోని ఐసీడీఎస్ కార్యాలయంలో పర్యవేక్షకురాలిగా శారద పనిచేసేవారు. నిత్యం బీదర్ వెళ్లి రావడం ఇబ్బందిగా ఉండటంతో మేకవనంపల్లిలో ఇల్లు కొనుగోలు చేసి కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉండేవారు. దీంతో సుశీల్ విద్యాభ్యాసమంతా దాదాపుగా తెలంగాణలోనే సాగింది. ఇంటర్ పూర్తికాగానే 2004లో సుశీల్‌కుమార్ సివిల్ పోలీస్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. శిక్షణ అనంతరం హైదరాబాద్‌లోని వివిధ ఠాణాల్లో పనిచేశారు. నాలుగేళ్ల క్రితం మేకవనంపల్లికి చెందిన సుష్మతో వివాహమైంది. వారికి కుమార్తె సుశిక(2) ఉంది. మూడేళ్ల క్రితం చందానగర్ ఠాణాలో పని చేస్తున్నప్పుడు గ్రేహౌండ్స్‌కు బదిలీ అయ్యారు. తల్లి శారద ఉద్యోగ విరమణ పొందడంతో మేకవనంపల్లిలోని ఇంటిని విక్రయించి బీదర్ వెళ్లిపోయారు. సుశీల్‌కుమార్ మరణ వార్త తెలియగానే తల్లితండ్రులు, భార్య కుప్పకూలిపోయారు. వారం క్రితమే బీదర్‌కు వచ్చివెళ్లిన సుశీల్.. విగతజీవిగా రానున్నాడంటూ కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. బాధిత కుటుంబాన్ని జహీరాబాద్ డీఎస్పీ రవి బీదర్‌లో పరామర్శించారు.



సుశీల్‌కుమార్ (పాతచిత్రం)

బలం పెరిగిన చోటే దెబ్బకొట్టారు

- వ్యూహాత్మకంగా వ్యవహరించిన పోలీసులు
- మావోయిస్టులకు కోలుకోలేని దెబ్బ

ఈనాడు, హైదరాబాద్: భౌగోళిక అనుకూలతల ఆధారంగా బలం పెంచుకోవాలనుకున్నారు. ఎదురుదెబ్బలతో కునారిల్లుతున్న పార్టీకి నైతికస్థైర్యం కల్పించాలనుకున్నారు. వ్యూహాత్మకంగా వ్యవహరిస్తూ కాస్త పురోగతి సాధించారు. పరిస్థితి ప్రమాదకరంగా మారుతుందని గ్రహించిన పోలీసులు ప్రతివ్యూహం పన్ని మావోయిస్టులను కోలుకోలేని దెబ్బ తీశారు. తెలంగాణ- ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో శుక్రవారం ఉదయం జరిగిన ఎదురుకాల్పుల్లో పదిమంది మావోయిస్టులు మరణించిన ఘటన సంచలనం సృష్టిస్తోంది. పోలీసులు వ్యూహాత్మకంగానే మావోయిస్టులపై విరుచుకుపడ్డట్లు తెలుస్తోంది. గత పదేళ్లుగా అంటే ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పటి నుంచే మావోయిస్టులకు వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ఒకప్పుడు 500 మందికి పైగా తెలుగు మావోయిస్టులు అజ్ఞాతంలో(యూజీ క్యాడర్) ఉండగా ఇప్పుడు 200కి తగ్గిపోయింది. పార్టీని పునర్‌నిర్మించాలని అగ్రనాయకత్వం కొన్నేళ్లుగా తీవ్రమైన కృషి చేస్తోంది. దీనిలో భాగంగానే అవకాశం దొరికినప్పుడల్లా విరుచుకుపడుతూనే ఉన్నారు. మహారాష్ట్ర సరిహద్దులోని గడ్చిరౌలిలో తలదాచుకుంటూ అవకాశం దొరకినప్పుడల్లా ఆదిలాబాద్‌లో దాడులకు పాల్పడేవారు. కాంట్రాక్టర్ల యంత్ర సామగ్రి పేల్చివేయడం, ప్రభుత్వ యంత్రాంగాన్ని ధ్వంసం చేసేవారు. జిల్లా కమిటీ కార్యదర్శి చార్లెస్ ఇందులో కీలకపాత్ర పోషించేవాడు. రెండేళ్ల కిందట జరిగిన ఎన్‌కౌంటర్లో చార్లెస్ మరణించాడు. అలానే కరీంనగర్, ఖమ్మం, వరంగల్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఈ మూడు జిల్లాల్లో కొంతకాలంగా కార్యకలాపాలు విస్తృతం చేశారు. 2016 మార్చిలో వరంగల్‌లో జరిగిన మావోయిస్టు నేతలు శ్రుతి, విద్యాసాగర్‌ల ఎన్‌కౌంటర్‌తో ఇక్కడ కార్యకలాపాలు మందగించాయి.

ఇక్కడ పరిస్థితి భిన్నం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మాత్రం పరిస్థితి కాస్త భిన్నంగా ఉంది. ఇక్కడున్న భౌగోళిక అనుకూలతల ఆధారంగా మావోయిస్టులు కాస్త బలం పుంజుకున్నట్లే కనిపిస్తోంది. ఈ విషయాన్ని పోలీసులూ అంగీకరిస్తున్నారు. గత నెలలో పినపాక మండలం భూపతిరావుపేట గ్రామంలోకి దాదాపు 30 మందికిపైగా మావోయిస్టులు ప్రవేశించి ఇన్ఫార్మర్ నెపంతో ఓవ్యక్తిని నరికి చంపారు. రమేష్ అనే మాజీ మావోయిస్టుపై హత్యాయత్నం చేశారు. మరో బృందం నీటిపారుదల ప్రాజెక్టుకు చెందిన యంత్ర సామగ్రిని ధ్వంసం చేసింది. ఇందరు మావోయిస్టుల ఒకే ప్రాంతంలో సంచరించడం కొన్నేళ్లలో ఇదే ప్రథమం. చర్ల, వాజేడు, వెంకటాపురం ప్రాంతాల్లో మావోయిస్టులు తమ ఉనికి చాటుకుంటున్నారు. గతేడాది నవంబరులో బూర్గంపాడు మండలం సీతారామ ఎత్తిపోతల యంత్రాలను మావోయిస్టులు ధ్వంసం చేశారు.

భౌగోళిక సానుకూలత

మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌లతో ఉన్న తెలంగాణ సరిహద్దును గోదావరి నది వేరు చేస్తుంది. ఇటు వైపు నుంచి రాష్ట్రంలోకి ప్రవేశించాలంటే నది దాటాలి. ఇది ప్రమాదకరం. పోలీసులు పసిగట్టడానికి అవకాశం ఉంది. కానీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మాత్రం గోదావరికి అవతలి వైపు కూడా కొంత రాష్ట్ర సరిహద్దు ఉంది. దాంతో ఛత్తీస్‌గఢ్‌లో మాటువేస్తున్న మావోయిస్టులు సులభంగా రాష్ట్రంలోకి ప్రవేశిస్తున్నారు. విధ్వంసానికి పాల్పడి పోలీసులు అప్రమత్తమయ్యేలోపే మళ్లీ సురక్షిత ప్రాంతాలకు తరలిపోతున్నారు. కొంతకాలంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జరుగుతున్న ఘటనలు పోలీసులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఉద్యమం బలపడకముందే వీటికి అడ్డుకట్ట వేయాలని భావించారు. దీనిలో భాగంగానే ఈ ప్రాంతంపై దృష్టి పెట్టి ఎదురుదాడికి పాల్పడ్డారు.

ఆపరేషన్ సమాధాన్‌లో భాగమే బూటకపు ఎన్‌కౌంటర్

- టీపీఎఫ్ రాష్ట్ర కమిటీ ఆరోపణ

బాగ్‌లింగంపల్లి, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన మూడోదశ ఆపరేషన్ గ్రీన్‌హంట్ సమాధాన్‌లో భాగమే తెలంగాణ- ఛత్తీస్‌గఢ్ అటవీ ప్రాంతంలో జరిగిన భారీ ఎన్‌కౌంటర్ అని, ఇది బూటకమని తెలంగాణ ప్రజా ఫ్రంట్ (టీపీఎఫ్) రాష్ట్ర కమిటీ ఆరోపించింది. బూటకపు ఎన్‌కౌంటర్‌కు కారణమైన తెలంగాణ గ్రేహౌండ్స్ పోలీసులపై 302 కింద కేసులు నమోదు చేయాలని డిమాండు చేసింది. శుక్రవారం సాయంత్రం హైదరాబాద్‌లోని సుందరయ్య కళానిలయం ఎదుట టీపీఎఫ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఎన్‌కౌంటర్‌కు వ్యతిరేకంగా ప్లకార్డులతో నిరసన చేపట్టారు. విరసం నేత వరవరరావు మాట్లాడుతూ తెరాస ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఎన్‌కౌంటర్లు, లాకప్‌డెత్‌లు ఉండవని చెప్పి ఎన్‌కౌంటర్లకు పాల్పడటం దుర్మార్గమైన చర్య అన్నారు. పౌరహక్కుల సంఘ రాష్ట్రాధ్యక్షుడు, గడ్డం లక్ష్మణ్ మాట్లాడుతూ. బూటకపు ఎన్‌కౌంటర్‌పై హైకోర్టులో తాను వ్యాజ్యం వేశానన్నారు. ఫోరెన్సిక్ వైద్యులతో పోస్టుమార్టం నిర్వహించాలని కోరారు. సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలన్నారు. టీపీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నలమాస కృష్ణ, మెంచు రమేష్, పౌరహక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.నారాయణరావు పాల్గొన్నారు.

వాణిజ్య యుద్ధం

● ఉక్కు, అల్యూమినియంపై దిగుమతి సుంకం ● ప్రకటించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్

● వచ్చే వారం తుది సంతకాలు ● మండిపడ్డ చైనా, ఐరోపా సమాఖ్య

వాషింగ్టన్

అమెరికా ఉత్పత్తిదార్లను రక్షించడం కోసం ఉక్కుపై 25 శాతం; అల్యూమినియంపై 10 శాతం చొప్పున దిగుమతి సుంకం విధించనున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. దీంతో చైనా, ఐరోపాలతో అమెరికా వాణిజ్య యుద్ధం తీవ్రం కానుంది. ఈ ఆదేశాలపై సంతకాలు వచ్చే వారం జరుగుతాయని ఉక్కు, అల్యూమినియం కంపెనీ ప్రతినిధులతో జరిగిన సమావేశానంతరం ట్రంప్ వెల్లడించారు. 'చాలా కాలం నుంచి దీనిపై చర్చ జరుగుతోంది. దీని ద్వారా మీకు చాలా కాలం పాటు భద్రత ఇస్తాను. మీరు చేయాల్సిందల్లా మీ రంగాన్ని వృద్ధి చేయడమే'నని విలేకర్ల సమక్షంలో ఆయా కంపెనీలను కోరారు. 'దిగుమతి సుంకం పెంపు వల్ల అమెరికాలో ఉద్యోగాలు పెరుగుతాయి. పరిశ్రమలకు మేలు జరుగుతుంద'ని వ్యాఖ్యానించారు. 'కార్ల, ఆటోమొబైల్ ప్లాంట్లన్నీ మెక్సికోకు తరలివెళ్లాయి. అలా ఎందుకు జరిగిందో తెలియదు. మన ఉక్కు, అల్యూమినియం పరిశ్రమను తిరిగి నిర్మిద్దామ'ని ఆయన పిలుపునిచ్చారు.

అమెరికా కంపెనీల హర్షం: ట్రంప్ ప్రకటనను అమెరికా ఉక్కు, అల్యూమినియం పరిశ్రమతో పాటు పలు వర్గాలు ఆహ్వానించాయి. అయితే మిగతా వర్గాలు మాత్రం అమెరికా వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతాయని ఆందోళన చెందుతున్నాయి. అంతర్జాతీయ వాణిజ్య యుద్ధానికి ఇది దారితీస్తోందేమోనని 'ద వాల్‌స్ట్రీట్ జర్నల్' అభిప్రాయపడింది. ట్రంప్ ప్రకటన అనంతరం డోజోన్స్ 400 పాయింట్లు నష్టపోవడం గమనార్హం.



వాణిజ్య యుద్ధాలు మంచిదే

వాణిజ్య యుద్ధాలు మంచివే. అవి గెలవడమూ సులువే. ఏదైనా దేశం(అమెరికా) ఇతర దేశాలతో చేస్తున్న వాణిజ్యంపై బిలియన్ల కొద్దీ డాలర్లను కోల్పోతున్న నేపథ్యం వస్తే వాణిజ్య యుద్ధం చేయడం మంచిదే. ఉదాహరణకు ఏదైనా దేశంతో వాణిజ్యం వల్ల మనకు 100 బిలియన్ డాలర్లు కోల్పోతున్నామనుకోండి. అసలు ఆ దేశంతో వాణిజ్యం చేయకపోతే ఆ డబ్బులన్నీ మిగిలినట్లేగా.

- ఉక్కు, అల్యూమినియంలపై దిగుమతి సుంకాలను విధించిన నేపథ్యంలో డొనాల్డ్ ట్రంప్ ట్వీట్

షేర్లు, డాలరు పడ్డాయ్

ట్రంప్ తాజా నిర్ణయం వెలువడిన వెంటనే వాల్‌స్ట్రీట్ ప్రతికూలంగా స్పందించింది. డాలరు కూడా క్షీణించింది. ఉక్కు తయారీ కంపెనీల షేర్లు పెరిగినప్పటికీ.. మిగతా షేర్లు పడ్డాయి. దిగుమతి చేసుకునే ఉక్కు, అల్యూమినియంపై వ్యయాలు పెరిగి.. వినియోగదార్లపైనా ఆ ప్రభావం పడే అవకాశం ఉంది.

చైనా వ్యతిరేకత: అమెరికా ఉక్కు దిగుమతుల్లో ఎక్కువ వాటా ఉన్న(ర్యాంక్ 11) చైనా అమెరికా చర్యలను వ్యతిరేకింది. అన్ని దేశాలూ అమెరికాను ఉదాహరణగా తీసుకుంటే అంతర్జాతీయ వాణిజ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి హు చున్‌యింగ్ శుక్రవారం బీజింగ్‌లో పేర్కొన్నారు.

ఐరోపా సైతం: ట్రంప్ తాజా నిర్ణయంతో అమెరికాకు ఐరోపా సమాఖ్య ఉక్కు ఎగుమతులు 50 శాతం తగ్గొచ్చని యూరోపియన్ స్టీల్ అసోసియేషన్ అంచనా వేసింది. అంతర్జాతీయ వాణిజ్య ఘర్షణకు ఆజ్యం పోసిందని ఆరోపించింది. ఈ విషయంపై యూరోపియన్ యూనియన్ గట్టిగా స్పందిస్తుంది. మా ప్రయోజనాలను కాపాడుకుంటామని యూరోపియన్ కమిషన్ అధిపతి జీన్ క్లాడ్ జుంకర్ పేర్కొన్నారు.

కాంగ్రెషనల్ స్టీల్ కాకస్ హర్షం: అధిక సామర్థ్యం గల అంతర్జాతీయ ఉక్కు వర్గాల కారణంగా దేశీయ పరిశ్రమ ఇబ్బందులు పడింది. జాతీయ భద్రతా ప్రయోజనాలను కాపాడే చర్యలను ట్రంప్ చేపట్టారని కాంగ్రెషనల్ స్టీల్ కాకస్ సహ-ఛైర్మన్ మైక్ బోస్ట్ పేర్కొన్నారు. 'మా మిలటరీ, కీలక మౌలిక వసతులను నిర్మించడంలో అమెరికా ఉక్కు సిబ్బంది కొనసాగేలా తీసుకున్న ధైర్యమైన అడుగు ఇది. అమెరికావాసులకు ఇది తిండిపెట్టే చర్య' అని ఆయన అన్నారు. చాలా కాలంగా పక్కనపెట్టిన విషయమని.. ఎట్టకేలకు నిర్ణయం తీసుకోవడం మంచిదేనని డొమెక్రటిక్ సెనేటర్ షెరాడ్ బ్రౌన్ పేర్కొన్నారు. అయితే రిపబ్లికన్ సెనేటర్ మైక్ లీ మాత్రం ప్రతిపాదిత టారిఫ్ల వల్ల అమెరికా వినియోగదార్లపై భారం పడుతుందన్నారు.

ఎందుకీ నిర్ణయం అంటే..: అమెరికా ప్రపంచంలోనే అతిపెద్ద ఉక్కు దిగుమతిదారు. జర్మనీ, దక్షిణ కొరియాలు ఆ తర్వాతి స్థానంలో ఉన్నాయి. అమెరికా గత దశాబ్ద కాలంలో మరింత ఉక్కును దిగుమతి చేసుకుంటూనే ఉంది. అప్పటితో పోలిస్తే ఇపుడు అవి నాలుగు రెట్లయ్యాయి. 2014-2016 మధ్య ఆ దేశంలో ఉక్కు ఉత్పత్తి 11 శాతం తగ్గింది. దీంతో గిరాకీ పెరిగింది. గతేడాది తొలి మూడు త్రైమాసికాల్లో ఉక్కు ఉత్పత్తి 3 శాతం పెరిగినా.. గిరాకీని తట్టుకోలేకపోయింది. అమెరికా ప్రభుత్వ గణాంకాల ప్రకారమే చూసినా. . ఈ గిరాకీ, ఉత్పత్తి మధ్య అంతరాన్ని పూడ్చడానికి కెనడా, బ్రెజిల్, దక్షిణ కొరియా, మెక్సికో, రష్యాలు ప్రయత్నిస్తున్నాయి. భారత్, రష్యా, తైవాన్‌లు వేగంగా తమ ఎగుమతులను(అమెరికాకు) పెంచుకుంటున్నాయి. మరో పక్క ఆ దేశంలో మాత్రం గత 25 ఏళ్లలోనే కనిష్ఠ స్థాయికి అల్యూమినియం పరిశ్రమ దిగజారింది. అప్పట్లో 23 స్మెల్టర్లు ఉండగా.. ఇపుడు అయిదుకు తగ్గాయి. అందులో కేవలం ఒకటి మాత్రమే అమెరికా యుద్ధ విమానాలకు అవసరమైన నాణ్యమైన అల్యూమినియంను తయారు చేస్తోంది. అమెరికాకు అల్యూమినియంను అధికంగా ఎగుమతి చేసే దేశాల్లో కెనడా, రష్యా, యూఏఈ, చైనాలున్నాయి. ఇటీవలి అక్కడి వాణ్యిజ శాఖ చైనాపై తీవ్ర ఆరోపణలు చేసింది. స్థానిక ఉత్పత్తిదార్ల ధర కంటే తక్కువకు ఆ దేశం అల్యూమినియంను ఇక్కడకు దిగుమతి చేసి ఇక్కడివారిని దెబ్బతీస్తోందని పేర్కొంది. ఐరోపా సైతం ఎక్కువ ఎగుమతులే చేస్తోంది.

సమస్యలూ ఉన్నాయ్

దిగుమతి టారిఫ్‌లను పెంచడం వల్ల అమెరికాకు రెండు ఇబ్బందులు తలెత్తవచ్చు. ఎగుమతి చేస్తున్న దేశాల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురై వాణిజ్య యుద్ధానికి దారితీయొచ్చు. అవి కూడా ఆ తరహా చర్యలకే దిగవచ్చు. రెండోది.. సుంకాలు పెంచినంత మాత్రాన అమెరికా ఉత్పత్తి పెరగదు. పైగా ధరలు మరింత పెరుగుతాయి. వినియోగదార్లపై మరింత భారం పడుతుంది.



త్యాగి

ఆయన అడుగుజాడల్లో..

● మార్కెట్ల పురోగతిపై ప్రధాన దృష్టి

● సెబీ ఛైర్మన్‌గా త్యాగికి ఏడాది

సెబీ ఛైర్మన్‌గా ఆరేళ్ల పదవీ కాలంలో యు.కె.సిన్హా అనేక కీలక సంస్కరణలను ప్రవేశపెట్టారు. వీటిలో కొన్ని అసంపూర్తిగా మిగిలిపోగా.. దీర్ఘకాలంగా అమలుకు నోచని సంస్కరణలు మరికొన్ని ఉన్నాయి. సిన్హా అనంతరం బాధ్యతలు చేపట్టిన అజయ్ త్యాగి ఇప్పుడు వాటి పని పడుతున్నారు. ఏడాదికాలంగా ఆయన నేతృత్వంలో సెబీ చేపట్టిన విధానపరమైన చర్యలే ఇందుకు నిదర్శనం. పాతవాటితో పాటు కొత్త సంస్కరణలు తేవడంపైనా ఆయన దృష్టి సారించారు.

కీలక అడుగులు..

అజయ్ త్యాగీ నేతృత్వంలో ఏడాదికాలంలో సెబీ వేసిన కీలక అడుగుల్లో ప్రధానమైనవి..

- ✦ పీనోట్ల దుర్వినియోగాన్ని నియంత్రించే ఉద్దేశంతో వాటి నిబంధనలను కఠినతరం చేయడం.
- ✦ కమొడిటీ మార్కెట్లో ద్రవ్య లభ్యతను పెంచేందుకు ఆప్షన్ల ట్రేడింగ్‌ను ప్రవేశపెట్టడం.
- ✦ క్రాస్ కరెన్సీ డెరివేటివ్‌ల ట్రేడింగ్‌కు అనుమతినివ్వడం.
- ✦ విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడి నిబంధనలు కఠినం.
- ✦ బాండ్ల మార్కెట్ విస్తరణపై దృష్టి పెట్టేందుకు ఓ ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయడం.
- ✦ మ్యూచువల్ ఫండ్ పథకాల వైపు ఎక్కువ మంది మొగ్గు చూపే విధంగా నిబంధనలను సరళతరం చేయడం.
- ✦ కార్పొరేట్ పాలనా ప్రమాణాలు మెరుగుపర్చేందుకు ఉదయ్ కోటక్ నేతృత్వంలో ఓ కమిటీని ఏర్పాటు చేయడం.
- ✦ కమొడిటీ ట్రేడింగ్‌లో బ్యాంకులకు అనుమతినిచ్చే విషయంపైనా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో కలిసి పనిచేయడం.
- ✦ కార్పొరేట్ సంస్థల త్రైమాసిక ఫలితాలు వాట్సాప్‌లో లీక్ అవ్వడాన్ని తీవ్రంగా పరిగణించడంతో పాటు ఇలాంటి అవకతవకలను నియంత్రించేందుకు అవసరమైన అన్ని రకాల చర్యలపై దృష్టి సారించడం.

స్టాక్ మార్కెట్ల వృద్ధికి, కార్పొరేట్ పాలనా వ్యవహారాల పటిష్ఠతకు సెబీ చేపడుతోన్న సంస్కరణలు, చర్యలను తక్కువ చేసి చూడలేం. ఈ విషయంలో ఇంతకుముందు సెబీ ఛైర్మన్‌గా పనిచేసిన యు.కె.సిన్హా కృషిని ముందుగా ప్రశంసించాల్సిందే. ఆయన తర్వాత పగ్గాలు చేపట్టిన అజయ్ త్యాగీ కూడా అదే బాటలో పయనిస్తున్నారు. అంతేకాదు మరిన్ని కొత్త సంస్కరణలకూ శ్రీకారం చుడుతున్నారు. సెబీ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయిన నేపథ్యంలో త్యాగి చర్యలు ఎంత వరకు ఫలప్రదమయ్యాయి.. ముున్ముందు పలకరించబోయే సవాళ్లు ఏమిటనేది ఆసక్తి కలిగించే విషయమే.

ఇవీ సవాళ్లు

- ✦ కేపిటల్ మార్కెట్ల పటిష్ఠతకు, కార్పొరేట్ పరిపాలనా వ్యవహారాల మెరుగుకు ఎన్ని రకాల చర్యలు చేపట్టినప్పటికీ, పీఎన్‌బీ కుంభకోణాన్ని ముందుగానే కనుగొనడంలో సెబీ విఫలమైందన్న అభిప్రాయాలు వెల్లువెత్తుతున్నాయి. అందువల్ల మున్ముందు ఏ కంపెనీ లేదా బ్యాంకుల్లో ఇలాంటి మోసాలకు పాల్పడకుండా కన్నేసి ఉంచేలా పటిష్ఠ నిఘా వ్యవస్థను ఏర్పాటు చేయాలి.
- ✦ చాలా ఏళ్లుగా కొనసాగుతున్న ఎన్‌ఎస్‌ఈ కో-లోకేషన్ కేసును ఓ కొలిక్కి తేవాల్సి ఉంటుంది. అయితే ఈ కేసు దర్యాప్తును త్వరితగతంగా పూర్తి చేస్తామని ఇప్పటికే త్యాగీ వెల్లడించడం గమనార్హం.
- ✦ మరోవైపు కొన్ని అంశాల్లో నియంత్రణ సంస్థల మధ్య ఏకాభిప్రాయం కుదరదు. దీనివల్ల నిర్ణయాలు ఆలస్యం అవుతాయి. ఆర్‌బీఐ, సెబీ మధ్య అప్పుడప్పుడు ఇలాంటి పరిణామాలు చోటు చేసుకోవడం మనం చూసి ఉన్నాం. అందువల్ల మిగిలిన నియంత్రణ సంస్థలు, ప్రభుత్వ సమన్వయంతో ఏకాభిప్రాయాన్ని సాధించడం ద్వారా సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేయాలి.

ఇంటి దొంగలే కీలకం!

బెంగళూరు: పంజాబ్ నేషనల్ బ్యాంకులో నీరవ్ మోదీ రూ.12,000 కోట్లకు పైగా మోసపూరిత లావాదేవీలు నిర్వహించేందుకు, ఆ బ్యాంక్ అధికారులు, సిబ్బందిలో కొందరి సహకారమే కారణమైంది. కొన్నేళ్లుగా వివిధ ప్రభుత్వరంగ బ్యాంకు (పీఎస్‌బీ)ల్లో చోటుచేసుకున్న మోసాల్లో ఆయా బ్యాంకుల సిబ్బంది పాత్ర కాదనలేనిది. వివిధ రాష్ట్రాల్లోని వేర్వేరు బ్యాంకుల్లో చోటుచేసుకున్న మోసాల్లో సంబంధిత సిబ్బంది పాత్రపై సవివర నివేదికను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) రూపొందించనుందని సమాచారం.

2013 ఏప్రిల్ నుంచి 2016 జూన్ వరకు రూ.లక్ష అంతకుమించి మొత్తాలు నష్టపోయిన ఘటనలు వివిధ

3 ఏళ్లలో రూ.2,450 కోట్ల నష్టం

పీఎస్‌బీల్లో 1,232 చోటుచేసుకోగా, రూ.2,450 కోట్ల నష్టం వాటిల్లింది.

✦ తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక వంటి దక్షిణాది రాష్ట్రాలతో పాటు మహారాష్ట్రతో కలిపి 609 కేసులు (మొత్తం కేసుల్లో 49 శాతం) నమోదయ్యాయి. అయితే వీటిల్లో నష్టపోయిన నగదు విలువ రూ.462 కోట్లే (19 శాతం).

✦ రాజస్థాన్‌లో 38 కేసులు (3 శాతమే) నమోదైనా, రూ.1,096 కోట్ల (44 శాతం) నష్టం వాటిల్లింది. దీంతోపాటు చండీగఢ్, దిల్లీ, పశ్చిమ బెంగాల్లోని బ్యాంకుల్లో జరిగిన మోసాల్లో 70 శాతం నగదు నష్టం వాటిల్లింది.

✦ దక్షిణాది రాష్ట్రాల్లో అధిక శాఖలు ఉండటం, వాటిల్లోనూ అధికంగా పట్టణాల్లో ఉండటం వల్ల, మోసపూరిత లావాదేవీలు ఎక్కువగా జరిగాయని భావిస్తున్నారు. డిపాజిట్ల రూపేణ జరిగిన ఈ మోసాల్లో తక్కువమొత్తమే బ్యాంకులు నష్టపోయాయి.

✦ రాజస్థాన్ సహా భారీమొత్తాల్లో నష్టం వాటిల్లిన కేసులు పరిశీలిస్తే, అవన్నీ రుణాలకు సంబంధించినవే. రుణంగా ఇచ్చే మొత్తం సాధారణంగా అధికంగా ఉంటుంది.

✦ రూ.లక్ష, అంతకుమించిన మొత్తం కనుక నష్టపోతే, అందుకు బాధ్యులైన ఖాతాదార్లతో పాటు బ్యాంక్ సిబ్బంది/అధికారుల పేర్లతోనూ



ఫిర్యాదు చేయాలని ఆర్‌బీఐ బ్యాంకులకు తెలిపింది. అయితే కోట్ల రూపాయల్లో జరిగిన మోసపూరిత లావాదేవీలు చూస్తే, చిన్నస్థాయి సిబ్బంది మాత్రమే ఉన్నట్లు కాదు.

✦ నిర్వహణ లోపాలు కూడా ఇందుకు కారణం. ఒకే విభాగం, శాఖలో సిబ్బందిని ఎక్కువకాలం కొనసాగించడం వల్ల పీఎస్‌బీలకు నష్టం వాటిల్లుతోంది.

✦ మోసాలకు సంబంధించి, ఎలా నివేదికలు సమర్పించాలనే విషయమై మార్గదర్శకాలను ఆర్‌బీఐ విడుదల చేసింది. ఎవరినో సంతృప్తి పరచడానికి అనధికారికంగా రుణ సదుపాయం కల్పించడం, నిర్లక్ష్యం, పద్దులోని గణాంకాలకు భిన్నంగా తక్కువ నగదు నిల్వ ఉండటం, మోసం, వేరేవారి సంతకం పెట్టడం ద్వారా జరిగిన మోసాలను బయట పెట్టాల్సి ఉంటుంది.

✦ ఇటువంటి మోసాలు చోటుచేసుకున్నపుడు, నష్టపోయిన నగదును వసూలు చేసుకోవడమే బ్యాంకుల దృక్పథం కాకూడదు. ప్రజల మేలు కోసం మోసంలో పాలుపంచుకున్న నిందితులకు శిక్ష పడేలా చూడాలి.


ఆయా రాష్ట్రాల్లో జరిగిన మోసాలపై ఆర్‌బీఐ గణాంకాలు

రాష్ట్రం	కేసుల సంఖ్య	కేసుల శాతం	నష్టంమొత్తం	శాతం
తమిళనాడు	170	14	రూ.83.09 కోట్లు	3
ఆంధ్ర, తెలంగాణ	157	13	రూ.148.41 కోట్లు	6
కర్ణాటక	125	10	రూ.89.34 కోట్లు	4
మహారాష్ట్ర	107	9	రూ.110.43 కోట్లు	4.5
కేరళ	50	4	రూ.30.53 కోట్లు	1.2
రాజస్థాన్	38	3	రూ.1096 కోట్లు	45
చండీగఢ్	03	0.02	రూ.253.44 కోట్లు	10
దిల్లీ	37	3	రూ.188.22 కోట్లు	8
పశ్చిమ బెంగాల్	69	6	రూ.167 కోట్లు	7
విదేశీ శాఖలు	9	0.7	రూ.41.6 కోట్లు	1.7
21 ఇతర రాష్ట్రాలు	467	38	రూ.241.53 కోట్లు	10
మొత్తం కేసులు	1232	100	రూ.2450 కోట్లు	100

గన్నవరం నుంచి ఇండిగో విమాన సేవలు

ఒకేసారి పది సర్వీసులు ప్రారంభం

ఈనాడు, అమరావతి: గన్నవరం విమానాశ్రయం నుంచి ఇండిగో విమానయాన సంస్థ తన కార్యాకలాపాలను శుక్రవారం నుంచి ప్రారంభించింది. గన్నవరం నుంచి ఒకేసారి పది సర్వీసులను హైదరాబాద్, చెన్నై, బెంగళూరు నగరాలకు ఇండిగో సంస్థ నడుపుతోంది. ఇండిగో సంస్థ కార్యాలయాన్ని విమానాశ్రయం డైరెక్టరు జి.మధుసూదనరావు కొత్త టెర్మినల్ భవనంలో ప్రారంభించిన అనంతరం ప్రయాణికులకు బోర్డింగ్ పాస్‌లను అందజేశారు. అనంతరం విమానాశ్రయానికి చేరుకున్న ఇండిగో విమానానికి ఫైర్‌ఇంజిన్లతో నీటిని జల్లుతూ సిబ్బంది ఘన స్వాగతం పలికారు. గన్నవరం నుంచి ప్రతిరోజూ ఉదయం 7.55 గంటలకు ప్రారంభించి.. హైదరాబాద్‌కు నాలుగు, చెన్నైకు రెండు, బెంగళూరుకు 2 ఇండిగో సర్వీసులు నడుస్తాయి. ఇండిగో ఒకేసారి 10 సర్వీసులను ప్రారంభించడంతో గన్నవరం నుంచి నిత్యం రాకపోకలు సాగించే సర్వీసుల సంఖ్య 53కు చేరింది. ఇండిగో అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ సానేల్ డిసౌజా మాట్లాడుతూ ప్రస్తుతం ఇక్కడి నుంచి 3 నగరాలకు నడుపుతున్నామని, డిమాండ్‌ను బట్టి ఇతర ప్రాంతాలకూ కొత్తవి ఏర్పాటు చేస్తామని తెలిపారు.



కోడి గుడ్లు

2న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)

(100కు రూపాయలలో)

హైదరాబాద్	345	వరంగల్	347
చిల్లరగా (ఒక గుడ్డు)	4.05	విశాఖపట్నం	350
బెంగళూరు	375	చెన్నై	385
3వ తేదీకి...		చిత్తూరు	378
విజయవాడ/గోదావరి	340	నమక్కల్	370

ఐటీ షేర్లు రాణిస్తాయ్

● పెరగనున్న క్లయింట్ల వ్యయాలు ● వాటా పెంచుకుంటున్న ఫండ్ సంస్థలు

● అమెరికా వడ్డీ రేట్లు, ఆర్థిక వ్యవస్థా కారణమే

వచ్చే కొద్ది నెలల్లో ఐటీ షేర్లపై ఫండ్ మేనేజర్లు కన్నేసే అవకాశం ఉందని విశ్లేషకులు అంటున్నారు. అందుకు కారణాలు సైతం చెబుతున్నారు. భారత ఐటీ కంపెనీల ఆదాయాల్లో ఎక్కువ భాగం అమెరికా కంపెనీల నుంచే వస్తుంటుంది. ఇపుడు ఆ అమెరికా కంపెనీల వ్యయాలు పెంచుతున్న నేపథ్యంలో ఐటీ కంపెనీల వృద్ధి నిశ్చయమైందని వారు అంటున్నారు. అదే సమయంలో కార్పొరేట్ పన్నులు తగ్గడం కూడా ఆయా కంపెనీల లాభాలను పెంచే అంశమేనని భావిస్తున్నారు.

కంపెనీలూ అవే చెబుతున్నాయి..: మూడో త్రైమాసిక ఫలితాలను ప్రకటించిన ఐటీ దిగ్గజ కంపెనీలు ఇన్ఫోసిస్, విప్రోలు కూడా ఇదే అంశాన్ని వెల్లడించాయి. బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా(బీఎఫ్‌ఎస్‌ఐ) వంటి విభాగాల్లో వ్యయాలు మెరుగవుతాయని అంచనా వేశాయి. భారత ఐటీ కంపెనీల మొత్తం విక్రయాల్లో ఈ విభాగం 30 శాతం వాటాను పొందాయి. డిజిటైజేషన్, కృత్రిమ మేధ, ఆటోమేషన్ వంటి వాటిలో వ్యయాలు పెరుగుతున్న నేపథ్యంలో బీఎఫ్‌ఎస్‌ఐ విభాగానికి ఐటీ బడ్జెట్లు సైతం పెరుగుతాయని రిలయన్స్ సెక్యూరిటీస్ ఒక నివేదికలో పేర్కొంది. అమెరికా బ్యాంకింగ్, ఆర్థిక సేవల క్లయింట్ల నుంచి డిజిటల్ ఆర్డర్లు వృద్ధి చెందే అవకాశం ఉందని ఫండ్ మేనేజర్లు గట్టిగా విశ్వసిస్తున్నారు.



ఇవీ కారణాలు..

✦ టీసీఎస్, ఇన్ఫోసిస్‌లు అక్టోబరు-డిసెంబరులో డిజిటల్ విభాగం నుంచి 14%, 10% చొప్పున ఆదాయ వృద్ధిని నమోదు చేశాయి. వాటి మొత్తం ఆదాయాల్లో ఈ విభాగం వాటా 25 శాతం కావడం గమనార్హం.

✦ డిసెంబరు త్రైమాసికంలో టీసీఎస్ 50 మిలియన్ డాలర్ల విభాగంలో అతిపెద్ద అంతర్జాతీయ డిజిటల్ ఆర్డరుపై సంతకాలు చేసింది.

✦ గార్ట్‌నర్ నివేదిక ప్రకారం.. ఐటీలో అంతర్జాతీయ వ్యయాలు ఏటా 4.5 శాతం మేర పెరుగుతాయి. 2018లో ఈ వ్యయాలు 3.7 లక్షల కోట్ల డాలర్లుగా ఉన్నాయి.

✦ ప్రపంచ ఐటీ వ్యయాల్లో అమెరికా వాటా 50-60 శాతంగా ఉంది.

✦ అమెరికా కార్పొరేట్ పన్ను తక్కువగా ఉండడం, అమెరికా ఆర్థిక వృద్ధి రేటు రాణిస్తుండడం వల్ల బ్యాంకులు, బీమా కంపెనీలు దీర్ఘకాలంలో రాణించే అవకాశం ఉందని ఓ విశ్లేషకుడు అంటున్నారు. పెరుగుతున్న వడ్డీ రేట్లు అమెరికా బ్యాంకులకు మద్దతునివ్వవచ్చు.

షేర్ల ధరలు తక్కువగా..

ఐటీ కంపెనీ షేర్ల ధరలు తక్కువగా ఉండడం వల్ల ఇవి రాణించే అవకాశం ఉందని కోటక్ మహీంద్రా మ్యూచువల్ ఫండ్ కూడా అంటోంది. టీసీఎస్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, విప్రో షేర్లు ప్రస్తుతం 2018-19 ఆదాయ అంచనాలకు 16-18 రెట్ల ధరల వల్ల కదలాడుతున్నాయి. నిఫ్టీ-50 మాత్రం 22.3 రెట్ల వద్ద ఉంది. దీనిని బట్టి ఐటీ షేర్లు ఇంకా రాణించే అవకాశం ఉందని స్పష్టమవుతోంది.

పెరుగుతున్న వాటా

విదేశీ మదుపర్లు జనవరిలో సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో మొత్తం రూ.2915 కోట్ల విలువైన వాటా కొనుగోలు చేశారు. అంతక్రితం ఏడు నెలల పాటు వారు విక్రయాల్లోనే ఉండడం గమనార్హం. మ్యూచువల్ ఫండ్‌లు సైతం టీసీఎస్, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్‌లలో జనవరి, డిసెంబరుల్లో వాటాను కొనుగోలు చేశాయి. ఇటీవల ఇన్ఫోసిస్‌లో మ్యూచువల్ ఫండ్ పరిశ్రమ దాదాపు 0.4 శాతం వాటాను పెంచుకుంది. వచ్చే కొద్ది నెలల్లో అమెరికా వడ్డీ రేట్లు పెరుగుతుండడం, సాధారణ ఎన్నికల ముందు భారత్‌లో రాజకీయ అనిశ్చితి తదితర కారణాల వల్ల ఊగిసలాట మార్కెట్లో ఐటీ వంటి షేర్లు ఆకర్షణీయంగా మారుతాయని విశ్లేషకులు అంటున్నారు.



కోల్‌కతాలో శుక్రవారం జరిగిన హోలీ వేడుకల్లో యువత సందడి



వేడుకల్లో మంత్రి గంటా

విశాఖపట్నంలో శుక్రవారం హోలీ సంబరాలు అంబరాన్ని తాకాయి. నగరంలోని ఎంవీపీకాలనీ డబుల్‌రోడ్డులో అఖిల భారతీయ మహిళా సమితి, మహేశ్వరి యువ మంచ్, మార్వాడీ యువ మంచ్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకలను రాష్ట్ర మానవవనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు ప్రారంభించారు. అనంతరం ఆయన మార్వాడీ పెద్దలకు రంగులు పులుముతూ సందడి చేశారు.



హోలీ.. రంగేళీ

కర్ణాటకలో శుక్రవారం హోలీ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచే చిన్నాపెద్ద తేడాలేకుండా ప్రజలంతా రంగుల్లో మునిగి తేలారు. ఒకరిపై మరొకరు రంగులు చల్లుకుంటూ యువతీయువకులు ఉత్సాహంగా ఈ వేడుకలో పాల్గొన్నారు. ప్రముఖ పర్యాటక కేంద్రాలైన మైసూరు సహా హంపీ తదితర ప్రాంతాల్లో విదేశీయులు కూడా హోలీ ఆడటంతో మరింత సందడి నెలకొంది.

– న్యూస్‌టుడే, హొసపేటె (కర్ణాటక)

రంగుల వసంతం

- దేశవ్యాప్తంగా హోలీ వేడుకలు
- రాష్ట్రపతి, ప్రధాని శుభాకాంక్షలు

దిల్లీ: దేశవ్యాప్తంగా శుక్రవారం హోలీ పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకొన్నారు. రంగుల్లో మునిగి తేలారు. మిఠాయిలు పంచుకున్నారు. శుభాభినందనలు తెలుపుకొన్నారు. రంగు నీళ్లను పిచికారి చేసుకుంటూ 'హోలీ రే'... 'హ్యాపీ హోలీ' అంటూ చిన్నా, పెద్దా తేడాలేకుండా అంతా కేరింతలు కొట్టారు. బెలూన్ల నిండా రంగునీరు నింపి ఒకరిపై ఒకరు విసురుకుంటూ ఆనందించారు. కొన్నిచోట్ల డ్రమ్ములు వాయించుకుంటూ నృత్యాలు చేశారు.

రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ప్రధాని నరేంద్రమోదీలు దేశప్రజలకు హోలీ శుభాకాంక్షలు అందచేశారు. సమాజంలో సుహృద్భాం, సామరస్య జీవనశైలికి ఈ రంగుల పండుగ అద్దం పడుతుందని అన్నారు. ఈ పర్వదినం ప్రతి ఒక్కరి జీవితాన్ని ఆనందోత్సాహాలు, శాంతిసౌభాగ్యాలతో నింపాలని ఆకాంక్షించారు. ఆయారాష్ట్రాల ముఖ్యమంత్రులంతా ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలియచేశారు. దిల్లీలో ముఖ్యమంత్రి కేజ్రీవాల్ నివాసంలో అధికారికంగా హోలీ వేడుకలను నిర్వహించలేదు. ముంబయిలో దివంగత నటి శ్రీదేవి నివాసం ఉన్న హౌజింగ్ సొసైటీ ఆమె మృతి నేపథ్యంలో హోలీవేడుకలను రద్దు చేశారు.

అపశ్రుతులు... రాజసాథన్‌లోని అల్వార్ జిల్లాలో హోలీ వేడుకల్లో విషాదం చోటు చేసుకుంది. భివాడీ పట్టణంలో రెండు వర్గాల మధ్య హోలీ వేడుకల్లో చెలరేగిన వివాదానికి నీరజ్ జాటవ్(16)అనే దళిత యువకుడు మృతి చెందాడు. ప్రత్యర్థి వర్గానికి చెందిన కొందరు నీరజ్‌ను తీవ్రంగా కొట్టడంతో అతడు మరణించాడు.

పుతిన్ 'రామ్'బాణం!

- అగ్రరాజ్య పోకడల వల్లే అధునాతన ఆయుధాల అభివృద్ధి
- అణుశక్తితో నడిచే రామ్‌జెట్‌తో పెరగనున్న క్షిపణి పరిధి
- నిపుణుల విశ్లేషణ

మాస్కో

రష్యా సైన్యం శత్రుభీకరంగా రూపుదిద్దుకుంటోందని, సరికొత్త ఆయుధ వ్యవస్థలను భారీగా అభివృద్ధి చేసుకుంటున్నట్లు ఆ దేశ అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ చేసిన ప్రకటన తీవ్ర చర్చనీయాంశమైంది. వాటి తీరుతెన్నులపై విశ్లేషణలు మొదలయ్యాయి. సాధారణంగా గోప్యంగా ఉంచే ఇలాంటి ఆయుధాల గురించి.. స్వయంగా అధ్యక్షుడే ప్రకటన చేయడం వెనుక వ్యూహం ఏమైఉంటుందా అని మేధోమథనం జరుగుతోంది.

పుతిన్ ప్రకటించిన ఆయుధ వ్యవస్థల్లో.. ప్రపంచవ్యాప్తంగా అణు దాడులు చేయడానికి పనికొచ్చే.. అణుశక్తి డ్రోన్ జలాంతర్గామి, శత్రు గగనతల రక్షణ వ్యవస్థను బోల్తా కొట్టించే సరికొత్త హైపర్‌సోనిక్ క్షిపణులు, అణుశక్తితో నడిచే క్రూయిజ్ క్షిపణులు ఉన్నాయి. ఈ క్షిపణులను అణుదాడికి ఉపయోగించవచ్చు. ఈ జాబితాలో.. సంప్రదాయ ఇంధనాలతో కాకుండా అణుశక్తితో పనిచేసే క్షిపణి కీలకం. దీనివల్ల అవి ప్రయాణించగలిగే దూరం గణనీయంగా పెరుగుతుంది. పుతిన్ అంతర్జాతీయ రాజకీయాలకు ఈ క్షిపణి పరిధి విస్తరణే కీలకం.



ప్రచ్ఛన్న యుద్ధకాలంలోనే.. ఈ పరిజ్ఞానం కొత్తదేమీ కాదని, ప్రచ్ఛన్న యుద్ధకాలంలో 'ప్రాజెక్టు ప్లూటో' పేరిట అమెరికా కూడా ఇలాంటి వ్యవస్థను అభివృద్ధికి శ్రీకారం చుట్టిందని నిపుణులు చెబుతున్నారు. వీరి విశ్లేషణ ప్రకారం.. ఒక క్రూయిజ్ క్షిపణికి అణుశక్తిని జోడించి, సూపర్‌సోనిక్ లో ఆల్టిట్యూడ్ క్షిపణి (ఎస్ఎల్ఏఎం)ని అమెరికా సృష్టించింది. దానిలో 'రామ్‌జెట్' ఇంజిన్‌ను వాడారు. ఇది.. క్షిపణి దూసుకెళుతున్న క్రమంలో గాలి ప్రవాహాన్ని ఒడిసిపడుతుంది. ఆ గాలిని ఒక చిన్నపాటి అణు రియాక్టర్‌తో వేడెక్కిస్తుంది. అలా వేడెక్కిన గాలిని నాజిల్ గుండా వేగంగా బయటకు పంపేయడం ద్వారా క్షిపణి.. ముందుకు దూసుకెళుతుంది.

డర్టీ బాంబుగానూ.. రష్యా రామ్‌జెట్ ఇంజిన్ పరీక్ష వల్ల గుర్తించదగ్గ స్థాయిలో రేడియోధార్మిక రేణువులు వెలువడి ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. దీనివల్ల ఈ క్షిపణి.. అణు వార్‌హెడ్లను చేరవేయడమే కాకుండా, రేడియోధార్మికతను వెదజల్లే 'హైస్పీడ్ డర్టీ బాంబు'గా కూడా పనికొస్తుంది. ఉత్తర ఐరోపా, అలాస్కాల్లో రేడియోధార్మిక రేణువులు కనిపించినట్లు ఇటీవల వార్తలు రావడం ఇక్కడ ప్రస్తావనార్హం. రష్యా క్షిపణి పరీక్షలకు ఇది నిదర్శనంగా విశ్లేషిస్తున్నారు. అణుశక్తితో నడిచే క్రూయిజ్ క్షిపణిని రష్యా పరీక్షించినట్లు తమకు తెలుసని అమెరికా రక్షణశాఖ తెలిపింది. అది అభివృద్ధి దశలోనే ఉందని, ఇటీవల ఆర్కిటిక్ వద్ద కూలిపోయిందని పేర్కొంది.

మార్గం.. ఆసక్తికరం.. అణుశక్తితో నడిచే క్రూయిజ్ క్షిపణి ఎలా ప్రయాణిస్తుందన్నది వాస్తవ వీడియో దృశ్యాలకు యానిమేషన్లను జోడించి పుతిన్ చూపారు. అమెరికా పశ్చిమ తీరానికి, హవాయ్‌కు మధ్య ఒక ఊహాజనిత దీవిని ఇది లక్ష్యంగా చేసుకుంది. ఆ క్షిపణి ప్రయాణ మార్గం ఆసక్తికరంగా మారింది. అట్లాంటిక్ మహాసముద్రానికి దక్షిణాన ప్రయాణిస్తూ.. రెండు నౌకాదళ రాడార్ కేంద్రాలను తప్పించుకునేందుకు, ఒడుపుగా వాటి మధ్య నుంచి దూసుకెళ్లినట్లు చూపారు. సంప్రదాయ ఇంధనంతో పనిచేసే క్షిపణుల తరహాలో ఈ అస్త్రాల్లో ఇంధనానికి కొరత లేకపోవడం వల్ల ప్రయాణ దూరంపై ఎలాంటి పరిమితులు లేవు. శత్రు రాడార్ కేంద్రాలను తప్పించుకోవడానికి చుట్టుతిరిగి ప్రయాణం చేసినా ఇబ్బంది ఉండదు.

అమెరికా చర్యల వల్లే.. తమ దాడి సామర్థ్యాన్ని.. క్షిపణి రక్షణ వ్యవస్థలతో కట్టడిచేయలేరని పశ్చిమ దేశాలకు చాటడమే పుతిన్ ప్రకటన పరమార్థంగా పాశ్చాత్య నిపుణులు విశ్లేషిస్తున్నారు. "1972లో సోవియట్‌తో కుదిరిన క్షిపణి రక్షణ ఒప్పందం నుంచి వైదొలుగుతున్నట్లు 2001లో నాటి అధ్యక్షుడు జార్జి బుష్ ప్రకటించారు. క్షిపణి రక్షణ వ్యవస్థ అభివృద్ధికి చర్యలు చేపట్టారు. బుష్ కానీ ఆ తర్వాత వచ్చిన ఒబామా కానీ.. ఈ వ్యవస్థపై రష్యాలో వ్యక్తమైన ఆందోళనలను పరిష్కరించలేకపోయారు. దీంతో ఆ దేశం కొత్త ఆయుధాల తయారీకి నడుం బిగించింది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా అణ్వాయుధగార విస్తరణపై ప్రకటనలు చేశారు. గత నెలలో ఆయన అణ్వస్త్ర వ్యూహ సమీక్షలో ఉపయోగించిన పదజాలంతో.. అమెరికా చర్యలకు స్పందనగా తన ఆయుధ కార్యక్రమాలను వెల్లడి చేయడం పుతిన్‌కు తేలికైంది" అని ఆయుధ నిపుణుడు లెవిస్ తెలిపారు.

ప్రచ్ఛన్న యుద్ధం నాటి ఒడంబడికలను ఉల్లంఘిస్తున్నారు

- పుతిన్‌పై అమెరికా విమర్శలు
- రక్షణ సామర్థ్యంలో అందరికన్నా ముందుంటామని స్పష్టీకరణ

వాషింగ్టన్, బ్రసెల్స్: కొత్త తరపు అజేయ ఆయుధాలను అభివృద్ధి చేస్తూ రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్.. ప్రచ్ఛన్న యుద్ధం నాటి ఒడంబడికలను బహిరంగంగా ఉల్లంఘిస్తున్నారని అమెరికా శుక్రవారం ఆరోపించింది. దేశాన్ని రక్షించుకోవడానికి అమెరికా సైన్యం పూర్తి సన్నద్ధతతో ఉందని తెలిపింది.

"అమెరికా ప్రభుత్వానికి ఎప్పటినుంచో తెలిసిన విషయాన్ని పుతిన్ నిర్ధారించారు. కానీ ఇంతకుముందు రష్యా దీన్ని ఖండించింది." అని శ్వేతసౌధం ప్రెస్ కార్యదర్శి సారా శాండర్స్ చెప్పారు.

ఒడంబడిక కట్టుబాట్లను నేరుగా ఉల్లంఘిస్తూ దశాబ్ద కాలంగా రష్యా.. అస్థిర వాతావరణాన్ని సృష్టించే ఆయుధ వ్యవస్థలను అభివృద్ధి చేస్తోందన్నారు. పలు అధునాతన ఆయుధ వ్యవస్థలను అభివృద్ధి చేశామని పుతిన్ గురువారం ప్రకటించిన నేపథ్యంలో సారా శాండర్స్ ఈ వ్యాఖ్యలు చేశారు. అమెరికా, భాగస్వామ్యపక్షాలు ఎదుర్కొంటున్న ముప్పుల గురించి అధ్యక్షుడు ట్రంప్‌నకు తెలుసని, దేశాన్ని రక్షించుకోవడానికి, బలం ద్వారా శాంతిని పరిరక్షించడానికి ఆయన కట్టుబడి ఉన్నారని చెప్పారు. అమెరికా రక్షణ సామర్థ్యాలు ఎప్పటికీ మరొకరి కన్నా వెనకబడి ఉండవన్నారు. అమెరికా అణ్వాయుధాలను ఆధునికీకరించే దిశగా ముందుకెళ్తున్నట్లు చెప్పారు. సాయుధ సర్వీసుల హౌస్ కమిటీ ఛైర్మన్ మెక్ థార్న్‌బెర్రీ స్పందిస్తూ రెండు దేశాలకు దీర్ఘకాలంగా పని చేసిన అధ్యక్షులే రష్యా దూకుడుకు కారణమని ఆరోపించారు. కొత్త అణ్వాయుధాలను రష్యా అభివృద్ధి చేస్తోందని, ఒడంబడికలను ఉల్లంఘిస్తోందని ఈ కమిటీ, ఇతరులు పలుమార్లు చెప్పినా ఒబామా యంత్రాంగం అంగీకరించడానికి ఆరేళ్లు పట్టిందని విమర్శించారు. అంగీకరించినా చర్యలు తీసుకోలేదన్నారు. అప్పుడు చర్యలు తీసుకోని ఫలితమే ప్రస్తుత పరిస్థితికి దారి తీసిందన్నారు.

నాటోకూటమిని పుతిన్ హెచ్చరించడం ఆమోదయోగ్యం కాదని, ఉద్రిక్తతలను చల్లబర్చడానికి ఉపకరించవని నాటో అధికార ప్రతినిధి ఒఆనా లంగెస్కు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తాము కొత్త ప్రచ్ఛన్న యుద్ధాన్ని, కొత్త ఆయుధ పోటీని కోరుకోవడం లేదన్నారు.

అజర్‌బైజాన్‌లో అగ్నిప్రమాదం

- 30 మందికిపైగా మృతి

బాకు: అజర్‌బైజాన్‌లో ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. దేశ రాజధాని బాకులోని మాదకద్రవ్య వ్యసనపరుల పునరావాస కేంద్రంలో.. గురువారం సాయంత్రం మంటలు వ్యాపించాయి. ఘటనలో 30 మందికిపైగా మృతిచెందినట్లు స్థానిక వార్తాసంస్థలు పేర్కొన్నాయి. విద్యుత్ సరఫరా వ్యవస్థలో తలెత్తిన లోపమే ప్రమాదానికి కారణమై ఉండొచ్చని ప్రాథమికంగా అధికారులు అంచనా వేశారు. మూడు గంటపాటు శ్రమించి.. అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు. కేంద్రంలో చిక్కుకున్న 31 మందిని రక్షించారు.

భారత వజ్రాల వ్యాపారుల నుంచి దోపిడీ

పారిస్: భారత్‌కు చెందిన ఇద్దరు వజ్రాల వ్యాపారుల వద్ద నుంచి 3.7లక్షల డాలర్ల విలువైన జాతి రాళ్లను దొంగలు తస్కరించారు. బాధితులు.. పారిస్‌లోని ఒక మెట్రో స్టేషన్ లోపలికి ప్రవేశిస్తున్న సమయంలో ఈ ఘటన జరిగింది. ఈ వ్యాపారులు సోమవారం ఒక వాణిజ్య భేటీలో పాల్గొని తిరిగొస్తున్నారు. వారిపై ఇద్దరు దుండగులు దాడి చేశారు. విలువైన రాళ్లు కలిగిన ఒక సంచిని దోచుకున్నారు. అందులో వజ్రాలు లేవు. ఇది ఒక ప్రణాళిక ప్రకారం జరిగిన దోపిడీగా దర్యాప్తు అధికారులను ఉటంకిస్తూ ఒక ఫ్రెంచ్ పత్రిక పేర్కొంది. పారిస్‌లోని సెంట్రల్ నైన్త్ ఆరాండిస్మెంట్‌లో ఇది చోటుచేసుకుంది.

క్యాన్సర్‌పై పరిశోధనకు భారతీయ అమెరికన్‌కు రూ.7.65 కోట్ల గ్రాంట్

హ్యూస్టన్: క్యాన్సర్ చికిత్సలో పరిశోధనకు గాను భారతీయ అమెరికన్ శాస్త్రవేత్త నవీన్ వరదరాజన్‌కు రూ.7.65 కోట్ల గ్రాంట్ మంజూరయింది. టి-సెల్ ఇమ్యూనోథెరపీ ప్రభావాన్ని మెరుగుపర్చడంలో చేసే పరిశోధనకు గాను ఆయనకు క్యాన్సర్ ప్రివెన్షన్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్సాస్ (సీపీఆర్ఐటీ) ఈ గ్రాంటును మంజూరు చేసింది. నవీన్.. యూనివర్సిటీ ఆఫ్ హ్యూస్టన్‌లో కెమికల్, బయోమాలిక్యులర్ ఇంజినీరింగ్‌లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. ఆయన సహచర ప్రొఫెసర్ అయిన సంఘ్యుక్ చంగ్‌కు సీపీఆర్ఐటీ రూ.5.25 కోట్లను మంజూరు చేసింది. సర్వైకల్ క్యాన్సర్‌లో చికిత్సకుగాను పరమాణు లక్ష్యాలను నిర్వచించేందుకు ఆయనకు ఈ సాయం అందుతుంది.

ఇజ్రాయిల్ ప్రధానిని మరోసారి విచారించిన పోలీసులు!

జెరూసలెమ్: మోసం, ముడుపుల కేసుల్లో - ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు, ఆయన భార్య సారాను వేర్వేరుగా పోలీసులు విచారించినట్లు మీడియా తెలిపింది. ఈమేరకు శుక్రవారం జెరూసలెమ్‌లోని నెతన్యాహు అధికార నివాసానికి దర్యాప్తు అధికారులు (డిటెక్టివ్‌లు) రెండు వాహనాల్లో చేరుకున్నట్లు వెల్లడించింది. అయితే దీన్ని పోలీసులు అధికారికంగా ధ్రువీకరించడం లేదు. 2017 ప్రారంభం నుంచి ఇలా ఆయనను విచారించడం ఇది ఎనిమిదోసారని ఓ వార్తాసంస్థ పేర్కొంది

అమ్మకోసం...!

- తీవ్రవాదం వదిలి వచ్చేసిన కశ్మీరీ బాలుడు

జమ్ము/శ్రీనగర్: తీవ్రవాదంవైపు మొగ్గుచూపి ఇల్లు వదిలి వెళ్లిపోయిన ఓ కశ్మీరీ బాలుడు తన తల్లి బాధ చూడలేక వెనుదిరిగి వచ్చేశాడు. అమ్మ కన్నీరుమున్నీరవడం చూసి సహించలేకపోయిన ఆ బాలుడు తిరిగి ఇల్లు చేరి... కుటుంబసభ్యులను కలుసుకున్నట్లు పోలీసు ఉన్నతాధికారి శుక్రవారం వెల్లడించారు. అతడు కుటుంబాన్ని తిరిగి కలుసుకోవడం అత్యంత సంతోషదాయకం అంటూ ఆయన ట్వీట్ చేశారు. అయితే, ఆ బాలుడి క్షేమం కోసం అతడి వివరాలేవీ కూడా పోలీసులు వెల్లడించలేదు.

ఈశాన్య ఫలితాలపై ఉత్కంఠ

- త్రిపుర, నాగాలాండ్, మేఘాలయాల్లో విజయంపై భాజపా ధీమా
- కమ్యూనిస్టుల కంచుకోటలో తొలిసారిగా ఎర్రజెండా ఎదురీత!

ఈనాడు – అమరావతి

ఈశాన్య భారతంలోని మూడు రాష్ట్రాల్లో ఇప్పటికే అధికారాన్ని కైవసం చేసుకున్న భారతీయ జనతా పార్టీ మరో మూడు రాష్ట్రాల్లోనూ విజయపతాకాన్ని ఎగురవేయాలన్న ఉత్సాహంతో ఉంది. హోరాహోరీగా సాగిన త్రిపుర, నాగాలాండ్, మేఘాలయ అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య శనివారం ఉదయం 8 గంటలకు ప్రారంభంకానుంది. త్రిపురలో ఫిబ్రవరి 18న, మిగిలిన రెండు రాష్ట్రాల్లో ఫిబ్రవరి 27న ఎన్నికలు జరిగాయి. సీపీఎం, భాజపా ముఖాముఖి తలపడిన త్రిపుర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఎలా ఉంటాయనేది రసవత్తరంగా మారింది. మూడు రాష్ట్రాల్లోనూ భాజపాదే ఆధిపత్యంగా ఎగ్జిట్ పోల్స్ చెబుతున్నాయి. పాతికేళ్లుగా త్రిపురలో సీపీఎం అధికారంలో కొనసాగుతోంది. మేఘాలయ పదేళ్లుగా కాంగ్రెస్ పాలనలో ఉండగా.. నాగాలాండ్‌లో నాగా పీపుల్స్ ఫ్రంట్ (ఎన్ఎఫ్‌పీ) 2003 నుంచి (2008లో 3 నెలల రాష్ట్రపతి పాలన మినహా) అధికారంలో ఉంది. ఇప్పటికే అసోం, మణిపుర్, అరుణాచల్‌ప్రదేశ్‌లలో అధికార పగ్గాలు చేపట్టిన భాజపా ఈశాన్య ప్రాంతంలో మరింత విస్తరించనున్నట్లు రాజకీయ విశ్లేషకుల అంచనా.

- త్రిపుర, మేఘాలయ, నాగాలాండ్‌లలో 60 చొప్పున అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. పోలింగ్‌కు ముందే త్రిపురలో సీపీఎం అభ్యర్థి ఒకరు మృతి చెందగా.. మేఘాలయలో ఓ ఎన్‌సీపీ అభ్యర్థి ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయారు. ఈ రెండు చోట్ల ఎన్నిక వాయిదాపడింది. నాగాలాండ్‌లో ఎన్‌డీపీపీ అధ్యక్షుడు నెయిఫ్యు రియో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కారణాలతో మూడు రాష్ట్రాల్లోనూ 59 స్థానాల చొప్పునే పోలింగ్ జరిగింది.

అనారోగ్యంతో త్రిపుర మంత్రి మృతి

త్రిపుర రాష్ట్ర మంత్రి, సీపీఎం అభ్యర్థి ఖగేంద్ర జమాతియా(64) దిల్లీలోని ఎయిమ్స్‌లో శుక్రవారం మృతి చెందినట్లు ఉప సభాపతి పవిత్ర కార్ తెలిపారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఆయన కృష్ణపుర్ నుంచి పోటీ చేశారు.

అందరి దృష్టి త్రిపురపైనే...

కమ్యూనిస్టుల కంచుకోటగా భావిస్తున్న త్రిపురలో ఈ సారి భాజపా గట్టి పోటీనిచ్చింది. కమలనాథులు తొలిసారిగా రాష్ట్రంలో అధికారంలోకి వచ్చే అవకాశం ఉందని ఎగ్జిట్ పోల్స్ వెల్లడిస్తున్న నేపథ్యంలో ఫలితాలపై ఉత్కంఠ నెలకొంది. 'మార్పు' నినాదంతో భాజపా బరిలోకి దిగింది. నాలుగు దఫాలుగా ముఖ్యమంత్రి పదవిలో కొనసాగుతూ అవినీతి మరకలు అంటని మాణిక్ సర్కార్ సీపీఎంకు ప్రధాన బలం. కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్‌లు అభ్యర్థులను పోటీ నిలిపినప్పటికీ ప్రధాన పోరు సీపీఎం, భాజపాల మధ్యనే జరిగింది. అధికార సీపీఎం 58 స్థానాల్లో పోటీ చేసింది. రెండు స్థానాలను మిత్రపక్షాలైన సీపీఐ, ఫార్వార్డ్ బ్లాక్, రివల్యూషనరీ సోషలిస్ట్ పార్టీలకు (ఒక్కోటి చొప్పున) ఇచ్చింది. భాజపా 51 స్థానాల్లో అభ్యర్థులను నిలిపింది. మిగిలిన తొమ్మిది స్థానాలను ఐపీఎఫ్‌టీకి కేటాయించింది. కాంగ్రెస్ 59 స్థానాలల్లో, తృణమూల్ కాంగ్రెస్ 24 స్థానాల్లో అభ్యర్థులను బరిలోకి దించాయి.

ముఖ్యనేతలు...

- ప్రస్తుత ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ (సీపీఎం)
- అఘోరె దేబ్‌బర్మ (సీపీఎం)
- రతన్ లాల్ నాథ్ (భాజపా)
- బిప్లబ్ దేబ్ (భాజపా రాష్ట్ర అధ్యక్షుడు)
- గోపాల్ చంద్ర రాయ్ (కాంగ్రెస్),
- ఎన్‌సి దేబ్ బర్మ (ఐపీఎఫ్‌టీ రాష్ట్ర అధ్యక్షుడు)

త్రిపుర మొత్తం అసెంబ్లీ స్థానాలు: 60

పోలింగ్ జరిగినవి: 59

ప్రధాన పార్టీలు	పోటీ చేసిన స్థానాలు
సీపీఎం	57
భాజపా	51
కాంగ్రెస్	59
తృణమూల్ కాంగ్రెస్	24

జీవితాంతం అధికారంలో..

- చైనా అధ్యక్షుడి పదవీ కాలపరిమితిని ఎత్తివేసేందుకు రంగం సిద్ధం

బీజింగ్: చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్ జీవితాంతం అధికారంలో కొనసాగేందుకు రంగం సిద్ధమయింది. చైనా అధ్యక్ష పదవీ కాల పరిమితిని రద్దు చేయాలన్న ప్రతిపాదనకు సోమవారం పార్లమెంట్‌లో ఆమోదముద్ర పడే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. వార్షిక పార్లమెంట్ సమావేశాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. అధ్యక్షుడి పదవీ కాల పరిమితిని ఎత్తివేయాలని చైనా అధికార కమ్యూనిస్టు పార్టీ ఇటీవలే ప్రతిపాదించిన సంగతి తెలిసిందే. చైనా అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు వరుసగా రెండు సార్లు కన్నా ఎక్కువసార్లు పదవిలో కొనసాగడానికి వీల్లేదని రాజ్యాంగం చెబుతోంది. చైనా పార్లమెంట్ అయిన నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్‌ను కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ చైనా (సీపీసీ) రబ్బరు స్టాంపుగా అభివర్ణిస్తారు. సీపీసీ తీసుకున్న నిర్ణయాలను మరో మాటకు తావు లేకుండా ఆమోదం తెలుపుతుంటుంది.


జిన్‌పింగ్ తన అధికారాన్ని సుస్థిరం చేసుకోవడంతో పాటు కొత్తగా నలుగురు ఉప ప్రధానమంత్రులను నియమించాలని కూడా యోచిస్తున్నారు. అధ్యక్షుడి మానసపుత్రికలయిన పేదరిక నిర్మూలన, పర్యావరణ పరిరక్షణ, ఆర్థికాభివృద్ధి వంటి ప్రజాకర్షక కార్యక్రమాలపై వారు కసరత్తు చేయాల్సి ఉంటుంది. ఈ కార్యక్రమాలతో జిన్‌పింగ్‌కు చైనాలో మరింత ఆదరణ పెరుగుతుందని భావిస్తున్నారు. ప్రస్తుతం చైనాకు ఇద్దరు ఉప ప్రధానులున్నారు.

మారుమూల అంటార్కిటిక్ దీవుల్లో 15 లక్షల పెంగ్విన్‌లు

పారిస్: అంటార్కిటిక్ ఖండంలోని మారుమూల దీవుల సమూహం 'డేంజర్ ఐలాండ్స్'లో 15 లక్షల అడెలీ జాతి పెంగ్విన్‌లు ఉన్నట్లు శాస్త్రవేత్తలు తాజాగా గుర్తించారు. ప్రపంచవ్యాప్తంగా ఇతర ప్రాంతాల్లోని అడెలీ పెంగ్విన్‌ల మొత్తం సంఖ్యతో పోలిస్తే ఈ దీవుల్లోనే వాటి జనాభా ఎక్కువగా ఉందని వెల్లడించారు. పలు ప్రాంతాల్లో ఈ పెంగ్విన్‌ల సంఖ్య వేగంగా పడిపోతున్న సంగతిని గుర్తుచేశారు. ఒకేసారి ఇంత అధిక సంఖ్యలో వాటి జాడ బయటపడటం పట్ల ఆశ్చర్యం వ్యక్తం చేశారు. 9 దీవుల సమూహమైన 'డేంజర్ ఐలాండ్స్' దక్షిణ అమెరికాకు సమీపంలోని వెడ్డెల్ సముద్రంలో ఉంది.

సెంట్రల్ మిచిగాన్ విశ్వవిద్యాలయంలో కాల్పులు: ఇద్దరి మృతి

షికాగో: అమెరికాలోని సెంట్రల్ మిచిగాన్ విశ్వవిద్యాలయంలోని వసతికేంద్రం (డార్మెటరీ)లో శుక్రవారం సాయుధుడైన ఓ యువకుడు జరిపిన కాల్పుల్లో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. దుండగుడి కోసం పోలీసులు గాలిస్తున్నట్లు ఓ వార్తాసంస్థ తెలిపింది. 'సెంట్రల్ మిచిగాన్'లో 23 వేల మంది విద్యార్థులు నమోదు కాగా. . తమ క్యాంప్‌బెల్ హాల్‌లో కాల్పులు జరిగినట్లు విశ్వవిద్యాలయం ట్విట్టర్‌లో తెలిపింది. పరిస్థితిని సమీక్షిస్తున్నట్లు పేర్కొన్న పోలీసు అధికారులు ఇతర వివరాలేవీ తెలపడానికి నిరాకరించారు. కాగా తాము ప్రత్యేక ఏజెంట్లను పంపించినట్లు - అమెరికాలోని.. మద్యం, పొగాకు, ఆయుధాలు, పేలుళ్ల నిరోధక బ్యూరో తెలిపింది. ఫ్లోరిడా హైస్కూలు వద్ద 17 మంది మృతికి కారణమైన కాల్పుల ఉదంతం మరిచిపోకముందే ఈ ఘటన చోటు చేసుకుంది.



డిపాజిటర్లకేదీ భరోసా?

- బెయిల్‌ఇన్ క్లాజ్‌పై అభ్యంతరం
- ఎఫ్ఆర్‌డీఐ బిల్లుపై తొలగని అనుమానాలు
- పీఎన్‌బీ ఉదంతంతో డిపాజిటర్లలో పెరిగిన భయాలు

భారతీయ రిజర్వుబ్యాంకు (ఆర్‌బీఐ) గత ఏడాది జూన్‌లో విడుదల చేసిన ఆర్థిక స్థిరత్వ నివేదిక (ఫైనాన్షియల్ స్టెబిలిటీ రిపోర్ట్) ప్రకారం దేశంలోని బ్యాంకులకు మొండి బకాయిలు 2017 మార్చి నాటికి అవి ఇచ్చిన అప్పుల్లో 9.6 శాతం ఉన్నాయి. తాజాగా ఇవి 11 శాతం వరకూ పెరిగాయి. పారదర్శకంగా లెక్కిస్తే మొండి బకాయిలు 20 శాతం వరకూ ఉండవచ్చని కొన్ని వర్గాలు విశ్లేషిస్తున్నాయి. దీనికి తోడు తాజాగా పంజాబ్ నేషనల్ బ్యాంకు ఉదంతం, దాన్ని వెన్నంటే ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్, మరికొన్ని ఇతర బ్యాంకుల్లో వెలుగుచూస్తున్న రుణగ్రహీతల మోసాలను చూసి బ్యాంకులపై ప్రజల్లో విశ్వాసం సడలిపోతోంది. తాము ఎంతో కష్టించి దాచుకున్న సొమ్ము బ్యాంకుల్లో వేస్తే, అది మళ్లీ మనచేతికి రాదేమో ననే అనుమానం వారి నుంచి వస్తోంది. దీనికి తోడు కేంద్రం తీసుకురాదలచిన ఎఫ్ఆర్‌డీఐ (ఫైనాన్షియల్ రిజల్యూషన్ అండ్ డిపాజిట్ ఇన్సూరెన్స్) బిల్లు, 2017 ఆ భయాలను ఇంకా పెంచుతోంది. ఈ బిల్లు చట్టరూపం దాల్చితే తమ డిపాజిట్లు, సేవింగ్స్ ఖాతాలో జమచేసిన మొత్తాలకు భద్రత ఉండదనే అనుమానం వారికి వస్తోంది. అటువంటి సమస్యేమీ ఉండదని ప్రభుత్వ వర్గాలు పలు సందర్భాల్లో స్పష్టం చేశాయి. అయినప్పటికీ బిల్లులోని నిబంధనలను సవరించకుండా, కేవలం నోటిమాటగా భరోసా ఇవ్వటం వల్ల ప్రయోజనం లేదని నిపుణులు విశ్లేషిస్తున్నారు.



బిల్లు ఏ దశలో ఉంది?

- 2013లో ఏర్పాటైన ఆర్థిక రంగ చట్ట సంస్కరణల కమిషన్ (ఎఫ్ఎస్ఎల్ఆర్సీ) సిఫార్సులకు అనుగుణంగా ఎఫ్ఆర్‌డీఐ బిల్లు రూపుదిద్దుకుంది.
- ఈ బిల్లును కేంద్ర మంత్రివర్గం గత ఏడాది జూన్‌లో ఆమోదించింది. దాన్ని కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ ఆగస్టు నెలలో లోక్‌సభలో ప్రవేశపెట్టారు.
- ప్రస్తుతం ఇది సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) పరిశీలనలో ఉంది. సమయం సరిపోకపోవటంతో కమిటీకి మరికొంత గడువు ఇచ్చారు.
- ప్రస్తుత బడ్జెట్ సమావేశాల్లో ఈ బిల్లు ప్రవేశపెట్టాలనే ఆలోచన కేంద్రానికి ఉన్నప్పటికీ అది సాధ్యం కాకపోవచ్చని తెలుస్తోంది. పార్లమెంటు వర్షాకాలం సమావేశాల నాటికి ఇది సిద్ధం కావచ్చు.
- జేపీసీ పరిశీలన ఇంకా పూర్తి కాకపోవటం, వివిధ వర్గాల ప్రజల నుంచి వస్తున్న అభ్యంతరాలపై ఏం చేయాలనే విషయంలో ఇంకా ఒక నిర్ణయానికి రాకపోవటం దీనికి ప్రధాన కారణం.

అభ్యంతరాలెన్నో...

- తొలి దశలో ఈ బిల్లుకు భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్‌బీఐ) అభ్యంతరం చెప్పింది. కానీ మలిదశలో తమకు అభ్యంతరం లేదని రిజర్వు బ్యాంకు గవర్నర్ ఉర్జిత్‌పటేల్ స్పష్టం చేశారు. కానీ ఆర్‌బీఐ, రిజల్యూషన్ కార్పొరేషన్ మధ్య విధివిధానాలు, బాధ్యతలు, ఇతర అంశాల్లో మరింత స్పష్టత కావాలని పేర్కొన్నారు.
- కేంద్ర ప్రభుత్వ కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ కూడా ఈ బిల్లులోని 'బెయిల్-ఇన్' క్లాజుపై అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ శాఖ ఆధ్వర్యంలోని ఈఎస్ఐసీ ద్వారా కార్మికులు, కిందిస్థాయి ఉద్యోగులకు వైద్యసదుపాయాలు అందించేందుకు నిర్దేశించిన సొమ్ము బ్యాంకుల్లో ఉంటోంది. ఏదైనా ఇబ్బంది వచ్చి ఆ సొమ్మును కోల్పోవలసి వస్తే, లక్షలాది మంది కార్మికులకు వైద్య సదుపాయం అందించలేని పరిస్థితి ఏర్పడుతుందని వివరించింది. మార్చి 31, 2017 నాటికి ఈఎస్ఐసీకి సంబంధించిన రూ.46,000 కోట్ల సొమ్ము ప్రభుత్వరంగ బ్యాంకుల్లో డిపాజిట్ల రూపంలో ఉంది. ఈఎస్ఐసీ పథకంలో చేరే ఉద్యోగులు తమ నెల జీతంలో 4.75 శాతం సొమ్ముకు ఈఎస్ఐకి జమ చేస్తారు.
- ప్రభుత్వ రంగ బ్యాంకుల సిబ్బంది, అధికారులు ఈ బిల్లును వ్యతిరేకిస్తున్నారు.

ఏదీ దారి?

ఎఫ్ఆర్‌డీఐ బిల్లుపై పార్లమెంటరీ కమిటీ త్వరలో తన నివేదికను పార్లమెంటుకు సమర్పించే అవకాశం ఉంది. ఆ తర్వాత కొన్ని మార్పులు, చేర్పులతో ఈ బిల్లు సభ ఆమోదానికి రావచ్చు. కానీ ఎక్కువ మంది అభ్యంతరం వ్యక్తం చేస్తున్న బెయిల్- ఇన్ నిబంధన తొలగిస్తారో... లేదో... స్పష్టం కావటం లేదు. ఈ నిబంధన సాంఘిక భద్రత అధికంగా ఉన్న అభివృద్ధి చెందిన పశ్చిమ దేశాలకు సరిపోతుంది కానీ, పేదలు అధికంగా ఉన్న మనదేశానికి సరిపడదని నిపుణులు కొందరు పేర్కొంటున్నారు. బ్యాంకింగ్ రంగంలో ఇటీవల చోటుచేసుకుంటున్న కుంభకోణాల ఫలితంగా ప్రజల్లో భయాందోళనలు మరింత అధికమయ్యాయి. అందువల్ల డిపాజిటర్ల ప్రయోజనాలకు భరోసా లేకుండా ప్రస్తుత పరిస్థితుల్లో ఇటువంటి చట్టాన్ని తీసుకురావటం సరికాదని విశ్లేషిస్తున్నారు.

'జుప్తా' లో చిక్కుకున్న బీఓబీ !

దాదాపు ఒక దశాబ్దకాలం పాటు దక్షిణాఫ్రికా అధ్యక్షుడిగా వ్యవహరించిన జాకబ్ జుమా తన రాజకీయ జీవితంలో ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్నారు. ఎన్నో సార్లు పతనం అంచుల వరకూ వెళ్లారు. కానీ ఆ సవాళ్లను విజయవంతంగా అధిగమించారు. కానీ గుప్తా సోదరులతో 'అనుబంధం' మాత్రం ఆయన అధ్యక్ష పదవికి ముప్పు తెచ్చిపెట్టాయి. ఇటీవల అనూహ్యమైన పరిస్థితుల్లో ఆయన అధ్యక్ష పదవి నుంచి దిగిపోవలసి వచ్చింది. గుప్తా సోదరులది ఉత్తరప్రదేశ్‌లోని సహరన్‌పూర్. ఇరవై ఏళ్ల కోసం వ్యాపార అవకాశాలు వెతుక్కుంటూ గుప్తా సోదరుల్లో ఒకరైన అతుల్ దక్షిణాఫ్రికా వెళ్లారు. మిగిలిన ఇద్దరు సోదరులు అజయ్, రాజేష్... ఆ తర్వాత కొంతకాలానికి అతుల్‌ను అనుసరించారు. ఎంతో సాధారణంగా ప్రారంభమైన వారి వ్యాపార ప్రస్తానం పదేళ్ల క్రితం ఒక కార్యక్రమంలో జాకబ్ జుమాను కలుసుకోవటంతో అనూహ్యమైన మలుపు తిరిగింది. జుమా కుటుంబ సభ్యులకు అన్ని రకాలైన ఎరలు వేసి అతి తక్కువ సమయంలో తమ వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించుకున్నారు. జుమా కుటుంబం, గుప్తా సోదరుల మధ్య బంధం, ఇద్దరినీ కలిపి 'జుప్తా' అని పిలిచేటంతగా బలపడింది. ఈ క్రమంలో గుప్తా సోదరులు ఇష్టానుసారం అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ ఆరోపణలే జుమా పదవి కోల్పోవటానికి దారి తీశాయి.

అంతవరకూ అయితే సరే. కానీ ఈ వ్యవహారంలో మనదేశానికి చెందిన ప్రభుత్వ రంగ సంస్థ అయిన బ్యాంక్ ఆఫ్ బరోడా చిక్కుకుపోయింది.

దక్షిణాఫ్రికాలో బ్యాంక్ ఆఫ్ బరోడా విదేశీ శాఖ ఉంది. దీన్లో గుప్తా సోదరులు ఖాతాలు తెరిచి ఇష్టానుసారం లావాదేవీలు నిర్వహించారు. ఎక్కడెక్కడి నుంచో వందల కోట్ల సొమ్ము అనుమానాస్పదంగా వచ్చి వెళ్తున్నా ఎవరూ పట్టించుకోలేదు. లంచాలు, అవినీతి చెల్లింపులు ఎన్నో ఈ ఖాతాల నుంచి జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. గుప్తా కంపెనీల లావాదేవీలు ఎంత అధికంగా జరిగాయంటే..., బ్యాంక్ ఆఫ్ బరోడా దక్షిణాఫ్రికా శాఖ మొత్తం ఆ ఖాతాలకు సేవ చేయటమే సరిపోయేది. ఇవన్నీ అనుమానాస్పదంగా ఉన్నాయని అక్కడి సిబ్బంది ఉన్నతాధికార్లకు తెలియజేసినా ఎవరూ పట్టించుకోలేదు. ఇప్పుడు ఈ మొత్తం వ్యవహారంపై దక్షిణాఫ్రికా ప్రభుత్వం విచారణ చేపట్టింది. దీంతో దక్షిణాఫ్రికా శాఖను మూసివేయాలని బ్యాంక్ ఆఫ్ బరోడా నిర్ణయించింది. ఏదేమైనా ఈ వ్యవహారంలో బ్యాంక్ ఆఫ్ బరోడాకు చిక్కులు తప్పకపోవచ్చని అంటున్నారు.

- ఈనాడు ప్రత్యేక విభాగం

అందులో ఏముంది?

- బ్యాంకులు, బీమా కంపెనీలు, ఎన్‌బీఎఫ్‌సీ (నాన్-బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ)ల పనితీరుపై పర్యవేక్షణ, అవి ఖాయిలా పడకుండా జాగ్రత్త వహించటం ప్రధాన లక్ష్యంగా ఈ బిల్లుకు కేంద్ర ప్రభుత్వం రూపకల్పన చేసింది.
- దీని ప్రకారం బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలపై పర్యవేక్షణకు 'రిజల్యూషన్ కార్పొరేషన్'ను ఏర్పాటు చేస్తారు. ఇది కేంద్ర ఆర్థిక శాఖ అజమాయిషీలో పనిచేస్తుంది.
- మనదేశంలో ప్రస్తుతం ద్రవ్య పరపతి విధానాన్ని రూపొందించటంతో పాటు బ్యాంకులపై పర్యవేక్షణ-నియంత్రణాధికారం ఆర్‌బీఐకి ఉంది. ఎఫ్ఆర్‌డీఐ బిల్లు చట్టరూపం దాల్చి, దాని ప్రకారం రిజల్యూషన్ కార్పొరేషన్ ఏర్పాటైతే, బ్యాంకులపై పర్యవేక్షణాధికారాన్ని రిజర్వుబ్యాంకు కోల్పోతుంది.
- ఈ బిల్లు ప్రకారం ఏదైనా ఆర్థిక సంస్థ ఖాయిలా పడినప్పుడు దాన్ని గట్టెక్కించటంలో భాగంగా సిబ్బందిని తొలగించటం, లేదా వారి జీతభత్యాల్లో కోత విధించటం చేయవచ్చు.
- ఖాయిలా పడిన ఆర్థికసంస్థను మరొక సంస్థలో కలిపివేయవచ్చు. లేదా ఆస్తులను, అప్పులకు కొంతకొంతగా సర్దేసి సంస్థను మూసి (లిక్విడేట్) వేయవచ్చు. ఈ క్రమంలో బిల్లులోని 52వ సెక్షన్‌లో పొందుపరిచిన 'బెయిల్- ఇన్' క్లాజు డిపాజిటర్లను భయాందోళనలకు గురిచేస్తోంది.
- ఈ క్లాజు ప్రకారం ఇబ్బందుల్లో కూరుకుపోయిన బ్యాంకును మూసివేయాలని నిర్ణయిస్తే, ఆ బ్యాంకు డిపాజిటర్లు తమ డిపాజిట్ల సొమ్మును వెనక్కి తీసుకునే హక్కును కోల్పోతారు. 2008లో అమెరికా, ఐరోపాలో ఆర్థిక సంక్షోభం ముసిరినప్పుడు అక్కడి ఎన్నో బ్యాంకులు దివాలా తీశాయి. ఆ సమయంలో డిపాజిటర్లు తమ సొమ్ము కోల్పోవలసి వచ్చింది. ఎఫ్ఆర్‌డీఏ బిల్లు చట్టమైతే మనదేశంలోనూ ఇటువంటి సమస్య డిపాజిటర్లకు ఎదురవుతుంది.
- అందువల్ల బెయిల్- ఇన్ క్లాజుపై వివిధ వర్గాల నుంచి తీవ్ర స్థాయిలో వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఇటీవల కాలంలో వెలుగు చూసిన కొన్ని మోసాలు

నష్టపోయిన బ్యాంకు	మోసపూరితంగా రుణాలు పొందిన సంస్థ	కుంభకోణం విలువ (రూ.కోట్లలో)
పంజాబ్ నేషనల్ బ్యాంక్	నీరవ్ మోదీ గ్రూపు సంస్థలు	12,700
బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఐఓబీ, యూబీఐ, ఓబీసీ, అలహాబాద్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర	రోటోమ్యాక్ పెన్స్	3,695
ఓబీసీ	ద్వారకా దాస్ సేథ్ ఇంటర్నేషనల్	390
ఎస్‌బీఐ, పీఎన్‌బీ, బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఐడీబీఐ, బ్యాంక్ ఆఫ్ బరోడా తదితర 17 బ్యాంకులు	విజయ్ మాల్యా కంపెనీలు	9,000
కెనరా బ్యాంకు	ఆర్‌పీ ఇన్ఫోసిస్టమ్స్ లిమిటెడ్, కోల్‌కతా	515

వచ్చే రెండు వారాల్లో ఎండల తీవ్రత కాస్త ఎక్కువే!

ఈనాడు, విశాఖపట్నం: రాష్ట్రంలో రాబోయే రెండు వారాల్లో ఎండల తీవ్రత కాస్త ఎక్కువగానే నమోదయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయని భారత వాతావరణశాఖ తెలిపింది. మార్చి మొదటివారంలో కోస్తా జిల్లాల్లో, అనంతపురం జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో సాధారణ ఉష్ణోగ్రత కంటే 1, 2 డిగ్రీలు అదనంగా నమోదయ్యే సూచనలు కనిపిస్తున్నాయని తెలిపింది. ఈ వారంలో కృష్ణా జిల్లాలో సముద్రానికి దగ్గరగా ఉన్న కొన్ని ప్రాంతాల్లో సాధారణ ఉష్ణోగ్రతలు ఉంటాయని అంచనాలు వేసింది. రెండో వారంలో ఉత్తరకోస్తా జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో సాధారణ ఉష్ణోగ్రతల కన్నా 1, 2 డిగ్రీలు అదనంగా నమోదవుతాయని, అనంతపురం జిల్లాలో కర్ణాటక సమీపాన ఉన్న ప్రాంతాల్లో ఇదే తరహాలో ఉష్ణోగ్రతలు ఉంటాయని వివరించింది. కర్నూలు జిల్లాలోని వాయువ్య ప్రాంతాలు, చిత్తూరు జిల్లాలో కర్ణాటకకు ఆనుకుని ఉన్న కొన్ని ప్రాంతాల్లో సాధారణం కన్నా 1, 2 డిగ్రీలు తక్కువగా ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అంచనా వేసింది. ప్రస్తుతం కోస్తా జిల్లాల్లో 34 నుంచి 37 డిగ్రీల మధ్య, రాయలసీమలో 35 నుంచి 39 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.

క్యాన్సర్ నుంచి బ్యాక్టీరియా రక్ష

వాషింగ్టన్: చర్మంపై కనిపించే సర్వసాధారణ బ్యాక్టీరియా ఒకటి క్యాన్సర్ల నుంచి రక్షణ కల్పిస్తుందని శాస్త్రవేత్తలు తాజాగా గుర్తించారు. చర్మంపై హానికర బ్యాక్టీరియాలతోపాటు కొన్ని మేలురకం బ్యాక్టీరియాలు కూడా ఉంటాయి. వాటిలో 'స్టెఫైలోకోకస్ ఎపిడెర్మిడిస్' ఒకటి. ఈ బ్యాక్టీరియా '6-ఎన్-హైడ్రాక్సీ అమైనో ప్యూరిన్ (6-హెచ్ఏపీ)' అనే ప్రత్యేకమైన రసాయనాన్ని విడుదల చేస్తుందని అమెరికాలోని కాలిఫోర్నియా శాన్ డీగో విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు తాజా పరిశోధనల్లో గుర్తించారు. క్యాన్సర్ కణాలను 6-హెచ్ఏపీ నాశనం చేస్తున్నట్లు నిర్ధారించారు. డీఎన్ఏ సంశ్లేషణ ప్రక్రియను అడ్డుకోవడం ద్వారా క్యాన్సర్ కణాల విస్తరణనూ అది అడ్డుకుంటుందని తెలిపారు. ఆరోగ్యవంతమైన కణాలపై మాత్రం 6-హెచ్ఏపీ ప్రతికూల ప్రభావం చూపదని స్పష్టం చేశారు. ఎలుకల్లో విస్తృత పరిశోధనల ద్వారా తాము ఈ అంశాలను నిర్ధారించామని వెల్లడించారు.

సరికొత్త సిరాతో వేగంగా క్షయ నిర్ధారణ!

లండన్: క్షయ వ్యాధిని సత్వరం నిర్ధారించడం ద్వారా రోగులకు మెరుగైన చికిత్స అందించడంలో దోహదపడే వినూత్న సాంకేతికతను శాస్త్రవేత్తలు తాజాగా అభివృద్ధి చేశారు. ఈ విధానంలో ఓ ప్రత్యేకమైన సిరా.. క్షయ బ్యాక్టీరియా గుట్టును రట్టు చేస్తుంది. మైకోబ్యాక్టీరియం ట్యుబర్క్యులోసిస్(ఎంటీబీ) అనే బ్యాక్టీరియా కారణంగా క్షయ వస్తుంది. ఎంటీబీ చుట్టూ రక్షణగా పలు పొరలుంటాయి. 'ట్రెహలోస్' అణువులతో తయారైన మైకోలిక్ ఆమ్ల పొర కూడా అందులో ఒకటి. దక్షిణాఫ్రికాలోని విట్‌వాటర్‌స్రాండ్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలతో కూడిన బృందం తాజాగా 'డీఎమ్ఎన్' అనే ప్రత్యేక సిరాను తయారుచేశారు. ఇది సజీవ ఎంటీబీలోని ట్రెహలోస్‌తో కలిసినప్పుడు 'డీఎమ్ఎన్-ట్రెహలోస్' సమ్మేళనాన్ని ఏర్పాటుచేస్తుంది. లాలాజల నమూనాను సూక్ష్మదర్శినితో పరిశీలిస్తే.. ప్రతిదీప్త కాంతిలో ఈ సమ్మేళనం ప్రకాశవంతంగా కనిపిస్తుంది. తద్వారా ఎంటీబీ ఉనికి గుర్తించి, క్షయ వ్యాధిని నిర్ధారించవచ్చు. రోగులకు వెంటనే చికిత్స ప్రారంభించవచ్చు.

వేద విజ్ఞానంతో విశ్వ ప్రగతి

- కేంద్ర సహాయ మంత్రి సత్యపాల్ సింగ్
- వేద వర్సిటీలో ప్రారంభమైన వేద సమ్మేళనం

తిరుపతి(సాంస్కృతికం), న్యూస్‌టుడే: వేద విజ్ఞానంతో విశ్వప్రగతి సాధ్యమని, భారత్‌తో పాటు నేడు ప్రపంచ దేశాలు వేద విజ్ఞానంపై క్షేత్ర స్థాయి పరిశోధనలు నిర్వహిస్తున్నాయని కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ సహాయ మంత్రి సత్యపాల్ సింగ్ పేర్కొన్నారు. శ్రీవేంకటేశ్వర వేద విశ్వ విద్యాలయం, మహర్షి సాందీపని వేదవిద్యా ప్రతిష్ఠాన్ సంయుక్త ఆధ్వర్యంలో వేద వర్సిటీ వేదికగా మూడురోజుల పాటు జరగనున్న దక్షిణ భారత స్థాయి వేద సమ్మేళనాన్ని శుక్రవారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శరీరానికి మంచి భోజనం ఎంత అవసరమో, మనసుకు మంచి శబ్దమూ అంతే అవసరమని.. ఆ శబ్దమే వేదమని అన్నారు. తితిదే ఆధ్వర్యంలో వేదాధ్యయనం, వేద పరిశోధనలకు ప్రత్యేకంగా విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటుచేయడం గొప్ప విషయమని ప్రశంసించారు. వేదాల్లో విశేష కృషి చేసిన 12మందికి ఏటా రూ.5లక్షల బహుమతిని అందిస్తామన్నారు. వేద పండితులకు సమాజంలో గుర్తింపు తెస్తామన్నారు. వేదవిద్యా ప్రతిష్ఠాన్ వైస్ ఛైర్మన్ రవీంద్ర అంబాదాస్ మూలే మాట్లాడుతూ వేద పరిరక్షణ తప్పనిసరని, తమ సంస్థ ఆధ్వర్యంలో పలు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం ఉపకులపతి ఆచార్య మురళీధర శర్మ మాట్లాడుతూ వేదాధ్యయనం చేసిన ప్రతి ఒక్కరు సంస్కృతాధ్యయనం, శాస్త్రాధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. సదస్సు ముఖ్య ఉద్దేశాన్ని వేద విద్యా ప్రతిష్ఠాన్ కులసచివులు ఆచార్య విరూపాక్షి జడ్డీపాల్, వేద వర్సిటీ రిజిస్ట్రార్ పి.విశ్వనాథ్ వివరించారు.



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న కేంద్ర మానవ వనరుల శాఖ సహాయ మంత్రి సత్యపాల్ సింగ్



నదీ గర్భం నుంచి.. జనసంద్రంలోకి

కొత్తపల్లి, న్యూస్‌టుడే: సప్త నదుల సంగమ ప్రాంతంలో కొలువైన కర్నూలు జిల్లాలోని సంగమేశ్వర క్షేత్రం భక్తులు దర్శించుకునేలా కృష్ణా నదిలో నుంచి బయటపడుతోంది. భక్తులు నదిలో కాలినడకన వేపదారు శివలింగాన్ని దర్శించుకునేందుకు, క్షేత్రం వద్దకు వెళ్లేందుకు రహదారి బయటపడింది. ఆరు నెలలు నీటిలో ఉన్న వేపదారు శివలింగం చెక్కు చెదరక పోవడం ఇక్కడి విశేషం. ఇక్కడ ఉన్న భీమలింగం బయల్పడేందుకు మరో 20 రోజుల వరకు పట్టనుంది.

ఏపీకి 26.38.. తెలంగాణకు 19 టీఎంసీలు

- కృష్ణా బోర్డు త్రిసభ్య కమిటీలో నిర్ణయం

ఈనాడు - అమరావతి, హైదరాబాద్

కృష్ణా నదీ యాజమాన్య బోర్డు త్రిసభ్య కమిటీ సమావేశంలో మార్చి నెలాఖరు వరకు ఏ రాష్ట్రం ఎంత నీరు వినియోగించుకోవాలో దాదాపు ఖరారు చేసేశారు. ఆంధ్రప్రదేశ్‌కు 26.38 టీఎంసీలు, తెలంగాణ 19 టీఎంసీలు వాడుకోవచ్చు. శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల్లో కనీస నీటిమట్టాలకు దిగువకు వెళ్లి కూడా అవసరమైన నీరు తీసుకునేందుకు నిర్ణయించారు. ఈ వివరాలు ఏపీ అధికారికంగా తక్షణమే వెల్లడించకూడదని నిర్ణయించారు. నీటిమట్టాల నిర్వహణ మాత్రం ఇరు రాష్ట్రాల పరిస్థితులకు తగ్గట్టుగా చూసుకుని వాటిని కచ్చితంగా నిర్వహించాల్సి ఉంటుంది. మార్చి 20 వరకు సాగర్‌లో 520 అడుగుల నీటి మట్టం, మార్చి చివరికి 515 అడుగుల మట్టం ఉండేలా చూసుకోవాలనే చర్చ జరిగింది. సాగర్‌లో కనీస నీటిమట్టం పడిపోతే రాష్ట్ర ప్రజల తాగునీటి అవసరాలకు భంగం వాటిల్లుతుందని, ప్రత్యామ్నాయంగా శ్రీశైలం నుంచి జలాలు విడుదల చేస్తేనే సమస్యలు రావని తెలంగాణ అధికారులు తెలిపారు. సాగర్ కనీస నీటి వినియోగ మట్టం దిగువ నుంచి తాగునీటి అవసరాలకు వినియోగించుకునేందుకు హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో నిర్ణయించారు.

గతేడాది రాష్ట్ర ప్రజల తాగునీటి అవసరాలకు నీళ్లు అందించలేక ఇబ్బంది పడిన పరిస్థితుల దృష్ట్యా ఈ ఏడాది ప్రజాప్రయోజనాలు పణంగా పెట్టలేమని తెలంగాణ నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ మురళీధర్‌రావు బోర్డుకి తెలిపారు. ఏపీ తన వాటాకు మించి అదనంగా కృష్ణా జలాలు వాడుకుందని అన్నారు. సాగర్ దిగువ నీటిమట్టాల నుంచి కూడా నీటిని తీసుకునేందుకు ప్రయత్నించిందన్నారు ప్రస్తుతం శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల్లో 33 టీఎంసీలు అందుబాటులో ఉండగా ఇందులో 24 టీఎంసీలు తెలంగాణకు, 9 టీఎంసీలు ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించాలన్నారు. దీనిపై ఏపీ అధికారులు అభ్యంతరం తెలిపారు. తమ వాదన వినకుండా ఏకపక్షంగా నీటి విడుదలను ఎలా నిలిపివేస్తారని ఈఎన్‌సీ వెంకటేశ్వరరావు ప్రశ్నించారు. నీటి నష్టాలపై తెలంగాణ చెబుతున్న లెక్కలు ఏకపక్షంగా ఉన్నాయన్నారు. సంయుక్త కమిటీ నీటి నష్టాలపై వేసిన లెక్కలను పరిగణనలోకి తీసుకుంటే వాస్తవాలు వేరే ఉంటాయన్నారు. ఆ లెక్కలు పరిగణనలోకి తీసుకుంటే ప్రస్తుతం అందుబాటులో ఉన్న 33 టీఎంసీల్లో ఏపీకి 14 టీఎంసీలకు పైగా దక్కుతాయని వెంకటేశ్వరరావు అన్నారు. ఈ వాదనల తర్వాత మార్చి కేటాయింపులపై పై విధంగా ఒక అభిప్రాయానికి వచ్చినా బయటకు వెల్లడించదలుచుకోలేదు. నీటి నష్టాలపై సోమవారం బోర్డు వద్ద రెండు రాష్ట్రాల ఈఈలు సమీక్షించనున్నారు.

ఆంధ్రప్రదేశ్‌కు కేటాయింపులు (అంకెలు టీఎంసీల్లో)

సాగర్ కుడి కాలువకు:	10.66
సాగర్ ఎడమ కాలువకు:	7.72
కృష్ణా డెల్టాకు:	4
హంద్రీనీవా:	4
మొత్తం:	26.38
తెలంగాణకు...	
ఏఎంఆర్‌పీ,	
హైదరాబాద్ తాగునీరు:	5.6
కల్వకుర్తి:	1
సాగర్ ఎడమకాలువ:	12.4
మొత్తం:	19.00

నివేదికలు సమర్పించిన కమిటీలు

నాగార్జునసాగర్ ఎడమ కాలువలో ఆంధ్రప్రదేశ్‌కు రావాల్సిన నీటి విషయంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లెక్కలకు సరిపోలని నేపథ్యంలో రెండు రాష్ట్రాల సంయుక్త అధికారులతో నియమించిన కమిటీ నివేదిక సమర్పించింది. అలాగే శ్రీశైలం నుంచి విడుదల చేసిన నీరు సాగర్‌కు చేరే క్రమంలో నష్టాలతో పాటు... నీటి ఆవిరి నష్టాలు, తాగునీటి కేటాయింపులపై మరో కమిటీ ఏర్పాటయింది. అది కూడా నివేదిక సమర్పించింది. శుక్రవారం నాటి త్రిసభ్య కమిటీ సమావేశం ఈ నివేదికలపై ఎలాంటి చర్చా చేపట్టలేదు.

వామపక్ష నేతల అరెస్టు తగదు

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు

అజిత్‌సింగ్‌నగర్, న్యూస్‌టుడే: ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు కోరుతూ శ్రీకాకుళంలో నిరసన దీక్షలు నిర్వహిస్తున్న వామపక్ష కార్యకర్తలను అరెస్టు చేయడం అమానుషమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రత్యేకహోదా, వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న నిరసన కార్యక్రమాల్లో భాగంగా శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో శాంతియుతంగా నిరసనదీక్షలు నిర్వహిస్తున్న సీపీఎం, సీపీఐ, న్యూడెమోక్రసీ కార్యకర్తలను అరెస్టు చేసి, శిబిరాలను తొలగించారని, సీపీఎం జిల్లా నాయకులు 15మందిని అక్రమంగా అరెస్టు చేశారన్నారు.

మూగబోయిన వెండితెర

ఈనాడు, హైదరాబాద్- న్యూస్‌టుడే,ఏలూరు

శుక్రవారం వస్తోందంటే చాలు... కొత్త సినిమా కబుర్ల కోసం సినీ ప్రియులు ఆసక్తికరంగా ఎదురు చూస్తుంటారు. సినిమాలు ఎలా ఉన్నాయి? ఎన్ని వసూళ్లు సాధిస్తాయి? రికార్డుల మాటేమిటి? అంటూ చర్చించుకుంటూ ఉంటారు. వారాంతాల్లో సినిమాలను వీక్షించేందుకు ప్రత్యేకంగా ప్రణాళికలు సిద్ధం చేసుకుంటారు. వాళ్లందరికీ ఈ వారం సినీ వినోదం దూరమైనట్లే. డిజిటల్ ప్రొవైడర్లకీ, చిత్ర పరిశ్రమకీ మధ్య వర్చువల్ ప్రింట్ ఫీజు (వి.పి.ఎఫ్) విషయంలో వివాదం నడుస్తుండడంతో శుక్రవారం నుంచి థియేటర్లలో ప్రదర్శనలు నిలిచిపోయాయి. నిర్మాతలు తమ చిత్రాలకి సంబంధించిన ప్రింట్‌ని ఇవ్వకపోవడంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని సుమారు 1600 థియేటర్లలో ప్రదర్శనలు ఆగిపోయాయి. దక్షిణాది రాష్ట్రాల్లోని పరిశ్రమలన్నీ కూడా ప్రదర్శనల నిలిపివేతకి పిలుపునిచ్చాయి. తెలుగు రాష్ట్రాలతో పాటు, కేరళలో పూర్తిగా ప్రదర్శనలు నిలిచిపోగా కర్ణాటక, తమిళనాడులో కొన్ని చోట్ల మాత్రమే సినిమాలు ప్రదర్శితమైనట్టు తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి అధ్యక్షుడు, దక్షిణ భారత చలన చిత్ర జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ జెమిని కిరణ్ తెలిపారు. ఈ నెల 9 నుంచి కర్ణాటకలో కూడా పూర్తి స్థాయిలో ప్రదర్శనల్ని నిలిపివేస్తామని ఆ చిత్ర పరిశ్రమ వర్గాలు తెలిపినట్టు వెల్లడించారు. చిత్ర పరిశ్రమకి చెందిన నిర్మాతలకి, పంపిణీదారులకి, ప్రదర్శనకారులకి నష్టమే అయినప్పటికీ... డిజిటల్ కంటెంట్ ప్రొవైడర్లు వసూలు చేస్తున్న ఛార్జీలు కూడా అందరికీ భారం అవుతుండడంతో ప్రదర్శనల నిలిపివేతకి మద్దతు బలంగా ఉంది. క్యూబ్, యు.ఎఫ్.ఓ వంటి డిజిటల్ కంపెనీల చేతుల్లోనే ఎక్కువ థియేటర్లు ఉన్నాయి. ఆ రెండు కంపెనీలు వర్చువల్ ప్రింట్ ఫీజుని తగ్గిస్తే సమస్య పరిష్కారమవుతుంది. ప్రస్తుతం వసూలు చేస్తున్న ఛార్జీల్లో 25 శాతం వెంటనే తగ్గించాలని పరిశ్రమ డిమాండ్ చేస్తుండగా... డిజిటల్ కంపెనీలు 9 శాతం తగ్గిస్తామని చెబుతున్నాయి. దీనిపై రోజూ చర్చలు జరుగుతూనే ఉన్నాయి. శనివారం కూడా మరో దఫా చర్చలు జరగనున్నాయని సమాచారం. ఈ విషయంపై తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి డిజిటల్ విభాగం ఛైర్మన్ కె.ఎల్.దామోదర్ ప్రసాద్ మాట్లాడుతూ... "డిజిటల్ కంపెనీలు మా డిమాండ్లని ఒప్పుకొనేవరకు ప్రదర్శనల నిలిపివేత కొనసాగుతుంది..." అని తెలిపారు. ఇదివరకు రీళ్లతో కూడిన ప్రింట్ల వల్ల వారానికి రూ. 2 వేలకి మించి భారం పడేది కాదని, డిజిటల్ కంపెనీల వసూళ్ల వల్ల నిర్మాతలు, పంపిణీదారులపై వారానికి రూ.12,500 భారం పడుతోందని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. డిజిటల్ కంపెనీలు వ్యాపార ప్రకటనలతోనూ పెద్దఎత్తున సొమ్ము చేసుకొంటున్నాయని, అందులో పరిశ్రమకి ఒక్క ప్రకటన కూడా ఇవ్వడం లేదని పరిశ్రమ ఆరోపిస్తోంది. ప్రకటనల్లో రెండింటిని పరిశ్రమ కోసం ఇవ్వాలని, వి.పి.ఎఫ్ ఛార్జీలు విడతలవారీగా తగ్గిస్తూ సమూలంగా తీసేయాలనేది పరిశ్రమ డిమాండ్. మార్చి 16 నుంచి వేసవి సీజన్ ప్రారంభం కాబోతోంది. చిత్ర పరిశ్రమకి కీలకమైన ఆ సీజన్‌కి ఇబ్బంది కలగకూడదంటే, ఈ వారంలోనే చర్చలు కొలిక్కి రావల్సిన అవసరం ఉంది. శనివారం జరిగే చర్చల తర్వాత ప్రదర్శనల నిలిపివేతపై ఓ స్పష్టత వచ్చే అవకాశాలున్నాయి. తొలి రోజు హైదరాబాద్‌లో 250కు పైగా సినిమా థియేటర్లను మూసివేశారు. దీని వల్ల రోజుకు రూ.20-30 కోట్ల వరకూ థియేటర్ల యాజమాన్యాలు నష్టపోవాల్సి వస్తుందని ఓ సినిమా థియేటర్ యజమాని విశ్లేషించారు. విజయవాడ నగరంలో తొలి రోజు రూ.60లక్షలకుపైగా నష్టం వాటిల్లినట్లు పరిశ్రమ వర్గాలు పేర్కొన్నాయి. నగర, జిల్లా వ్యాప్తంగా 200లకుపైగా స్క్రీన్లు ఉన్నాయి. థియేటర్ల మూసివేతతో కార్మికులంతా ఆందోళన చెందుతున్నారు.



హైదరాబాద్‌లో బోసిపోయిన ఓ థియేటర్ కాంప్లెక్సు

నోటీసులు జారీ చేసేందుకు చర్యలు


ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను థియేటర్లలో ప్రదర్శించాల్సి ఉండగా దీనిని ఆ సంస్థలు అమలు చేయడం లేదు. ఎఫ్‌డీసీ ఛైర్మన్‌గా డిజిటల్ కంటెంట్ ప్రొవైడర్ సంస్థలైన యూఎఫ్‌వో, క్యూబ్‌లకు లీగల్ నోటీసులు జారీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నా. రుసుములను తగ్గించకపోవడంతో నిర్మాతలు, ఎగ్జిబిటర్లు ఎంతో నష్టపోతున్నారు. థియేటర్లు మూతపడే పరిస్థితి ఏర్పడింది. 50 శాతం తగ్గించమంటే కేవలం 8 శాతం తగ్గించాయి. దీనివల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదు. అందుకే నిర్మాతలు, ఎగ్జిబిటర్లు సమ్మెకు దిగారు.

- అంబికా కృష్ణ, రాష్ట్ర సినీ, టెలివిజన్, నాటకరంగ అభివృద్ధి సంస్థ ఛైర్మన్

సినిమా థియేటర్ల బంద్‌కు సీపీఐ మద్దతు

విజయవాడ, న్యూస్‌టుడే : సినిమా డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్ల తీరుకు నిరసనగా చేపట్టిన సినిమా థియేటర్ల బంద్‌కు సీపీఐ సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

రచయిత దేవరాజు రవి కన్నుమూత



ఘట్‌కేసర్, న్యూస్‌టుడే: ప్రముఖ రచయిత, సినీ సమీక్షకుడు, కథకుడు, నవలాకారుడు, సాంఘిక సేవా కార్యకర్త దేవరాజు రవి (80) శుక్రవారం కన్నుమూశారు. కొంతకాలం నుంచి ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. మేడ్చల్ జిల్లా మేడిపల్లి గ్రీన్‌హిల్స్ కాలనీలోని స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. దేవరాజు రవి 12 నవలలు, 200పైగా కథలు, 1250 సినిమా సమీక్షలు, పలు ఇతర వ్యాసాలు రాశారు. 1959లో రామం అనే నవలతో ప్రారంభమైన ఆయన రచనా వ్యాసంగం తుదవరకు కొనసాగింది. మూడు కవితా సంపుటాలు, రెండు కథా సంపుటాలు వెలువరించారు. సితార, శివరంజని, మేఘసందేశం, నంబర్‌వన్ సినిమా పత్రికల్లో ఆయన చేసిన సమీక్షలు పాఠకుల్ని ఆకట్టుకున్నాయి. ఆయన రచనల్ని సర్వేపల్లి రాధాకృష్ణన్, వీవీ గిరి వంటి ప్రముఖులు మెచ్చుకున్నారు. నంది అవార్డుల కమిటీలో దేవరాజు రవి రెండు సార్లు సభ్యులుగా ఉన్నారు. తెలుగులో తొలి డిటెక్టివ్ నవల 'వాడే వీడు' రచయిత దేవరాజు వెంకటకృష్ణారావు కుమారుడైన రవి సాంఘిక కార్యకర్త కూడా. కుష్టువ్యాధి నిర్మూలనకు విశేషంగా కృషి చేశారు. లెప్రసీ డాక్టర్‌గా ఉద్యోగం చేసి పదవీ విరమణ అనంతరం ఆ సేవల్ని కొనసాగించారు. ఏప్రిల్ 5, 1938లో జన్మించిన రవికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆయన భార్య సీత సైతం రచయిత్రి. దేవరాజు రవి మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

ప్రపంచ నం.2తో పోరాటం ఆరంభం

అర్జెంటీనాతో భారత్ ఢీ నేడు ● అజ్లాన్ షా హాకీ

మధ్యాహ్నం 1.30నుంచి స్టార్‌స్పోర్ట్స్-1లో

ఇపో (మలేసియా): కీలక టోర్నీలకు సన్నద్ధమవుతున్న భారత హాకీ జట్టు ముందు ముఖ్యమైన సిరీస్. అజ్లాన్ షా కప్ హాకీ ఆరంభం శనివారమే. తొలి మ్యాచ్‌లో యువ భారత జట్టు ప్రపంచ నం.2 అర్జెంటీనాను ఢీకొననుంది. 2020 ఒలింపిక్స్ బెర్తుపై కన్నేసిన హాకీ ఇండియా (హెచ్ఐ).. భారత జట్టు ఈ ఏడాది కామన్వెల్త్ క్రీడలు, ఆసియా క్రీడలు, ప్రపంచ కప్ లాంటి మెగా టోర్నీలు ఆడాల్సివున్న నేపథ్యంలో సీనియర్ ఆటగాళ్లందరికీ విశ్రాంతినిచ్చింది. మాజీ కెప్టెన్ సర్దార్ సింగ్‌కు జట్టు పగ్గాలు అప్పగించిన హెచ్ఐ.. ముగ్గురు కొత్త కుర్రాళ్లు మన్‌దీప్ మోర్, సుమిత్ కుమార్, శిలానంద్ లక్రా అవకాశం కల్పించింది. మిగతా ఆటగాళ్లకు పెద్దగా అనుభవం లేదు. కెరీర్ చరమాంకంలో ఉన్న సర్దార్ సింగ్‌కుఇది వీడ్కోలు సిరీస్ అన్న ప్రచారం సాగుతున్న నేపథ్యంలో అతడు ఎలా ఆడతాడన్నది ఆసక్తికరంగా మారింది. తాను మాత్రం ఒలింపిక్స్ వరకు ఆడాలనుకుంటున్నానని చెప్పిన సర్దార్ సత్తా చాటి జట్టులో చోటు పటిష్టం చేసుకోవాలని పట్టుదలగా ఉన్నాడు. వైస్ కెప్టెన్ రమణ్‌దీప్ సింగ్, ఎస్కే ఉతప్ప, గుర్జాంత్ సింగ్ లాంటి సీనియర్లు మినహాయిస్తే.. జట్టులో అంతా కుర్రాళ్లే ఉన్నారు. మరి ఇలాంటి జట్టును సర్దార్ ఎలా నడిపిస్తాడో చూడాలి. భారత్‌తో పాటు.. ప్రపంచ నం.1 ఆస్ట్రేలియా, అర్జెంటీనా, ఇంగ్లాండ్, ఐర్లాండ్, ఆతిథ్య మలేసియా కప్ కోసం పోరాడనున్నాయి. 1983లో ఆరంభమైన ఈ కప్‌ను ఇప్పటివరకు భారత్ ఐదుసార్లు గెలుచుకుంది. చివరిసారిగా 2016లో సర్దార్ సారథ్యంలో భారత జట్టు రజతంతో సరిపెట్టుకుంది.



ఫామ్ పోయింది.. కెప్టెన్సీ చేజారింది.. జట్టులో చోటూ కరవైంది.. ఏడాదిగా అసలు ఊసులోనే లేడు..! ఇక అతడి కెరీర్ ముగిసి నట్లే అనుకున్నారు! కానీ.. అనూహ్యంగా అతడికి భారత జట్టుకు సారథ్యం వహించే అవకాశం లభించింది. భారత హాకీ పాతాళానికి పడిన వేళ.. అసాధారణ ఆటతో, అద్భుత కెప్టెన్సీతో జాతీయ క్రీడ బాగుపడటంలో కీలక పాత్ర పోషించిన సర్దార్ సింగ్‌కు నిరూపించుకునేందుకు మరో అవకాశం.. బహుశా ఇదే ఆఖరిది!

సత్తా.. చూపిస్తాడా..!

ఈనాడు క్రీడావిభాగం

పదేళ్ల కిందటి సంగతి. 2008 అజ్లాన్ షా కప్ హాకీకి సమయం ఆసన్నమైంది. భారత్ జట్టు కూడా పోటీపడాలి. ఐతే బీజింగ్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించలేక తీవ్ర నిరాశలో మునిగిపోయిన వేళ.. జట్టులో చోటును అమ్మేసిన లంచగొండి అధికారి ఉదంతం వెలుగు చూడటంతో భారత హాకీ అతలాకుతలమైంది. కొన్నాళ్ల పాటు మరే టోర్నీలో జట్టును ఆడించకూడదని సమాఖ్య నిర్ణయానికొచ్చేసింది! ఐతే.. 2009 జూనియర్ ప్రపంచకప్ ఆడాల్సివున్న నేపథ్యంలో కుర్రాళ్లకు అవకాశం కల్పించేందుకుగాను కుర్ర జట్టును అజ్లాన్ షా టోర్నీకి ఎంపిక చేసింది. అప్పటికి కొద్ది కాలం నుంచి నిలకడగా జట్టులో ఆడుతున్న సర్దార్ సింగ్‌కు పగ్గాలు అందించింది. అందివచ్చిన ఆ అవకాశాన్ని రెండు చేతులా అందిపుచ్చుకున్నాడు సర్దార్. అసలు ఎలాంటి అంచనాలు లేకుండా బరిలో దిగిన భారత జట్టు సర్దార్ సారథ్యంలో ఏకంగా ఫైనల్‌కు దూసుకెళ్లింది. పెద్ద టోర్నీల్లో పదమూడేళ్ల తర్వాత భారత జట్టు ఫైనల్ చేరడం అదే తొలిసారి. స్వర్ణం గెలవడంలో భారత జట్టు విఫలమైంది గానీ.. మసకబారిన భారత హాకీ అభివృద్ధి దిశగా తొలి అడుగు వేసింది అప్పుడే. సర్దార్ సింగ్ కెరీర్ మేలిమలుపు తిరిగింది అక్కడే. పదేళ్ల విరామం తర్వాత మళ్లీ యువ జట్టుతో అతడు మలేసియాలో అడుగు పెట్టాడు. దశాబ్దం కిందట అతడిపై ఎలాంటి ఒత్తిడి లేదు. జట్టు గెలిచినా ఓడినా పట్టించుకునేవారు లేరు. కానీ ఇప్పుడు అతడు వేసే ప్రతి అడుగుపై, తీసుకునే ప్రతి నిర్ణయంపై నిషా కళ్లు ఉంటాయనడంలో సందేహం లేదు. అతడి కెరీర్ కొనసాగుతుందా లేదా అన్నది తేలేది ఇప్పుడు అజ్లాన్ షా హాకీ కప్‌లోనే. రెండేళ్లుగా చోటు నిలబెట్టుకోవడమే కష్టంగా మారిన అతడికి.. గౌరవప్రదంగా వీడ్కోలు పలికేందుకు హాకీ ఇండియా కెప్టెన్‌గా ఎంపిక చేసిందని సమాచారం.

సవాల్‌కు నిలిచేనా..: కొత్త కోచ్ మారిన్ షోర్డ్ యువకులపై నమ్మకం ఉంచుతున్న నేపథ్యంలో సర్దార్ అసలు జట్టు ప్రణాళికల్లోనే లేడు. 2016లో కెప్టెన్సీ కోల్పోయిన అతడికి ప్రస్తుతం జట్టులో చోటే కష్టమైంది. వ్యక్తిగత విభేధాలు, ఫామ్‌లేమి కారణాలేవైతేనేం అతడు ఒకప్పటి అంత గొప్పగా ఆడటం లేదన్నది వాస్తవం. 31 ఏళ్ల సర్దార్‌కు ప్రస్తుతం జట్టులో స్థిరమైన పొజిషన్ కూడా లేదు. ఓల్ట్‌మన్ హయాంలో ఫార్వర్డ్‌లో ఆడిన సర్దార్.. ఒలింపిక్స్‌లో తనకిష్టమైన మిడ్‌ఫీల్డ్‌లో ఆడాడు. మన్‌ప్రీత్ దూకుడు పెరగడంతో.. కోచ్ మారిన్ సర్దార్‌ను డిఫెండర్‌గా మార్చేశాడు. చివరికి అతడిని జట్టు నుంచి తప్పించేశాడు. కోచ్ యువ తరంపై విశ్వాసం పెట్టుకున్న నేపథ్యంలో కుర్రాళ్ల సవాల్‌కు అతడు ఎలా ఎదుర్కొంటాడన్నది సవాలే. హాకీ ఇండియా ఆలోచనలు ఎలా ఉన్నా మరో రెండేళ్లు ఆటకు వీడ్కోలు పలికే ఆలోచనలు తనకు లేవని సర్దార్ స్పష్టం చేస్తున్నాడు. 2020 ఒలింపిక్స్‌లో పోటీపడాలనుకుంటున్నట్లు తన ఉద్దేశాన్ని స్పష్టం చేశాడు. "భారత జట్టును నడిపించే అవకాశం లభించడం ఎప్పుడైనా గొప్ప గౌరవమే. మళ్లీ ఇన్ని రోజులకు నాకు ఆ అవకాశం దక్కింది. ఈసారి నేనేంటో నిరూపించుకుంటా" అని విశ్వాసం వ్యక్తం చేస్తున్నాడు. ఈసారి అజ్లాన్ షా హాకీలో భారత జట్టు ఎలా ఆడుతుందనే దానికంటే ఎక్కువగా.. సర్దార్ సింగ్ ఎలా ఆడతాడన్నదానిపైనే అందరి దృష్టి నెలకొంది. సత్తా చాటితే మరికొంత కాలం ఆడొచ్చు.. లేదంటే అతడి కెరీర్‌కు ఇది ఆఖరి టోర్నీ కావొచ్చు..!

నవ్‌జోత్ పసిడి చరిత్ర

ఆసియా రెజ్లింగ్‌లో స్వర్ణం సొంతం ● సాక్షి మలిక్‌కు కాంస్యం



బిష్కెక్ (కిర్గిజ్‌స్థాన్): నవ్‌జోత్ కౌర్ చరిత్ర సృష్టించింది. ఆసియా రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణం గెలిచిన భారత తొలి మహిళగా రికార్డు సాధించింది. శుక్రవారం 65 కిలోల విభాగంలో అసాధారణ ప్రదర్శన చేసిన నవ్‌జోత్ పసిడి గెలుచుకోగా.. రియో ఒలింపిక్స్‌లో కాంస్య పతక విజేత సాక్షి మలిక్ కాంస్యంతో సరిపెట్టుకుంది.

నవ్‌జోత్ కౌర్.. భారత రెజ్లింగ్‌లో ఈ పేరు చాలా ఏళ్లుగా వినిపిస్తోందే. ఐతే.. పెద్ద టోర్నీల్లో ఒక్కసారి కూడా మెరవలేదు. 2013 ఆసియా ఛాంపియన్‌షిప్‌లో రజతం నెగ్గిన ఈ పంజాబీ రెజ్లర్.. 2014 కామన్వెల్త్ క్రీడల్లో కాంస్యం గెలిచింది. ప్రతిభ ఉన్నా మెగా టోర్నీల్లో విఫలమవుతోన్న 28 ఏళ్ల నవ్‌జోత్ ఎట్టకేలకు పసిడి కరవు తీర్చుకుంది. కిర్గిజ్‌స్థాన్ ఆసియా రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో ఆమె స్వర్ణం సొంతం చేసుకుంది. శుక్రవారం మహిళల 65 కిలోల విభాగంలో తిరుగులేని ప్రదర్శన చేసిన నవ్‌జోత్ ఫైనల్‌ను ఏకపక్షంగా మార్చేసింది. తుది పోరులో 9-1తో మియా ఇమాయ్ (జపాన్)ను చిత్తు చేసింది. ఆరంభంలో ప్రత్యర్థి దూకుడు ప్రదర్శించిన వెంటనే ఆమెపై పట్టు సాధించిన నవ్‌జోత్ ఏ దశలోనూ వెనక్కి తగ్గలేదు. ఐతే స్టార్ రెజ్లర్ సాక్షికి మాత్రం నిరాశ తప్పలేదు. ఆమె కాంస్యంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. 62 కిలోల విభాగంలో కాంస్యం కోసం జరిగిన పోరులో సాక్షి 10-7తో కాసిమోవా (కజకిస్థాన్)ను ఓడించింది. తొలి రౌండ్ ముగిసేసరికి 5-6తో వెనకబడిన సాక్షి ఆ తర్వాత అసాధారణంగా పుంజుకుని మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. ఆధిక్యంలోకి వెళ్లాక పూర్తి రక్షణాత్మకంగా మారిన సాక్షి.. ఆఖరి రెండు నిమిషాల్లో ప్రత్యర్థికి ఒక్క పాయింటు కూడా కోల్పోలేదు. మొత్తంమీద భారత పతకాల సంఖ్య ఆరుకు చేరింది. ఒక స్వర్ణం, రజతం, నాలుగు కాంస్య పతకాలు ఖాతాలో ఉన్నాయి.



విజేత భారత్

ప్రపంచకప్ టీమ్ స్నూకర్ టోర్నీ

దోహా: ఐబీఎస్ఎఫ్ టీమ్ స్నూకర్ ప్రపంచకప్‌లో భారత్ విజేతగా నిలిచింది. ఫైనల్లో భారత్ 3-2తో పాకిస్థాన్‌పై విజయం సాధించింది. మొదట భారత్ 0-2తో వెనుకబడినప్పటికీ, తర్వాత గొప్పగా పుంజుకుని టైటిల్ సాధించింది. భారత జట్టులో స్టార్ క్యూయిస్ట్ పంకజ్ అడ్వాణీతో పాటు చంద్ర, మనన్ ఉన్నారు. అంతకుముందు సెమీఫైనల్లోనూ భారత్ 3-2 తేడాతోనే ఇరాన్‌పై గెలిచింది. మరో సెమీస్‌లో పాక్ 3-2తోనే హాంకాంగ్‌పై నెగ్గింది.

అరుణకు ఘన స్వాగతం



ఈనాడు డిజిటల్, హైదరాబాద్: ప్రపంచకప్ జిమ్నాస్టిక్స్‌లో కాంస్యం గెలిచి ఆ ఘనత సాధించిన తొలి భారత క్రీడాకారిణిగా చరిత్ర సృష్టించిన బుడ్డా అరుణరెడ్డికి ఘన స్వాగతం లభించింది. అరుణ శుక్రవారం హైదరాబాద్ చేరుకుంది. విమానాశ్రయం దగ్గర శాట్స్, తెలంగాణ ఒలింపిక్ సంఘం, జిమ్నాస్టిక్ సంఘం అధికారులు, అభిమానులు, కుటుంబ సభ్యులు ఆమెకు స్వాగతం పలికారు. ఓపెన్ టాప్ జీప్‌లో విమానాశ్రయం నుంచి అత్తాపూర్‌లోని ఆమె నివాసం వరకూ అభిమానులు ర్యాలీ నిర్వహించారు.

కామన్వెల్త్ పతకమే లక్ష్యం: ఏప్రిల్ 4న ఆరంభమయ్యే కామన్వెల్త్ క్రీడల్లో పతకం సాధించడమే తన ప్రస్తుత లక్ష్యమని అరుణ తెలిపింది. "జిమ్నాస్టిక్ క్రీడాకారిణుల జీవితం ఎలా ఉంటుందో నాకు తెలుసు. ఏళ్ల తరబడి కఠోర సాధన చేస్తేనే ఫలితం ఉంటుంది. పతకం గెలవడానికి నాకు పద్నాలుగేళ్ల సమయం పట్టింది. కామన్వెల్త్‌లో పతకం సాధించడమే నా లక్ష్యం" అని అరుణ పేర్కొంది.

దక్షిణాఫ్రికా ఢమాల్

- **162 పరుగులకే కుప్పకూలిన సఫారీ జట్టు**
- **తొలి టెస్టులో ఆసీస్‌కు 189 పరుగుల ఆధిక్యం**



స్టార్క్ (5/34)

డర్బన్: భారత్ చేతిలో వన్డే, టీ20 సిరీస్‌లు ఓడి ఆత్మవిశ్వాసం కోల్పోయిన దక్షిణాఫ్రికా.. ఆస్ట్రేలియాతో నాలుగు టెస్టుల సిరీస్ తొలి మ్యాచ్‌లోనూ తడబడింది. బ్యాట్స్‌మెన్ ఘోర వైఫల్యంతో ఆ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 162 పరుగులకే కుప్పకూలి, ప్రత్యర్థికి 189 పరుగుల భారీ ఆధిక్యాన్ని సమర్పించుకుంది. రెండో రోజు రెండో సెషన్లో తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన దక్షిణాఫ్రికా.. సాయంత్రానికల్లా ఆలౌటైపోయింది. ఫాస్ట్ బౌలర్ మిచెల్ స్టార్క్ (5/34), స్పిన్నర్ లైయన్ (3/50)ల ధాటికి 51.4 ఓవర్లలోనే ఇన్నింగ్స్‌ను ముగించింది. స్టార్ బ్యాట్స్‌మన్ ఏబీ డివిలియర్స్ (71 నాటౌట్; 127 బంతుల్లో 11×4) ఒంటరి పోరాటం చేశాడు. పిచ్ స్పిన్నర్లకు అనుకూలిస్తుండటంతో ఇన్నింగ్స్ ఆరంభంలోనే బౌలింగ్‌కు వచ్చిన లైయన్.. డీన్ ఎల్గర్ (7), హషీమ్ ఆమ్లా (0)లను స్వల్ప వ్యవధిలో ఔట్ చేసి దక్షిణాఫ్రికాను గట్టి దెబ్బ తీశాడు. ఈ దశలో మార్‌క్రమ్ (32)తో కలిసి డివిలియర్స్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేశాడు. కానీ మార్‌క్రమ్ ఔటయ్యాక ఏబీకి మిగతా బ్యాట్స్‌మెన్ నుంచి సహకారం లేకపోయింది. ఆ తర్వాత డుప్లెసిస్ (15), డికాక్ (20) మాత్రమే రెండంకెల స్కోర్లు చేశారు. ఓ వైపు వికెట్లు పడుతున్నా డివిలియర్స్ ధాటిగా ఆడుతూ పోవడంతో దక్షిణాఫ్రికా ఆ మాత్రం స్కోరైనా చేయగలిగింది.

ఆసీస్.. ఇంకో 126: అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 225/5తో శుక్రవారం ఉదయం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆసీస్.. ఇంకో 126 పరుగులు జోడించి మిగతా ఐదు వికెట్లు కోల్పోయింది. 32 పరుగులతో బ్యాటింగ్ కొనసాగించిన మిచెల్ మార్ష్ (96; 173 బంతుల్లో 13×4, 1×6) విలువైన ఇన్నింగ్స్ ఆడటంతో ఆసీస్ అనుకున్న దాని కంటే ఎక్కువ స్కోరే చేయగలిగింది. తొమ్మిదో స్థానంలో వచ్చిన మిచెల్ స్టార్క్ (35; 25 బంతుల్లో 4×4, 2×6) ఉన్నంతసేపూ సఫారీ బౌలర్లపై ఎదురుదాడి చేసి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. స్టార్క్ ఔటయ్యాక కూడా మార్ష్ పట్టుదల కొనసాగించడంతో స్కోరు 350 దాటింది. మార్ష్ తొమ్మిదో వికెట్ రూపంలో వెనుదిరిగిన కాసేపటికే ఇన్నింగ్స్ ముగిసింది. దక్షిణాఫ్రికా బౌలర్లలో స్పిన్నర్ కేశవ్ మహరాజ్ (5/124) ఆకట్టుకున్నాడు. ఫిలాండర్ (3/59), రబాడ (2/74) కూడా రాణించారు.

ఇతడు శార్దూలేనా..!



ముంబయి: ముంబయి లోకల్ రైలు.. అంధేరి నుంచి పాల్గర్ వెళ్తోంది. ఇందులో విశేషమేం లేదు! ఐతే ఆ రైల్లో ఓ కుర్రాడు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాడు. సాధారణంగా ప్రయాణం చేసే వారి గురించి మరొకరు ఆలోచించే పరిస్థితి ఉండదు. ఐతే అతడు మాత్రం చూడ్డానికి టీమ్‌ఇండియా పేసర్ శార్దూల్ ఠాకూర్‌లా కనిపిస్తున్నాడు. కానీ భుజానికి ఓ బ్యాగు వేసుకుని కళాశాల కుర్రాడిని తలపిస్తున్నాడు. ఒకవేళ అతడు శార్దూల్ ఠాకూరే అయితే లోకల్ ట్రైన్‌లో ఎందుకు ప్రయాణిస్తాడు. ఇలాంటి సందేహాల మధ్య కొందరు కుర్రాళ్లు అతడిని 'నువ్వు భారత క్రికెటర్‌వా' అని ప్రశ్నించారు కూడా. గూగుల్‌లో అతడి ఫొటోల కోసం శోధించిన తర్వాత ఖరారు చేసుకున్నారు.. తమతో ప్రయాణిస్తోంది శార్దూల్ ఠాకూరేనని..! అయినా టీమ్‌ఇండియా యువ పేసర్ అలా రైల్లో ఎందుకు ప్రయాణిస్తాడన్నదే కదా సందేహం. టీమ్‌ఇండియా స్థాయికి ఎదిగే క్రమంలో నిత్యం అతడి ప్రయాణం సాగింది రైల్లోనే..! పాల్గర్‌లోని తన ఇంటి నుంచి ముంబయి వచ్చి అతడు శిక్షణ పొందేవాడు. రైల్లో తనతో ప్రయాణించే కొందరు.. 'ఇంత దూరం నుంచి వచ్చే నువ్వు భారత జట్టుకు ఆడే స్థాయికి ఎదగగలవా. సమయం వృథా చేసుకోకు' అని సలహాలు కూడా ఇచ్చేవారట. మరికొందరు ముంబయి జట్టుకు ఎప్పుడు ఆడతావ్.. భారత జట్టుకు ఎంపికయ్యే అవకాశముందా అని ఆసక్తిగా ప్రశ్నించేవారట. ఇలా వారి ప్రశ్నలకు సమాధానం చెబుతూనే తన పేస్‌కు పదును పెట్టుకున్న శార్దూల్ టీమ్‌ఇండియా స్థాయికి ఎదిగాడు. అయినా ఎప్పట్లానే అతడు రైల్లో ప్రయాణించడం విశేషం. దక్షిణాఫ్రికా పర్యటన ముగించుకుని ముంబయిలో అడుగుపెట్టిన అతడు.. నేరుగా రైల్వే స్టేషన్‌కు వెళ్లి.. పాల్గర్ వెళ్లే లోకల్ రైలును అందుకున్నాడు. తనను గుర్తించి సెల్ఫీ తీసుకునేందుకు కుర్రాళ్లు పోటీపడగా.. పాల్గర్ వచ్చే వరకు ఆగండని చెప్పి.. వారందరితో ఫొటోలు దిగాడు. శార్దూల్‌ను నిత్యం రైల్లో చూసే పెద్దలు మాత్రం.. ఈ కుర్రాడు ఎప్పుడో ఒకసారి భారత జట్టుకు ఆడతాడని తాము ముందే ఊహించామని ఆనందం వ్యక్తం చేశారట. ఓ పత్రికతో ఇంటర్వ్యూ సందర్భంగా శార్దూల్ ఠాకూర్ ఈ విషయాలను పంచుకున్నాడు.



సౌత్‌జోన్ ఛాంప్ ఆంధ్ర

మహిళల అండర్-23 వన్డే లీగ్

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: బీసీసీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన సౌత్‌జోన్ మహిళల అండర్-23 వన్డే లీగ్‌లో ఆంధ్ర జట్టు విజేతగా నిలిచింది. చెరో 16 పాయింట్లతో ఆంధ్ర, కేరళ టోర్నీని ముగించాయి. అయితే మెరుగైన రన్‌రేట్ ఉండడంతో ఆంధ్ర ఛాంపియన్‌గా నిలిచింది. 'సౌత్‌జోన్ విజేతగా నిలిచిన ఆంధ్ర జట్టుకు శుభాకాంక్షలు. ఈ విజయం ఎంతో స్ఫూర్తినిస్తోంది. ఆంధ్ర మహిళల జట్టు బలంగా ఎదుగుతుందనడానికి ఇది నిదర్శనం" అని ఆంధ్ర క్రికెట్ సంఘం తెలిపింది. ఆంధ్ర జట్టులోని అనూష, అంజలి, పద్మజ సౌత్‌జోన్ జట్టుకు ఎంపికయ్యారు.



జూనియర్ చీఫ్ సెలక్టర్ పదవికి

ప్రసాద్ రాజీనామా

దిల్లీ: భారత మాజీ పేసర్ వెంకటేష్ ప్రసాద్.. జాతీయ జూనియర్ క్రికెట్ సెలక్షన్ కమిటీ ఛైర్మన్ పదవికి రాజీనామా చేశాడు. వ్యక్తిగత కారణాలతోనే తాను తప్పుకుంటున్నట్లు ప్రసాద్ బీసీసీఐకి చెప్పినట్లు సమాచారం. ప్రసాద్ 30 నెలల పాటు ఈ పదవిలో కొనసాగాడు. ప్రసాద్ నేతృత్వంలోని కమిటీ ఎంపిక చేసిన అండర్-19 జట్టు ప్రపంచకప్ గెలిచిన నెల రోజుల్లోపే అతను తన పదవికి రాజీనామా చేయడం గమనార్హం. ఐపీఎల్‌లో కోచ్ పదవి చేపట్టాలని యోచిస్తున్న ప్రసాద్.. విరుద్ధ ప్రయోజనాల అంశం తెరమీదికి వస్తుందేమో అన్న ఆలోచనతో ముందే బోర్డు పదవిని వదులుకున్నట్లు చెబుతున్నారు. బీసీసీఐతో అతడి సంబంధాలు కూడా అంత బాగా లేవని సమాచారం. "ప్రసాద్‌కు సర్దిచెప్పే ప్రయత్నం చేశాను కానీ.. తన నిర్ణయంపై పట్టుదలగా ఉన్నాడని అర్థమైంది. ప్రతిభాన్వేషణలో ప్రసాద్‌కు తిరుగులేదు. భారత్ జూనియర్ ప్రపంచ ఛాంపియన్‌గా నిలవడంలో ప్రసాద్ పాత్ర కీలకం" అని బీసీసీఐ తాత్కాలిక అధ్యక్షుడు సీకే ఖన్నా అన్నాడు.

కార్ల్‌సన్‌కు లలిత్ చెక్



విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: తెలుగుతేజం ముసునూరి లలిత్‌బాబు సంచలన విజయం సాధించాడు. ఆన్‌లైన్ ప్రొ చెస్ లీగ్-2 టోర్నీలో భాగంగా అతను ప్రపంచ ఛాంపియన్ మాగ్నస్ కార్ల్‌సన్ (నార్వే)ను ఓడించాడు. దిల్లీ డైనమేట్స్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న లలిత్.. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో నార్వే గ్నోమెస్ జట్టుకు చెందిన కార్ల్‌సన్‌పై విజయాన్ని నమోదు చేశాడు. ఈ చెస్ లీగ్‌లో ఒక్కో డివిజన్‌లో ఎనిమిది జట్లు పోటీపడతాయి. ఈ పోరులో దిల్లీ డైనమేట్స్ 16 పాయింట్లకు 11.5 పాయింట్లు సాధించి గ్నోమెస్ జట్టును ఓడించింది. దిల్లీ డైనమేట్స్ జట్టులో లలిత్‌తో పాటు గ్రాండ్‌మాస్టర్లు పెంటేల హరికృష్ణ, అభిజిత్ గుప్తా తదితరులు ఆడుతున్నారు.

ధోని అనుభవాన్ని కొనలేం!



ముంబయి: టీమ్‌ఇండియా మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోని అనుభవం అమూల్యమైందని కోచ్ రవిశాస్త్రి అన్నాడు. "అనుభవానికి ప్రత్యామ్నాయం అనేది ఉండదు. దాన్ని మార్కెట్లో కొనలేం, అమ్మలేం. ధోని ప్రపంచ క్రికెట్ చరిత్రలోనే అత్యంత గొప్ప వన్డే ఆటగాళ్లలో ఒకడిగా నిష్క్రమిస్తాడు. అతడిది అసాధారణ అనుభవం, గొప్ప ఫిట్‌నెస్. ఒక మ్యాచ్‌ను ముగించడంలో, చివరి ఓవర్లలో బ్యాటింగ్ చేయడంలో అతడిని మించిన వాళ్లు క్రికెట్లో చాలా తక్కువమంది కనిపిస్తారు. 5, 6 లేదా 7 స్థానాల్లో ధోని లాంటి ఆటగాడుండటం వల్ల చాలా మార్పు ఉంటుంది" అని రవిశాస్త్రి చెప్పాడు.

కృత్రిమ మేధ.. రోబోటిక్స్.. నానో టెక్నాలజీ.. కొంతకాలంగా సైన్స్ రంగాన్ని సంచలన పథంలో నడిపిస్తున్న అత్యాధునిక విజ్ఞాన విభాగాలివి. ఇప్పుడీ విభాగాలన్నీ ఒకదానితో మరోటి పెనవేసుకుపోయి.. కలసికట్టుగా మానవ జీవితాల్లో అనూహ్య పురోగమనం తీసుకురాబోతున్నాయ్! మచ్చుకు రెండు ఉదాహరణలివి!

రక్షించే రోబోలొస్తున్నాయ్!

గాలించి కాపాడే ఎమిలీ!

జల ప్రమాదాలు సంభవించి జనం సరస్సుల్లో, సముద్రాల్లో మునిగిపోయినప్పుడు గాలింపు చర్యలు ఎలా ఉంటాయో మనకు తెలుసు. గజ ఈతగాళ్లు రంగంలో దిగి వెతుకులాడటం చిరకాలంగా మనకు తెలిసిన ప్రాణరక్షణ విద్య! సాంకేతికంగా మనం ఎంతగా అభివృద్ధి చెందినా చాలకాలంగా ఈ విషయంలో ఎందుకో పెద్ద పురోగతి లేదు. కానీ ఇప్పుడు పరిస్థితి అనూహ్యంగా మారిపోతోంది. ఎవరైనా నీట మునిగారంటే.. వెంటనే ఒడ్డు మీంచి 'ఎమిలీ'ని పంపితే చాలు.. ఎంత ప్రమాదకరమైన ప్రదేశానికైనా అదే వెళ్లి బాధితుల ఆచూకీ పట్టేసుకుంటుంది. ఈ 'ఎమిలీ' ఎవరా అనుకుంటున్నారా? ఇదో చిన్న రోబో. పూర్తిపేరు 'ఎమర్జెన్సీ ఇంటిగ్రేటెడ్ లైఫ్‌సేవింగ్ లేన్యార్డ్'. ప్రయోగాత్మక దశలోనే ఉన్నా.. ఇప్పటికే దీని సాయంతో గ్రీసు తీర ప్రాంత రక్షణ బృందం సముద్రంలో మునిగిపోతున్న వందలాది మంది శరణార్థుల ప్రాణాలు కాపాడింది. తర్వాత ఇటలీ, అమెరికా తీరగస్తీ బృందాలూ దీన్ని రంగంలో దింపాయి.




తాజాగా దీన్ని మరింత అత్యాధునికంగా తీర్చిదిద్దేందుకు- నీటిలో మునిగిన వారి మూలంగా మారుతున్న ఉష్ణోగ్రతలను పసిగట్టే 'థర్మల్ సెన్సింగ్'ను అమరుస్తున్నారు. అలాగే పై నుంచి వీక్షించే డ్రోన్ కెమేరాలతోనూ అనుసంధానిస్తున్నారు. ఇలా ఇది నేరుగా నీట మునిగిన బాధితులు ఎక్కడుంటే అక్కడికే తనంతట తానుగా వెళ్లిపోయేలా నేషనల్ సైన్స్ ఫౌండేషన్, టెక్సాస్ ఎఅండ్ఎం యూనివర్సిటీ పరిశోధకులు దీన్ని తీర్చిదిద్దుతున్నారు. పడవలు నీట చిక్కుకుపోవటం వంటి సందర్భాల్లో ఇది అద్భుతంగా ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. దీని ఆగమనంతో గాలింపు చర్యల్లో అనూహ్య మార్పులు తథ్యం!

- ఈనాడు ప్రత్యేక విభాగం


క్యాన్సర్ గడ్డలకు నానో అడ్డుకట్టలు

క్యాన్సర్ కణుతులను మట్టుబెట్టాలంటే ఇప్పటి వరకూ సర్జరీ చేసి వాటిని కోసెయ్యటమో.. రేడియేషన్ ఇచ్చి మాడ్చివేయటమో.. లేక తీక్షణమైన మందులు పంపి దాన్ని చంపెయ్యటమో.. ఇవే ప్రధాన మార్గాలు. కానీ నానో టెక్నాలజీ విస్తరిస్తున్న కొద్దీ.. కొత్త విధానాలూ తెర మీదికి వస్తున్నాయి. ఒంట్లో ఏ కణం బతకాలన్నా దానికి రక్త ప్రసారం ఉండాలి. క్యాన్సర్ కణాలకూ ఇదే వర్తిస్తుంది. దీన్ని ఆధారంగా చేసుకుని.. తాజాగా ఆరిజోనా విశ్వవిద్యాలయం, చైనా సైన్స్ అకాడెమీ పరిశోధకులు సంయుక్తంగా వినూత్న విధానాన్ని ఆవిష్కరిస్తున్నారు.

నానో టెక్నాలజీ సాయంతో రక్తనాళాల్లో అడ్డుకట్టలు సృష్టిస్తారు. దీంతో వాటి ద్వారా రక్త ప్రవాహం నిలిచిపోతుంది. దీంతో క్యాన్సర్ గడ్డలు రక్తం అందక వాటంతట అవే చనిపోయేలా వీరు వినూత్న విధానాన్ని ఆవిష్కరిస్తున్నారు. ఈ 'డీఎన్ఏ రోబోటిక్ నానో సిస్టమ్' విధానంలో ఎలాంటి క్యాన్సర్ గడ్డనైనా తేలికగా మట్టుబెట్టే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు.



నానోరోబోట్‌కు రక్తం గడ్డకట్టించే మందును అనుసంధానిస్తారు.
ఆ నానోబాట్‌ను క్యాన్సర్ కణితికి రక్తం తీసుకువెళ్లే రక్తనాళాల్లోకి ప్రవేశపెడతారు.



అది రక్తనాళంలో కూర్చొని.. అక్కడ రక్తం గడ్డకట్టేలా చేసి, ప్రవాహాన్ని మూసేస్తుంది.
రక్తం అందక క్యాన్సర్ కణాలు చచ్చిపోయి.. క్యాన్సర్ గడ్డ క్రమేపీ కృశించిపోతుంది.

రుచిగా వండకపోవడం... విడాకులకు ప్రాతిపదిక కానేకాదు

- ముంబయి హైకోర్టు తీర్పు
- భర్త పిటిషన్ కొట్టివేత

ముంబయి: "మా ఆవిడ తెగబారెడు పొద్దు ఎక్కిన తర్వాత కానీ నిద్రలేవడం లేదు....రుచీపచీలేని వంట చేసిపెడుతోంది. అదికూడా చాలీచాలకుండా వండుతోంది. ఒకవేళ పొద్దున్నే ఆవిడను నిద్రలేపేందుకు యత్నిస్తే తనను...తన తల్లి దండ్రులను తిట్టిపోస్తోంది. అందుకే, ఆమె నుంచి విడాకులు ఇప్పించండి' అంటూ ఓ వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌ను బాంబే హైకోర్టు కొట్టివేసింది. భార్య మీద అతడు చేసిన ఆరోపణలేవీ కూడా క్రూరత్వం, వేధింపుల కిందకు రానేరావనీ... అసలు విడాకుల కోసం యత్నించడానికి ఈ కారణాలేవీ సరైన ప్రాతిపదిక కానే కాదనీ హైకోర్టు గురువారం స్పష్టం చేసింది.

శాంతాక్రజ్ నివాసి అయిన ఓ వ్యక్తి తన భార్య నుంచి విడాకులు కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేస్తూ అంతకుముందు ఫ్యామిలీ కోర్టు కూడా ఇచ్చిన తీర్పును హైకోర్టు సమర్థించింది. ఉద్యోగస్తురాలైన ఆ ఇల్లాలు ఇంటికి కావలసిన సరకుల కొనుగోలు, వంటవార్పు, భర్త, అత్తమామలకు వంటచేయడం, ఇతరత్రా ఇంటిపనులన్నిటినీ చూసుకుంటున్నట్లు హైకోర్టు పేర్కొంది. ఉద్యోగిని అయిన ఆమె కార్యాలయం నుంచి సాయంత్రం ఆరుగంటలకు ఇంటికి తిరిగి వచ్చి....నిద్రపోతున్నారనీ...రాత్రి 8.30 దాకా వంటావార్పు జోలికే వెళ్లడం లేదన్నది పిటిషనరు ఆరోపణగా ఉంది. అంతేకాదు, తాను ఆఫీసు నుంచి అలసిసొలసి వస్తే...కనీసం గ్లాసు మంచినీళ్లు ఇవ్వడానిక్కూడా ఆమె ముందుకు రావడం లేదంటూ భర్త చేసిన ఆరోపణలన్నిటినీ భార్య ఖండించారు. ఇంటెడు చాకిరీ చేస్తున్నా అత్తామామా...భర్తా కలిసి తనను వేధిస్తున్నట్లు ఆమె ఆరోపించారు.

'విదేశాల్లో దోషి అయితే ఇక్కడి కోర్టులు పరిగణనలోకి తీసుకోవచ్చు'

ముంబయి: విదేశాల్లో నేరానికి పాల్పడినందుకు భారతీయులెవరినైనా అక్కడి న్యాయస్థానాలు దోషిగా నిర్ధారిస్తే దాన్ని మన న్యాయస్థానాలు లేదా న్యాయాధికారులు పరిగణనలోకి తీసుకోవచ్చని బొంబాయి హైకోర్టు చెప్పింది. అయితే అక్కడి కోర్టులు తీసుకున్న ఆ నిర్ణయానికి ఇక్కడి న్యాయస్థానాలు, న్యాయాధికారులు కట్టుబడి ఉండాల్సిన అవసరం లేదని, ఇక్కడి వారు తమ విచక్షణను ఉపయోగించాలని న్యాయమూర్తులు జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ కె.ఆర్.శ్రీరామ్, జస్టిస్ బి.పి.కొలబావాలాతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. లీలావతి ఆస్పత్రి ట్రస్టీ ప్రబోధ్ మెహతాను బెల్జియంలో అనైతిక ప్రవర్తన నేరానికి దోషిగా నిర్ధారించారు. ఈ కారణంగా ట్రస్టీ పదవి నుంచి ఆయనను 2013 మార్చిలో జాయింట్ చారిటీ కమిషనర్ (జేసీసీ) తొలగించారు. దీన్ని ఆయన సిటీ సివిల్ న్యాయస్థానంలో సవాల్ చేయగా న్యాయస్థానం జేసీసీ చర్యను సమర్థించింది. మెహతా హైకోర్టులో అప్పీలు చేశారు. ఈ కేసును డివిజన్ బెంచ్.. త్రిసభ్య ధర్మాసనానికి పంపించింది. ఇక్కడ న్యాయస్థానాలు తమ సొంత న్యాయాధికారాల ఆధారంగా వ్యవహరిస్తూనే విదేశాల్లోని న్యాయస్థానం నిర్ణయాన్ని పరిగణనలోకి తీసుకోవచ్చని చట్టం చెబుతోందని సుప్రీంకోర్టు గత తీర్పులను ఉటంకిస్తూ త్రిసభ్య ధర్మాసనం స్పష్టం చేసింది. విదేశాల్లో ఎవరైనా భారతీయుడు అనైతిక ప్రవర్తన కారణంగా దోషిగా నిర్ధారణ అయితే అనర్హత వేటు వేయవచ్చంది.

దక్షిణాఫ్రికా చేరిన ఐఎన్ఎస్‌వీ తరణి



తరణి వెసల్‌లోని మహిళా అధికారులు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: నావికా సాగర పరిక్రమ పేరిట చేపట్టిన సాహస యాత్రలో భాగంగా.. భారత నౌకాదళానికి చెందిన ఐఎన్ఎస్‌వీ తరణి మహిళా వెసల్ శుక్రవారం దక్షిణాఫ్రికాలోని కేప్‌టౌన్ తీరానికి చేరుకుందని నౌకాదళ వర్గాలు తెలిపాయి. హోలీ సందర్భంగా తరణి బృందానికి అక్కడ నగర మేయర్ హెలెన్‌జిల్లె సప్తవర్ణ రంగులతో స్వాగతం పలికారని చెప్పారు. ఐఎన్ఎస్‌వీ తరణిని గతేడాది సెప్టెంబరు 10న గోవాలో భారత రక్షణశాఖ మంత్రి నిర్మలాసీతారామన్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సాహస యాత్రలో లెఫ్ట్‌నెంట్ కమాండర్‌గా వర్తికాజోషి వ్యవహరిస్తుండగా, లెఫ్ట్‌నెంట్ కమాండర్లు ప్రతిభాజావెల్, పి.స్వాతితో పాటు లెఫ్ట్‌నెంట్లు ఎస్.విజయదేవి, పాయల్‌గుప్తా ఉన్నారు. మొత్తం 17,500 నాటికల్ మైళ్లు ప్రయాణించిన నౌక ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ తదితర దేశాల తీరాలను సందర్శించింది. భారత్‌లో తయారీ నినాదంతో నిర్మించిన ఐఎన్ఎస్‌వీ తరణిని మహిళా సాధికారత సాధించే దిశగా సిబ్బందిని మొత్తం మహిళలనే నియమించింది. ఐఎన్ఎస్ తరణి ఈ నెల 14న తిరుగు ప్రయాణమై... ఏప్రిల్ నెలలో గోవా తీరానికి చేరుతుందని నౌకాదళ వర్గాలు పేర్కొన్నాయి.



సింహగిరి ఘాట్‌రోడ్డు నుంచి కనువిందు చేసిన పొగమంచు సోయగం

పాలకడలిని తలపించేలా..!

సింహగిరిపై కమ్మేసిన పొగమంచు

రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం రోజురోజుకు ఉష్ణోగ్రతల్లో భారీ తేడాలు వస్తున్నప్పటికీ విశాఖపట్నం జిల్లా సింహాచలంలో వాతావరణం మాత్రం భిన్నంగా కనిపిస్తోంది. రాత్రంతా చల్లదనం, తెల్లవారుజామున పొగమంచుతో ఆహ్లాదకరంగా ఉంటోంది. శుక్రవారం ఉదయం దట్టమైన పొగమంచు సింహాచలం పరిసర ప్రాంతాలను కమ్మేసింది. సింహగిరి ఘాట్‌రోడ్డు నుంచి వీక్షించినపుడు.. దూరంగా ఉన్న ఎత్తయిన కొండలు గాల్లో తేలుతున్న అనుభూతిని కలిగించాయి. క్షీరసాగరాన్ని తలపించేలా మేఘాలు ముందుకు కదులుతూ చూపరులను కనువిందు చేశాయి.

–న్యూస్‌టుడే, అడివివరం(విశాఖపట్నం)

పెళ్లికి ముందే ఓ ఒప్పందం!

- ఎన్ఆర్ఐ వివాహాల్లో మహిళలకు రక్షణ
- చట్టబద్ధత దిశగా కేంద్రం యోచన



ఈనాడు, దిల్లీ: పెళ్లికి ముందు చేసుకునే ఒప్పందాలకు చట్టబద్ధత కల్పించే దిశగా కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది. స్త్రీ-పురుష సమానత్వాన్ని పెంపొందించే కృషిలో భాగంగా మోదీ ప్రభుత్వం ఈమేరకు సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తోంది. ఈ అంశాలపై చర్చించేందుకు గాను మార్చి నెలాఖరులో కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖ దిల్లీలో ఓ ఉన్నత స్థాయి సమావేశాన్ని నిర్వహించనుంది. హోం, న్యాయ శాఖలతో పాటు, మహిళా జాతీయ కమిషన్ ప్రతినిధులు, న్యాయ నిపుణులు కూడా చర్చల్లో పాల్గొంటారు. వివాహానికి ముందు ఒప్పందాలు చేసుకునే విధానం కొన్ని పాశ్చాత్య దేశాల్లో ప్రస్తుతం అమల్లో ఉంది. పెళ్లికి ముందే సంబంధిత జంట సంబంధిత పత్రాలపై సంతకాలు చేస్తారు. వివాహానంతరం వేరుపడే పరిస్థితి వస్తే - ఉమ్మడి ఆస్తులను ఎలా పంచుకోవాలి? నియమ నిబంధనలు ఎలా ఉండాలి? వంటివి ఆ ఒప్పందంలో స్పష్టంగా పేర్కొంటారు. అయితే పాశ్చాత్య విధానాలను ఉన్నవిఉన్నట్లుగా కాకుండా.. భారతీయ సంప్రదాయాలకు అనుగుణంగా ఓ విధానం రూపొందించే విషయమై సమావేశంలో చర్చించనున్నట్లు మహిళా, శిశు అభివృద్ధి శాఖ వర్గాలు తెలిపాయి. ప్రధానంగా ప్రవాస భారతీయులను (ఎన్ఆర్ఐ) పెళ్లి చేసుకునే మహిళలకు రక్షణ కల్పించడంతో పాటు, వారి ప్రయోజనాలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు వెల్లడించాయి. అయితే ఈ విషయంలో భారతీయ ఒప్పంద చట్టం-1872తో కీలక సవాల్ ఎదురు కానుంది. ఇందులోని 23, 26 సెక్షన్ల ప్రకారం ఇలాంటి ఒప్పందాలు చెల్లనేరవు. దేశంలోని ఏ వివాహ చట్టం కూడా ఇలా పెళ్లికి ముందు ఒప్పందాలను అంగీకరించడం లేదు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం అమల్లో ఉన్న చట్టాల సవరణపై కూడా సమావేశంలో చర్చించాల్సిన అవసరం ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి. భారత్‌లో వివాహాలన్నీ దాదాపుగా సంప్రదాయ ఒప్పందాలతోనే జరుగుతుంటాయి. ఈమేరకు మహిళల హక్కులను పరిరక్షించేలా.. వివాహ ముందస్తు ఒప్పందాలకు కొంత చట్టబద్ధత లభించేలా నిపుణులంతా కూలంకషంగా చర్చిస్తారు. ఒకసారి ఆస్తులు, చెల్లింపులు, బాధ్యతలపై చట్టబద్ధమైన ఒప్పందం కుదిరితే.. భార్యాభర్తలిద్దరూ విడిపోవాలన్నా కూడా ఒకటికి రెండు సార్లు ఆలోచిస్తారని అధికార వర్గాలు తెలిపాయి.

దలైలామాపై భారత్ వైఖరి సుస్పష్టం, సుస్థిరం

విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ వెల్లడి

దిల్లీ: బౌద్ధ మత గురువు దలైలామా పట్ల భారత ప్రభుత్వం సుస్పష్టమైన, నిలకడైన విధానంతో ఉందని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. దేశంలో మత కార్యక్రమాలను నిర్వహించుకునే స్వేచ్ఛ ఆయనకు ఉందని తెలిపింది. దేశ ప్రజలకు దలైలామా పట్ల అమితమైన గౌరవం ఉందని విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రవీశ్ కుమార్ తెలిపారు. ఈ అంశంపై భారత వైఖరిలో ఎలాంటి మార్పులేదన్నారు. చైనాతో సంబంధాలు మెరుగుపరుచుకునేందుకు దలైలామాపై తన వైఖరిని భారత్ మార్చుకుందని, దీనిలో భాగంగానే కేంద్ర కేబినెట్ కార్యదర్శి పీకే సిన్హా ఇటీవల ఒక సూచన చేస్తూ "దేశంలోని సీనియర్ నాయకులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు దలైలామా కార్యక్రమాల్లో పాల్గొనటం వాంఛనీయంకాద"ని అభిప్రాయపడ్డారంటూ మీడియాలో వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే విదేశీ వ్యవహారాల శాఖ వివరణ ఇచ్చింది.

రైతుల ప్రకృతి బాట.. దిగుబడికి రాచబాట

లాన్సింగ్: పురుగుమందుల వాడకాన్ని తగ్గించుకునేందుకు.. వివిధ దేశాల్లో రైతులు అనుసరిస్తున్న ప్రకృతి సిద్ధ మార్గాలపై పరిశోధకులు అధ్యయనం జరిపారు. వీటి ద్వారా పర్యావరణంపై ప్రతికూల ప్రభావం తగ్గడంతోపాటు.. కొన్ని సందర్భాల్లో పంట దిగుబడులూ పెరుగుతున్నాయని పేర్కొన్నారు. అమెరికాలోని మిషిగన్ విశ్వవిద్యాలయ పరిశోధకులు ఈ అధ్యయనాన్ని చేపట్టారు. కీటకాల బారి నుంచి పంటలను రక్షించుకునేందుకు.. రైతులు కొన్ని పక్షులు, జంతువులను ఉపయోగించుకుంటున్న తీరును వారు పరిశీలించారు. కొన్ని ప్రత్యేక ఏర్పాట్లు చేయడం ద్వారా ఉపయోగకరమైన జీవులను ఆకర్షిస్తున్నట్లు గుర్తించారు. మిషిగన్‌లో పళ్లతోటలను బాధించే చీడపురుగులను.. అమెరికన్ కెస్ట్రెల్ పక్షులు బాగా ఆరగిస్తాయి. అందుకే ఈ పక్షుల కోసం తోటల్లో రైతులు గూళ్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇండోనేసియాలో కొన్ని పక్షులు, గబ్బిలాలను ఉపయోగించుకుని.. కోకో చెట్ల పెంపకదారులు పురుగుమందుల వాడకాన్ని తగ్గించగలుగుతున్నారు. ఫలితంగా ప్రతి ఎకరాకూ దాదాపు రూ.



20వేల మేర వారికి దిగుబడి పెరిగింది. స్పెయిన్‌లో వరి రైతులు గబ్బిలాలకు ఆవాసాలు ఏర్పరుస్తున్నారు. జమైకాలో కాఫీ తోటలు, న్యూజీలాండ్‌లో ద్రాక్ష తోటల్లోనూ.. ఇలాంటి పద్ధతులను అనుసరిస్తున్నారు. రైతులు పాటిస్తున్న ఈ విధానాల వల్ల.. పక్షుల సంఖ్య వృద్ధి చెందడంతోపాటు వినియోగదారులు మెచ్చే పంటలు పండుతున్నాయని పరిశోధకులు తెలిపారు. వీటిలో నుంచి ఉత్తమమైన మార్గాలను గుర్తించేందుకు తదుపరి పరిశోధనలు కొనసాగిస్తామని చెప్పారు.

మధుమేహం 5 రకాలు

- సవరించిన వర్గీకరణను ఆవిష్కరించిన శాస్త్రవేత్తలు
- వాటిలో 3 తీవ్రమైనవి.. రెండు సాధారణం

లండన్: మధుమేహ రోగులకు మరింత మెరుగైన చికిత్స అందించే దిశగా శాస్త్రవేత్తలు ముందంజ వేశారు. వ్యక్తిగత స్థాయిలో రోగులకు అవసరమైన ప్రత్యేక చికిత్సా విధానాలను అభివృద్ధి చేసేందుకు బాటలు పరిచారు. మధుమేహానికి సంబంధించి సవరించిన వర్గీకరణను ఆవిష్కరించారు. ఈ వ్యాధిలో మొత్తం 5 విభిన్న రకాలు ఉన్నాయని తెలిపారు.

ప్రస్తుతం మధుమేహాన్ని టైప్-1, టైప్-2 రకాలుగా మాత్రమే గుర్తించిన సంగతి గమనార్హం. 'టైప్-1' బాధితుల్లో ఇన్సులిన్(రక్తంలో చక్కెర స్థాయిలను క్రమబద్ధీకరించే హార్మోన్) ఉత్పత్తి కాదు. చిన్నారుల్లో ఈ వ్యాధి ఎక్కువగా కనిపిస్తుంది. మొత్తం మధుమేహ కేసుల్లో 'టైప్-1' కేసులు దాదాపు 10 శాతం ఉంటాయి. 'టైప్-2' బాధితుల్లో ఇన్సులిన్ తగినంత స్థాయిలో ఉత్పత్తి కాదు. కొత్తగా మధుమేహం బారినపడ్డ 13,270 మందిపై స్వీడన్‌లోని లండ్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలతో కూడిన బృందం తాజాగా పరిశోధనలు నిర్వహించింది. వారిలో ఇన్సులిన్ నిరోధకత, ఇన్సులిన్ ఉత్పత్తి, రక్తంలో చక్కెర నిల్వలు, వయసు, అనారోగ్య ప్రారంభం వంటి




అంశాలను పరిశీలించింది. వాటి ఆధారంగా మొత్తం రోగులను ఐదు భిన్న బృందాలుగా వర్గీకరించింది. అందులో మూడు బృందాల్లో వ్యాధి తీవ్ర ఎక్కువగా ఉందని.. మరో రెండు బృందాల్లో తీవ్రంగా ఏమీ లేదని తెలిపింది.

ఇన్సులిన్‌ను ప్రభావవంతంగా ఉపయోగించుకోలేని స్థితి(ఇన్సులిన్ నిరోధకత)లో ఉన్న వ్యక్తులను శాస్త్రవేత్తలు మొదటి రకం మధుమేహుల బృందంలో చేర్చారు. వారిలో వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉందని తెలిపారు. అలాంటి వ్యక్తులు మూత్రపిండ సంబంధిత వ్యాధుల బారినపడే ముప్పు అధికంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఇన్సులిన్ నిరోధకత కలిగి ఉన్న రోగులకు సరైన చికిత్స అందడం లేదని అభిప్రాయపడ్డారు. ఇన్సులిన్ లోటుతో బాధపడుతున్న వ్యక్తుల్లో కూడా మధుమేహ తీవ్రత ఎక్కువగానే ఉందని వెల్లడించారు. వారిని రెండో బృందంగా వర్గీకరించారు. మూడో బృందంలో.. స్వీయ రోగనిరోధకత నాశక మధుమేహంతో బాధపడుతున్నవారిని చేర్చారు. నాలుగు, ఐదో రకం బృందాల్లో.. వయసు మీదపడేకొద్దీ మధుమేహం బారినపడే వ్యక్తులు సహా ఇతరులను చేర్చారు. వారిలో తీవ్ర ప్రతికూల ప్రభావాలేవీ కనిపించలేదని తెలిపారు.

సామాజిక మాధ్యమాల వల్ల ముఖాముఖి సంభాషణలేమీ తగ్గట్లేదు

మిసోరీ: ఫేస్‌బుక్, ట్విటర్ వంటి సామాజిక మాధ్యమాల కారణంగా.. మనుషుల మధ్య ముఖాముఖి సంభాషణలేమీ తగ్గడం లేదని ఓ అధ్యయనంలో తేలింది. మనుషుల నడవడిక, ఇతరులతో వ్యవహరించే శైలిపై.. పెద్దగా ప్రతికూల ప్రభావం పడట్లేదని వెల్లడైంది. అమెరికాలోని మిసోరీ, కేన్సస్ వర్సిటీలకు చెందిన పరిశోధకులు ఈ అధ్యయనం జరిపారు. సామాజిక మాధ్యమాలను వాడుతున్న కొంతమందిని 2009 నుంచి 2011 వరకు వారు పరిశీలించారు. సామాజిక మాధ్యమాల వాడకం వల్ల ప్రత్యేకంగా వ్యక్తుల ప్రవర్తనతీరులో ఏ మార్పూ రాలేదని కనుగొన్నారు.

కన్నడలో రైల్వే టికెట్లు



కన్నడలో ముద్రించిన టికెట్

బెంగళూరు, న్యూస్‌టుడే: రైల్వే టికెట్లు కన్నడలో ముద్రించే ప్రక్రియ కర్ణాటకలో అందుబాటులోకి వచ్చింది. ప్రాంతీయ భాషలో ఇలా ముద్రించడం సాధారణ ప్రయాణికులకు ఉపయుక్తమని అధికారులు తెలిపారు. బెంగళూరు, హుబ్బళ్లి, మైసూరు స్టేషన్లలో అందుబాటులోకి వచ్చిన ఈ సదుపాయం తరువాత అన్ని స్టేషన్లకు విస్తరిస్తారు.

భారీగా కరిగిన అంటార్కిటికా మంచు

ఫిబ్రవరిలో 2వ అత్యల్ప విస్తీర్ణానికి పరిమితమైన హిమ దుప్పటి

సిడ్నీ: అంటార్కిటికాలో వరుసగా రెండో ఏడాదీ మంచు భారీగా కరిగింది. అక్కడి మంచు పొర విస్తీర్ణం రికార్డుల పరంగా రెండో అత్యల్ప స్థాయికి పడిపోయింది. 'ఆస్ట్రేలియన్ అంటార్కిటిక్ డివిజన్(ఏఏడీ)' ఈ మేరకు శుక్రవారం నివేదిక విడుదల చేసింది. గత నెల్లో అంటార్కిటికాలో మంచు విస్తీర్ణం 21.5 లక్షల చదరపు కిలోమీటర్లకు పరిమితమైనట్లు అందులో తెలిపింది. ప్రస్తుత వేసవిలో ఇదే కనిష్ఠమని వెల్లడించింది. మొత్తం వేసవి సీజన్ల పరంగా చూస్తే ఇది రెండో అతి తక్కువ విస్తీర్ణమని పేర్కొంది. గతేడాది మార్చిలో అత్యల్పంగా 20.7 లక్షల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణానికి మంచుపొర పరిమితమైందని గుర్తుచేసింది.

హిజ్బుల్ ఉగ్రవాదులతో నవీద్.. బయటకు వచ్చిన తాజా వీడియో

శ్రీనగర్: పోలీసుల అదుపులో నుంచి తప్పించుకు పారిపోయిన లష్కరే తోయిబా ఉగ్రవాది నవీద్ జట్‌కు సంబంధించిన తాజా వీడియో ఒకటి బయటకు వచ్చింది. హిజ్బుల్ ముజాహిదీన్ ఉగ్రవాదులను అతడు కలిసిన దృశ్యాలు ఇందులో ఉన్నాయి. ఆటోమాటిక్ రైఫిల్ ధరించిన నవీద్.. హిజ్బుల్ ఉగ్రవాదులను ఆలింగనం చేసుకుంటూ ఇందులో కనిపించాడు. దక్షిణ కశ్మీర్‌లోని అటవీప్రాంతంలో ఈ వీడియోను చిత్రీకరించి ఉండొచ్చని భావిస్తున్నారు. అయితే ఈ వీడియో విశ్వసనీయతపై స్పందించేందుకు పోలీసులు నిరాకరించారు.

అర్చకులకు గ్రాట్యుటీపై పునఃసమీక్ష..!?

- సర్వీసు ఇనాం భూములు అనుభవిస్తున్న వారికి ఎలా ఇస్తాం?
- కమిషనర్ ఆదేశాలతో మెమో జారీ
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న అర్చక సంఘాలు

ఈనాడు–అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో వంశపారంపర్య అర్చకులకు గ్రాట్యుటీ చెల్లింపుల అంశాన్ని దేవదాయశాఖ పునః సమీక్షిస్తోంది. ఈ మేరకు ఆ శాఖ కమిషనర్ ఆదేశాలను అనుసరించి కార్యాలయ పాలనాధికారి ఫిబ్రవరి 26న ఒక మెమో జారీ చేశారు. దీనిపై అర్చకుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. రాష్ట్రంలో మొత్తం 178 మంది అర్చకులకు పదవీవిరమణ గ్రాట్యుటీ మంజూరు చేయాలని దేవాదాయ అసిస్టెంటు కమిషనర్లు ప్రతిపాదనలు పంపారు. ఈ నేపథ్యంలో తాజాగా జారీ చేసిన మెమోలో... సర్వీసు ఇనాం భూములు అనుభవిస్తున్న అర్చకులకు గ్రాట్యుటీ ఇవ్వాలని ఎలా సిఫార్సు చేస్తారంటూ కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వంశపారంపర్య అర్చకులకు పదవీవిరమణ లేని పరిస్థితుల్లో వారికి గ్రాట్యుటీ ఎందుకు ఇవ్వాలని ప్రశ్నించారు. సుప్రీంతీర్పు 33/2007 చట్ట సవరణల్లో కూడా పదవీవిరమణ లేదని ప్రస్తావించారు. పదవీవిరమణ పొందుతున్న అర్చకులు 178 మంది ఆ భూములపై హక్కులు వదులుకుని దేవాలయానికి అప్పగించారో లేదో పరిశీలించాలని, అలా అప్పగిస్తేనే గ్రాట్యుటీకి అర్హులవుతారని స్పష్టం చేశారు. దీనికి సంబంధించి ఆయా భూముల సర్వే నెంబర్లు, వాటి పరిస్థితిపై తక్షణమే తమకు నివేదిక పంపించాలని కోరారు.

అర్చక సంఘాల ఆందోళన

సుప్రీంకోర్టు తీర్పుననుసరించి జరిగిన చట్ట సవరణల అనంతరం కోర్టు మార్గదర్శకత్వంలో భూపరిపాలన ప్రధాన కమిషనర్ ఆధ్వర్యంలో అర్చక సంక్షేమ ట్రస్టు బోర్డు అధ్యక్షుడిగా పంకజ్ త్రిపాఠి అధ్యక్షతన ఒక సమావేశం జరిగింది. ఇందులో తీసుకున్న నిర్ణయం మేరకే వంశపారంపర్య అర్చకులకు కూడా గ్రాట్యుటీ సౌకర్యం కల్పించారని, ఇప్పుడు కమిషనర్‌కు దీన్ని పునఃసమీక్షించే అధికారమే లేదని అర్చక సంఘాలు పేర్కొంటున్నాయి. 1987లో దేవదాయ చట్టం ప్రకారం అర్చకులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దాంతో వేతన, అర్చకుల సంక్షేమ కమిటీలు ఏర్పాటయ్యాయి. అవి అధ్యయనం చేసి 6 ఎ, 6 బి ఆలయాల్లో మాత్రమే వేతన స్కేళ్లు వర్తింపజేయగలమని, 6 సి ఆలయాలకు నిధిని ఏర్పాటు చేసి కనీస వేతనాలు ఇస్తామని, అన్ని ఆలయాల్లో అర్చకులకు సుప్రీంకోర్టు చెప్పిన ప్రకారం సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తామని పేర్కొన్నాయి. సుప్రీంకోర్టు పే స్కేలు ఇవ్వని పక్షంలో వంశపారంపర్య హక్కులు, అన్నింటిలో వారికే వాటాలు వదిలేయ్యాలని సూచించాయి. 2007లో ఈ మేరకు చట్ట సవరణలు చేసినా అవి అమలు కాలేదు. సుప్రీం మార్గదర్శకాల మేరకే సంక్షేమ ట్రస్టు బోర్డు విధివిధానాలు నిర్ణయమయ్యాయి. దాంతో తాజా మెమోపై అర్చక సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. తమకు కనీస వేతనాలు ఇవ్వరు, పీఆర్‌సీ అమలు చేయరు, గ్రాట్యుటీపై ఎలా పునఃసమీక్షిస్తారంటూ ప్రశ్నిస్తున్నాయి.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications; a division of Ushodaya Enterprises Private Limited and Printed at EENADU Press, Gudavalli Village & Panchayat, Vijayawada Rural Mandal, Krishna District, A.P and EENADU Press, Patamatalanka, Vijayawada AND Published at EENADU Press, Patamatalanka, Vijayawada-520 010. Phones: 2494900 (4 Lines), Fax-2470000. Regd. No. VJ/013/2018-20 RNI No. 32238/78. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10-00